ఈ విషయాన్నే శ్రీనారద మహర్షుల వారు తమ భక్తి సూత్రాల్లో ఇలా వివరించారు.

కస్తరతి కస్తరతి మాయాం? యః సంగాం స్త్యజతి
యో మహానుభావం సేవతే నిర్మమో భవతి॥

(నా.భ.46)

పై సూత్రంలో మాయను ఎవరు దాటుతారు? అని ప్రశ్నించి దానికి తగిన వ్యక్తులెవరో తానే సమాధానమిచ్చారు. మొట్టమొదటిది "యో మహానుభావం సేవతే" ఎవరైతే మహానుభావులను సేవిస్తారో వారు మాయను దాటుతారు. ఇక్కడ మహానుభావులు ఎవరు? దీనికి సమాధానం మనకు శ్రీ మద్భగవద్గీత తెల్పినవిషయం "వాసుదేవస్సర్వమితి స మహాత్మా" 'సమస్త చరాచరప్రపంచం వాసుదేవ లేక పరమాత్మ స్వరూపం' అని సుదృఢంగా అనుభూతి కలిగి ప్రవర్తించేవారు. మహానుభావులు. ఎంతో పుణ్యఫలం ఉంటేగాని జీవునికి వారు లభించడం కష్టం. లభించినా వారిసేవ దుర్లభం. వారిసేవ కావాలి అనుకునే వారు సమస్త "త్యాగం" చేస్తేనే సమకూరుతుంది. శారీరక సంబంధం, లేదా కర్మలు వదలి వారిని ఆశ్రయించాలి, సేవించాలి, వారితో శ్రవణం, సందేహ నివృత్తి, సత్సంస్కార ప్రాప్తి. అందుకే పై సూత్రంలో సంగత్యాగం చెప్పుట గమనార్హం. అది ఏ సంగమైనా కావచ్చు. త్యాగం చేయుట ప్రథమ కర్తవ్యం. దుస్సంగం, కర్మ, కర్మఫల సంగం, తదితరం గణనీయం. దీనిచే మహాత్ములను వెతకడం, ఆ సేవతో పరిపక్వత గలిగిన సంస్కారంతో "నిర్మమత్వం" రావడం సంభవిస్తుంది. మమకారాదులున్నంత వరకు త్యాగం సంభవించదు. త్యాగం లేందే మహానుభావుల దర్శన (ప్రాప్తి) సేవాదులు సంభవించవు. ఇంకొన్ని విశేషణాలు క్రింది 4వ సూత్రం ద్వారా తెలుపబడినవి.

యో వివిక్త స్థానం సేవతే యో లోకబంధమున్మూలయతి
నిస్త్రైగుణ్యో భవతి యో యోగక్షేమం త్యజతి (నా.భ.47)

సంస్కారం రావాలి అనేదానికి వివిక్త స్థాన సేవనం కూడ ఒక ముఖ్య సాధన. అందురూ ఏకాంతంలో ఉండలేరు. అది కావాలి, నెరవేరాలి అంటే లౌకికబంధాలు అన్నివిధాల పోవాలి. లౌకిక బంధాలు పోయిన వాడే ఏకాంతంలో వుండగలుగుతాడు. ఏకాంతవాసంలో స్థిర పడినా లౌకిక బంధాలు పోతాయి. దీనిని సాధించాలి అంటే నిష్కామ కర్మద్వారా, మహానుభావుల సేవద్వారా సంపాదించిన బృహత్తర పుణ్యము, అనుగ్రహాదులు కావాలి. కేవలం ఏకాంతవాసం కాదు ఇక్కడ కావల్సింది. సర్వసంకల్పరహిత మానసిక స్థితికి ప్రయత్నం కూడ అవసరం. అప్పుడే 'నిస్త్రైగుణ్యత్వం' వస్తుంది. గుణప్రకోపం ప్రాపంచిక సంబంధాదుల ద్వారా పెరుగుతుంది. ఆ సంగం దూరం కావడం ఒక పుణ్యం. అక్కడ నిలిచి సర్వసంకల్ప రాహిత్యానికి ప్రయత్నించి, నిలువడం మరీ విశేషం. అందుకే "యో యోగక్షేమం త్యజతి" అనే విశేషణం గూడ మహర్షి ద్వారా చెప్పబడింది. లేనివస్తువును సంపాదించడం యోగం, సంపాదించిన వస్తువును కాపాడుకోవడం క్షేమం. ఈ రెంటికోసం జీవుడు ప్రయత్నిస్తున్నంతవరకు లోకబంధం ఉండే వుంటుంది. ఏకాంతవాస ప్రయోజనం సున్న. నిస్త్రైగుణ్యత్వం చాలా దూరం. ఇక మాయ, మాయా కార్యన్ని దాటేది ఎలా? సంభవం కాదేమో? అందుకే సామాన్య సాంగత్యాదుల త్యాగంచేత మహానుభావుల సాంగత్యం, అనుగ్రహం లభించి దాంతో ఏకాంతసేవ నిష్ఠ పరిపక్వతతో సర్వసంకల్ప సన్న్యాసానికి అధికారి అవుతాడు. నిస్త్రైగుణ్య స్వరూపాన్ని పొందుతాడు. అలాంటివారి యోగక్షేమాలు భగవద్విభూతి ద్వారానే పూర్తి అవుతాయి. అందుకే



పూజ్యశ్రీ స్వాములవారు
తిరుపతి శ్రీమలయాళ సద్గురు సేవాసమాజ
భవనంలో శ్రీకృష్ణ ప్రతిష్ఠ చేయుట
1995



1991లో కోరట్ల (కరీంనగర్ జిల్లా)లో శ్రీ సాయిబాబా విగ్రహప్రతిష్ఠ చేస్తున్న శ్రీ స్వాములవారు

1992లో పూజ్యశ్రీ స్వాములవారితో
సాహిత్యశిరోమణి సముద్రాల లక్ష్మణయ్య ఎం.ఏ.

విశాఖపట్టణం గీతాజ్ఞానయజ్ఞ ప్రవచనలో శ్రీస్వాములవారు(1977 సంవత్సరం, డిసెంబర్)



1984వ సం॥రం తిరుమలలో శ్రీ సద్గురు మలయాళస్వామి
శతజయంత్యుత్సవాలలో ఋషీకేశ్ శ్రీ చిదానందస్వాములవారితో శ్రీ స్వాములవారు.

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారికి సన్న్యాసమిచ్చిన సందర్భంలో
పూజ్యశ్రీ స్వాములవారు. (1994 మే నెల వైశాఖమాసం శంకరజయన్తి)

పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ గురుదేవులవద్ద సన్న్యాసము తీసుకొనినవారు



శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు
శ్రీ శుకబ్రహ్మాశ్రమాధిపతులు, శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా.



శ్రీ వేణ్వానందగిరి స్వాములవారు
శ్రీనివాసాశ్రమం అధిపతులు
(అగరం, కోలారు జిల్లా, కర్ణాటక)



శ్రీ భక్తిరసానందగిరి స్వాములవారు
యోగానందాశ్రమాధిపతులు,
(శ్రీశైలం, కర్నూలు జిల్లా)



శ్రీప్రణవానందస్వాములవారు
ఓంకారమఠ సంస్థాపకులు,
బళ్లారి, కర్ణాటక



శ్రీ జగదీశ్వరానందస్వాములవారు
శ్రీజగదీశ్వరాశ్రమ సంస్థాపకులు,
కోరట్ల, కరీంనగర్ జిల్లా.



భగవంతుడు "యోగక్షేమం వహామ్యహం" అని భగవద్గీతలో చెప్పాడు. ఆ తరువాత విషయ సేకరణను 48,49 సూత్రాల ద్వారా నారద మహర్షి సూచించారు.

యః కర్మ ఫలం త్యజతి కర్మాణ్యపి సంన్యస్యతి తతో నిర్ద్వంద్వోభవతి।
యో వేదానపి సంన్యస్యతి కేవలమవిచ్ఛిన్నామనురాగం లభతే ॥

పై రెండు సూత్రాలు గీత యొక్క భావాన్నే అనుసరిస్తూ కర్మ ఫలాన్ని, కర్మలను, కర్మప్రతిపాదకాలైన వేదాలను గూడ త్యాగం చేయమని చెప్పుచున్నవి. అంతేకాక ద్వంద్వ సహిష్ణుత్వాన్ని గూడ బోధిస్తున్నవి.

"ఆగమాపాయినోఽనిత్యాః తాన్ తితిక్షస్వ"

శీతోష్ణ, మానావమాన, సుఖదుఃఖాది ద్వంద్వాలన్నీ వచ్చీ పోయేవి, అనిత్యమైనవి. వాటిని సహించి అన్వయించుకునే స్థితి రావడం అంటే మానసిక సంస్కార స్థితి. అలాంటి వారికే భగవంతుని యందు "అవిచ్ఛిన్న మనురాగం" అను విశేషణం ద్వారా చెప్పబడు పరిపూర్ణభక్తి కలుగుతుంది. సరి, ఈ స్థితి ఇటు పరిపూర్ణభక్తికి కావచ్చు లేదా శ్రవణ, మనన నిదిధ్యానలను శీలించే జ్ఞానమార్గావలంబికి కావచ్చు అత్యవసరమయ్యే వుంది. అందుకే శ్రీమద్భగవద్గీత "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" సమస్త లౌకిక, అలౌకిక ధర్మాలను వదలి నన్నే శరణుబొందు మనింది. పై విస్తృత వివరణ ద్వారా ఏదో ఒక జన్మలో ఎప్పుడో ఒకప్పుడు సర్వసంగపరిత్యాగీ, సర్వారంభ పరిత్యాగీ రెండూ కాక తప్పదు. అదే మానవ జన్మ చరమలక్ష్యం, చరమ సుఖం. ఇవి తప్ప మిగతా వన్నీ మానవేతర జన్మల క్రియలని సాధకుడు గుర్తుంచుకోవాలి.

"న్యాస ఏవాఽత్యరేచయేత్" అని వేదవాణి. సన్న్యాసమే అన్నిటికీ గొప్పది. బాహ్యసన్న్యాసం, ఆంతరిక సన్న్యాసం రెండూ కావాలి. కేవల బాహ్యసన్న్యాసం పతనానికి కారణం. ఆంతరిక సన్న్యాసం మానసిక స్థితి. ఆ స్థితి ఉన్నవారు ఏ ఆశ్రమంలో ఉన్నా ఫరవాలేదు. కాని ఆ స్థితి ప్రస్తుత వాతావరణంలో సాధ్యపడనందుననే బాహ్య సన్న్యాసం కూడ కావల్సి వచ్చింది. బాహ్య సన్న్యాసం దాని విధి విధానం పై సూత్రాల్లో మనం కొంత వరకు అవగాహన చేసుకున్నాము. అది సిద్ధిస్తే ఆంతరిక సన్న్యాసం సులభతరం. ఆలాంటి వాటిని అలవరచుకునేకి ఆశ్రమవాసం, సేవాదులుగూడ అత్యవసరమేనేమోననిపిస్తుంది. కారణం? అనాది కాలంగా వచ్చే ఆధ్యాత్మికేతర సంస్కారాలు అంతతొంతరగా, సులువుగా పోవు. వాటిని తగ్గిస్తూ, ఆధ్యాత్మిక సంస్కారాలను అభివృద్ధి చేసుకోవాలంటే పై దెలిపినవి రెండూ అత్యవసరమే. ఈ ఆంతరిక సన్న్యాసానికి సహకరించే బాహ్య సన్న్యాసం ఒక్కోచోట నాలుగు రకాలుగాను, ఆరురకాలుగాను చెప్పబడింది. దాని వివరం క్రింది విధంగా గ్రహించనగును.

కుటీచక, బహూదక, హంస, పరమహంస, తురీయాతీత, అవధూత అని ఆరు విధాలుగ చెప్పబడుచున్నవి. కొందరు వైరాగ్య సన్న్యాసము, జ్ఞానసన్న్యాసము, జ్ఞానవైరాగ్య సన్న్యాసము, కర్మ సన్న్యాసమని చెప్పుదురు.

వైరాగ్య సన్న్యాసము :- విషయాసక్తిని వదలి పూర్వ పుణ్య ప్రభావంచేత సన్న్యసించినవారిని వైరాగ్య సన్న్యాసి అంటారు.

జ్ఞానసన్న్యాసము:- శాస్త్రజ్ఞాన పాటవం చేతగాని, పాపపుణ్యలోకానుభవ శ్రవణం చేతగాని ప్రాపంచిక భోగాలచే విరక్తుడై క్రోధ, ఈర్ష్య, అసూయ, అహంకార, అభిమానాత్మక సమస్త ప్రపంచాన్ని వదలి, దారేషణ, ధనేషణ, లోకేషణాత్మక దేహ, లోక, శాస్త్ర వాసనలు త్యజించి ఈ ప్రాపంచిక

భోగాదులన్నిటిని వమనాన్నంవలె భావించి, సాధన చతుష్టయ సంపత్తిచేత సన్న్యసించువాడు జ్ఞానసన్న్యాసి.

జ్ఞానవైరాగ్యసన్న్యాసము :- క్రమంగా, విధిగా అభ్యసించి, అనుభవించి జ్ఞానవైరాగ్యాదులచే స్వరూపాను సంధానంచేసి కేవల శరీరమాత్రం కలవాడై సన్న్యసించి దిగంబరంగా సంచరించు వాడు జ్ఞానవైరాగ్యసన్న్యాసి.

కర్మసన్న్యాసము :- విధిగా బ్రహ్మచర్యము పూర్తిచేసి, గృహస్థ, వానప్రస్థములను గూడ నిర్వహించి ఆశ్రమానుక్రమం చేత సన్న్యసించువాడు కర్మసన్న్యాసి.

బ్రహ్మచర్యం నుండి సన్న్యసించి దిగంబరుడై చరించువాడు వైరాగ్య సన్న్యాసి. విద్వత్సంన్యాసియే జ్ఞానసన్న్యాసి. వివిదిషా సన్న్యాసియే కర్మసన్న్యాసి. కర్మసన్న్యాసం తిరిగి రెండురకాలు. నిమిత్త సంన్యాసము, అనిమిత్త సన్న్యాసమని. ఆతుర సన్న్యాసం నిమిత్తం. క్రమ సన్న్యాసం అనిమిత్తము. ఆతురమనగా ఏ కర్మ చేయలేనిస్థితిలో ప్రాణప్రయాణసందర్భాన్ని పురస్కరించుకుని చేయునది. ఇక ఇప్పుడో అప్పుడో జీవుడు వెళ్ళి పోనున్నాడు. స్వయంగానో, పూర్వపుణ్యం చేత కలిగిన గుర్వనుగ్రహం చేతనో ఆ సమయానికి గుర్తుకువచ్చి ఆచరించే సన్న్యాసం. అలా సన్న్యసించిన తరువాత ఒకవేళ జీవించిన యెడల తిరిగి విధి విధానంగా సన్న్యసించవలసియుండును.

దృఢమైన శరీరం కలిగి ఉత్పన్నమైన సమస్త ప్రపంచం ప్రాపంచిక భోగాలనిత్యమని, దేహాదులుగూడ అశాశ్వత మని తలచి బ్రహ్మమొక్కటే నిత్యసత్యసుఖరూపమని స్థిరంగా నిర్ణయించి క్రమంగా సన్న్యసించు పద్ధతిని అనిమిత్త సన్న్యాసమంటారు.

కుటీచక సన్న్యాసము:- శిఖాయజ్ఞోపవీతం గలిగి దండకమండలాలనుధరించి మాతా, పితృ, గురువులను ఆరాధిస్తూ, ఒకే దగ్గర ఆహారాన్ని గ్రహిస్తూ మంత్రానుష్ఠానపరుడై ఊర్ధ్వపుండ్ర, లేదా త్రిపుండ్రధారిని కుటీచక సన్న్యాసియని అంటారు.

బహూదక సన్న్యాసము:- కుటీచకుని వలెనే మిగత వ్యవహారం కలిగి ఆహార విషయంలో మధుకర వృత్తిచే అష్ట కబళాలు మాత్రం భుజించి జీవనయాపన చేయువాడు బహూదక సన్న్యాసి.

హంస సన్న్యాసము:- జడలు, త్రిపుండ్ర, ఊర్ధ్వపుండ్రములను ధరించి, మధుకర వృత్తిచే అతి తక్కువ ఆహారం గలిగి కౌపీనం మాత్రం ధరించి వ్యవహరించేవాడు హంస సన్న్యాసి.

పరమహంస సన్న్యాసము:- శిఖాయజ్ఞోపవీతాలను వదలి, ఐదు ఇండ్లలో మాత్రమే భిక్షచేసి రాత్రిమాత్రం భుజించి కరపాత్రుడై వుంటాడు. ఏక వస్త్రముగలిగి, దండము గలిగి (వేణు దండము) లేదా కేవల భస్మోద్ధూలనం చేసి సమస్తం పరిత్యాగం చేసినవాడు పరమహంస సన్న్యాసి యనబడును.

తురీయాతీత సన్న్యాసము:- నియమరహితుడై పతిత వర్జిత సమస్త వర్ణములచేత అజగరవృత్తి ఆహారం గలిగి నిరంతర స్వరూపానుసంధానపరుడై ప్రవర్తించువాడు అవధూత సన్న్యాసి.

కుటీచకాది మూడు సన్న్యాసాలు బ్రహ్మచర్యాశ్రమం వలెనే ఉంటాయి. పరమహంసాది మూడు, కటిసూత్రం, కౌపీనం, వస్త్రం, దండ, కమండల వర్జితుడై సర్వవర్ణాల్లో ఒకేసారి భిక్షావృత్తి గలిగి ఉండడం విధిగా చెప్పబడినవి.

పై వివరమంతా నారద పరివ్రాజకోపనిషత్తులో తెలుపబడింది. విస్తారభయంచే మిగిలిన వివరం

వదిలివేయబడింది. ఏది ఏలా వున్నా ప్రారంభంలో మనం వివరించిన విధంగా ప్రాపంచిక భోగాసక్తిని వదలి యుక్తాహార విహారాదులతో పరమ వైరాగ్యంతో బ్రహ్మానుసంధానం చేయడమే నిజమైన కర్తవ్యం. శ్రీ శంకరుల అభిప్రాయ ప్రకారం దశనామ (పదిపేర్లు కలిగిన) సన్న్యాస సంప్రదాయాన్ని క్రింది తెలుపుతూ ఈ వ్యాసాన్ని ముగించగలను-

శ్రీశంకర భగవత్పాదులు పశ్చిమంలో ద్వారకలో శారదామఠాన్ని స్థాపించి అక్కడ నివసించే సన్న్యాసులకు చివరిలో తీర్థ, ఆశ్రమం అని పేరు కల్పించారు. తూర్పుభాగం జగన్నాథ పురిలో గోవర్ధన మఠాన్ని స్థాపించి వన, అరణ్య అను నామాలను సూచించారు. ఉత్తరంలో జ్యోతిర్మఠం స్థాపించి గిరి, పర్వత, సాగరులని సూచించారు. దక్షిణంలో శృంగేరీ మఠాన్ని స్థాపించి సరస్వతి, భారతి, పురియను నామాలను సూచించారు. దీనినే ''దశనామ సంప్రదాయ''మని కూడ అంటారు. ఉత్తరాదిలో వీటికి సంబంధించిన "అఖాడా"ల వ్యవహారం కూడ వుంది. ప్రస్తుతం శ్రీ మలయాళ సద్గురు దేవులు స్థాపించిన శ్రీవ్యాసాశ్రమము, మరియు వాటి శాఖోపశాఖలు ఎన్నోవున్నవి. వాటిని నిర్వహించే మహాత్ములు, లేదా సన్న్యాసులు 'గిరి' సంప్రదాయానికి చెందినవారు. ఈ విధంగా సన్న్యాస సంప్రదాయం శాఖ, ఉపశాఖలుగా సంస్కారభేదం లేదా వ్యవహారభేదాన్ని బట్టి రకరకాలుగా చెప్పబడినప్పటికి పూర్ణపరవైరాగ్యోపేతుడై శ్రోత్రియబ్రహ్మనిష్ఠుని నిష్ఠతో సేవిస్తూ శాస్త్ర, బ్రహ్మానుసంధాన రతుడైనవాడే సన్న్యాసి పదోపలక్షితుడై ఉండగలడు. అదే మానవ జన్మ చరమ లక్ష్యం. శుభమస్తు.

With Best Compliments From :

SREE MAHAYOGI LAKSHMAMMA COOPERATIVE BANK LIMITED No. 72
(Registered Under Andhra Pradesh Mutually Aided Co-operative Societies Act.1995)
E-mail : avva_bank@yahoo.co.in., Grams " 'Avvabank"
Fax : 08512-252858, Phone : 252922, 253836
Bank Established : 12.02.1984
Entire Transactions working under Core Banking System
Presently Leading Coop. Bank in Rayalaseema Area.
The Latest Financial of the Bank as on 31-07-2012.

Position for	(Rs. in Lacks)
Paid cup Capital	: 364.19
Reserves	: 805.00
Deposits	: 8485.00
Investments	: 1856.32
Loans & Advances	: 6867.00
Recovery	: 98%

This Bank is not only involved in financial activities but also closely associated with social, cultural and philosophical activities.
Founder Chairman : Sri Raichooti Ramaiah
Ex.-MLA
ADONI

With Best Compliments From :

PSS TOBACCO THRESHERS PVT LTD.
KAZA,
Mangalagiri - Mandal
Guntur-Dist. - 522503
Phone : 08645-248290,
248152
Fax : 08645-248089

బ్రహ్మ విద్యాసంప్రదాయకర్తృభ్యో నమః



ఆచార్యోపాసనమ్

శ్రీ శివదేవానందస్వాములవారు, దావణగెరె

(పూజ్యశ్రీ శివదేవానంద స్వాములవారు శ్రీ వ్యాసాశ్రమ బ్రహ్మవిద్యా పాఠశాలలో కొద్దికాలం అధ్యయనం చేసి పూజ్యశ్రీ రామకృష్ణానందస్వాములవారి వద్ద (గండి) సన్న్యాసం తీసుకొన్నారు. శ్రీవారు బ్రహ్మలీనులైనారు.)

అస్మద్గురువరేణ్యులు పూజ్యపాద శ్రీరామకృష్ణానంద స్వాములవారి శ్రీచరణాలకు ప్రణామాలు. ఆంధ్రదేశపు ఆధ్యాత్మిక పితామహులు శ్రీ సద్గురు మలయాళ స్వాములవారికి నమః సుమాంజలులు. పండిత పామరులనక ఆబాలగోపాలం చేత గీతామకరందాన్ని ఆస్వాదింపజేసిన, ప్రస్తుతము ఆంగ్లభాషాభిమానులు చేతను, కన్నడాభిమానుల చేతనూ గీతామకరందాన్ని ఆస్వాదింపజేస్తున్న బ్రహ్మలీన పరమ పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారికి నా నమోవాకములు. సకల గురుభక్తులకు, సాధకులకు హార్దిక శుభాభినందనలు.

ఆత్మీయులారా!

'అధ్యాత్మవిద్యా విద్యానాం' అని భగవంతుడు గీతలో సెలవిచ్చాడు. అంటే ఆత్మను తెలుసుకొనే విద్య. ఈనాడు దేహాన్ని పెంచే, అన్నాన్ని సంపాదించుకొనే విద్యలకు చాల ప్రాధాన్యత ఏర్పడింది. శ్రీరామకృష్ణపరమహంసగారి అన్న 'రాంకుమార్' తమ్ముడితో అన్నారు. 'శ్రద్ధగా' చదువు నేర్చుకో, చదవకపోతే ముందు ముందు నీపొట్ట గడవటం ఎలాగ?" అంటే, ఆయన "ఆ పొట్టకూడు సంపాదించిపెట్టే విద్యలు నాకు వద్దు పొమ్మ"న్నాడు. ఆత్మలాభానికై భగవల్లాభానికై పరితపించాడు. అన్నంతో ఆకలి బాధ తాత్కాలికంగా ఉపశమిస్తుంది. శోకమోహాలను రాగద్వేషాది క్లేశాలను అంతరింపజేసేది ఒక ఆత్మజ్ఞానం మాత్రమే. 'ఆత్మవిత్ శోకం తరతి' ఆత్మవిదుడు మాత్రమే శోకాన్ని దాటగలడని ఉపనిషత్తు చెబుతున్నది. ఈ ఆత్మజ్ఞాన ప్రాప్తి కావాలంటే గురువవసరము. "ఆచార్యవాన్ పురుషో వేద", "స గురుమేవాభిగచ్ఛేత్", "తద్విద్ధి ప్రణిపాతేన... ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినః తత్త్వదర్శినః" అంటూ శ్రుతులు, స్మృతులు ఆదేశిస్తున్నాయి.

"గురుమేవ అభిగచ్ఛేత్" - గురుమేవ - 'ఏవ' శబ్దంవల్ల ఈ జ్ఞానం గురువుద్వారానే పొందదగినది; 'నాన్యః పంథా - మరోమార్గం లేదు' అని తెలుస్తూ వుంది. అంటే ఇది పుస్తకాలవల్ల నేర్చేసుకొనే విద్యకాదు. 'రోడ్ మ్యాప్" చూసుకొని ఏదో క్రొత్తవూరికి పోయేటంత సులభం కాదు ఇది. ఎందుకంటే ఇది బాహ్యప్రయాణము కాదు; దూరంగా ఎక్కడోలేదు. అది మన స్వరూపమే అయియుంది; నిత్యసిద్ధమైయుంది. అది కర్మసాధ్యం కాదు. నాస్త్యకృతః కృతేన పరీక్ష్యలోకాన్ నిర్వేదమాయాత్' - వైరాగ్యాన్ని పొంది సద్గురువును ఆశ్రయించి సేవించి తెలుసుకోవాలి.

ఆచార్యుడంటే, గురువంటే ఎవరు? "శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు" అని ఉపనిషత్, "జ్ఞానినః తత్త్వదర్శినః" అని భగవద్గీత చెబుతున్నాయి.

ఉపనీయ తు యః శిష్యం వేదమధ్యాపయేత్ ద్విజః।
సాంగం చ సరహస్యం చ తమాచార్యం ప్రచక్షతే॥

ఉపనయనం చేసి వేదాంగములతోపాటు వేదాన్ని అధ్యాపనం చేయించి అందులోని రహస్యాన్ని - చదువులలోని మర్మమును శిష్యుడికి బోధించువాడే ఆచార్యుడని మనువు చెప్పాడు.

శాస్త్రములను మథించి సారాన్ని గ్రహించి దాన్ని తాను స్వయంగా అనుభవిస్తూ ఆచరిస్తూ శిష్యుడికి కూడా దాన్నే బోధించి ఆచరింప చేయువాడిని ఆచార్యుడన్నారు.

ఆచినోతి హి శాస్త్రార్థం ఆచారే స్థాపయత్యపి ।
స్వయమాచరతే యస్మాత్ తస్మాదాచార్య ఉచ్యతే॥

గురువనే మాటకు శిష్యుడి హృదయంలోగల అజ్ఞానాంధకారాన్ని తొలగించువాడనే అర్థము. 'గురు' వంటే బరువైనది అని కూడా అర్థము. బరువైన వస్తువు - ఒక బండ లేదా కొండ - ఏ విధంగా పెద్ద పెద్ద గాలివానలు వచ్చినా చలించదో ఆలాగున ఈ లోకంలో ఎదురయ్యే సుఖ - దుఃఖ, మాన - అవమాన, నిందా - స్తుతి, లాభనష్టాలు, శీత - ఉష్ణాలు మున్నగు ద్వంద్వాల తాకిడికి చెక్కు చెదరక నిలవగలిగిన స్థితప్రజ్ఞుడే గురువు. దత్తాత్రేయులవారు పర్వతాన్ని గురువుగా చేసుకొని ఈ పాఠాన్నే నేర్చుకొని మహాగురువయ్యారు.

మొత్తానికి ఇలాంటి లక్షణాలు గలిగిన గురువు నాశ్రయించి సేవా శుశ్రూషలతో మెప్పించి ఈ ఆత్మవిద్యాలాభాన్ని పొందాలి.

తోషితే సద్గురౌ చాష్టసిద్ధయో యాంతి వశ్యతామ్ ।
వేదశాస్త్రాదికం సర్వం సులభం క్షణమాత్రతః ॥

సద్గురువు సంతుష్టుడైతే సిద్ధులన్నీ వశమవుతాయి. వేదశాస్త్రాదుల అర్థములన్నియూ క్షణమాత్రంలో సులభంగా అర్థమవుతాయి.

భగవద్గీత 13వ అధ్యాయంలో అమానిత్వాది గుణాలలో 'ఆచార్యోపాసన' ఒక ముఖ్యమైన జ్ఞాన సాధనగా చెప్పబడింది. అయితే మొదట అమానిత్వం, అదంభిత్వం, అహింసా, క్షాంతి, ఆర్జవం అనే ఐదు సాధనలు చెప్పి తర్వాత ఆచార్యోపాసన చెప్పి యుండటం ఒక స్వారస్యకరవిషయం. అభిమాని, దంభాచారి అయినవాడు గురువును ఆశ్రయించలేడు, సేవ అసలే చేయలేడు. **అభిమానమంటే ఇతరుల కంటే తానే గొప్పవాడని భావించు కొనటం, దంభమంటే తనలో లేని గొప్పలను ప్రదర్శించాలను కోవటం.** ఇలాంటి వారు గురువును ఎలా సమీపించగలరు?! అసలు ఒకరిని గురువుగా భావించట మంటేనే వారు తన కంటే ఎక్కువ తెలిసినవారని ఒప్పుకోవటం; శిష్యుడు కావటమంటే తన అజ్ఞానాన్ని, తెలియనితనాన్ని నిర్లజ్జగా ప్రకటించటము, ఆ అజ్ఞానాన్ని గురువుయొక్క మార్గదర్శనంతో తొలగించుకొనేందుకు సంసిద్ధుడై వుండటము, తన అజ్ఞానపు అథవా అల్పజ్ఞానపు ఎరుక కలిగియుండటము, గురువు యొక్క జ్ఞానము నందు శ్రద్ధ కలిగి యుండటము - ఇదే ఆత్మజ్ఞానానికి ప్రథమ సోపానము.

ఆత్మజ్ఞాన ప్రాప్తియందు అహంకారమే పెద్ద ప్రతిబంధకము. ఈ పరిచ్ఛిన్న అహంకారము, దేహాత్మబుద్ధి శిథిలమయ్యే వరకు జ్ఞానప్రాప్తి కలుగదు. ఈ అహంకార నిర్మూలన కోసమే దండవత్ నమస్కారము, ప్రతీక్షా, శుశ్రూషా మొదలైన ఆచారాలను విధించారు. ఈ సాధనలను యాంత్రికముగా కాక శ్రద్ధాభక్తులతో హృత్పూర్వకంగా చేయాలి. అలా చేసినప్పుడు హృదయాంతరాళంలోని ప్రతిబంధకాలు తొలగి జ్ఞానధారణకు ఆవశ్యకమైన భూమిక నిర్మాణమవుతుంది. హృదయంలో గ్రహణశీలత (Receptivity) పెరుగుతుంది. అహంకారము వంగితే లోపలి ద్వారాలు తెరుచుకుంటాయి. అలా జరిగినప్పుడు ఒక్కోసారి బయటనుండి ఎవరూ చెప్పకనే లోపలనే బోధ

అవగతమవుతుంది. “మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మతత్త్వం” అన్నారు గదా! సత్యకాముడు గురువునందు శ్రద్ధ గలిగి శుశ్రూషావిరతుడై వున్నాడు. తాను మేపుతున్న ఆవులు, ఆడవిలోని పశుపక్షులు, వృక్షాల నుండే అతనికి బోధ లభించింది. ఏకలవ్యుడు గురువు యొక్క ప్రతిమను ఆలంబనంగా వుంచుకొని గురువు మీది శ్రద్ధను తన హృదయంలోనే పోషించుకొంటూ సాధన చేసి సిద్ధిని పొందాడు.

గురువు లేకపోతే, గురువునందు శ్రద్ధ లేకపోతే అలాంటి మనోభూమిక ఏర్పడటము అసంభవము. గురువులకు వాస్తవంగా మన సేవా శుశ్రూషలు అవసరం లేదు. వారు పూర్ణకాములు. మన ఉద్ధారకాని కోసం మనమే వారినాశ్రయించి సేవించాలి. గీతలో అర్జునుడే “శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నం” అంటూ జగద్గురువు నాశ్రయించాడు. అర్జునుడే “నేను నీ శిష్యుడిని - నీవు నా గురువువు, నన్ను ఆదేశించు, నాకు ఉపదేశించు’ అంటూ తనను తాను సమర్పించుకొన్నాడు. కృష్ణుడు మాత్రం “నేను గురువును, నీవు నా శిష్యుడివి’ అని ఎక్కడా చెప్పుకోలేదు. గురువుకు తాను గురువనే అభిమానం వుండదు. శిష్యుడే తన శిక్షణా పరిపూర్తి కోసం గురువునందు గురుత్వాన్ని అధ్యారోపంచేసి ఆరాధిస్తాడు. జ్ఞానసిద్ధి అయిన తర్వాత “న గురుర్నైవ శిష్యః చిదానందరూపైవ సర్వమ్”

ఒకానొక సంత్‌మహాత్ముడు గురుశిష్యసంబంధాలను గూర్చి ఇలా చెప్పాడు - “గురువు తాను గురువని తెలియరాదు; శిష్యుడు తాను శిష్యుడనని మరవరాదు. గురువుకు శిష్యుడి సేవా శుశ్రూషల అవసరముండరాదు. శిష్యుడు గురువుకు సేవాశుశ్రూషలు చేయకుండా వుండరాదు” - అని.

సాధన దృష్టితో చూస్తే ఇచ్చట శిష్యుడి పాత్రయే ప్రముఖమైనదిగా కనిపిస్తుంది. తాను ఎంత శ్రద్ధాభక్తులు గలిగి సేవా శుశ్రూషలు చేస్తాడో అంత ప్రయోజనాన్ని తాను పొందగలుగుతాడు. శిష్యుడే గురువు నాశ్రయించాలి. శిష్యునికే గురువుయొక్క అవసరము. గురువుకు శిష్యుల అవసరంలేదు. అది పూర్ణపాత్ర. అందులో ఇక నింపదగినది. ఏదియూ లేదు. అందులో ఏ కొరతాలేదు.

ఏదో ఉపచారానికోసం (Formality) గురుభక్తి, నమస్కారాలు, పురస్కారాలు చేసేవారికి ఆత్మలాభం కలుగదు. నిష్కపటసేవ, సమర్పణాభావన, శ్రద్ధా, భక్తి, వినమ్రత, నిర్మల హృదయము గలిగిన పుణ్యవంతుల హృదయంలోనికి ఏదోమార్గం గుండా జ్ఞానగంగ తానే ప్రవేశిస్తుంది.

సద్గురు స్థానాన్ని అలంకరించి లక్షలాది ముముక్షువులకు గీతోపదేశాన్ని చేసిన పూజ్యపాద శ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు పరమ గురుభక్తిపరాయణులు. జ్యోతిని స్పర్శించి జ్యోతిగా మారునట్లు గురుశుశ్రూషచేత తామూ గురుపదాన్ని పొందినారు. ‘తేజస్వినావధీతమస్తు’ - అన్నట్లు తాము నేర్చిన విద్యను విస్తారంగా లోకానికి పంచి విద్యాప్రకాశులనే నామాన్ని సార్థకం చేశారు. తమ ఆశ్రమానికి “శుకబ్రహ్మాశ్రమము” - అని పేరు పెట్టుకోవటంలోనే వారి వినమ్రత, గురుభక్తి పరాయణత విశదమవుతున్నాయి. (వ్యాసమహర్షి పుత్రుడు, శిష్యుడు గదా శుకుడు!) 'Spritual knowledge is the only solution for all the human problems'. (ఆత్మజ్ఞానము ఒక్కటియే అన్ని సమస్యలకు పరిష్కారము)అనునది శ్రీవివేకానందస్వాములవారి అభిప్రాయము. శ్రీమాన్ మలయాళ స్వాములవారి ఆశయము కూడా అదే “వర్ధతాం బ్రహ్మవిద్యా చ లోకేభ్యః సుఖమేధతాం” బ్రహ్మవిద్యవల్లనే లోకానికి సుఖం - అనే వారి మాట సార్థకం కావలెనని ఆశిస్తాను. జ్ఞానమతము వ్యాపకమగును గాక!

జై గురుదేవ్! నమో మహద్భ్యో గురుభ్యః

ఓం తత్ సత్



సాధు హృదయము

శ్రీ రామకృష్ణానంద స్వాములవారు
శ్రీ భూమానందాశ్రమాధిపతులు (గండిక్షేత్రం)

(పూజ్యశ్రీ స్వాములవారు గండిక్షేత్రంలోని శ్రీభూమానందాశ్రమాధిపతులు వ్రాతలోను, ప్రవచనలోను సిద్ధహస్తులు. వారి జనప్రియగీతోపన్యాసాలు లోక ప్రసిద్ధములు. శ్రీవారు బ్రహ్మీభూతులైనారు. సం॥)

విశాల నర రూపంలో విరాజమానమై వుండే ఈ విశ్వవిరాట్ భగవంతునికి నా అనంత ప్రణామాలు. పరమాత్ముడు మనకు అనుకూలమైతే ప్రకృతి అంతా మనకు అనుకూలమే. అయినా మనకు అడుగడుగునా అనుమానము. వెనుక వుండి మనలనూ మన కార్యక్రమాన్నీ నడుపుతూండే భగవంతుని వైపు మనం చూడటం లేదు. కాబట్టే భగవద్గీతలో “తాన్యహం వేద సర్వాణి - న త్వం వేత్థ పరంతప!” అర్జునా! నేను నిన్ను తెలుసుకుంటున్నాను, కాని నన్ను నీవు తెలుసుకోవడం లేదయ్యా” - అంటూ మాటలు మార్చి ప్రకారాంతరంలో భగవంతుడన్నాడు. సర్వదృక్కు ఆయన, ఆయనకు కనబడనిదంటూ లేదు. మనకు దృశ్యాన్ని చూచే చూపే కాని దృక్కును చూచే చూపులేదు.

“మీ వేదాంతం - మీ భగవద్గీత మాకు అన్నం పెడుతుందా? నీళ్ళు పోస్తుందా? గుడ్డనిస్తుందా?” అని కొందరి ప్రశ్న. వేదాంతము అన్నం కాదు - అమృతాన్ని పెట్టుంది. అన్నం కోసం భగవద్గీత దగ్గరికి పోవాల్నా? కానైతే, అమృతం త్రాగాలంటే దేవతలకే వీలౌతుంది. రాక్షసులు త్రాగలేరు. మానవుడు అన్నంతో కాదు బ్రతికేది - ఆత్మతో బ్రతుకుతున్నాడు. “అన్న దాతా సుఖీ భవ” అంటూ అన్నం పెట్టినవాన్ని అనుకుంటాము. కాని ఆయుస్సు “ఆత్మనా విందతే వీర్యం” అంటూ కేనోపనిషత్తు చెప్పింది. “మనిషి రొట్టెతో కాదు బ్రతికేది - దేవుని ఆశీర్వాదంతో” బైబిలు పలికింది. “మానవుడా నీవు అన్న పుత్రుడివి కాదు, అమృతపుత్రుడివయ్యా” అంటూ శ్రుతిమాత ఎలుగెత్తి చాటింది.

విద్యారణ్యుని హయాంలో సమర్థ రాముని కాలంలో కాషాయ చిహ్నం రాజ్యాలేలింది. మంత్రులు, సామంతులు, సామ్రాట్టులు, ఛత్రపతులు ‘భగవా’ జెండాకు తలలు వంచి నమస్కరించారు. మన సంస్కృతిలో ఇంద్రుని గెలిస్తే గొప్ప కాదు. ఇంద్రియాలను గెలిస్తే గొప్ప, ఇందజిత్తును యింద్రియ జిత్తైన లక్ష్మణుడు జయించాడు. మన సంఘాన్ని నడిపిన వారు త్యాగులు కాని భోగులు కారు. గుడిపాటి వెంకటాచలంగారు (ఆయన వాడుక పేరు చలం) అంతగా మారి పోయారంటే ఏ ప్రభావమంటారు? ఆయన వ్రాసింది నిజమా - ఆయన చేసింది నిజమా? అనేది ప్రజానీకానికి ఒక సమస్య అయిందే! మహర్షిని ముట్టి ఆయన ఒక మహర్షి

అయ్యాడు. రామ అనలేనివాడు రామాయణం వ్రాశాడంటే యే ప్రభావమంటారు? నారదుని సాంగత్య ప్రభావము. **నిప్పును సోకి జొన్నగింజ తెల్లగౌతుంది. పాపి కూడా సాధు సాంగత్యంతో పరిశుద్ధుడౌతాడు.** పాశ్చాత్య దేశాలలో ఏసుక్రీస్తుకు, సోక్రటీసుకు వుండే పేరు ప్రతిష్ఠలు రాజాధి రాజులకు లేవు.

సైంటిస్టులు బైట బాగు చేయాలంటారు. సాధువులు లోపల బాగుచేయాలంటారు. మతి మారక గతి మార్తే సుఖం లేదు. పందిని తీసుకు వెళ్ళి 'ఎయిర్ కండిషన్' రూంలో పండబెట్టితే - అది హాయిగా పండుకొంటుందా? బురద గుంటకు పరుగెడుతుంది. మతి యెంతో గతి అంత. 'సబ్‌కో సన్మతి దే భగవాన్' సుఖం వస్తువులలో లేదు, సంస్కారంలో, ఇష్టంలో వుంది. ఒకనికి యింపైనది మరొక్కనికి కంపు. ఎక్కడ వుందో కీలకం ! మానవుని బయట గతి బాగానే వుంది, కాని లోపల మతి చెడిపోయింది. అమెరికాలో 5 మందిలో ఒకడు ఆత్మహత్య చేసుకొని చస్తున్నాడట! ఎక్కడ వచ్చిందీ లోటు? అక్బరు చక్రవర్తికి లేని వైభవం మనకు వుంది. ఆయన జన్మలో కాఫీ త్రాగాడా? నీ అదృష్టం పండింది–బెడ్‌కాఫీ– మరి యెందుకో మానవునికి శాంతిలేదు.

ప్రభుత్వం ప్రపంచాన్ని బాగు చేయాలంటూంది. సాధువులు మానవుని బాగుచేయాలంటారు. ఈ మానవుడు కొంత మట్టుకు బైటి ప్రకృతిని గెలిచాడు. కాని లోపలి ప్రకృతిని అణువంత స్వాధీనం చేసుకోలేదు. 'లోకము లన్నియున్ గడియలోన జయించినవాడవు - యింద్రియానీకము చిత్తమున్ గెలువనేరవు' - అనినట్లైంది. **బైటికి చంద్రలోకం వరకైనా పోతాడు కాని లోపలికి అంగుళం పోలేదు.** విలువైన వస్తువులు బయట వుండవు. లోపలనే వుంటాయి. **బైటి వస్తువులు పెరగటం కాదు - లోపలి వాసనలు తరగాలె. అప్పుడే శాంతి.** బయటి ప్రకృతి యెంతెంతనో వశం చేసుకున్నానని అనుకుంటున్నాడు, కాని అంతంతకు దానికి బానిస అయిపోతున్నాననే సంగతి మానవుడు యోచించడం లేదు.

ఈ సాధువులను, సాధమ్మగార్లను చూడండి. ఎర్ర జెండాలెత్తి ప్రకృతి యొక్క నిరంకుశాధికారంపైన సహాయ నిరాకరణం జరిపే సత్యాగ్రహులు వీరు. ప్రకృతి మానవుని పశువుగా చేయాలంటుంది. మానవుడు తాను పశుపతిగా తయారు కావాలంటాడు. ఈ పోరాటమే జీవితం. ఈ పోరాటంలో విజయ ధ్వజాన్ని యెగుర వేసేవాడు నూటికొక్కడు. పల్లకి యెక్కేవాడు ఒకడు, మోసేవాళ్ళు నలుగురు, చూచే వాళ్ళు వెయ్యిమంది. ఈ పల్లకి విషయమూ అంతే.

అంతా వదిలిన వానికి అంతా తనదే. 'స్వదేశో భువనత్రయమ్,' మునికి లోకమంతా సొంత ఇల్లే. పారే నదికి వొళ్లంతా కాళ్ళు, మండే అగ్నికి వొళ్ళంతా నోళ్ళు. వీచే గాలికి వొళ్ళంతా చేతులే, త్యాగికి అంతావానిదే. అందరూ వాని వాళ్ళే. తెలుపుత్యాగి, తెలుపును అందరూ ప్రేమిస్తారు. పిల్లన గ్రోవి త్యాగి, దాని దర్శనము లేకపోతే భగవంతుడు ఉండలేడు.

ఒక పర్యాయము నారదుడు వైకుంఠం వెళ్ళాడట - నగరిలో నారాయణుడు లేడు. 'అమ్మా! స్వాములవారు యెక్కడ కెళ్ళారు?' నారదుడు అడుగుతాడు. 'ఏమో! నారదా! ఏ భక్తుని దర్శనానికి వెళ్ళాడో మరి!' ఆ మాటకు నారదుని ఒళ్ళు ఝుల్లుమంది. 'భగవంతుడు కూడా దర్శనాలకు వెళ్ళుతుంటాడా? నేనే ఇక్కడకు దర్శనానికి వస్తూంటానే! ఆ భక్తులు యెలాంటి భక్తులో!' అంతలో స్వామి దయచేశారు. నారదుడు ఒకటే పట్టు పట్టాడు. 'నాకు అలాంటి భక్తులను చూపించు'.

శ్రీస్వాములవారు మహాసమాధిని పొందిన 1998 ఏప్రిల్ 10వ తేదీ శ్రీవారి పవిత్ర శరీరాన్ని ఊరేగించుట

1998లో పూజ్యశ్రీస్వాములవారి మహాసమాధి మండలపూజ

మండలారాధనలో పూజ్యశ్రీ స్వాములవారి (శ్రీవిద్యాప్రకాశానందగిరిస్వాములవారి)
సమాధి పూజ (1998 సం॥)

శ్రీవారి మండలారాధనలో పూజ్యశ్రీ విద్యానందగిరి స్వాములవారు (శ్రీవ్యాసాశ్రమ పీఠాధిపతులు)
(1998 సం॥)

శ్రీస్వాములవారి జన్మదినోత్సవములో

భక్తన్నప్ప కంటి ఆస్పత్రి డాక్టర్ శ్రీ వేణుగోపాలాచారి ఎం.ఎస్. గారికి సన్మానము

ఆశ్రమ గ్రామీణ మెడికల్ క్యాంపులో సేవచేసిన గౌరవనీయులైన డాక్టర్లకు

శ్రీవారి జన్మదినమున సన్మానములు.

శ్రీవారి 94వ జన్మదినోత్సవంలో శ్రోతలు

పూజ్యశ్రీ శ్రీశ్రీ స్వాములవారి 94వ జన్మదినోత్సవంలో

పూజ్యశ్రీ స్వామీజీల ప్రవచనాలు

శ్రీవారి ఆరాధనలో శ్రీవారి భక్తుడు
సూరదాసు శ్రీ సాంబయ్యగారు (ఈదర) వాయిద్యం వాయిస్తూ సంకీర్తన జేయుట.



శ్రీవారి 97వ జన్మదినోత్సవంలో భారతీయ నృత్యం

10వ ఆరాధనలో వృద్ధులకు వస్త్రదానం



శ్రీవారి ఆరాధనోత్సవాలలో కుమారి ఎం.ఎస్. ఆషా (శ్రీకాళహస్తి) సుప్రసిద్ధ నాగినీ నృత్య ప్రదర్శన

శ్రీ శుకబ్రహ్మాశ్రమ ఉత్తర పీఠాధిపతి పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారి పట్టాభిషేకంలో పాల్గొన్న పూజ్యశ్రీ స్వామీజిలు

పూజ్యశ్రీ స్వామీజి ఆరాధనలో ప్రవచనలు చేసిన శ్రీస్వాములవార్లకు సన్మానము.



గురువు ముందు శిష్యుడు వెనుక. దేశ సంచారం చేస్తున్నారు. ఒక రోజు గురువుగారికి లోపల పెద్ద బాధ ప్రారంభమైంది. విపరీతంగా బాధ పడ్తున్నాడు. 'నారదా! మనిషి గుండెకాయ రసంతో తప్ప ఈ వ్యాధి నివారించదట! ఎక్కడైనా విచారించి వస్తావా!' శిష్యరూపంలో వుండే నారదుడు ఆ గ్రామాధికారి వద్దకు వెళ్ళాడు. ఈ భక్తుని చూస్తూనే ఆ పెద్ద మనిషి ఆదరించి కూర్చోమన్నాడు. నారదుడంటాడు. 'అయ్యా! మా గురువుగారు పెద్ద సంకటంలో పడ్డారు. గుండెకాయ కావాలట. దయచేసి ఈ ఉపకారం చేస్తారా!'. మతి లేని మనిషిని బయటికి నెట్టమన్నాడాయన.

ఊరంతా తిరిగాడు - గుండెకాయ ఎవరిస్తారండీ! ప్రపంచ విపణిలో త్యాగవీరులు మచ్చుకు లేకపోలేదు. జీవితంలో తిరిగే కల్పవృక్షాలు కొన్నైనా ప్రపంచంలో ఉంటాయి. లేదనే మాట వారి దగ్గర లేదు. ఒకాయన నారదుని వెంటబయలుదేరాడు. భగవంతుడు స్థిమితంగా కూర్చొని ఉన్నాడు. 'నారదా! నీవటు వెళ్ళగానే రోగము దానిపాటికదే కుదురుకొందయ్యా! ఇక గుండెతో పనిలేదు. కండతో పనిలేదు. 'మహానుభావా! మీరు చల్లగా వెళ్ళండి. నమస్కారం" నారదా! ఏమీ అనికోవు కదా! ఒకమాట. అందరి దగ్గరికి వెళ్ళి గుండెకాయ కావలె కావలె అని అడుగుతావే! నీకు లేదా గుండెకాయ!'

నారదుడు నిర్ఘాంతపడిపోయాడు. కాబట్టే నారదా! నీవు నా దర్శనానికి అక్కడికి వైకుంఠానికి రావలె. నేను వీరి దర్శనం కోసం ప్రపంచంలో తిరగాలె. త్యాగుల దర్శనం లేకపోతే భగవంతుడు ఉండలేడు. ఇక 'సాధు హృదయము' అనే అసలు విషయం లోకి దిగుతాను. శ్రీమద్భాగవతంలో ఒక మహా ఋషి తన ఆశయాన్ని క్రింది విధంగా లోకానికి సందేశం వినిపిస్తున్నాడు. వినండి.

స్వస్త్యస్తు విశ్వస్య ఖలఃప్రసీదతాం ధ్యాయంతు భూతాని శివం మిథోధియా !

మనశ్చ భద్రం భజతా దధోక్షజే ఆవేశ్యతాం నో మతి రప్యహైతుకీ !!

'విశ్వస్య స్వస్తి రస్తు' విశ్వమునకు స్వస్తి అగుగాక! ఇది ఋషుల మొదటి ఆశయము. 'స్వదేశో భువనత్రయం - వసుధైక కుటుంబకం - జై జగత్' - అనే ఈ ఉద్ఘోషలు భారతీయులకు అనాది సిద్ధంగా వచ్చిన ఆర్ష సంస్కారాలు. 'మా మతము బాగుపడుగాక! మాదేశము సుఖించును గాక! మేమూ మా వాళ్ళూ క్షేమముగా ఉందుము గాక! ఈ సంకుచిత భావాలు భారతీయ తత్త్వం కాదు. కాబట్టే ఋషి అంటాడు.

'స్వస్త్యస్తు విశ్వస్య' - విశ్వమునకు స్వస్తి అగుగాక! ప్రపంచము బాగుపడుగాక! బాగు కావాలని ప్రతి వాడూ కోర్తాడు, ప్రభుత్వము కూడా అందరిని బాగు చేయాలని కోర్తుంది. బాగుచేయాలనేదే నీతి శాస్త్రం మాట. 'బాగు ఏది' అనేది తత్త్వశాస్త్ర విషయం. నిజమైన బాగు బయట లేదు. బయటి బాగు తళుకుబెళుకు మాత్రమే. అసలు బింబము లోపలనే వుంది. బైటిది ప్రతిబింబము మాత్రం. తెలుపు గుడ్డనుండే రావాలి గాని సబ్బునుండి రాదు. నిజమైన బాగు బయటి నుండి కూరేది కాదు, లోపలి నుండి ఊరేది. ఈ కలికాల మానవుడు 'ఈ సినిమా మానిసి' వస్తువును లోపల పోగొట్టుకొని బైట వెతుకుతున్నాడు. బయటికి చంద్రలోకం వరకైనా పోతాడు. కాని లోపలికి అంగుళం పోలేడు. చంద్రలోకం పోతే వళ్ళు చల్లబడొచ్చు కాని ఉల్లం చల్లబడదు. లోపలి రోగం బైటి ఉపచారాలతో పోదు. **జ్వరంతో వచ్చిన చలి గొంగళ్ళు కప్పితే పోదు, జ్వరం తగ్గితేనే పోతుంది. అజ్ఞానంతో కల్గిన అవస్థ జ్ఞానం కల్గితేనే తొలగుతుంది.**

మనుష్యుడు కలలో ఎందుకు యేడుస్తాడు? తన్ను మరచి – తానున్న చోటు మరచి. ఇప్పుడూ అంతే – దేహం తాననుకొని దేహ ధర్మాలు తనవనుకొని ఈ మూఢ మానవుడు యేడుస్తూ పుట్టాడు. యేడుస్తూ బ్రతికాడు, యేడుస్తూ చచ్చాడు. సూర్యుడు ఒకనాడు సముద్రంలో తన ప్రతిబింబాన్ని చూచుకున్నాడట. తరంగాల తాకిడిలో అది అల్లల్లాడ్తూంది. ముక్కలు చెక్కలైనట్లుంది, కంగారు పడ్డాడు, 'నాకీ గతి వచ్చెనే' అని వాపోయాడు. తపనుడు తన్నుమరచి తానున్న చోటు మరచి తన్నుకులాడాడు.

అయ్యా! బయటి చూపు వదలు, లోచూపును అవలంబించు. చూడబడే దృశ్యాన్ని చూచే చూపుకాక, చూచే దృక్కును చూచే చూపును ప్రసాదించు, అదే నిజమైన చూపు. 'యః పశ్యతి స పశ్యతి' – అని గీత చెప్పింది. బైటి చూపు పశువుది. **'పశ్యతీతి పశుర్మతః'** బహిర్దృష్టి పశు లక్షణమని భగవత్పాదులు అన్నది ఆ మాటే.

డబ్బు ఇస్తే మనుష్యుడు బాగు పడ్తాడా? **'న విత్తేన తర్పణీయో మనుష్యః'** డబ్బుతో తృప్తి పడడం వుండదని కఠోపనిషత్తు పలికింది. **'ప్రాయశో ధనినవేమేవ ధనలోభోऽభిజాయతే'** – ధనికులకే ధనాశమెండు అనే ఆర్యోక్తివుంది. మనస్సుకు రెండు కోట్లు వున్నా మళ్ళీ లక్షవైపే మ్రొగ్గుతుందట. రామతీర్థుల వారి తొంభై తొమ్మిదవ కథ మీకు తెలిసిందే కదా!

పెళ్లి అయితే మానవుడు బాగుపడ్తాడా? ఇద్దరు భార్యలతో ఉత్తానపాదుడు ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ముగ్గురి భార్యలతో దశరథుడు చావనే చచ్చాడు. కోటి మంది భార్యలున్నా చిత్రకేతు మహారాజుకు సుఖం దక్కలేదు. కొడుకులు కల్గితే ఈ మనిషి బాగుపడ్డాడందామా? అది తప్పని తేలింది. అయితే నూరుమంది కొడుకులు కల్గిన ధృతరాష్ట్రుడు ఏమి మూట కట్టాడు. అరవై వేలమంది సగర మహారాజుకు కొడుకులు, వారి గతి సాగరమే అయింది. కాబట్టే ఋషి అంటాడు. 'స్వస్త్యస్తు విశ్వస్య' – విశ్వమునకు స్వస్తి అగుగాక!

'వర్ధతాం బ్రహ్మవిద్యా చ లోకేభ్య స్సుఖమేధతాం' – బ్రహ్మ విద్యవర్ధిల్లును గాక! లోకమునకు సుఖము కల్గును గాక! మిట్ట మధ్యాహ్నం వేళ ప్రయాణంగా ఒకడు పోతున్నాడు. దారి చెరువుగట్టులోని చేప ఒకటి ఎగిరి గట్టున పడి విల విల లాడుతోంది. ఆ మనిషి చూచాడు. వానిది దయా హృదయము. కంపించి పోయాడు. దాన్ని చేతి గుడ్డలో వేసుకొని చక్కా ఇంటికి వచ్చాడు. ఆ చేపకు శాంతి సౌఖ్యాలు కల్పించడమే తన పని, తన ప్రయాణం మానుకున్నాడు. దానిని హంసతూలికా తల్పంపై పండబెట్టాడు. సహ ధర్మచారిణితో సహా దానికి సేవలు చేశాడు. అది మరింత విలవిల లాడిపోతూంది. నిజంగా చూస్తే ఇంత గొడవతో పనిలేదు. బైటి చేపను అట్లు నీళ్ల లోనికి పడవేస్తే సరిపోతుంది. స్వస్థానం చేరితే తప్ప స్వర్గస్థానం చేర్చినా దానికి లాభం లేదు. మానవుడు అన్ని లోకాల బాగు విచారిస్తాడు. తన ఆత్మలోకం బాగు అనుకోడు. మనస్సుకు బైట తిరిగేది అలవాటు. లోపలికి ఆత్మవైపు పరమాత్మవైపు మళ్ళమంటే, అది చచ్చినా మళ్ళదు. ఈగ అన్నిచోట్ల వాలుతుంది గాని నిప్పుమీద వాలదు. నిప్పైపోతానని దానికి భయం. చిత్తము అంతే. ఆత్మలో పరమాత్మలో చేర్తే తాను చిత్తైపోతానని దానికి భయం. అయినా ఫరవాలేదు. 'అభ్యాసేన తు కౌన్తేయ వైరాగ్యేణ చ గృహ్యతే'. సాధనమున పనులు సమకూరు ధరలోన.

మహర్షి మళ్లీ రెండోసారి అంటున్నాడు. 'ఖలః ప్రసీదతాం' ఖలుడు (దుర్మార్గుడు) కూడ సుఖించును గాక! 'దుర్జనస్సజ్జనో భూయాత్' – అనేది కదా సాధు హృదయము. 'సంత భగవంత ఏక' సాధువూ భగవంతుడూ ఒకటే. 'సాధుల హృదయము నాయది. – సాధులెరుగుదురు నాదు చరితము' అని భాగవతంలో సాక్షాత్తు భగవంతుడే అన్నాడు. భగవంతుడు అంతటా వున్నా భగవంతుని యెరిగే హృదయం అందరికీ లేదు. అట్లే సాధువులు సర్వత్రా వున్నా సాధువనే మాట ఇక్కడ కేవలం వేషధారిని ఉద్దేశించి చెప్పడంలేదు. ప్రాణం పోయినా సరే – సాధన నిష్ఠను యెవ్వడు వదలడో, అపకారికి కూడ ఉపకారం చేయాలనే అభిప్రాయం యెవరికి వుంటుందో వాడే సాధువని చెప్పబడ్తాడు.

సాధువులు లేక కాదు కాని, సాధువును యెరిగే హృదయము లోకంలో దుర్లభంగా వుంటుంది. సాధువు సాధువుకే లభిస్తాడు కాని, అసాధువుకు లభించడు. జ్ఞాని హృదయాన్ని జ్ఞాని హృదయమే గ్రహిస్తుంది కాని అజ్ఞాని హృదయం అందుకోలేదు. ప్రతివాడు వాని వాని స్వభావాన్ని బట్టి ప్రపంచాన్ని భావిస్తాడు. దృష్టి యెట్టిదో సృష్టి అట్టిది. 'పాపీ సర్వత్ర పాప మాశంకతే' – పాపి సర్వత్రా పాపాన్నే గ్రహిస్తాడు. తాను దొంగ అయితే పొరుగును నమ్మడనే సామెత వుంది. మంగలివాడు ప్రతివాని తలకాయలతట్టూ చూస్తూంటాడు. మాదిగవాడు ప్రతివాని కాళ్ళతట్టు చూస్తుంటాడు, దృష్టి యెట్టిదో సృష్టి అట్టిది, 'యద్భావం తద్భవతి'.

ఏ అవాంతరంతోనో దారి తప్పి ఒక హంస ఒకానొక పల్లెటూరి చెరువులోకి చేరింది. ఆ చెరువులో కొంగలన్నీ దాని చుట్టూ చేరాయి, ఇదేమో! వళ్ళంతా తెల్లగా వుంది – కాళ్ళూ మొగం యెఱ్రగా వుంది, 'ఇదే దేశపు కొంగో? తెలుసుకుందా' మని దానితో అవి సంభాషణ మొదలు పెట్టాయట.

'ఎవ్వడ వీవు? కాళ్ళు మొగ మెఱ్ఱన, హంసను,
నెందు నుందువో? దవ్వుల మానసంబునను,
దాన విశేషము లేమొ చెప్పుమా?
మవ్వపు కాంచనాబ్జములు మౌక్తికముల్ కలవందు.
నత్తలో? అవ్వి యెఱుంగ" నన్న 'అహహా' యనినవ్వె బకంబు లన్నియున్'

చెరువులోని నత్తలను, చేపలనుతినే కొంగలు– మానస సరోవరంలో ముత్యాలను, తామరతూండ్లను ఆరగించే హంసలను యే విధంగా గుర్తించగల్గుతాయని?

'స్వస్త్యస్తు విశ్వస్య' – లోకమంతయు సుఖించు గాక! విశ్వాత్మక భావము కల్గిన ఋషుల యొక్క మొదటి ఆశయమిది.

ఇక రెండో మాట, 'ఖలఃప్రసీదతాం' – దుష్టుడు కూడా శిష్టుడగు గాక'.

దుర్జనః సజ్జనో భూయాత్ సజ్జన శ్శాంతి మాప్నుయాత్ !
శాంతో ముచ్యేత బంధేభ్యో ముక్తశ్చాన్యాన్విమోచయేత్!

దుర్జనుడు సజ్జనుడు కావలె, సజ్జనుడు ప్రశాంత చిత్తుడు కావలె, ప్రశాంత చిత్తుడు అజ్ఞాన విముక్తుడు కావలె. అతడితరులను తనవలె ముక్తులనుగా తయారు చేయాలె.

సాధుపురుషుల శుభకామన యిది. చెడ్డ అని ఎవణ్ణీ అనవద్దు, 'అయ్యా! మంచివాడివే! మరీ మంచివాడివి కావలె' – అంటూ ప్రతివాణ్ణీ ప్రోత్సహించమంటూ శ్రీరామకృష్ణ గురుదేవుని హితబోధ.

ప్రతివాడు మూలంలో పరమాత్ముని స్వరూపం. మానవుడు పాపి అనుటే మహాపాపమంటూ శ్రీవివేకానంద

స్వాములవారి హెచ్చరిక. దేవాలయంలోని దేవునికి ప్రదక్షిణం చేస్తూ ఒకానొకడు 'పాపోఽహం పాప కర్మాహం' అంటూ పరిపాటిగా చెప్పుకొంటున్నాడు. ప్రక్కన వున్నవాడు–'అరే! పాపీ!' అని పిలిచాడు, వానికి యెక్కడ లేని కోపం వచ్చింది. ఎందుకని? అది తానన్న మాటే కదా! వానికి యెందుకు కోపం రావాలని? అసలు అర్థమేమంటే – పాపి అనడం ఆత్మ ఒప్పుకోదు. ఆత్మ పాపి కాదు, నీటికి మాలిన్యం ఆగంతుక సంబంధంతో కల్గినట్లు, పాపము ఉపాధిగతమై కానవచ్చింది, కాని ఆత్మకు పాపానికి స్వరూపతః సంబంధము లేదు, 'శుద్ధమపాప విద్ధమ్' అని ఉపనిషలుత్తుద్ఘోషించాయి.

క్రైస్తవులు చెప్పుకున్నట్లు మీరు పాపుల సంతానం కాదు, పరమాత్ముని స్వరూపము.

"అమృతస్య పుత్రాః, తత్త్వమసి".

పాపి అనబడే వాడుకూడా స్వరూపతః పరమాత్మ వస్తువే, కాబట్టి పాపాన్ని ద్వేషించు, కాని పాపిని ద్వేషించ వద్దని పెద్దవారి ఉపదేశం. పాపబలం యెంత దొడ్డదైనా – మానవునిలో వుండే పరమాత్ముని బలం అంత కంటె దొడ్డది. ఆ భాగవత విస్ఫులింగం యే క్షణంలో భగ్గుమని వెల్గుతుందో చెప్పలేము. ఆ క్షణంలో పాపరాసులు దూది పర్వతాల వలె భస్మీపటలం కాక తప్పదు. పచ్చి కిరాతకుడు రత్నాకరుడు పరమ ఋషి ఆదికవి (వాల్మీకి) అయ్యాడు. పిచ్చికాముకుడు తులసీదాసుడు భార్యవేసిన ఒక్క మొట్టికాయతో రామదాసుడైనాడు. మనం అంతటి పచ్చికిరాతులంకాదు, పిచ్చి కాముకులం కాదు కదా! ఏ పుట్టలో యే పాముందో యె వణ్ణీ తిరస్కరించవద్దు. 'సర్వజీవ తిరస్కారః కేశవం ప్రతిగచ్ఛతి' జీవమాత్రుడు భగవంతుని అంశమే, కాబట్టి యేజీవుని తిరస్కరించినా భగవంతుని తిరస్కరించినట్లే సుమా!

ఏసుక్రీస్తు దగ్గరికి కొందరు ఒక స్త్రీని తీసుకవచ్చారు. 'ఈమె పతితురాలు. పాపం చేసింది, ఇలాంటివారు సంఘంలో వుంటే సంఘమంతా చెడిపోతుంది. పబ్లిక్‌లో నిలబెట్టి తలా వొక రాయి తలపై వేసి ప్రాణాం తీయాలని తీర్మానించినాము, ఈ శిక్ష మీ ఎదుటనే జరగాలె'.

క్రీస్తు సరే నన్నాడు. తలా ఒక రాయి తీసుకున్నారు. తీరా పడవేసే సమయం, క్రీస్తు ఒక మాట అన్నాడు, 'ఈమె తప్పు చేసింది. మీరీమె తలపై రాళ్ళు వేసి శిక్షిస్తున్నారు. కానీ రాళ్ళు వేసేవాడు తప్పు చేయనివాడై వుండాలె, ఆత్మ సాక్షిగా ఆలోచించండి.'

'మనిషి అయినాక తప్పు లేకుండా వుంటాడా?' – ఎవరికి వారే తమలో తాము మథనపడ్డారు. చేతుల్లోని రాళ్ళు యెక్కడి వక్కడే రాలి పోయాయి, ఆమె కళ్ళు తెరచి చూసేసరికి క్రీస్తు ప్రభువు ఒక్కడు తప్ప మరెవ్వరూ లేరు, ఆమెకు పునర్జన్మ కల్గినట్లయింది, వెళ్లి ఆయన పాదాలపై పడింది. 'స్వామీ! మీరు నా తలనే కాదు – భగ్నం కాకుండా నా జీవితాన్నే నిలబెట్టారు. శరణు, శరణు, శాశ్వతంగా శరణు.'

వెనుకటి క్షణంలో పాపాత్మురాలు, ఈ క్షణంలో పరమ భక్తురాలు, భూతంలో పతిత, వర్తమానంలో పవిత్ర. మానవుడా! భూతాన్ని వదలి నిత్యవర్తమానమైన ఆత్మను పరమాత్మను గ్రహించు, 'ఉత్తిష్ఠత – జాగృత'.

క్రైస్తవమతం నీతిని, భక్తిని ప్రబోధించి పాపానికి తాత్కాలిక పరిహారోపాయం చూపింది. హిందూమతం మరింతా ముందుకు వెళ్లి జ్ఞాన మహిమను నిరూపించి పాప సమస్యను శాశ్వతంగా పరిష్కరించింది, ఆ ప్రకారమెట్టిదో ముందు ముందు విచారించుకొందాం.

సాధువు భగవంతుని విభూతి. భగవద్గీతలో చెప్పినట్లు 'పరిత్రాణాయ సాధూనాం' సాధువుల పరిత్రాణం కొరకు భగవంతుడు అవతరిస్తాడు. త్రాణమనగా రక్షించుట, పరిత్రాణమనగా అటు ఇటు ఆనుకొని వుండే పరిసర ప్రాంతాలను కూడా రక్షించుట. పరితః త్రాణం పరిత్రాణం. ఒక్కపూలమొక్కకు మనము నీళ్ళు పోస్తే దానికి చుట్టు ముట్టి వుండే గడ్డి గాదము, చెట్టు చేమలు కూడా బ్రతికి పోతుంటాయి. అట్లే సాధు రక్షణార్థమై భగవంతుడు అవతరిస్తే ఆ ప్రభావంతో సాధువులు, అసాధువులు, భక్తులు అభక్తులు కూడా తరించి పోతుంటారు.

'గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం' అని మనము రోజూ స్వస్తి వాక్యాలలో చెప్పుకుంటుంటాము. గోవులకును, బ్రాహ్మణులకును సర్వదా శుభమగుగాక! గోవులు గడ్డి తిని పాల నిస్తాయి. బ్రాహ్మణులు అనిత్యవస్తువును తీసుకొని, నిత్యవస్తువైన జ్ఞానాన్ని ప్రసాదిస్తారు. గోవుల వలన బాహ్యదేహానికి పుష్టి, బ్రాహ్మణుల వలన భావదేహానికి పుష్టి, బ్రాహ్మణులంటే యిక్కడ జాతి వాచకం కాదు, గుణవాచకంగా గ్రహించవలె. వాసన ముఖ్యము కాని వర్ణము ముఖ్యం కాదు. కాగితం పూవు యెంత అందంగా వున్నా తలలో పెట్టుకోము. దానికి వాసన లేదు, కాబట్టే 'జాతి న పూఛో సాధుకో' అని కబీరు అన్నారు. 'సాధువును జాతి అడగొద్దు – జ్ఞానము గ్రహించు' మంటూ దాని అర్థము. చిప్పను చూడొద్దు, ముత్యమును తీసుకో! నారదుడు తన భక్తి సూత్రాలలో 'నాస్తి తేషు జాతి విద్యా రూప కుల ధనాది భేదః,'. అని నుడివి వున్నారు. భక్తులకు జాతి విద్యా రూప కుల ధనాది భేదము లే' దని ఆ సూత్రానికి అర్థము.

శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రంలో ఫలశ్రుతి సందర్భంలో ఒక శ్లోకం వుంది, వినండి.

వేదాంత గో బ్రాహ్మణస్యాత్ క్షత్రియో విజయీ భవేత్ !
వైశ్యో ధనసమృద్ధస్స్యాత్ శూద్ర స్సుఖ మవాప్నుయాత్ !

'బ్రాహ్మణునికి వేదాంత జ్ఞానము, క్షత్రియునికి శత్రు విజయము, వైశ్యునికి ధన సమృద్ధి, శూద్రునికి సుఖభోగాలు లభిస్తా' యని ఆ శ్లోకానికి భావార్థము. శ్రీ విష్ణు సహస్రనామస్తోత్ర పఠనానికి చెప్పిన ఫల శ్రుతి అది. ఏమంటే – 'వేదాంత జ్ఞానాన్ని కోరేవాడే బ్రాహ్మణుడు, కీర్తి కోసం, పౌరుషం కోసం ప్రాకులాడే వాడే క్షత్రియుడు. ధనము ధనమని ధన దాహం కలవాడే వైశ్యుడు, కమ్మగ తినడం కండలు పెంచకోడం – అడపాదడపా తూకం యంత్రాలపై దేహాన్నితూచుకొని ఆనందించడం – వాడు ఏ జాతి వాడైనా సరే – అదే శూద్ర లక్షణం'.

గోవులు, బ్రాహ్మణులు త్యాగానికి సంకేతం, త్యాగులను భగవంతుడు పూజిస్తాడు. పిల్లన గ్రోవి త్యాగి, అర్జునుడు త్యాగి, కుచేలుడు త్యాగి, గోపాంగనలు త్యాగులు, జటాయువు త్యాగి, శబరి త్యాగి, ఆంజనేయుడు త్యాగి, విభీషణుడు త్యాగి, కన్నప్ప త్యాగి, కమలము త్యాగి. త్యాగులు అధికంగా వుంటే అదే కృతయుగం. భోగులు అధికంగా వుంటే అదే కలియుగం. 'గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు' – అనే ఋషి వాక్యంలో త్యాగుల ప్రశంస చేయబడి వుంది.

"శివాజీ! లోకంలో మూడురకాలైన జీవన వృత్తులున్నాయి. ఒకటి భిక్షావృత్తి, రెండు వ్యాపార వృత్తి, మూడు చోర వృత్తి. అయ్యా! నీ రాజ్యంలో భిక్షా వృత్తిని వృద్ధి చేయాలె" – అని శ్రీ సమర్థరామదాస్వామి తన శిష్యుడైన ఛత్రపతి శివాజీతో అనేవాడట.

'భిక్షావృత్తి' అంటే యీనాడు మనకు వీధుల్లో కనబడే సిగ్గు చేటైన యాచకవృత్తి కాదు, పశువులు, పక్షులు కూడా

పాటుపడి పొట్టపోసుకుంటూ వుంటే, యింత మానవుడు సోమరియై దండగ మారి పరాయి తిండికి ప్రాకులాడటం జన్మకు కళంకం, జన్మమిచ్చిన దేవునికి అవమానం, సమాజానికి దౌర్భాగ్యం. ఒక లోకోక్తి వుంది - ఏమంటే, 'గడ్డిపోచ కంటే దూది పింజ తేలిక', దూది పింజ కంటె యాచకుడు తేలిక' అని అయితే మరి, వాయుదేవుడు గడ్డిపోచను, దూది పింజను యెత్తుకపోతాడు కదా, యాచకుని యెత్తుక పోదే, అంటే - వాణ్ణి యెత్తుకపోతే వాడెక్కడ తన్ను పీడిస్తాడో, అని వాయుదేవునికి కూడా భయమట'.

అల్పము తీసుకొని అధిక మిచ్చేది భిక్షావృత్తి, ఎంత యిస్తాడో అంత తీసుకోవడం వ్యాపార వృత్తి. తన సొత్తు ఒకరికి పోనీదు, ఒకని సొత్తు తనకు పని లేదు - ఇదే వ్యాపారవృత్తి, వ్యవహార వృత్తి. రాజనీతికి యిది అనుకూలమైన వృత్తి. ఇక మూడవది, చోరవృత్తి. చోరవృత్తి అంటే కన్నం వేసి దొంగలించడం మాత్రమే కాదు, ఊరక తేరక ఇతరుని సొత్తు తనకు కావాలనే స్వభావము కూడా చోరవృత్తి. బొత్తిగా యివ్వకుండానే తీసుకొనేది. ఒకవేళ ఇవ్వవలసివస్తే అంతో యింతో యిచ్చి లేదా యిచ్చినట్లు నటించి అధికంగా తీసుకునే వృత్తిని చోరవృత్తి అంటారు. ఈ వృత్తి, ఈ స్వభావము సమాజంలో పెరిగితే దేశానికి అరిష్టం, అనర్థదాయకము.

త్యాగులతో దేశము శోభిస్తుంది కాబట్టి సమర్థ రామదాసస్వామి శిష్యుడు శివాజీతో మన రాజ్యంలో భిక్షావృత్తి వర్థిల్లాలని, ఉపదేశించాడు.

సాధు సంత్ పురుషులతో ప్రసిద్ధమైన భూమి మన భారతదేశము. 'భా' అనగా ప్రకాశము, బ్రహ్మజ్ఞానమే నిజమైన ప్రకాశము. దానిలో రమించే వారు కాబట్టి భారతులనే పేరు అన్వర్థంగా మనకు అమరింది, భారతీయ సాహిత్యమంతా బ్రహ్మజ్ఞానుల ప్రశంసలతో నిండి నిబిడీకృతంగా వుంది.

'స్వస్త్యస్తు విశ్వస్య - ఖలః ప్రసీదతాం'

సాధు హృదయమనే విషయం పైన యింతవరకూ ఈ రెండు అంశాలు చెప్పుకున్నాము, వినండి భాగవత ఋషి ఆ వెంటనే అంటున్నాడు - **"ధ్యాయంతు భూతాని శివం మిథోధియా"** అని.

విశ్వం విష్ణుని స్వరూపము. విష్ణుసహస్ర నామ స్తోత్రంలో **'విశ్వం - విష్ణుః'** అని మొదటినామము భగవంతునికి విశ్వమనే చెప్పబడినది. 'హరి మయము విశ్వమంతయు - హరి విశ్వమయుండు - హరి మయము కాని వస్తువు పరమాణువు లేదు'. అని శ్రీమద్భాగవత సందేశము.

భగవంతుడు విశ్వరూపుడని వాడుకగా మనమూ అంటూనే వుంటాము. భగవద్గీతలో విశ్వరూపసందర్శన యోగము ప్రసిద్ధమైన ఒక అధ్యాయము. భగవంతుడు విశ్వరూపుడే అయివుంటే, విశ్వంలో ఆయనకాని స్వరూపం వొకటి అంటూ వుంటుందా అని, వేషాలు వేరు వేరైనా వేషధారి ఒక్కడే. సామాన్యమైన మానవుడు వేషాలను చూస్తాడు కాని, వేషధారిని చూడలేడు. అట్లే సామాన్య పామరమానవులు నామరూపాలను చూసి రాగద్వేషాలకు గురియై సంసార నిమగ్నులౌతారు. కాని నామరూపాలకు అధిష్ఠానమైన సత్య పరమాత్మను దర్శించి ధన్యులు కాలేరు.

సర్వత్రా సద్భావన పెట్టు, ఎట్టి భావన పెట్టుకుంటావో, అట్టి సంస్కారం నీకు లభిస్తుంది. 'యద్భావం తద్భవతి' భావాన్ని అనుసరించి బాహ్యముంటుంది. మతి యెంతో గతి అంత. ఎవ్వనియందూ దుర్భావన పెట్టొద్దు. నీ అజ్ఞానమే కాని రూపాలలో వుండేవాడు ఒక్కడే కదా అని.

'పురుష ఏవ, ఇదగ్ం సర్వమ్' అఖిలరూపముల్ తన రూపమైనవాడు' - అతడే పరమాత్మ. మంచి అను - చెడ్డ అను, నీ దృష్టి వైపరీత్యమే కాని వస్తువులో భేదం లేదు. 'మాయా మాత్రమిదం ద్వైతం అద్వైతం పరమార్థతః.'

సద్భావన అంటే :- 'సత్' అంటే పరమాత్మ. సర్వత్రా పరమాత్మను భావన చేయుటే సద్భావన. మన భావనలే మనకు సంస్కారాలై అంటుకొంటాయి, సంస్కారాలే స్వరూపాన్ని యిస్తాయి. మంచిని భావించి మంచివాడౌతాడు. చెడ్డను భావించి భావించి చెడ్డవాడౌతాడు. వస్తువులు మన వెంట రావు. మనభావనలు, మనసంస్కారాలు మన వెంట వస్తాయి. అవే మనకు స్వరూపాన్ని యిస్తాయి. కాబట్టి బుద్ధిమంతుడు సద్భావనలే చెయ్యాలి కాని దుర్భావనలు చేయరాదు.

నారదుడు అన్ని యిళ్ళల్లో శ్రీకృష్ణుణ్ణే చూస్తూ చూస్తూ ఆయనా శ్రీకృష్ణుణ్ణే భావన చేస్తూ చేస్తూ తానూ శ్రీకృష్ణుడే అయ్యాడన్న మాట. భగవద్గీత పదో అధ్యాయంలో 'దేవర్షీణాంచ నారదః' అని శ్రీకృష్ణుడు నారదుని తన స్వరూపంగానే చెప్పుకున్నాడు కదా!

త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ !
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ!!

అని పాండవగీతలో చెప్పిన ప్రకారము తండ్రి రూపంలో, తల్లి రూపంలో, బంధువురూపంలో, చెలికాని రూపంలో యీ అన్నిరూపాలలో వుండేది ఆ పరమాత్ముడే సుమా! సామాన్యులు వేషాలను చూస్తారు. కాని వేషం వేసినవాణ్ణి చూడరు, మనమూ అంతే. ఉపాధులను చూస్తాము కాని చైతన్యాన్ని గుర్తించలేమే! దేహాలు తల్లీ తండ్రీ కాగలుగుతాయా? దేహాలే తల్లి తండ్రి అయితే, ప్రాణాలు పోయిన తర్వాత కూడా వాటిని వుంచుకోవలసివుంటుంది. లేదే! 'తల్లి పోయింది - తండ్రి పోయా'డని ఆ దేహాలను మంటలోవేయడమో, మట్టి పాలు చేయడమో జరుగుతూందే!

ఒక కంబళి సాధువు ఉండేవాడు. ఆయన కంబళి (గొంగళి)ని ఒకనాడెవడో దొంగలించాడు. సాధువు ఫిర్యాదు చేసేకోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాడు. 'సాధువు ఏమి చెబుతాడో' అని దొంగ కూడా వెంట వెంట వెళ్ళాడు, 'నీ వస్తువులు ఏమేమి పోయా' యంటూ సాధువును పోలీసు ఆఫీసరు అడిగాడు. 'కప్పుకునే దుప్పటి పోయింది, కట్టుకునే ధోవతి పోయింది, పరుచుకొనే పడకపోయింది, తల క్రింది దిండు పోయింది, తొడుక్కునే కోటు పోయింది, తలకు చుట్టుకునే పాగా పోయింది' - అని వరుసగా సాధువు చెప్తున్నాడు. వింటూండే దొంగకు వొళ్ళు మండింది, తాను దొంగిలించింది ఒక్క కంబడి మాత్రము. ఇదే సమయమని సాధువు తెగ జెప్తున్నాడే, ఆ కంబడి తీసి యెదుట పార వేసి వున్న నిజం చెప్పాడు, "ఏమయ్యా!" అని సాధువును ఆఫీసరు అడిగితే ఆయనగారు అంటారు - 'నా మాట అబద్ధం కాదండీ! ఆ ఒక్క కంబడే నాకు అన్ని రూపాలతో పనికివస్తూంది. కప్పు కుంటే దుప్పటి అయింది, కట్టుకుంటే ధోవతి అయింది, వగైరా, వగైరా సాధువు పాలిటికి ఆ కంబడి 'త్వమేవ సర్వం మమ దేవదేవ!'.

కుమారుడు దూర ప్రాంతాలలో బాధ్యత కల్గిన వుద్యోగం చేస్తున్నాడు. చూడక బహుకాలమైంది. తల్లి తండ్రి ప్రయాణమైనారు. అక్కడ కొడుక్కు కూడా అదే సంకల్పం కల్గింది. తానూ భార్యా బయలుదేరారు. దూర భార ప్రయాణం, మధ్యలో ఒకచోట వీరూ వారూ ఆగారు. ఒక

ధర్మశాలలో మకాం వేశారు. తల్లి తండ్రీ ఒక గదిలో, కొడుకూ కోడలూ ఒక గదిలో, చూడక పెద్ద కాలమై ఒకరికొకరికి గుర్తింపు లేకపోయింది, వృద్ధుడు కాబట్టి ప్రయాణాల తాకిడితో తండ్రికి వాంతులు బేదులు పట్టుకున్నాయి. ముసలామె సేవ చేస్తూ బాధ పడ్తూ ఉంది. ఆఫీసరుగారు చూచారు కిటికీ నుండి, ధర్మశాల మేనేజరును పిలిపించి మా బోటి ఘనమైన ఆఫీసరులుండే చోట యీలాంటి రోగులను చేర్చావేమయ్యా? అని దబాయిస్తాడు. అతన్ని వెంటనే వేరే చోటికి మార్చమని జులుం చేశాడు. మేనేజరుగారు జడిసి బండి గిండి తెచ్చి ముసలివాన్ని తరలించే యత్నంలో వున్నాడు. అంతలో మంచి నీళ్ళ కొళాయి దగ్గర అత్తా కోడళ్ళు కలుసుకున్నారు. ఆడవాళ్ళు కదండీ! భార్య పరుగున వెళ్ళి భర్తతో అనింది. 'ఆయన మీ నాయనేనండీ! అంత హడావుడీ చేస్తారే!' మాటలు, మంతనాలు జరిగినవి.

తెలియక అంత హంగామా, కాని తెలిస్తే తండ్రిగారు, మారింది ఏమి లేదు, తెలివి మారింది. దర్శనం మారితే దృశ్యం మారింది. వేదాంతం కోరేది అంతే. దేశాంతర, కాలాంతర, నామాంతర, రూపాంతర, వేషాంతర, భాషాంతరాలతో పనిలేదు. కావలసింది భావాంతరం మాత్రం. గతి మారనక్కర లేదు, మతిమార్తే చాలు. బద్ధుడయ్యేది – బుద్ధుడయ్యేది బుద్ధితోనే. 'మంచి బుద్ధినిమ్మని' భగవంతుని కోరుకోవాలె.

సాధువు పడవలో ప్రయాణం చేస్తున్నాడు. పడవలో వుండే తుంటరి జనం యావత్తూ సాధువును నానావిధాల హింసిస్తున్నారు. వాళ్ళ పాలిటికి వేటమృగం దొరికినట్లయింది. పడవ నట్టనడియేట్లో చేరింది. ఒకడు కాలిచెప్పుతో సాధువుగారి తలపై తాళం వేయడం ప్రారంభించాడు, భక్తునికి జరిగే అపచారాన్ని భగవంతుడు సహించలేకపోయాడు.

ఆకాశవాణి పలికింది, 'సాధువుగారూ! మీ అనుమతి అయితే యీ పడవను తల్లక్రిందు చేసేస్తా! పోనీ! వీళ్ళు పాడైపోనీ!'

'భగవంతా! ఏమైనా తలక్రిందు చేసేశక్తి నీకు వుంది. పడవ నెందుకు? వీళ్ళ బుద్ధులను తలక్రిందు చేయరాదా?' ఇది సాధుహృదయం.

1940లో జరిగిన సంగతి, 'పర్చూరే శాస్త్రి' అనే విద్వాంసుడు సేవాగ్రాంలో వున్నాడు. ఆయనకు కుష్ఠరోగము. ఆయనకు మాలీసు చేయడం, పుండ్లు కడగడం, మందు వేయడం మొదలైన సేవలు మహాత్మాగాంధీ స్వయంగా చేస్తాడు.

ఒకరోజు శాస్త్రిగారికి మహాత్మాజీ మాలీస్ చేస్తున్నారు. పండితసుందరలాల్ ఆ సమయంలో అక్కడికి వచ్చారు. ఆయన అన్నారు.

'బాపూజీ! కుష్ఠువ్యాధికి చక్కని మందు ఒకటి వుందండీ! బ్రతికిన నల్లత్రాచు పామును పట్టిఖాళీ పాత్రలో పెట్టి మూసి పొయ్యిమీద ఉంచి మంట వేస్తే (పుటం వేస్తే) అది సజీవంగా చచ్చి భస్మమౌతుంది. ఆ భస్మాన్ని తేనెలో కలిపి శరారానికి రుద్దితే ఈ వ్యాధి సమసిపోతుంది'.

ఆ మాటవిని మహాత్మాజీ! మెల్లగా నవ్వి 'యేమండీ శాస్త్రిగారూ! ఆ ప్రక్రియను ఉపయోగించి చూస్తారా?' అని అడిగారు.

శాస్త్రిగారు కొంత సేపూరకుండి గద్గదస్వరంతో అన్నారు, 'బాపూజీ! నిష్కారణంగా ఆ పాముని కాల్చి వేసేందుకంటే నన్నే కాల్చివేస్తే తంటా లేదే! పూర్వజన్మంలోని యే పాపంతోనో యీ ఖర్మ నన్ను అంటుకొనింది. ఈ జన్మలోనే యీ ఖర్మను తీర్చుకొని చస్తే మంచిది కదా! ముందు జన్మలకి మళ్ళీ మూట కట్టుకోవాల్నా?'

పండిత సుందరలాల్‌గారు యీ మాటలు విన్నారు. 'ఈ తెలివిలేని మాటలు యీ మహాత్ములతో అంటినే' అని పశ్చాత్తాపపడ్డాడు. ఇది సాధు హృదయము.

దుర్జన స్సజ్జనో భూయాత్ సజ్జన శ్శాంతి మాప్నుయాత్ ।
శాంతో ముచ్యేత బంధేభ్యో ముక్త శ్చాన్యాన్విమోచయేత్ ॥

దుర్మార్గుడు సన్మార్గుడగుగాక! సన్మార్గుల హృదయములు శాంతి నొందుగాక! శాంత హృదయాలకు శాశ్వత సుఖము లభించుగాక! ముక్త పురుషులతో లోకము కళకళ లాడునుగాక!

'ధ్యాయం తు భూతాని శివం మిథోధియా'.

రాజుగారికి శెట్టిగారికి మహామైత్రి, శెట్టిగారిది గంధపుకొయ్య వ్యాపారం, వర్షాలధికమై ఆయా కారణాలతో కొయ్య అట్లే స్టాకు నిలిచిపోయింది. ఏమీ ఖర్చులేదు. 'అయ్యో! సరుకు నిల్వ యేర్పడిందే! ఖర్చు కాలేదే! రాజు గారు చస్తే ఆయన అంత్యసంస్కారానికి కొంతైనా ఖర్చు అవుతుంది" – రాత్రి పడుకున్న శెట్టి గారికి ఈ యోచన తట్టింది.

'మనకు ఖజానాలో డబ్బు లోటుగా వుంది. శెట్టిగారి విలువైనకొయ్య ఊరక స్టాకు నిలబడిపోయింది. ఆయనకు కావలసినంత డబ్బు ఉండిపోయె, ఆ కొయ్యను స్వాధీనం చేసుకుంటే మన లోటు తీర్తుంది' – రాజుగారికి యీ ఆలోచన కల్గింది. బుద్ధిమంతుడు కాబట్టి పునరాలోచన చేశాడు. మిత్రుని పట్ల నాకీ దురాలోచన యెందుకు కలగాలె? ఏదో కారణం వుంది.

శెట్టిగారిని పిలువనంపి 'రాత్రి నా విషయంగా ఏమైనా ఆలోచించావా? నిజం చెప్పు' మని సానునయంగా అడిగాడు, ఆయన తనకు కల్గిన ఊహ చెప్పాడు. 'మిత్రమా! అక్కడ నీవా దుర్భావన చేసేసరికి యిక్కడ నాకీ దుర్బుద్ధి

పుట్టింది. చూచావా? ఆ మాట నాతో అని వుంటే సరుకు ఖర్చు అయ్యే విధానం చేసి వుందు కదా!' – రాజు శెట్టిగారిని మందలించి బుద్ధి చెప్పాడు.

'ధ్యాయం తు భూతాని శివం మిథోధియా'.
మనశ్చ భద్రం భజతా దథోక్షజే'.

'మనశ్చ భద్రం భజతాత్' – ఇక వినవలసిన విషయం యిది, వినండి, 'మానవులకు మనోభద్రతలు చేకూరు గాక'! ఋషులు కోరే కోరిక యిది. మనస్సే మనుష్యుడనుట పాశ్చాత్యుల మాట. మనస్సే మనుష్యుడని మనమనము. కాని, మనస్సెట్లుంటే మనుష్యుడట్లుంటాడు. అన్ని భద్రాలకంటే మనోభద్రత గొప్పది. మనస్సు చెడితే మనుష్యుడే చెడినట్లు. ఆరునూరుకానీ నూరు ఆరుకానీ నా మనస్సును చెడగొట్టు కోనంటూ గ్రీకు తత్త్వవేత్త సత్యవీరుడు సోక్రటీసు అన్నాడు.

సోక్రటీసు భార్య చరిత్ర ప్రసిద్ధి కెక్కిన గయ్యాళిగంప. ఏదో ఒక నెపంగా ఆమె గొడవ చేయని రోజు లేదు. ఒకరోజు ఆయన మిత్ర బాంధవులతో కలసి భోజనం చేస్తున్నాడు. ఆమె ఆగ్రహావేశం శృతి మించి రాగాన పడింది. మజ్జిగకుండ తెచ్చి అమాంతము ఆయన నెత్తిమీద పగలవేసింది, 'రోజూ వట్టి ఉరుములే, ఈ రోజు వానకూడా పడింది'. అని మహానుభావుడు చల్లగా అన్నాడు. బైట కుండపగిలిందే కాని లోపలి గుండెకు చలనం లేదు.

ఒక కోటీశ్వరుడు స్టీమరు వ్యాపారము చేస్తున్నాడు, స్టీమరు భర్తీ చేసి వెంట కుమారుని కూడా పంపాడు. రెండు రోజుల తర్వాత ఒక టెలిగ్రాం వచ్చింది. అకస్మాత్తు ప్రమాదానికి గురియై స్టీమరు మునిగిపోయిందని, తంతివార్త చదివాడు. నిమిషం కళ్ళు మూసుకొని 'భగవంతుని అనుగ్రహం' అంటూ కళ్ళుదెరిచాడు. ఆయన చుట్టూ ఉండే

వాతావరణమంతా శోకపారావారంలో మునిగిపోయింది. ఒక గంట తిరిగీ తిరగక ముందే అర్జెంటు టెలిగ్రాం మరొక్కటి వచ్చింది. 'పొరపాటు. మునిగింది మీ స్టీమరు కాదు, వేరేది' చదివాడు, మళ్ళీ అదేమాట అన్నాడు. ప్రక్కవాళ్ళూ అడిగారు. 'ఇప్పుడంటే సరేకాని, మునిగింది అన్నప్పుడూ భగవంతుని అనుగ్రహమన్నావే! అదెలా సరిపోతుంది?'

స్టీమరు మునగడాన్ని తేలడాన్ని గురించి భగవంతుని అనుగ్రహమని నేను అనలేదు. ఆ వార్తా, యీ వార్తా విన్నప్పుడు నేను నా మనస్సు తట్టు చూచుకున్నాను. అది మునగాలేదు, తేలా లేదు. ఒకేస్థాయిలో వుండింది. అది భగవంతుని అనుగ్రహమన్నాను'. అని ఆయన జవాబు.

'మనశ్చ భద్రం భజతాత్', గతి చెడినా ఫరావాలేదు కాని మతి చెడరాదు. గతి ప్రారబ్ధాధీనం, మతి పురుషార్థాధీనం. గతి ఈశ్వర సృష్టిలోనిది. మంచి మతి ప్రారబ్ధాన్ని కూడా మార్చగల్గుతుంది. గతి చెడితే మతి చక్క బెట్ట గల్గుతుంది. కాని మతి చెడితే గతి చక్కబెట్టలేదు. వినోబాగారు ఒకమాట అన్నారు - 'ఎవరికి జ్వరం వచ్చినా పరవాలేదు. థర్మామీటరుకు జ్వరం రాకూడ'దని.

మతి కొద్ది కృతి, కృతికొద్ది గతి - ఇది జీవితంలో త్రిసూత్రి, ఒకడు దొంగతనం చేశాడు. మనిషి మంచివాడే - ఏ పూర్వసంస్కారబలంతోనో దొంగతనం చేసి పారిపోతున్నాడు. పోలీసులు గుర్తించి వెంట పడ్డారు. వాడు ప్రాణ పణంగా పరుగెత్తి అడవిన పడ్డాడు. ఒక పురాతన శిథిల శివాలయం వుండింది. లోపల శివలింగం చాటున దాగుకొన్నాడు. పోలీసులు వెంటబడి పట్టుకొన్నారు, లింగాన్ని కరుచుకొని వదలడు, లాగి లాఠీతో తలపై దెబ్బ వేశారు. ఆయువు పట్టున దెబ్బపడింది 'శివాశివా' అంటూ జీవం దేహం వదలింది.

శివదూతలు వచ్చారు, యమదూతలు వచ్చారు. దొంగకాబట్టి యమలోకం రావాలని యమదూతలు, అంత్యకాలంలో 'శివా' అన్నాడు కాబట్టి శివలోకానికే అర్హుడని శివదూతలూ పేచీవచ్చింది. తీర్మానము కుదరక తీర్పుకోసం శివుడి సన్నిధికి తీసుకెళ్ళారు. 'పాపం చేశాడు కాబట్టి పాప నివృత్తి కోసం నరకం వెళ్ళవలసిందే, ముందు నరకం వెళ్ళిరమ్మ'ని శివుడు ఆజ్ఞాపించాడు,' స్వామీ! అలాగే నరకానికి వెళ్ళుతాను. కాని ఒక గంట నాకు స్వేచ్ఛగా యెక్కడైనా సరే వెళ్ళేందుకు అనుమతి యివ్వండి, తర్వాత నరకానికి వెళ్ళుతాను'. భగవంతుడడిగాడు - 'యెక్కడి కెళ్ళాలను కొన్నావు?'

'ప్రభూ! మా భూలోకం వెళ్ళి వస్తాను. శివనామ స్మరణ చేస్తే నరకబాధ వుండదని మా భూలోకంలో వాళ్ళు అనుకుంటూంటారు. ఆ విధంగా నమ్మి వున్నారు. శివుణ్ణి ప్రొద్దున దర్శించినా కూడా నాకు నరకబాధ తప్పలేదు. ఆ మాటలన్నీ శుద్ధ అబద్ధాలు, నమ్మవద్ద'ని చెప్పి-వస్తానన్నాడు. వాని బుద్ధి వైభవము ప్రారబ్ధాన్ని తారుమారు చేసింది. భగవంతుని కూడా దిగ్భ్రాంతుని చేసింది.

'మనశ్చ భద్రం భజతాత్'.

మనస్సు భద్రమైతే సమస్తమూ భద్రము. అయితే ఆ భద్రమైన మనస్సు లభించే మార్గమేమని? ఋషి అంటున్నాడు, "అధోక్షజే ఆవేశ్యతాం నో మతి రప్యహైతుకీ'. మనస్సు నిష్కపటమైన ప్రేమతో భగవంతుని ప్రేమించాలె. భద్రమైన మనస్సు భగవంతుని అనుగ్రహంతో లభించాలి, కాని అది యే కంపెనీలోనూ దొరకదు.

ఒక షావుకారు బ్రహ్మాండమైన బంగళా కట్టాడు, కనపడినవారినల్లా తీసుకెళ్ళి చూపించి, వారు తెగ

పొగుడుత్తూంటే కుర్చీపట్టకుండా వుబ్బిపోయేవాడు. ఒక పెద్దమనిషి కనపడ్డాడు, అతన్ని తీసుకెళ్ళి యిల్లంతా చూపించాడు. ఆ మహాశయుడు పొగిడేవాడు తెగిడేవాడు కాదు. మనస్సు పట్టలేక 'యిల్లు యే విధంగా వుందండీ' అంటూ యజమానే అడిగాడు.

నోటినిండా వుమ్మి వుండింది, తువుక్కున మొగానవు మిసి, "అయ్యా! క్షమించండి, పైత్యమో! పిత్తమో! ఉమ్మి తెగవూర్తూ వుంటుందండీ! ఉమ్మి వేసేందుకు యీ ఇంట్లో చోటే లేదండీ! యెటువంటి యిల్లండీ!" వానికి ఉమ్మి వేసేందుకు ఆ ఒక్కచోటే దొరికింది.

మానవుని బైట అంతా బాగుంది. బాగులేనిది ఒక్క మనస్సు మాత్రం. విశ్వంలో వుండి విశ్వనాథుని మరిచాము, బాగు యెలా వుంటుందని! కృతఘ్నునికి శాంతి లభిస్తుందా?

మనోభద్రతకు మార్గమేదని భాగవతాన్ని అడుగుదాము, ప్రహ్లాదుని అడుగుదాము, 'విష్ణునందుల్లము చేర్చి కారడవి నుండుట మేలు! సర్వాత్ము హరి న్నమ్మి సజ్జనుడై యుండుట భద్రమంచు దలతున్ సత్యంబు' - అని ప్రహ్లాదుని హితోపదేశము.

మనశ్శక్తిని మదింపు వేసే సైంటిస్టు ప్రపంచములో లేడు. సుమారు భగవంతుని అంతశక్తి కలిగినది మనస్సు, కాబట్టే భగవంతుడు గీతలో 'ఇంద్రియాణాం మనశ్చాస్మి' - మనస్సు నా విభూతి' అని సెలవిచ్చాడు.

మనఃపుష్పాన్ని భగవంతునికి అర్పించు. అప్పుడు నీవు కృతకృత్యుడివి. 'మా మనంబు లెల్ల మరిపి దొంగిలితివి - యేమి చేయువార మింక కృష్ణ!' మనస్సే లేకపోతే యిక చేయవలసిందేముంది? కృతకృత్యునికి కృత్యమేముంది? బండినే వదలినవాడు గేటుయివ్వవలసి వుంటుందా? అర్పించేవాడు అర్పణమై పోతే యిక అర్పించవలసినది యేమీ లేదు. వాని యోగక్షేమాలు భగవంతుడే వహిస్తాడు, అదే భద్రము.

ప్రపంచము కేవల జడము, పరమాత్మ కేవల చైతన్యము. మనస్సు జడ చేతనాత్మకము. మనస్సును కేవలజడ స్వరూపమైన ప్రపంచానికి అర్పించడం అన్యాయం, అయోగ్యము; ఆత్మను పరమాత్మకు అర్పించుట న్యాయము; యోగ్యము. 'నీచాశ్రయం న కర్తవ్యం - కర్తవ్యం మహదాశ్రయం' - పెద్దల ఆశ్రయము తగును కాని నీచుల ఆశ్రయము యే విధంగానూ తగదు.

మరొక్క విధంగా చూస్తే - యీ శబ్దాదివిషయ ప్రపంచము జాగ్రదవస్థలో మాత్రం వుంది. స్వప్నంలో కాని, సుషుప్తిలో కాని లేదు. దీని ఉనికి ఒక్క అవస్థలో మాత్రము. మనస్సు జాగ్రవదవస్థలోనూ వుంది, స్వప్నావస్థలోనూ వుంది. దీని వునికి రెండు అవస్థలలోనూ వుంది. ఆత్మ మూడు అవస్థలలోనూ వుంది. జాగ్రత్, స్వప్న, సుషుప్తులలోనూ వుంది. ఈ విధంగా విచారిస్తే ప్రపంచము యొక్క యోగ్యత మనస్సు కంటే తక్కువ, పరమాత్ముని యోగ్యత మనస్సుకంటే యెక్కువ. తక్కువను ప్రేమించడం అయోగ్యం - యెక్కువను ప్రేమించడం యోగ్యం. కావుననే నరుని నిమిత్తం చేసుకొని నారాయణుడు గీతలో 'మచ్చిత్తస్సతతం భవ' - ఎప్పుడును చిత్తమును నాకే యిమ్ము పార్థ! అని బోధించాడు.

స్తంభాన్ని పట్టుకొని అబ్బాయి అబ్బాలాడ్తాడు, స్తంభం పట్టువుండేవరకు వానికి భయంలేదు. విశ్వప్రపంచంలో విచ్చలవిడిగా పరిభ్రమిస్తూండే మనస్సుకొక గట్టి పట్టుండాలె. అన్నిటికి అధిష్ఠానమై సర్వానికి ఆధారమై ఊర్ధ్వమూలము పరమాత్మ వున్నాడు. సర్వాధారమును ఆధారముగ చేసుకొన్న

మనస్సుకు అగచాట్లు వుండవు. అనిత్యమైన నామరూప ప్రపంచాన్ని ఆధారం చేసుకుంటే అనర్థము తప్పదు. ఊగే కొమ్మమీద కూర్చుంటే వూగక తప్పదు, ఈ ప్రపంచము అశ్వత్థవృక్షమైపోయే:

ఆవు దొంగగొడ్డు, తప్పుకొనిపోవడం, పరాయి పొలాల్లోపడడం, లేని తగవులు తెచ్చి పెట్టడం - ఒకటే గోడు. యజమాని ఆలోచించాడు. పొలిమేరవరకు చూపుమేరకు పొలమంతా తానే కొనివేశాడు. అది యిక యెక్కడపోనీ, మేయనీ తగవు తంటా లేదు. ఈ విశ్వబ్రహ్మాండమంతా నా స్వరూపం - నా ప్రభువు విలాసం! అన్ని నామరూపాలతో నటించే నట చక్రవర్తి ఒక్క నారాయణ పరమాత్మ 'పురుష యేవ యిదగ్ం సర్వం' మనస్సు యిక యెక్కడ దిరిగితే నేమి? రాగం లేదు, ద్వేషం లేదు, భయం లేదు, శోకం లేదు.

అనాత్మాకార వృత్తులన్నీ మారిపోయే వృత్తులు. ఏది మార్తుందో అది భయాన్ని కల్గిస్తుంది, మారని వృత్తి బ్రహ్మాకారవృత్తి. అది సామాన్యవృత్తి, విశేషవృత్తులన్నీ నశిస్తాయి. సామాన్యము నశించదు. ఇద్దరు గోపికల మధ్య శ్రీకృష్ణుడున్నాడట. రెండు విశేషవృత్తుల సంధిలో సామాన్య చైతన్యం ఉంది. దానిని ఆధారం చేసుకొన్న వృత్తి భద్రమైన వృత్తి, ఆ విషయాన్ని దృష్టిలో పెట్టుకొనే 'తరతి శోక మాత్మవిత్' అని ఉపనిషత్తు చెప్పింది, ఆత్మాకారము చెందిన చిత్తానికి శోకోపలక్షిత సంసారము లేదు, కలలోని సుఖదుఃఖాలు మేలుకొన్నవానికి లేవు, ఆత్మజ్ఞానికి సంసారభయము లేదు.

కామము చిత్తకల్మషము. నిష్కామత, చిత్తశుద్ధి, రాగము, రోగము, భవరోగము. 'రాగో లింగ మబోధస్య' రాగము అజ్ఞాన చిహ్నమని సురేశ్వరుల మాట. విరాగము చిత్తస్వాస్థ్యము. స్వాస్థ్యమంటే స్వరూపంలో నిలబడుట. రంగులేని నీళ్ళు శుద్ధజలము. నీళ్ళకు రంగు వుండకూడదు, రాగములేని చిత్తము శుద్ధచిత్తము. అది భగవంతుని కౌగిటిలో వుంటుంది. కాబట్టే ఋషి అన్నాడు 'అథోక్షజే ఆవేశ్యతాం నో మతి రప్యహైతుకీ' - అహైతుకీ మతి అనగా అదియే శుద్ధచిత్తము. భగవద్గీత కూడా 'ప్రజహాతి యదా కామాన్' అంటూ నిష్కామచిత్తానికే స్థిత ప్రజ్ఞత చెప్పింది. శుభమస్తు.

భాగవతఋషి మనలో తానొక్కడై మనందరికీ యీ శుభాశీస్సులను ప్రసాదించాడు, శుభసందేశమును ప్రబోధించాడు. 'ఋషి మతము వర్ధిల్లును గాక!'

ఏ ప్రీతితో అభీప్సిత ప్రాపంచిక వస్తువునుగూర్చి చింతన చేయు చున్నారో, అట్టి ప్రీతితో భగవంతుని చింతను చేసిన చాలును. లక్ష్యము కరతలామలకమై పోవును. ఇందులకు దైవమునందు అచంచల విశ్వాసము, భక్తి ఆవశ్యకములై యున్నవి. కావున జనులారా! నియమము లేర్పరచుకొని దినమందు కొంతసేపయినను, దృష్టిని బహిఃప్రపంచమునుండి మరల్చి అంతర్ముఖమొనర్చి, భగవత్తత్త్వమును ధ్యానించెదరుగాక! పాపనాశనమునకు, అలౌకిక దివ్యానుభూతికి ఇదియొకటియే మార్గమని మఱువకుందురుగాక!

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు



శ్రీమాత్రే నమః

కారుణ్యము మరియు సార్థకజీవనము

శ్రీ స్వామి దయానందసరస్వతి
ఆర్షవిద్యాగురుకులం, ఆనైకట్టి

మానవుని సార్థకజీవనము ఇతరులకు తనవంతు సహకారాన్నందించడంతోనే ప్రారంభమవుతుందని నా భావన. అటువంటి సమర్పణ, ఆ వ్యక్తికి మరింత సంతోషాన్ని, సంతృప్తిని, స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. అలాకాని పక్షంలో సదరు వ్యక్తి జీవనశకటాన్ని జరామరణముల ద్వారా మరుభూమి దశగా ఈడ్చుకు పోయే వ్యక్తి ఔతాడు. తన శక్తి మేరకు పరులకు మేలు చేకూర్చగలిగితే తనకు కూడా మంచే జరుగుతుంది. ఇతరులకు సహకారాన్నందిచే సత్కర్మలు అహంకారానికి తావులేదు. సహజసిద్ధంగా అతని హృదయాంతర్గతమైన దయాగుణంవిస్తరిస్తుంది. ఈ విస్తరణే వ్యక్తి అభివృద్ధికి సూచిక. ఎందుకు అనగా పూర్ణత్వము జీవుని సహజలక్షణము. ఇతరులకు తనవంతు తోడ్పాటు నందించడంతో ఈ పూర్ణత్వము మరింతగా సువ్యక్తమవుతుంది.

ఒక వ్యక్తి కేవలము వితరణశీలి అయినంత మాత్రమున సరిపోదు. తనను తాను వితరణశీలగా గుర్తించు కోగలగాలి అంటే తన దాతృతాన్ని ఇతరులు గుర్తించాలని కాదు, వ్యక్తి తనకు తాను ఈసత్యాన్ని గుర్తించాలి. అయితే ఈ గుర్తింపు కేవలము భావనామాత్రంగా ఉంటే సరిపోదు. కారణము భావనలు శాశ్వతం కావు. అవి చపలమైనవి, క్షణ భంగురాలు. జీవుడు సనాతనుడు, శాశ్వతుడు మరియు సత్యుడు. ఇది భావన కాదు. జీవుడు సదా గుర్తుంచుకొన వలసిన సత్యము. ఇలా గుర్తించడానికి వ్యక్తికి తన ఆత్మ యొక్క స్వరూపమును గూర్చిన అవగాహన అవసరము. కరుణను తన స్వరూపముగా గుర్తించిన వ్యక్తి ఆచరణలు, వితరణ కార్యములు చేయకున్నా అతను దాతగానే మిగిలి పోతాడు. కారుణ్య భావనకు సైతము గొప్పమేలు చేసే శక్తి ఉంటుంది.

కారుణ్యము అను పదమునకు అనేక రకములు వ్యాఖ్యానాలున్నాయి. వ్యక్తి యొక్క ఆంతరిక వికాసమును గుర్తించడానికి ఉపయోగించు పదములలో కరుణ అను పదమునకు మించిన పదము వేరొకటి లేదని నా భావన. సంపూర్ణంగా అర్థాన్ని వివరించుటలో మరే ఇతర పదము దీనికి సాటిరాదు.

కారుణ్యము అను పదము గొప్ప క్రియాశీలకమైనది. సంస్కృతంలో దీనిని దయ అని పిలుస్తారు. ఇది వ్యక్తి ఆత్మలలో జనించి దేహం ద్వారా వ్యక్తమై ప్రపంచానికి విస్తరిస్తుంది. 'కారుణ్యము' సదా ఏదో ఒక విషయముతో బంధింపబడి ఉంటుంది. దానికి భిన్నంగా 'ఆనందము' మాత్రము విషయ బంధితము కాదు. అనగా ఆనందము బాహ్యవిషయములపై ఆధారపడి యుండదు. వ్యక్తికి పూర్ణానందము తన ఆత్మయందే లభించునని భగవానుడు భగవద్గీత రెండవ అధ్యాయములోని 55వ శ్లోకములో బోధించి యున్నారు. అయితే ఈ ఆనందము బాహ్యవిషయాలతో కలిస్తే అది ప్రేమగా మారుతుంది. ఆ ప్రేమే కారుణ్యంగా రూపొందుతుంది. కారుణ్యం కలిగిన

వ్యక్తి పంచడం మరియు పంచుకోవడం చేస్తాడు. కనుకనే కారుణ్యాన్ని క్రియాశీలకమైనదిగా వర్ణిస్తాము. కావున జీవాత్మ బాహ్యావిషయములతో సంపర్కము కానంత వరకు ఆనందస్వరూపముగను, విషయాలతో కలిస్తే కారుణ్యంగానూ రూపొందుతుంది. ఈ విధముగ కారుణ్యము మానవ నైజము.

కారుణ్యాన్ని ఒక సుగుణంగా పేర్కొనేటట్లయితే కరుణా మూర్తియైన వ్యక్తి, ఎన్నటికీ జీవితమును భారమయినదిగా భావించడు. అయితే ఈ సుగుణమునకు ఏదైనా ప్రత్యేకత కలదా? మరియు ఇంతటి ప్రత్యేకమయిన గుణం వ్యక్తికి ఎలా సంక్రమిస్తుంది ? కారుణ్యము వ్యక్తికి సాధన ద్వారా గానీ లేక మరి ఏఇతర పద్ధతుల ద్వారా గానీ లభ్యము కాదు. ఏలననగా కారుణ్యము వ్యక్తి యొక్క సహజ సిద్ధమైన ఆత్మ స్వరూపమే అయిఉన్నది.

కరుణా పూరితమైన సత్కర్మ నిగూఢమైన కరుణను మేల్కొల్పగలదు

నీవు స్వభావరీత్యా కరుణామూర్తివైనప్పటికినీ ఒక్కొక్కప్పుడు కరుణ నీహృదయములో ఘనీభూతమై నిగూఢంగా ఉండిపోతుంది. మరి దీనిని మేల్కొల్పడము ఎలా? కరుణతో కూడిన చిరుకర్మతో దీనిని తట్టి తీయవచ్చును. ఈ చర్య కడు జాగరూకతతో కూడి ఉంటుంది. ఉద్వేగభరితమైన ప్రతిచర్యకు ఇది పూర్తిగా విరుద్ధమైనది. ఎలాగైతే కరుణ యొక్క విలువనెరింగిన వ్యక్తి కరుణా స్వభావుడై ఉంటాడో, ఆలోచనా పూర్ణుడైన వితరణశీలి కడు జాగరూకతతో వ్యవహరిస్తాడు. కరుణామూర్తిగా వ్యవహరించడం ద్వారా నీ వేదయినా లబ్ధి పొందగోరితే నీకు నీజానికి కరుణ యొక్క విలువ తెలియనట్లే. నీది కేవలం నటనగనే మరేదో ఆశిస్తున్నావు. ఇది వంచన, నిన్నునీవు మభ్యపెట్టుకోవడం. దానికి బదులుగా నీవు కరుణ యొక్క విలువను గ్రహించి కరుణా మూర్తిగా మారడంవలన నీవిలువ ఎంతగానో పెరుగుతుంది. ఒక్కొక్కప్పుడు నీవుచేసే కరుణ లోపించినట్లు కనిపించినప్పటికినీ, కరుణకు విలువనిచ్చే దిశగా, కరుణను కనుగొనే దిశగా నీవు దానిని నిర్వర్తించినపుడు అది నటన కానేరదు సరికదా అదియే వాస్తవమైన జీవనము.

ఒక మామూలు వ్యక్తి వితరణశీలిగా మారవలెనంటే అతను కరుణా స్వభావుడై ఉండవలెను. అటువంటి వ్యక్తి మాత్రమే ఇతరులకు సహాయకారి కాగలడు. ఆకస్మికముగా ఉద్విగ్నుడై స్పందించు వ్యక్తి దాతకాలేడు. అవసరాలలో ఉన్న వారికి అందించే సహాయక చర్యలను కరుణా పూరిత చర్యలుగా జనులు భావిస్తారు. ఇది జనులు దయతో చేసే అతిమామూలు చర్యగా నేను భావిస్తాను. అసలైన కారుణ్యచర్య చాలా క్రమబద్ధంగా ఉంటుంది. అది ఎలాగంటే ఎవరైనా నీకు తీవ్రమైన ఇబ్బంది కలిగించినప్పటికనీ వారి శ్రేయస్సు కోరకు నీవు ప్రార్థించ గలగడం వంటిది. దారుణంగా నీకు హానితలపెట్టబడినపుడు నీ మనస్సులో కలిగిన కోపము, ద్వేషము, అసహ్యము వంటి భావనలను అధిగమించి వారిని పూర్తిగా క్షమించడమే నిజమైన కారుణ్యము

అహింసయే కారుణ్యంగా రూపొందుతుంది.

మానవుని సార్థక జీవనానికి ఉపకరించే వివిధ ధర్మాలు, విలువలు వేదాంతంలో పొందుపరచ బడ్డాయి. భగవద్గీతలోని 13వ అధ్యాయములోని 8 శ్లోకములు ఆత్మజ్ఞానమును పొందుటకు అవసరమైన సుగుణములను భగవానుడు పేర్కొని యున్నారు. "అమానిత్వం అదంభిత్వం అహింసా క్షాంతిరార్జవమ్" తనకు తాను పొగడు కొనకుండుట, దంభము లేకుండుట, పరప్రాణులను బాధింపకుండుట, ఓర్పు గలిగి ఉండుట, ఋజుత్వము కలిగి

శ్రీవారి ఆరాధనోత్సవాలలో శ్రీస్వాములవారి జీవిత చరిత్ర రచయిత డా॥ శ్రీ సముద్రాల లక్ష్మణయ్యగారికి సన్మానము



అమ్మ ఆశ్రమ (వృద్ధాశ్రమ) సంస్థాపకులు ఆశ్రమ గీతా పోటీ పరీక్షల కన్వీనర్ రిటైర్డ్ ఉపాధ్యాయిని భూలక్ష్మిగారికి శ్రీవారి ఆరాధనలో పూజ్యశ్రీ యోగిని చంద్ర కాళీప్రసాదమాతాజీచే సన్మానము

శ్రీవారి జన్మదినోత్సవం రోజు గిరిజన
బాలబాలికలు భోజనాలు చేయుట

శ్రీవారి ఆరాధన రోజన గిరిజన తుపాన్ సెంటర్ విద్యార్థులకు నోట్‌బుక్స్ నిచ్చుట(2010సం॥లో)

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారి వద్ద సన్యాసము తీసుకొన్నవారు



పూజ్యశ్రీ శ్రీరంగానందగిరి స్వాములవారు
స్వాతంత్ర్యసమరయోధుడు,
గురుదేవులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శిష్యులు,
గద్వాల్



పూజ్యశ్రీ పరమేశ్వరానందగిరి స్వాములవారు
(పూర్వాశ్రమంలో ప్రభుత్వ ఉన్నతోద్యోగస్థులు,
తమిళనాడు), శ్రీ శుకబ్రహ్మాశ్రమం.



పూజ్యశ్రీ కైలాసానందగిరి స్వాములవారు
శ్రీ శాంత్యాశ్రమాధిపతులు, కైలాసకోన
నారావయణవనం మండలం, చిత్తూరు జిల్లా.
(వీరు పూర్వాశ్రమంలో విశ్రాన్త ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు)



పూజ్యశ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు
శ్రీమలయాళ స్వామి సత్యశోధనాశ్రమ
సంస్థాపకులు, షోలాపూర్, మహారాష్ట్ర.

అధిష్ఠానమందిరంలో పూజ్యశ్రీ స్వాములవారి మూర్తి.

అధిష్ఠానమందిరంలో పూజ్యశ్రీ స్వాములవారి ఆరోధనోత్సవాలు.

పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు
శ్రీ శుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు.



పూజ్యశ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు
శుకబ్రహ్మాశ్రమ పీఠ ఉత్తరాధికారులు

యుండుట మొదలైనవి. కానీ దయను గూర్చి ప్రత్యేకంగా ఇచట వివరించబడలేదు. కానీ 12వ అధ్యాయములోని 13వ శ్లోకమైన "అద్వేష్టాసర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ" అనుశ్లోకములో ప్రత్యేకంగా కరుణను గూర్చి వివరించడం జరిగింది. సమస్త ప్రాణుల యెడల ద్వేషము లేనివాడును, మైత్రి, కరుణ కలవాడును నాకు ఇష్టుడు అని గీతాచార్యుల వారు బోధించియున్నారు. ఈ పదములకు మూలము భూతదయయే. అహింస యొక్క విస్తృత రూపమే భూతదయ.

'అహింసా పరమోధర్మః' అనునది ఆర్యోక్తి. అహింస పరమోత్కృష్టమైన ధర్మంగా పేర్కొనబడినది. వ్యాఖ్యానాలకు పరిమితము చేయక హృదయాంతర్గతంగా అహింసను స్థిరముగ నిల్పుకున్నచో ఆ సద్గుణమే దయగా రూపొందుతుంది.

నీవు నీ జీవితమును ఉన్నతంగా తీర్చి దిద్దుకోనవలెనని భావిస్తే కరుణను పెంచుకో. కరుణకు నీవు విలువనిస్తే నీవు చేసే కర్మలన్నీ కరుణాపూరితంగానే ఉంటాయి. ఒక వ్యక్తి పట్ల నీకు దయలోపించినట్లయితే సదరు వ్యక్తిని నీవు ప్రమాదకారిగానో లేక పోటీదారుగానో గ్రహిస్తావు, కానీ కరుణలో నీవు ఈ అవరోధాలన్నింటినీ అధిగమించగలవు. అప్పుడే నీవు నిజమైన వితరణశీలిగా మారినట్లు. వితరణలు నీవు ఎంత చేసావు, ఏమి చేసావు అన్నది ముఖ్యము కాదు. ఏ భావముతో చేసితివన్నదే ముఖ్యము. 'యద్భావం తద్భవతి' అనునది హితవచనము. దేనినైతే నీవు భావిస్తావో అదే నీవవుతావు. దేనినైతే నీవు భావిస్తావో అదే నీవవుతావు నిన్ను సదా ఎవరో ఒకరు రక్షిస్తూ ఉండవలెనని నీవు. భావిస్తున్నంత వరకు నీవు బలహీనుడవుగనే ఉంటావు. అందుకు భిన్నంగా నిన్ను నీవు ఇతరులను రక్షించే రక్షకునిగా భావిస్తే ఖచ్చితంగా నీవు బలవంతు డవవుతావు. నీవు ప్రపంచాన్ని ఒక ఉచ్చులాగా భావిస్తే అది నీ పట్ల అలాగే ఉంటుంది. సర్వత్రా నీవు భయపడతావు. ప్రతినీడా దయ్యంలాగా తోస్తుంది. త్రాడును పాముగా భ్రమిస్తావు, మిత్రుడు సైతం శత్రువుగా కనిపిస్తాడు. నీ దృష్టిననుసరించే ఈ సృష్టికనిపిస్తుంది. నిన్ను నీవు బలిపశువుగా భావిస్తే ఈ ప్రపంచం నిన్ను బెదిరిస్తుంది. నీవు బలహీనుడవైతే నీపై సవారీ చేస్తుంది. అదే బలవంతుడవైతే నీతో సంధి కుదుర్చుకుంటుంది. దీనికి భర్తృహరి ఒక చక్కని ఉదాహరణ ఇస్తారు. అగ్గిపుల్ల మంట వంటి చిరుజ్యోతి పట్ల వాయువు - శత్రువుగా మారి దానిని ఆర్పివేస్తుంది. అదే వాయువు బలమైన అగ్ని శిఖకు సహాయకారిగా వ్యవహరిస్తుంది. అలాగే ఈ ప్రపంచంలో జనులు బలవంతులతో. ఇచట బలం అంటే శారీరకమైన బలం అనికాదు, ఆత్మబలం. నేను బలవంతుడనైతే ప్రపంచం నాతో స్నేహం చేస్తుంది మరియు నేను ఇతరులకు సహాయకారిని కాగలను. నేను బలహీనుడైన పక్షంలో ఒక మామూలు వ్యక్తిగానే మిగిలిపోతాను. కనుక నీవు సామాన్యమానవునిగా మిగిలి పోవడమైనా లేక ఇతరులకు తోడ్పాటు నిచ్చే గొప్ప కరుణా మూర్తిగా మారడమైనా అంతా నీపైనే ఆధారపడి ఉంది.

కనుక నీవు కరుణామూర్తివి కావలెనంటే తప్పక బలవంతుడవై ఉండాలి. సహజంగా ప్రజలు కరుణగల వ్యక్తిని బలహీనునిగా తలుస్తారు. కానీ బలహీనుడైన వ్యక్తి ఎన్నటికీ తనపట్లగానీ, ప్రపంచము పట్లగానీ కరుణను ప్రదర్శించలేడు మరియు తనపై తాను కరుణను కురిపించ లేనివ్యక్తి ప్రపంచము పట్ల కరుణను ప్రదర్శించలేడు. ఎట్టి పరిస్థితులలోనూ నీ పట్ల నీకు కాఠిన్యభావనఉండదు. నీ శరీరమే నీవుగా భావించినట్లైతే దానిపట్ల నీకు ప్రేమ ఉండి తీరుతుంది. నీ శరీరం పట్ల నీవు ప్రదర్శించే శ్రద్ధతోనే నీ



కరుణ మొదలవుతుంది. అంటే నీశరీరం పట్ల నీవు శ్రద్ధ ప్రదర్శిస్తున్నావంటే నిన్ను నీవు ప్రేమించినట్లే. ఈ నేపథ్యంగా ఆసనాలతో కూడిన 'యోగ' ప్రక్రియలు ప్రారంభంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. వీని అనుష్ఠానంద్వారా నీ శరీరంపై శ్రద్ధ చూపడం ప్రారంభిస్తావు. శారీరక ఆరోగ్యాన్ని ఉద్దేశించే ఏరోబిక్ వ్యాయమాలు శరీరాన్ని కొంత కష్టపెట్టేవిగా ఉంటాయి. కానీ యోగ ప్రక్రియలు మాత్రం ప్రేమ పూరితమై ఉంటాయి. ఇంతకు మునుపు చెప్పినట్లుగా నిన్నునీవు ప్రేమించవలెను కాబట్టి, నీదేహం పట్ల నీవు వ్యక్త పరచే శ్రద్ధద్వారా నీపై ప్రేమను నువ్వు ప్రదర్శిస్తావు. ఈ విధంగా శ్రద్ధతో కూడిన చర్య ప్రేమ పూరిత చర్యగా మారుతుంది.

నీ స్వస్వరూపమైనట్టి ఆనందము ప్రేమగా రూపాంతరము చెందునంత వరకు నిన్ను నీవు ప్రేమించాలి. మరి ఆనందం ఎచట కలదో అన్వేషిద్దాం. ఆనందం ప్రేమలోనే ఉంటుంది. ఏదో ఒక సంబంధం ద్వారా వ్యక్తమయ్యే ప్రేమ సాపేక్షప్రేమ. ఇటువంటి సంబంధాలు గల వ్యక్తి కేవలం కొన్ని బాహ్యమైన విషయాల పట్లనే ప్రేమను ప్రదర్శిస్తాడు. ఇంతకు మునుపు చెప్పబడినట్లు దేహం పై శ్రద్ధచూపడంతో ప్రారంభించిన ప్రేమ అంతటితో ఆగిపోరాదు. అది దేహభావాన్నిదాటి అంతరంగంలోనికి ప్రవేశించాలి. కనుకనే యోగ ప్రక్రియ కేవలము శారీరకమైన విషయాల పట్లనే దృష్టిఉంచక తనను తాను ప్రేమించడంతో ప్రారంభించి ఆత్మజ్ఞానాన్ని తెలిసికొనువైపుగా సాగుతుంది.

సంతుష్టిని పొందిన ఆత్మనుండి కారుణ్యం జనిస్తుంది. ఈ ప్రపంచమునకు నీవు ఎంత కరుణను పంచగలవో అంత కరుణను తిరిగి పొందగలవు. ఫలితంగా నీకు కలిగిన ఆత్మసంతుష్టిని కూడా నీవు అర్థం చేసికొనగలవు. ఎందుకంటే, ఆనందము నీ స్వరూపమే అయిఉన్నది. నీవు ప్రదర్శించు అతికొద్ది కారుణ్యము కూడా నీకు ఆత్మానందమును ప్రసాదించగలదు. ఆత్మానందము పొందిన వ్యక్తి ఆత్మసంతుష్టుడౌతాడు మరియు ఆత్మతృప్తిని పొందుతాడు. అట్టి వ్యక్తి వేదాంతము నభ్యసించుటకు అధికారి. ఆత్మసంతుష్టుడైన వ్యక్తి సుఖదుఃఖాలు మరియు లాభనష్టాలు వంటి ద్వంద్వముల పట్ల సమతుల్యతను సాధిస్తాడు. సుఖాలకు పొంగడు, దుఃఖాలకు క్రుంగడు. మానవులందరూ సదా ఈ వైఖరిని అలవరచుకొనవలెను. నీకు లేని వాటిని గూర్చి నీవు దిగులు చెందవద్దు, నీకు నీవుగా సాధించగలిగినంత సాధించు. అసాధ్యమనిపించిన విషయములో విడిచిపెట్టు. నీకు ఆనందాన్ని కలుగజేసే వివిధ విషయములను గమనించు. కరుణ గలిగిన వ్యక్తి ఆత్మసంతుష్టుడౌతాడు.

ఒక వ్యక్తి కరుణ ఏస్థాయిలో ఉన్నది అన్న విషయాన్ని బట్టి జనులు అతనిని అంచనా వేస్తుంటారు. ఎందుకిలా అంటున్నానంటే ఒక వ్యక్తి గొప్ప కరుణామూర్తి అయితే అతనిని సాధువు అని పిలుస్తారు. అంటే అతను ఒక ప్రత్యేకమైన పూజనీయ వ్యక్తి అన్నమాట. కానీ వేదాంతం దీనినంగీకరించదు. మానవ జీవితం పురుషార్థప్రదమైనదని వేదోక్తి. చతుర్విధ పురుషార్థాలలో ధర్మము మొదటిది. కారుణ్యం మానవీయ ధర్మం. దీనిని అనుష్ఠించిన ప్రతి మామూలు వ్యక్తీ సాధువుగా మారగలడు.

పైన చెప్పబడిన ప్రకారము అత్యంత విలువైన మరియు సాధుత్వానికి ప్రతీక అయిన కారుణ్య ధర్మాన్ని పెంపొందించుకొను వ్యక్తి కరుణామూర్తిగా ఎదగవలెను. ఇది ఎలా సంభవిస్తుంది? ఇందుకొరకు బాహ్యంలో కరుణను వ్యక్తపరుస్తూ అంతరంగంలో నిగూఢంగా ఉన్న కరుణను అన్వేషించవచ్చును. నీవు చేయు కరుణాపూరితమైన ఈ

సత్కర్మ నిన్ను కరుణామూర్తిగా మారుస్తుంది. ఈ కర్మ చాలా విలువైనది. ఇటువంటి కర్మలు నిరంతరము చేయడం వలన కరుణ నిన్ను వెన్నంటి ఉంటుంది.

కారుణ్యము ఆనందము యొక్క క్రియాశీలక రూపమని, అది స్వరూపమే అయిఉన్నదని ముందు తెలిసికొన్నాము. ఈ విషయము నీకు తెలిసినా లేక తెలియకపోయినా ఆనందమనునది నీ స్వరూపమే తప్ప వేరు కాదు అని నీవు అర్థం చేసికొనగలవు. ఆనందము బయటి వస్తువుకాదు. వెలుపల ఏ చోటా ఉండదు. ఆనంద స్వరూపునిగా నీచే గుర్తింపబడగల వ్యక్తి ఎవరూ ఉండరు. దీనికి కాలము, రూపములేదు. ప్రత్యేకమైన చోటులేదు. ఫలానాచోట నేను ఆనందంగా ఉండగలనని నీవు గనక భావిస్తే అటువంటి చోటు ఈ సృష్టిలో ఎచటనూ లేదు. ఎందువలనంటే ఆనందం స్థలంలో ఉండదు. దీనిని బట్టి ఆనందము బయట వస్తువు కాదు, అది నీస్వరూపమే అయి ఉన్నదని నీకు అవగతమవుతుంది.

కొందరు ఆనందం నీలోనే ఉంది అంటారు అంటే అర్థ మేమిటి? ఆనందం మనస్సుకు సంబంధించిందా? ఒకవేళ ఆనందానికి మనస్సే కారణమయితే నీవువిచారంగా ఉన్నసమయంలో నీలో మనస్సు లేదని అర్థమా? ఒక్కొక్కప్పుడు మనస్సులో కలిగిన కోరికలన్నీ తీరినప్పటినీ నీకు కలిగే ఆనందం తాత్కాలికంగానే ఉంటుంది. కొన్ని సందర్భాలలో కోరికలు సఫలమైనప్పటికీ మనస్సు ఆనందాన్ని పొందదు. మరికొన్ని సందర్భాలలో కోరికలతో సంబంధములేకుండానే నీవు ఆనందంగా ఉంటావు. కనుక నిజమైన ఆనందానికి ఆధారమేమి? అది నీవే. ఆనందము మనస్సు యొక్క స్థితిపై ఆధారపడి యుండదు. నీలో కోరికలు జనించనంత వరకు కోరికలను ప్రేరేపించే పరిస్థితులు నీకు ఎదురులేనంత వరకు నీవు ఆనందంగానే ఉంటావు. స్వతహాగా ఆనంద స్వరూపుడవైన నీవు, నీవు నీవుగా ఉన్నపుడే ఆనందంగా ఉంటావు. స్వార్థ పూరితమైన చింతన నిన్ను విషాదగ్రస్తుణ్ణి చేస్తుంది. నిస్స్వార్థం నీకు ఆనందాన్నిస్తుంది.

నీ ఆనందానికి గల కారణం నీవు చెప్పలేక పోవచ్చును, కానీ నీవు విచారంగా ఉన్నపుడు మాత్రం నిన్ను నీవు నిగ్రహించుకోలేవు. సంతోషంగా ఉన్నదీ నీవే, నిన్ను ప్రేమించే వ్యక్తివీ నీవే. తర్కంలోంచి పుట్టిన ఈ రకమైన అనుభవాన్ని అనుభవ యుక్తి అంటారు. నీ అనుభవము నీకు యుక్తిని ప్రసాదిస్తుంది. ఫలితంగా కలిగిన వివేచన సహాయంతో నిన్ను నీవు ఆనంద స్వరూపునిగ అవగాహన చేసికొనగలవు. ఇంతకు మునుపు చెప్పినట్లుగ ఆనందము యొక్క క్రియాశీలక రూపమే కారుణ్యము. కనుక నీలో కరుణ కలిగిననాడు నీవు నీ ఆత్మ స్వరూపానికి దగ్గరవుతావు, కనుక కరుణ చాలా ప్రాముఖ్యత గల్గినది.

మానవతా విలువల వ్యవస్థను పరిశీలించినపుడు అత్యంత జాగరూకతతో క్రమబద్ధంగా ఎరుకతో పెంపొందించుకొనవలసిన విలువలలో కారుణ్యము అతిముఖ్యమైనదిగా నాకు అనిపిస్తుంది. ఈ సుగుణము వ్యక్తిలో సంపూర్ణత్వాన్ని, ప్రేమను, సమర్పణ భావాన్ని, మరియు అవగాహనను పెంపొందించగలదు. ఇది వ్యక్తి జీవనములో హుందాతనమును పెంపొందిస్తుంది. అటువంటి హుందాతనము ఆ వ్యక్తి కుటుంబజీవనమును సైతము గొప్పగ ప్రభావితము చేయగలదు. విశాల హృదయుడైన వ్యక్తి మాత్రమే ఆ ఈ విలువను సంపూర్ణంగా అనుష్ఠించగలడు.

అనువాదము

ఎ. తారాలక్ష్మి M.A., M.Ed., M.Phil

శ్రీకాళహస్తి

భాగవతం భక్తి కథా కుసుమం

- ఆచార్య కె.ప్రతాప్

నిర్గుణము, నిరాకారము, నిరంజనము అయిన పరమాత్మతత్త్వాన్ని 'శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః' అని ఉపనిషత్తులు ఎలుగెత్తి చాటిన పరమసత్యాన్ని పురాణేతిహాసాలు కథల రూపంలో పునరుద్ఘాటించాయి. నిరాకారమయిన పరతత్త్వాన్ని అనుసంధానంచేయడం మహాతపస్సంపన్నులయిన మునులకు, మహర్షులకుమాత్రమే సాధ్యం. దివ్యశక్తులు లేని సామాన్యమానవాళిని తరింపచేయడంకోసం వెలువడిన పురాణసాహిత్యంలో శ్రీమద్భాగవతానిదే అగ్రస్థానం. మానవుడై జన్మించిన ప్రతివాడు అనునిత్యం అభయప్రదమైన భగవత్స్వరూపాన్ని అనుసంధానం చేయాలన్నది భాగవతసందేశం.

ప్రాయేణ మునయో రాజన్ నివృత్తా విధినిషేధతః
నైర్గుణ్యస్థా రమంతే స్మ గుణానుకథనే హరేః !!
(భాగ. 7)

'సహజంగా విధినిషేధాలకతీతులయిన ఋషులు మునులు నిరాకారము, నిర్గుణము అయిన పరతత్త్వంలో రమిస్తూ వుంటారు. అయినా వారికి కూడా ఆ భగవంతుని అనంతగుణగణాలను, మధురాతిమధురమైన అద్భుతలీలను విని తరించాలని ఉవ్విళ్ళూరుతుంటారు' అని శుకమహర్షి పరీక్షిన్మహరాజుతో చెబుతాడు.

'ఆత్మా వా అరే ద్రష్టవ్యః, శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః'

అన్న బృహదారణ్యకోపనిషత్ సందేశాన్ని భాగవత మహాపురాణం

శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ స్మర్తవ్యశ్చేచ్ఛాభయమ్ !!(భాగ. 11.5)

అని సరళం చేసి చెబుతుంది. అంటే సర్వాత్ముడైన హరిని, హరినామాన్ని, హరినామమాహత్మ్యాన్ని గురించి శ్రద్ధగా వినాలి. విన్నదానిని నిరంతరానుసంధానంతో వేనోళ్ళ పొగడాలి. పొగడినపలుకుని హృదయంలో స్థిరంగా ప్రతిష్ఠించుకోవాలని తద్ద్వారా జీవితగమ్యము, పరమ పురుషార్థము అయిన మోక్షము సాధ్యమౌతుందని తెలియజేసిన ఉపదేశకథాకథనమే శ్రీమద్భాగవతపురాణం.

మొత్తం పండ్రెండు స్కంధాలతో కూడుకున్న భాగవతపురాణంలోని మొదటి రెండుస్కంధాలు భగవద్గుణగానామృతాన్ని వినిపింపచేయడానికనువైన భూమికను సిద్ధం చేయడానికి కేటాయించబడినాయి. ఎందుకంటే బీజావాపనప్రక్రియ ఎంతశ్రేష్ఠమైతే ఫలితమంత ఉన్నతంగా వుంటుంది. ఆ తరువాతి అయిదు స్కంధాలలో భగవంతుని దివ్యగుణాలను తెలియజేసే కథలను వివరించి, చివరి అయిదు స్కంధాలలో భగవల్లీలలనెలా స్మరించుకోవాలో విశదీకరిస్తుంది. అలా విని, స్మరించి, అనుభవించిన భగవంతుని మాహాత్మ్యం మానవునికి అనుగ్రహించే అపురూపఫలాలనీక్రింది విధంగా పేర్కొంటుంది.

సత్యం శౌచం దయామౌనం బుద్ధి శ్రీర్యశః క్షమా! ।
శమో దమో భగశ్చేతి యత్సంగాద్యాతి సంక్షయమ్! ॥
- భా.ర. 111.203

సత్యము శౌచము, దయ, వాక్సంయమనము, సంపద, సిగ్గు, కీర్తి, ఓర్పు, అంతరింద్రియనిగ్రహము, బాహ్యేంద్రియసంయమనము, ఐశ్వర్యము వంటి గుణ సమూహసంబంధం వల్లనే మానవుడున్నతుడై నిశ్శ్రేయస ప్రాప్తికి అర్హుడౌతాడు.

భగవన్నామాన్ని, మాహాత్మ్యాన్ని శ్రవణం అంటే వినడమనే ప్రక్రియలో భాగస్థులయిన అడిగేవాడు, వినేవాడు, వినిపించేవాడు- ఈ ముగ్గురే. వారు స్త్రీలయినా, పురుషులయినా కూడా పవిత్రతము లౌతారని, సాలగ్రామాల్లాగా పూజ్యులవుతారని, గంగాజలంలాగా తీర్థాలౌతారని ఎలుగెత్తి చాటుతున్నారు శుకమహర్షులు -

వాసుదేవకథాప్రశ్నః పురుషాన్ స్త్రీన్పునాతి హి!
వక్తారం పృచ్ఛకం శ్రోతౄస్తత్పాదసలిలం యథా!!
(భా. 6)

ఇక భాగవతకథాకథన సంవిధానం అత్యంత హృద్యంగా వుంటుంది. ఎంతటి గహనము, గూఢము అయిన విషయాన్నైనా సహజంగా సరళంగా సామాన్యునికందింపచేసే ప్రయత్నం అపూర్వమైనది. పసివాడికి సంఖ్యాజ్ఞానం కలిగించే ఒకటి, రెండు,మూడు అనే సంఖ్యాక్రమంలో బాహ్యాభ్యంతర విశ్వపరిచయాన్ని అత్యంతమనోహరంగా ఉపేంద్రవజ్ర వృత్తంలో వివరిస్తాడు వ్యాసభగవానుడు -

ఏకాయనోఽసౌ ద్విఫలస్త్రిమూల
శ్చతూరసః పంచవిధః షడాత్మా!
సప్తత్వగష్టవిటపో నవాక్షో
దశచ్ఛదీ ద్విఖగో హ్యాదివృక్షః !! భా. X 21

అక్కడ ప్రకృతినాశ్రయించుకొని ఒక వృక్షముంది. దానికి రెండు ఫలాలు, సత్త్వము,రజస్సు, తమస్సు అనే మూడు వేళ్ళున్నాయి. ఈ చెట్టుకు కాచిన పళ్ళకు ధర్మము,అర్థము, కామము, మోక్షము అనే నాలుగు రుచులున్నాయి. ఆ పళ్ళను కన్ను, చెవి,ముక్కు,నాలుక, చర్మమనే అయిదు ఇంద్రియాలద్వారా ఆస్వాదించడానికి వీలవుతుంది. అలాగే ఈ చెట్టుకు పుట్టడం, వుండటం, పెరగటం, మార్పుచెందటం, తగ్గటం,నశించటం అనే ఆరు దశలున్నాయి. రసము, రక్తము, మాంసము, మేధస్సు, ఎముకలు, మజ్జ, శుక్రమనే ఏడు ధాతువులతో ఈ చెట్టుయొక్క బెరడు నిర్మించబడివుంది. నేల,నీరు, వెలుగు,గాలి, ఆకాశం, మనస్సు, బుద్ధి, అహంకారమనే ఎనిమిదికొమ్మలున్నాయి. అలాగే ప్రాణము,అపానము, వ్యానము, ఉదానము, సమానము, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయ అనే పది ఆకులున్నాయి. ఈచెట్టు కొమ్మలమీద రెండుపక్షులున్నాయి. ఇది కంటికి కనిపించే బాహ్యప్రపంచపు స్వరూపం.

దీని అంతఃస్వరూపం, లేదా ఆధ్యాత్మిక స్వరూపమేమిటో ఇప్పటికే అవగతమైవుంటుంది. ప్రకృతినాధారంచేసుకొని వుండే పరతత్త్వం ఎప్పుడూ ఒక్కటే. అది జీవాత్మస్వరూపంలో భౌతికశరీరంలో అభివ్యక్తమౌతుంది. ఇది త్రిగుణాత్మకము (సత్త్వము, రజస్సు, తమస్సు). దీని ప్రవృత్తి ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే నాలుగు ప్రయోజనాలున్నాయి. ఈ ప్రయోజనాలను పంచేంద్రియాల ద్వారా సాధించుకోవాలి. ఇది ప్రపంచంలో ఆరుదశలలో ఆవిర్భవించి అంతరిస్తుంది. ఏడు ధాతువులతో నిర్మించబడుతుంది. పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారం అనే ఎనిమిది అంశాలతో విశ్వమంతా వ్యాపించివుంది. ఈ శరీరయంత్రానికి తొమ్మిది రంధ్రాలుండి, పదిరకాల

వాయువులు యథేచ్ఛగా సంచరిస్తాయి. ఇది జీవాత్మ స్వరూపం. ఇలా బాహ్యాంభ్యంతరవిశ్వాలను ఒక్కశ్లోకంలో వివరించడం పురాణకర్తయెక్క కథనకౌశల్యానికి నిదర్శనం. ఇటువంటి శ్లోకాలు ఈ పురాణంలో లెక్కకుమించి వున్నాయి.

ప్రస్తుతం మనకు లభించే ముద్రిత భాగవత పురాణంలో 14,260 శ్లోకాలున్నాయి. ఇంతటి విస్తృతమైన గ్రంథం విజ్ఞులైనవారికి కూడా అందుబాటులోలేని కారణాన పరమపూజ్యులు, శ్రీమలయాళయతీంద్రుల పరమశిష్యులు, శ్రీ శుకబ్రహాశ్రమసంస్థాపకులు అయిన శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు (1914-1998) 'శ్రీమద్భాగవతమహాపురాణాన్ని 'భాగవతరత్నాకర' మనుపేర సంక్షిప్తీకరించడం ఆంధ్రులు చేసుకున్న భాగ్యంగా భావించాలి. శ్రీగురుదేవుల శతజయంత్యుత్సవాలను పురస్కరించుకొని వెలువడుతున్న విశేషసంచికలో 'శ్రీ భాగవతరత్నాకరము' (భా.ర) ను గురించి నాలుగు మాటలు వ్రాసే అవకాశం కలిగించిన సంపాదక మండలికి కృతజ్ఞతలు.

– కె. ప్రతాప్

ముముక్షువులారా! మీరు ఎంతధ్యానముగాని, జపముగాని, యోగసాధనలుగాని అభ్యసించుచుండినను వేదాంత విద్యాపఠనమును మాత్రము చేయుచుండవలయును. అది లేనిచో బుద్ధి వికసించదు. విశాల భావమున్ను గలుగదు. ఆత్మస్వరూప నిర్ణయమును సిద్ధించదు. ఋషులమార్గమున్ను గోచరించదు. ఏలన ధ్యానములోగాని, జపములోగాని, ఆసన ప్రాణాయామాదుల యందుగాని, కీర్తనాదులు యందుగాని, బుద్ధికి పని యేమియు కలుగదు. ఆత్మ విచారణ శాస్త్రచింతనయందు మాత్రమే బుద్ధికి పని తగులుచుండును. అపుడు బుద్ధి జాగ్రదవస్థలోనికి వచ్చును. పై చెప్పిన జపయోగాదులన్నియు అపుడు బుద్ధియొక్క ఏకాగ్రతకున్ను, నిర్మలత్వమునకున్ను, జాగ్రత్తకున్ను ఉపయోగపడును. అత్తరి నిద్రలో నుండు మహాపండితునివలె బుద్ధి జడావస్థను పొందియుండును. ఆత్మ విద్యావిచారణ జ్ఞానములచే నిద్రనుండి మేల్కొనిన విద్వాంసునివలెను, సార్వభౌమునివలెను ఆత్మస్వరూపజ్ఞానము కలుగును.

నిద్రలో నుండువరకు పై నుదాహరించిన పండిత చక్రవర్తులకు తమ మహిమ తెలియనట్లుండుననియు, నిద్రనుండి మేల్కొనిన వెంటనే తన మహిమాతిశయములను తెలిసికొనినట్లుండుననియు మఱువకుడు. మెదడు పలిశీలకులు గూడ అనేక సంవిత్తు అణువులు మెదడులో నిద్రావస్థలో నున్నవనియు, అందువలననే ప్రజ్ఞామాంద్యము గలుగుచున్నదనియు, తపఃస్వాధ్యాయ యోగాదులచే నవి జాగ్రదవస్థలోనికి వచ్చుననియు, అందువలననే యోగుల కున్ను, తాపసులకున్ను అతీంద్రియ జ్ఞానము కలుగుచున్నదనియు తెలుపుచున్నారు. మరియు బంగారు పనివారున్ను, ఇనుపపనివారున్ను బొగ్గులో కొంచెము నిప్పువేసి ఊదునపుడు ఆనల్ల బొగ్గులన్నియు నిప్పుగా ఎట్లు మారునో ఇదిన్ని అటువంటిదని గ్రహించుకొనుడు.

– శ్రీ మలయాళస్వామి

గీతాసందేశము

శ్రీ స్వామి రామదాస్

ఆనందాశ్రమము (కన్‌హన్‌గాడ్)

ఓం ప్రథమముగ శ్రీమద్భగవద్గీత యందు శ్రీకృష్ణ భగవానుడు అవిద్యాపూరితమైనదియు, మోహగ్రస్త మైనదియు అగు అర్జునుని జీవాత్మను పిరికి తనమనెడి నీచమగు మనో దౌర్బల్యము నుండి మేల్కొలిపెను. ఈదుర్గుణము దివ్యమైనదియు, శాశ్వతమైనదియు అగు ఆత్మ స్వరూపమును మరుగు పరచి జీవాత్మను బంధమునకు గురిచేయును. జీవుని అజ్ఞానమునకు హేతువయిన ఈ 'మోహము' 'కామము' అను బీజమునుండి ఉద్భవించును. కామము మరియు మోహమనెడి దుర్గుణములను రెండింటిని సమూలముగ నిర్మూలించుటయే మోక్షము. మరియొక విధమున ఆత్మయొక్క శాశ్వతత్వమును గుర్తించుటయే మోక్షము. జీవుడు ప్రగాఢమైన మోక్షాభిలాషియై, నశ్వరమైన దేహము మరియు విషయేంద్రియ సంగమము నుండి విముఖుడై, ఏకాగ్ర సాధన ద్వారా శాశ్వతుడు, సత్యుడు అగు సచ్చిదానంద నిర్గుణ పరబ్రహ్మమును కూడుటయే మోక్షము. సాధకుడు పలు విధములైన సాధనలు, అనుష్ఠానములతో కూడిన సత్కర్మాచరణము నవలంబించి తన ఆత్మస్వరూపమును గుర్తించి తద్వారా ఆత్మజ్ఞానమును పొందును. వాస్తవమునకు జీవుడు అవిద్య, లేక అజ్ఞానము కారణంగా తాను అనంతమైన, శాశ్వతమైన ఆత్మ స్వరూపమను విషయమును పూర్తిగా విస్మరించును. అజ్ఞాన వశమున విస్మరించిన ఈ గొప్ప సత్యమును సాధకునకు నిరంతరము గుర్తుచేయుట కొరకే అన్నిరకములైన సాధనలు, అనుష్ఠానములు నిర్దేశింప బడినవి. ఈ సాధనల ద్వారా జీవుడు తనను తాను సచ్చిదానంద స్వరూపునిగా నిరంతరము స్మరణ జరుపుతాడు. ఫలితముగ తనను తాను నిత్యునిగ, శాశ్వతునిగి, సర్వవ్యాపిగ గుర్తిస్తాడు. ఈ నేపథ్యంలో జీవాత్మ దేహభావమును వీడి, త్రిగుణాతీతస్థితిని తద్వారా ఏర్పడే ద్వంద్వాతీతస్థితిని కూడా అధిగమించి శాశ్వత ఆనందమును పొందును.

ఆత్మజ్ఞానమును పొందిన జీవాత్మ మోక్షస్థితిని పొంది జీవబ్రహ్మైక్యము నొందుటకు ప్రయత్నించును. జ్ఞానప్రాప్తి ఆత్మయొక్క అనుభూతికి దారితీయును. అపుడు జీవుడు సమస్త దృశ్య ప్రపంచమునకు ఆధారభూతమైన, అగోచరం, అపరిమితం, అచలం, అచింత్యం మరియు సనాతమైన, సచ్చిదానంద నిర్గుణ పరబ్రహ్మములో ఐక్యమై పరమ శాంతిని పొందును. భగవద్గీతను సమగ్రంగా సంపూర్ణంగా అవగాహన చేసికొనిన వ్యక్తి బ్రహ్మజ్ఞాన శిఖరాన్ని అధిరోహించును మరియు ఆ వ్యక్తి మూర్తీభవించిన దివ్యజ్ఞానిగా, దివ్యమైన ప్రేమస్వరూపునిగా, దైవహిత మరియు పరహిత కార్యశూరునిగా, భగవానునకు అత్యంత ఇష్టుడైన భక్తునిగా పరిగణింపబడును. ఆ విధమైన జీవన్ముక్తుని సాక్షాత్తూ భగవత్ స్వరూపముగను లేక మానవ రూపములోనున్న మాధవునిగను పేర్కొన వచ్చును. పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు అటువంటి భక్తుని హృదయ కుహరము లోనికి ప్రవేశించి అతనిని తనలో ఐక్యమొందించగలరు. ఇదియే శ్రీ మద్భగవద్గీత యొక్క లక్ష్యము మరియు సందేశము.

అనువాదము

ఎ. తారాలక్ష్మి M.A., M.Ed., M.Phi.,l



గీతాజ్యోతి

శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయరు స్వాములవారు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥

ప్రతిపదార్థము :- సర్వధర్మాన్= సకలమోక్ష సాధనములను, పరిత్యజ్య=ఫల సంగకర్తృత్వముతో మాత్రము విడిచి, మాం ఏకం = నన్నే, శరణం = ఉపాయముగా, వ్రజ = అనుసంధించుము, అహం = నేను, త్వా = నిన్ను, సర్వపాపేభ్యః = నన్ను పొందుటకాటంకములుగా నున్న పాపములన్నిటినుండియు, మోక్షయిష్యామి = విడిపింతును, మా శుచః = దుఃఖింపకుము.

భగవద్గీత ఒక ఉత్తమ ఆధ్యాత్మిక గ్రంథం. ఒక ధర్మశాస్త్రం, ఒక ఉపనిషత్, ఒక యోగశాస్త్రం. గీతను "సర్వశాస్త్రమయీ గీతా" అంటే, లోకంలో ఉండే శాస్త్రాలన్నింటికీ మూలమైనది భగవంతుడు ఉపదేశించిన గీత. "యా స్వయం పద్మనాభస్య ముఖ పద్మాత్ వినిస్సృతా" అంటూ సర్వజగత్ కారణమైన, చతుర్ముఖబ్రహ్మని కూడాతన నాభీపద్మంలోంచి సృజించిన స్వామే సాక్షాత్తుగా ప్రవచించిన, మానవహితకరమైన ఉపదేశం భగవద్గీత.

మనిషిని సన్మార్గంలో పెట్టడానికి, తరింప చేయడానికి ఎన్నెన్నో సాధనాలు, ఎన్నెన్నో ఉపాయాలు ఇందులో అందించాడు. అయితే, ఈ ఉపాయాలు వాటంతట అవి పనిచేయగలిగినవి కానేకాదు. ఏ ఉపాయం పని చేయాలన్నా, దానిని పనిచేయింప చేసే ఆ పరమాత్మయొక్క కటాక్షం మనకు కావాలి. లోకంలో మనం చేసే సాధనాలన్నీ అచేతనాలు, శక్తిహీనాలు, తాత్కాలికాలు, నశ్వరాలు, మన ప్రయత్నం మీద ఆధారపడ్డవి. వాటన్నిటికంటే విలక్షణముగా సహజమైన జ్ఞానశక్తులు కలిగి లోకులందరిని, జీవులందరినీ కూడ తనయొక్క సంతానంగా ప్రేమించి వారి దోషాల్ని భోగ్యముగా స్వీకరించగలిగే ఔదార్యం కల పరమాత్మ-స్వయంగా నీకు ఉపాయం నేనౌతా, నీ భారాన్ని నేను స్వీకరిస్తా, నీ రక్షణ నేను చూసుకుంటాను, నీకెందుకు బెంగ? అని ఒక భరోసా ఇస్తే మనకిక కావలసినది ఏముంది?

లోకంలో మేం నీకు రక్షకులమవుతామని చెప్పి చివరికి వారికి వారే రక్షణ చేసుకోలేకపోయిన సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. ఆశ్రయించిన వాడిని రక్షణ చేస్తానని ప్రతిజ్ఞ చేసి, దానికి ధీటుగా వారిని రక్షించి, వారికి కావలసిన ప్రయోజనాలు, ఫలితాన్ని ప్రసాదించగలిగినవాడు పరమాత్మ సాక్షాత్తూ శ్రీకృష్ణుడు ఒక్కడే. నేనే నీకు ఉపాయమై ఉంటానయ్యా! అని భగవంతుడే మనముందు నిలిస్తే ఇక అంతకంటే కావలసినది ఏముంది! భగవంతుడు మనకోసం చేసిన ఈ అద్భుతమైన ప్రతిజ్ఞనే 'చరమశ్లోకం' అని మన పూర్వీకులు అంటారు. అర్జునుడిని వ్యాజంగా చేసుకొని ఈ లోకానికంతటికీ అభయమిచ్చాడు పరమాత్మ ఈ శ్లోకంలో. ఆనాడు యుద్ధరంగంలో యుద్ధం చేయాలా? మానాలా? తనకర్తవ్యాన్ని పాటించాలా? పాటించతగదా? యుద్ధం

చేయడం వలన పాపాలు, నరకాలు, దుఃఖాలు పొందాల్సి వస్తుంది -అనే సంశయంతో ఊగిసలాడుతున్నాడు అర్జునుడు. క్షత్రియుడిగా యుద్ధం చేయడమే తనకి విహితమైన ధర్మము. దానిని అధర్మమని భావించాడు. యుద్ధంలోంచి వెనుదిరగడం అధర్మం. కాని దానినే ధర్మంగా నిశ్చయించుకొని తన చేతుల్లో ఉండే ధనుర్బాణాలను క్రిందకు వదిలి, ధర్మస్థాపన చేయడం కోసం వచ్చిన సాక్షాత్తూ సర్వేశ్వరుడి ముందే ధర్మత్యాగం చేస్తానన్నాడు. అలాంటి అర్జునుడిని కర్తవ్యోన్ముఖుడిని చేయడానికి సాగించిన ఉపదేశసారమే ఈ శ్లోకం.

అది ఆనాడు కేవలం అర్జునుడికోసమే ఉపదేశించినా కర్తవ్యమేమిటో తెలియక కొట్టుమిట్టాడుతూ ఉండే మానవాళికందరికీ చెప్పిన ఉపదేశము భగవద్గీత. అందులో ఎన్నెన్నో ఉపాయాలు చెప్పి చిట్టచివరికి "సర్వాధర్మాన్" అనే ఈ చరమశ్లోకాన్ని ఉపదేశించాడు. నిజానికి అదేదో మొదటే చెప్పేసి ఉంటే సరిపోయేదిగా అని చాలామందికి సందేహం వస్తుంది. కానీ, భగవంతుడు మొదటే అది చెప్పి ఉన్నట్లయితే, అర్జునుడికి విశ్వాసం కలిగి ఉండేదే కాదు. కారణం? తాను రథికుడు. శ్రీకృష్ణుడు సారథిగా కూర్చున్నాడు. అలాంటి ఆయన ఇది నీకు చరమోపాయం. నేనే నీకు కావాలసినవి అన్నీ చేయగలిగిన వాడిని అని అంటే, ఏమో! ఈ సారథియా చేయగలిగేది! అనే సంశయం ఏర్పడుతుంది. కనుక, ముందే తాను చెప్పలేదన్నమాట. అంతేకాక, అర్జునుడిలో నేనే చేసే వాడిని, పొందేవాడిని నేనే, ఇదంతా నావల్లనే అనే అహంకారం నిండుగా ఉంది. కనుక, ఆ అహంకారాన్ని మొదట తొలగించాలి. అది మొదటి కర్తవ్యం. అహంకారం తొలగనంత వరకూ స్వామి నిశ్చయించి చెప్పలేదు.

ముందు అర్జునుడిని పరీక్షిస్తూ ఇదైనా చేసుకో, పోనీ అదైనా చేసుకో అంటూ అనేక రకాల ఉపాయాలను తాను చెప్పాడు. అవన్నీ ఆలోచించి నీకేది మంచిదో అదే తీసుకోవయ్యా! అన్నాడు. అయితే అవన్నీ విన్న తరువాత అర్జునుడికి-అమ్మో! ఇది నిర్ణయం చేసుకోవాలసింది నేను కాదు. లోపల ఉండి ఆచరింప చేయాల్సింది నీవే అన్న జ్ఞానం కలిగింది. అర్జునుడికి తన స్వరూపం తెలిసిన తరువాత 'లోపల ఉండి చేసేవాడు ఆయన. సర్వభూత సుహృత్, నా ఎదురుగా కూర్చున్నాడు. అతడు సర్వశక్తికలవాడు. వాని అనుగ్రహం లేకపోతే నేను చేసి సాధించగలిగేదిలేదు' అనే ఇంగితం ఏర్పడినది. 'కృష్ణా! నీవేది చెబితే అది నేను చేస్తాను. నామీద భారం పెట్టి, నాకు అహంకారం వచ్చేట్టు చేయకు' అని ఏడ్చాడయన. ఆ ఏడుపు చూసి జాలి తలచి శ్రీకృష్ణుడు 'మా శుచః' అని అన్నాడు. నీకు కావవలసిన రక్షణ నేను చూసుకుంటాను. నీకు వచ్చే అడ్డులన్నీ తొలగించి, నీకు కావాలసినవన్నీ ఇచ్చే బాధ్యతను నేను, నామీద వేసుకుంటాను. నీకెందుకు అనవసరంగా ఏడుపు? - అంటూ ఓదార్చాడు చరమశ్లోకంలో.

లోకంలో ఒకడు గుడికి వెళ్ళి కొబ్బరికాయ కొట్టి ఈ పని జరిగితే బాగుండును అని మ్రొక్కితే, పొరపాటున ఆ పని జరిగితే, నేను కొబ్బరికాయ కొట్టాను కాబట్టి పని జరిగింది అంటాడు. కొబ్బరికాయ కొడితే పని జరిగితే - కొట్టిన ప్రతివాడికీ జరగాలి. కానీ, అలా జరగటం లేదు. అంటే నీవు చేసిన కార్యములు కావు నీకు ఫలితాన్ని అందించేది, దైవ అనుగ్రహం ఉన్నపుడు వస్తుంది. లేకపోతే రాదు. చేసే ఏ పని అయినా నా వల్ల జరుగుతుంది! నాకు ఫలితం వస్తుంది! అనే భావన ఏ మాత్రం ఉన్నప్పటికీ కూడా భగవంతుడు తను కల్పించుకునే ప్రయత్నం చేయడు. ఎందుకంటే, తను కనుక ప్రయత్నం చేసి ఇస్తే, 'నేను చేతకాని వాడినా?' అని నువ్వు ఎక్కడ ఏడుస్తావోనని ఆయనకు బెంగ. నేను చేసుకుంటుంటే, మధ్యలో నీ సహాయం ఎందుకు? అని నువ్వు ఎక్కడ చిన్నబోతావో అని ఆయనకు బెంగ.

అందుచేత నీవెంత వరకు కృషిచేయగలవో, ఎంతవరకు సాధించగలనంటావో, అంతవరకు సాధించుకునేటట్లు తాను వదిలిపెడుతుంటాడు. ఇక ఏ కారణంగానైనా - ఇది నావల్లకాదు. నేను సాధించుకోలేను - అని ఆయనకు నీవు ఏనాడు పరిపూర్ణంగా శరణాగతి చేసి ప్రపన్నుడవౌతావో, ఆనాడు పూర్తి భారాన్ని తాను చూచుకుంటాడు.

నేను ప్రయత్నం చేస్తున్నందువల్ల, నేనే శరణాగతి చేసినందువల్ల భగవంతుడు నన్ను రక్షిస్తున్నాడు అనే భావన కూడ తప్పే. శరణాగతి మనమా చేయగలిగేది! శరణాగతిచేసే శరీరం ఎవరి వల్ల పనిచేస్తుంది? శరణాగతి చేసే జ్ఞానం ఇచ్చేదెవడు? లోపలుండే వాని వల్లనే కదా కలిగింది! అంటే, నీకు ఏ మాత్రపు అహంకారపుపొర ఎక్కడ కాస్త కలిగినా, తాను వదిలేసి కూర్చుంటాడు. కోతి పిల్ల, తల్లి పొట్టకరచి పట్టుకొని, 'పట్టుకున్నందువల్లే నేనిలా ఉన్నాను' అనుకుంటుంది కనుక, కోతి వదిలేసి కూర్చుంటుంది. దీనినే మర్కట కిశోర న్యాయమంటారు.

పిల్లిపిల్ల తను తలవంచి తల్లి తీసుకువెళ్ళినట్లుగా ఒదిగి ఉంటుంది. తల్లిపిల్లే జాగ్రత్తగా పిల్లకు ఎటువంటి శ్రమకలగకుండా తీసుకువెళుతుంది. దీనినే మార్జాలకిశోర న్యాయమంటారు. అలాగే మనం కూడ భగవంతుడి రక్షణ విషయంలో అమరి ఉండగలగాలి. అయితే శారీరకంగా చేయవలసిన పనులన్నీ సిన్సియర్‌గా చేస్తూనే ఉండాలి. కానీ, ఇది నావల్ల కలుగుతోంది, నాకోసం కలుగుతోంది, అనే భావన లవలేశమైనా లోపల ఏ మూలఎక్కడ, ఏ కాస్తకన్పించినా, భగవంతుడు తాను ఊరుకుంటాడు. లోపల ఆ భావన లేకుంటే, సర్వవిధాల తానే రక్షణ చేస్తాడు. అది అర్జునుడికి తెలియడానికి '17' అధ్యాయాల గ్రంథాన్ని చెప్పాల్సి వచ్చేది. ఇక మనలాంటి వాళ్ళకి ఆ విశ్వాసము ఎప్పటికి కలుగుతుందో? ఏమిటో? తెలియనే తెలియదు.

కానీ, అది కలిగితే వాని రక్షణలో ఇక లోటు లేనేలేదు.

ఆళ్వార్లలాంటి మహానుభావులకు అలాంటి విశ్వాసం కలిగింది. సీతమ్మలాంటి మహానుభావురాలికి ఆ విశ్వాసం ఉంది. లంకా నగరంలో హనుమంతుడు వచ్చి "అమ్మా! రామచంద్రుడి దగ్గరకి నిన్ను తీసికెళ్ళిపోతా"! అని అంటే, "రాముడే నన్ను రక్షింపతగినవాడు. నా శరణాగతిని నువ్వు ఆయనకు తెలియజెయ్. ఆయనే వచ్చి, యుద్ధం చేసి, రావణ నిరసన చేసి, మిగతా వారిని దండించి అప్పుడు నన్ను తీసుకువెళ్ళమని చెప్పు" అని శరణాగతి స్వరూపాన్ని మనకి అమ్మ తెలిపింది. ఒక్కసారి ఆ శరణాగతి మనం పరిపూర్ణంగా చేయగలిగితే మనలో భగవత్ ప్రేమ కలగడానికి ఆటంకంగా ఉండేవన్నీ తను తొలగించుకుంటాడు. తను మన పాలిటి సాధనమై, ఆ సాధన చెయ్యాల్సిన పనులన్నీ తనే చేసికొని చేర్చాల్సిన ఉత్తమ లక్ష్యానికి మనని చేర్చుకొని ఆనందింప చేసి, మనం ఆనందిస్తుంటే చూసి తాను పొంగిపోతుంటాడు. ఇది భగవంతుడికి మనమీద ఉండే గొప్ప ఔదార్యం. ఈ మాట భగవంతుడు ఈ శ్లోకంలో స్పష్టం చేసాడు.

ఇది చెప్పిన తరువాత ఇక అర్జునుడికి సందేహం కలగలేదు. ఆ మాట చెప్పనంతవరకు ప్రశ్నలు వేస్తూనే ఉన్నాడు. తాను వింటూనే ఉన్నాడు. కానీ, ఈ మాటను విన్న తరువాత, ఇక నాకు ఇతర ఉపాయాలు లేవు. సాక్షాత్తూ కృష్ణుని యొక్క చరణారవిందములే రక్షకములు.

సార్వజనీనమైనది భగవదుపదేశం. కేవలం ఒక దేశీయులకో, ఒక ప్రాంతీయులకో లేదా ఒక కులస్థులకో కాక, మానవాళికందరికీ కూడా మహోపదేశంగా చెప్పింది. భగవద్గీత. ఇది ఉత్తమ ఉపాయములు మనకందరికి అందించే సాధనం. ఏ సమస్యను ఎవరు ఎదుర్కొన్నా, కావలసిన పరిష్కారాన్ని అందించ గలిగిన గ్రంథం భగవద్గీత.

ఇది ఒక జ్ఞానజ్యోతి, గీతాజ్యోతి, దానిలో ఎన్నో ఎన్నో రత్నములున్నవి. అన్నీ మనం అందుకోలేం కానీ, మనకుండే శక్తికి, మనకుండే అవకాశానికి, మనకుండే అవసరాలకి తగిన కొన్ని రత్నాలని అందులోంచి అంది పుచ్చుకొనే ప్రయత్నం చేయడం తప్పేమీ కాదు. అపారమైన, అగాధమైన ఆ జలాలలో ఏ మూల, ఏ కాస్త జలబిందువులను మనం రుచి చూడగలిగినా, మనకుండే అనంతమైన తృష్ణ తీరకమానదు. ఎన్నివేల జన్మలుగానో, ఎన్నో కోట్ల జన్మలుగానో పైన పూసుకున్న అనంతమైన అతి క్రూరపాప రాశినంతటినీ 'సకృత్ గీతాంభసి స్నానం సంసార మలమోచనం' అని భగవద్గీత మనలో ఉండే ఆ మలినాల్ని కడిగి పారవేస్తుంది. మనల్ని పరిశుద్ధులుగా తీర్చిదిద్దుతుంది. లోకంలో అందరినీ తరింప చేసేది భగవద్గీత ఒక్కటే. తరింపచేసేవాడు పరమాత్మ - మాధవుడొక్కడే "ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతం ఏకోదేవ" ఆయన ఒక్కడే లోకాన్ని తరింపచేసేవాడు. దేవకీ పుత్రుడిగా ఈ లోకంలో అవతరించాడు. లోకంలో ఎన్నెన్నో అక్షర సముదాయాలుగా ఏర్పడ్డమంత్రములుండుగాక! కానీ, చేయవలసింది ఆ స్వామియొక్క దివ్యనామ స్మరణమే. అదే మనల్ని తరింపచేసేది. 'ఏకో మంత్రః తస్య నామాని యాని' అని మనమంతా అతడి సేవగా లోకసేవచేయాలి. 'కర్మాప్యేకం తస్యదేవస్య సేవా'! అన్నట్టుగా అతడి కైంకర్యముగా మన జీవితాన్ని గడపాలి. మాధవసేవగా మన జీవితాన్ని గడపగలగాలి.

లోకములో ఉండే మానవాళికి అందించిన ఈ ఉత్తమ ఉపదేశాన్ని మనం విశ్వసించే ప్రయత్నం చేద్దాం! మాధవసేవగా - సర్వప్రాణి సేవని మనం స్వీకరిద్దాం. దానికి తగినట్లుగా ఆ స్వామిని మనకు నచ్చిన ఏ రూపంలోనైనా అది చిన్నదా, పెద్దదా, అది లోహమా? మృణ్మయమా? దారుమయమా? అంటే అది చెక్కతో చేసినదా? లోహంతో చేసినదా? ఈ నియమమేమీ అవసరం లేదు. అది ఎటువంటిదైనా ఆ స్వామి యొక్క ఒక చిన్నారి రూపాన్ని మన హృదయంలో ధరించవచ్చు. మన గృహాల్లో ఆరాధించవచ్చు. మనకోసం తాను అక్కడ నుండి కావాలసిన రక్షణ అందిస్తాడు. తనను మనం విశ్వసించి ఆరాధన చేస్తే తన దివ్యమంగళ విగ్రహం నుండి అనుగ్రహాన్ని మనం పొందుతాం. సంజయుడు ప్రతిన పూనినట్టుగా, మనకు ఉపదేశం చేసినట్టుగా మనకి సకల మంగళాలు లభిస్తాయి. మనం ఆరంభం చేసిన ప్రతి పనిలో రక్షణ లభిస్తుంది మనకు. మన జీవితాలు నీతిమయంగా సాగుతాయి. మనం మనకి తగిన దానిని ఆరాధన చేసుకుంటూ తదితరమైన లోకులయొక్క నియమములను ఆదరిస్తూ పరస్పర ప్రేమానురాగాలతోటి జీవనం సాగించే ప్రయత్నం ప్రారంభించాలి. నీది నీవు ఆరాధించు. నాది నేను ఆరాధిస్తాను. నీది నేను గౌరవిస్తాను. నా దానిని నీవూ గౌరవించు! మన ఇరువురం కలసి సమాజాన్ని గౌరవిద్దాం. నేను విశ్వసించిన దైవాన్ని నేను ఆరాధిస్తాను, సేవచేస్తాను. నీవు విశ్వసించిన రూపంలో నీవు దైవానికి ఆరాధన చెయ్, సేవ చెయ్. ఇతరులు చేసుకొనేవాటిని గౌరవించు! ఈ భూమి మీద పరస్పరం కలహాలు మాని కలసి ప్రేమతో జీవిద్దాం! సమాజానికి మనం సేవచేద్దాం. మనమందరం కలిసి సమాజరూపమైన అవరోధాలు తొలగిద్దాం. ఆ భగవత్ సంతానమైన మనం ఒక కుటుంబంగా భావన చేస్తూ, పరస్పర ప్రేమానురాగాలతోటి, గౌరవాదరణతోటి, తోటివారికి తోడ్పడుతూ జీవితాన్ని సాగించేట్టు అడుగు ముందుకు కదుపుదాం! గీతాజ్యోతిని మనతో శాశ్వతమైన కరదీపికగా చేసుకొందాం! భగవదనుగ్రహాన్ని మనం పొందుతూ మిగతా ప్రాణికోటితో ఈ భూమ్మీద మరో పదికాలాలపాటు మనుగడ సాగించగలిగే ఈ ఉద్యమంలో మనమూ ఒక అడుగు కలిపి నడుద్దాం!



భగవద్గీత అంతరార్థం

శ్రీ రంగనాథానంద స్వాములవారు

(పూజ్యశ్రీ రంగనాథానందస్వాములవారు స్వామి వివేకానందచే స్థాపింపబడిన అంతర్జాతీయ సంస్థ అయిన శ్రీరామకృష్ణ మఠాలు, శ్రీరామకృష్ణ మిషనులకు సర్వాధ్యక్షులుగా వుండినారు. అందరిచే పొగడబడిన మంచివక్త.)

భారతావనిలో జన్మించిన చింతనాశీలురు, కార్యోన్ముఖులు అందరిలో గీతాచార్యుడు భగవాన్ శ్రీకృష్ణుడు అనుపమాన మయిన వాడు. అతడు ఉదాత్త ఆశయాలు కలవాడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. గీత బహుళ ప్రాచుర్యం పొందుతున్న ఈ ఆధునిక కాలంలో శ్రీకృష్ణుని వ్యక్తిత్వానికి కూడ గొప్ప గుర్తింపు లభిస్తున్నది. గీత ఆధ్యాత్మిక మనోజ్ఞతను, తత్త్వజ్ఞాన గాంభీర్యాన్ని గుర్తించిన పాశ్చాత్యులలో కార్లైల్, వాల్ట్‌విట్ మన్, ఎమర్సన్‌లు ప్రప్రథములు. 'ఇంతటి గొప్ప గ్రంథం మరొకటి రచింపబడలేదని గీతను ఫ్రెంచి భాషలోకి అనువదించిన బర్నూఫ్ అన్నాడు.

1. భవిష్యవాణి

సర్ చార్లెస్ విల్కిన్స్ ఇంగ్లీషు అనువాదానికి ఉపోద్ఘాతం వ్రాస్తూ, భారతదేశం ప్రథమ బ్రిటిషు గవర్నర్ జనరల్ ఈ విధంగా అన్నారు. 'భారతదేశంలో బ్రిటిషు పరిపాలన ముగిసి, దాని ఐశ్వర్యాధికారాలు చరిత్ర మరుగున పడిపోయిన చాల కాలం పిదప కూడ భారతీయ తత్త్వశాస్త్రాలు చిరస్థాయిగా నిలిచి ఉండగలవు'.

ఆనాడు మొదలు ఎందరో పాశ్చాత్య కవులు, మేధావులు గీతా మాహాత్మ్యాన్ని శ్లాఘిస్తూనే ఉన్నారు.

2. యుక్తియుక్తమైన జీవన తత్త్వం

ఆధునికులకు సైతం ఆకర్షణీయంగా ఉన్న కొద్ది ధార్మికగ్రంథాలలో గీత ఒకటి అన్నది విశేషమైన సంగతి. ఆధునికులకు ఏ శాస్త్రగ్రంథంపైనా నమ్మకం లేదన్నది గమనార్హం. సాంప్రదాయిక మతాలు వక్కాణించే ధర్మపన్నాలపై వారికి శ్రద్ధ లేదు. ఆధునిక వైజ్ఞానానికి విమర్శనాస్త్రాన్ని వారు ప్రపంచ మత గ్రంథాలపైనే పూర్తిగా సంధించారు. ఇది ఉభయత్ర దారుణ పరిణామాలకు దారి తీసింది. విశ్వాసంతోనే జీవించటం రాను రాను కష్టమవు తున్నది. ముఖ్యంగా ఆ విశ్వాసం నిరూపిత యథార్థాలకు అనుగుణంగా లేనప్పుడు మరీ కష్టం. సర్వత్ర శంక సంశయాలే కానవస్తున్నాయి.

3. భారతీయ సంప్రదాయంలో శ్రీకృష్ణుడు

గీతాసందేశాన్ని ప్రస్తావించినప్పుడు మన దృష్టి గీతాచార్యుడైన శ్రీకృష్ణుని వైపు ప్రబలంగా ఆకర్షింప బడుతుంది. పూర్వకాలంలో మన దేశంలో ఎందరో మహానుభావులు జన్మించారు. భారతీయ సంస్కృతికి ఒక

విలక్షణమైన రూపాన్ని చేకూర్చటంలో వారు ఘనమైన పాత్రలు నిర్వహించారు. వీరిలో శ్రీకృష్ణుడు అగ్రగణ్యుడు. కనుక హిందువులు ఆయనను పూర్ణావతారంగా కొలుస్తారు. సర్వోత్తముడైన వ్యక్తికి మానవాళి చేయగల ఘనసన్మానం ఇదే. బుద్ధికుశలతకల భారతీయులు ఈ గొప్పదనాన్ని అర్థం చేసికొన్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక రంగాలలోని పురుషపుంగవులను వారు ఈశ్వరావతారాలుగా పరిగణించి, ఆరాధించారు. ఈ మహాపురుషులు జాతీయ వికాస ఉద్యమంలో అగ్రేసరులు. వారు జాతి మానసాన్ని మలచగలరు. వారితో ఒక శకం ఆరంభమవుతుంది. శ్రీకృష్ణుడు ఈ కోవకు చెందుతాడు.

మహాభారతం నాటక ప్రదర్శనలలో శ్రీకృష్ణుడు తప్పనిసరిగా ప్రత్యక్షమవుతాడు. ఆయన నిర్వహించిన వివిధ పాత్రలలో పార్థసారథి పాత్రవలె ఆకర్షణీయమైనది మరొకటి లేదు. ఇక్కడ ఆయన సఖుడుగా, తత్త్వవేత్తగా – శోకోద్విగ్నుడైన అర్జునుడికి మార్గదర్శిగా తనలోని మానవత్వాన్ని విస్పష్టంగా ప్రదర్శిస్తాడు. మహాభారతంలో ప్రత్యక్షమైన కృష్ణుడి ప్రత్యేకత ఇది.

గీతోపదేశం అత్యంత విషాదభరితమైన వాతావరణంలో జరిగినందున ఆ బోధనలు వాస్తవికంగా ఉంటాయి. యుద్ధం ఆరంభం కానుండగా, తన రథాన్ని ఉభయ సైన్యాల నడుమ నిలుపమని అర్జునుడు శ్రీకృష్ణుని కోరుతాడు. అత్యంతానుకూలమైన అచ్చోట నిలబడి, రణరంగాన్ని వీక్షించి, తానెవరెవరితో పోరు సల్పనున్నాడో నిర్ధారించుకొంటాడు. మోహరించిన శత్రు సైన్యంలో భీష్మద్రోణాదుల వంటి పెద్దలను, గురువులను చూడగానే అర్జునుడి ధైర్యం సడలి, ఆతడు ఖిన్నుడవుతాడు. గీత ప్రథమాధ్యాయంలో ఈ దృశ్యం అతివిశదంగా వర్ణింప బడింది. అతిశయ భావోద్వేగానికి లోనయి అర్జునుడు విచక్షణాశక్తిని కోల్పోతాడు. తుచ్ఛమైన కీర్తి ప్రతిష్ఠలకై బంధువర్గాన్ని, గురు వర్యులను వధింపబోననీ, కనుక యుద్ధం చేయననీ దృఢంగా చెప్పుతాడు. ఇటువంటి విజయం మూలంగా సమకూడిన రాచభోగాలను అనుభవించుట కంటె తిరుపెమెత్తుకు తిరగటం మేలంటాడు. వికృతమైన ఆతని బుద్ధికి, విచక్షణాశక్తికి ఎంతో సబబుగా తోచిన మరెన్నో వాదనలు చేస్తాడు. విభ్రాంతుడై, నిలువెల్ల కంపిస్తూ రథంలో చతికిలబడి, యుద్ధం చేసేది లేదని నిష్కర్షగా చెప్పుతాడు.

4. పార్థా! పిరికి వాడవు కావలదు.

ఈ సంకటమయ సమయంలో, శ్రీకృష్ణుడు ఖచ్చితమైన పదాలు ఉపయోగించుతూ ఒక శక్తిమంతమైన సందేశమిచ్చాడు.

కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।
అనార్యజుష్టం అస్వర్గ్యం అకీర్తికరం అర్జున ॥

'ఓ అర్జునా! ఆర్యులకు తగనట్టిది, స్వర్గప్రాప్తికి భంగకరము, నిన్ను అప్రతిష్ఠపాలు చేయు ఈ మనోవ్యాకులత ఈ సంకటస్థితిలో నీకెట్లు దాపురించినది?

క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వయి ఉపపద్యతే ।
క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥

'ఓ పార్థా! పిరికివాడవు కావలదు. ఇది నీకు తగదు. నీచమైన మనోదౌర్బల్యాన్ని విడనాడి, ఓ శత్రుతాపనుడా, లెమ్ము.

ఉత్తేజకరమైన శ్రీకృష్ణుడి పలుకులు ఖిన్నుడైన అర్జునుడికి బలాన్నొసగాయి. అర్జునుడు తలచినట్లు శ్రీకృష్ణుడు సానుభూతి చూపలేదు. కాకపోతే, అర్జునుడి దురవస్థపై



కృష్ణుడికి జాలి లేకపోలేదు. ఆప్యాయత, కనికరం, పరోపకార బుద్ధి మున్నగు ఉదారగుణాల చేత అర్జునుడు ఈ నిర్ణయానికి వచ్చినట్లు మనకు తోచవచ్చు. అర్జునుడు సైతం అట్లే తలపోసి ఉండవచ్చు. అహింసాధర్మం, ఎదిరించకపోవటం వంటి సుగుణాలను కూడ అర్జునుడు ఆ సందర్భంలో ప్రస్తావించాడు. కాని ఆ వాదాలన్నీ గాలిలో దూదిపింజలవలె తేలిపోయాయి. శ్రీకృష్ణుడు మనస్తత్త్వ పరిజ్ఞానాన్ని అద్భుతంగా ప్రదర్శించాడు. అల్లకల్లోలమైన అర్జునుడి మనస్సును శాంతపరచడానికి మనోవిశ్లేషణా పద్ధతులను ఉపయోగించాడు. శ్రీకృష్ణుడు అర్జునుడి మనఃస్థితిని అర్థం చేసికొన్నాడు - క్షణిక బలహీనత వల్ల మనః స్థిమితం కోల్పోయాడు; దానిని కప్పిపుచ్చటానికి డాంబికమైన వాదనలు చేసాడు. చివరకు తాను పల్కుతున్నవి డాంబికాలని తానే మరచిపోయే స్థితికి వచ్చాడు. వైరుల పట్ల ప్రేమ, కనికరం, నెనరు, ఔదార్యం కలిగి ఉండాలని వాదించి తన మనోదౌర్బల్యాన్ని మాత్రం ప్రకటితం చేసికొంటున్నాడు. నిజానికి ఈ సుగుణాలను ప్రదర్శించటం కంటె తన వాదనలకు హేతువాదం రంగులు పులుమ చూస్తున్నాడు. అర్జునుడి వలెనే చాల మంది తమ బలహీనతలను కప్పిపుచ్చుకొనడానికి ధర్మపన్నాలు వల్లె వేస్తారు. మన బ్రతుకుబండి సాఫీగా సాగిపోతుంటే మనం ఇది గ్రహించం. జీవితంలో ఒత్తిళ్ల మూలంగా తీవ్ర సంఘర్షణలు, తుపానులు చెలరేగినపుడు, అవలీలగా తోచే ఈ ధర్మగుణాలను పునస్సమీక్షింపవలసిన అవసర మేర్పడుతుంది; అప్పుడు వీటి పునాదులు ఎంత బలహీనంగా ఉన్నాయో తెలిసికొంటాం. ఈ ధర్మాల నిజరూపాల్ని ప్రదర్శించవలెనంటే గొప్ప ధైర్యం, శౌర్యం అవసరం. కనుక శ్రీకృష్ణుడు 'ఓ శూరుడా! నీ హృదయ దౌర్బల్యాన్ని విడనాడుము, లెమ్ము' అని ఉద్బోధించాడు.

5. తత్త్వజ్ఞాన ప్రశంస

పైన చెప్పిన ఆ రెండు శ్లోకాలు సంజీవిని వలె పని చేసి అర్జునుడి మనస్సుకు కొంచెం ఊరట కలిగించాయి. అప్పుడు శ్రీకృష్ణుడు అర్జునుడికి సందేహనివృత్తి, దోషప్రక్షాళన చేయుటకు తత్త్వజ్ఞానబోధకు ఉపక్రమించాడు. దీనిని మించిన రక్షాకవచం లేదు. భవరోగాలన్నిటికీ ఏకైక ఔషధం ఇది. సందేహాలతో, ఘర్షణలతో మన జీవితం చిన్నాభిన్నమైనప్పుడే, తత్త్వజ్ఞానోపదేశానికి మనం తగిన పాత్రులవుతాము. అర్జునుడి పరిస్థితి ఇప్పుడు ఆ విధంగా ఉంది కాబట్టి శ్రీకృష్ణుని ఉపదేశం వాంఛిస్తున్నాడు. నిర్విరామంగా జరిగే జీవన సమరంలో మనోస్థైర్యం ఇవ్వగల తత్త్వాన్ని కృష్ణుడు బోధింప నుపక్రమించాడు. "కందువా చివర్న అద్వైత జ్ఞానాన్ని కట్టుకొని, నీకు ఇచ్ఛవచ్చినట్లు చేయి"- అన్నారు శ్రీరామకృష్ణులు. జీవితంలో అడుగడుగునా సమస్య లెదురవుతాయి. తత్త్వజ్ఞానం ఆ సమస్యలకు పరిష్కారాలు ఒసగుతుంది. జీవన సంధ్యలో ప్రత్యక్షమయ్యే పరిష్కారాలతో లాభం ఒనకూడదు. ఈ జీవితకాలంలో సాక్షాత్కారమయ్యే సత్యమే ఉపయుక్తం. ఇక్కడే ఇప్పుడే సత్యాన్ని తెలిసికొనుటనే కేనోపనిషత్తు (11.5)లో ఉద్బోధించారు.

ఇహచేదవేదీత్ అథ సత్యమస్తి
న చేదిహా అవేదీత్ మహతీ వినష్టిః

'ఇహలోకంలో తెలసికొన్నవారికే జీవితం సత్యమగును. లేనివారికి గొప్ప నష్టం చేకూరును.'

సత్యం చాలా సరళమైనది. అది జీవితంలోకి నెమ్మదిగా ప్రవేశించి, ఇతర విషయాలు వేటినీ బలాత్కారంగా తోసివేయకుండానే, జీవితాన్ని అతిసూక్ష్మంగానే మార్చివేయ గలదు. ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ఏవో నియమాలు, నిష్ఠలు కాక, శ్రీకృష్ణుడు తత్త్వప్రదానం చేస్తున్నాడు. ఆ విధంగా

చేయకపోతే ఆతని బోధన నగుబాటు పాలవుతుంది. 'ఆకలిగొన్న పిల్లవాడు అన్నమడిగిన ఏ కన్నతండ్రి వానికి రాళ్లు ఇచ్చును?' అన్నాడు ఏసు.

జీవితంలో అవరోధాలను దాటి, నిబ్బరంగా ముందుకు సాగటానికి ఒకింత ఆత్మవిశ్వాసం అవసరం. 'దైవమందు విశ్వాసం కలుగుటకు ముందు మనలో మనకు నమ్మక ముండవలెను' అన్నారు స్వామి వివేకానంద. మనం చేసే యత్నాలకూ, కోరేకార్యసిద్ధికి ఆత్మజ్ఞానమే ఆధారమై నిలవాలి. కనుక, శ్రీకృష్ణుడు అర్జునుడికి ఆత్మసాక్షాత్కార మార్గం చూపించనున్నాడు. అందుమూలంగా ప్రాప్తించిన జ్ఞానాన్నీ, శ్రద్ధనూ అర్జునుడు తన సమస్యల పరిష్కారాలకు స్వయంగా ఉపయోగించుకొనాలి. పద్దెనిమిదవ అధ్యాయం (63వ శ్లో)లో ఈ విషయం కృష్ణుడు స్పష్టం చేశాడు:

ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।
విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥

'గుహ్యాతిగుహ్యమైన ఈ జ్ఞానమును నేను నీకు చెప్పినాను. దీనిని బాగా విమర్శించి (విచారణ చేసి) నీకు తోచినట్లు చేయుము'.

ఈ బోధన అర్జునుడిపై ఆశించిన విధంగా పని చేసినది అని ఆతడు చెప్పిన సమాధానం (18-73) మూలంగా తెలుస్తుంది.

నష్టో౽ మోహః స్మృతిః లబ్ధా త్వత్ప్రసాదాత్ మయా౽చ్యుత।
స్థితో౽స్మి గత సందేహః కరిష్యే వచనం తవ॥

'అచ్యుతా! నీ అనుగ్రహం వలన నా భ్రమ నశించినది. నా నిజస్థితి జ్ఞప్తికి వచ్చినది. నేను స్థిమితంగా ఉన్నాను. నాకు సందేహనివృత్తి అయినది. నీవు చెప్పినట్లే చేసెదను'

6. ఆత్మ స్వరూపం

శ్రీకృష్ణుడు రెండు విషయాలు బోధించదలచాడు. ఒకటి ఆత్మస్వరూపం. రెండవది ధర్మప్రవర్తన. ముందుగా మొదటి విషయాన్ని విపులీకరించి, ఆ పైన రెండవ దానిని ప్రస్తావించాడు.

అన్ని పొరపాట్లకు కారణం, సర్వానర్థాలకు మూలం అహం. మన జీవితానుభూతుల నిర్ణయాలన్నీ అహంతోనే తీసికొంటాం. కాని అది పరిమితమైనది కనుక మన నిర్ణయాలు దోషరహితంకావు. కనుక పొరపాట్లు జరుగుతాయి. సందేహాలు ఉత్పన్నమవుతాయి. మరింత విచారణ జరుపవలసి ఉంటుంది. లోతుగా పరిశీలించిచే అహంకారం మాయ అనీ, మన నిజస్వరూపం ఇంకా లోతైనదనీ తెలుస్తుంది.

వేదాంతంలో సాక్షి అనే భావం ఉంది. ఇది పాశ్చాత్యతత్త్వవేత్తలకు అపరిచితం. కాకపోతే, జ్ఞానశాస్త్ర, మనస్తత్త్వ శాస్త్రాలలో వైజ్ఞానిక విధానాలను ప్రవేశపెట్టి, వారు ఇప్పుడిప్పుడే దీనిని కనుగొనే ప్రయత్నం చేస్తున్నారు. వ్యక్తి నిజస్వరూపం అహంకారం కాదన్నది బౌద్ధమతంలోని ప్రధాన తత్త్వం. ఆధునిక జీవశాస్త్రం, మనస్తత్త్వశాస్త్రాలలో కూడ ఇది సూచన ప్రాయంగా కనపడుతున్నది. వెల్స్ ఆదులు ఈ విధంగా వ్రాశారు. 'నీరవ నిశీథిలో ఒంటరిగా ఆలోచిస్తున్నప్పుడు, మరెన్నో ఆలోచనాపూరిత సందర్భాలలో ఒక ప్రశ్న ఉత్పన్నమగును. నా చిన్నలోకానికి కేంద్రమైన "నేను", ఈ లోకాన్ని ఎంతో లాలసతో పట్టుకున్న "నేను" లేని సమయం రాగలదా? అది లేకపోతే ఈ ప్రపంచమే లేదే! అయినా, రాత్రి నిద్రిస్తున్నప్పుడు అది ఉండదే! తన ఉనికిని తాను తెలిసికొన్న ఆ దశలేమిటో మనమెరుగము.

'మానవుడు విశ్వాన్ని గురించి చేసే కల్పనలు మరింత స్పష్టము, సమగ్రము అయిన కొలది, వ్యష్టిపై మనస్సు కేంద్రీకరించటం రాను రాను దుర్భరమవుతున్నది. వ్యష్టిని పూర్తిగా త్యజించుట అనివార్యం.

'మనిషి తాదాత్మ్యం పొంది అహంకారాన్ని విడనాడుతాడు. వ్యష్టి సమష్టిలో లయమై, మనిషి అమరత్వం పొందుతాడు. ఇదే దివ్యరహస్యజ్ఞానాల సారాంశం. జీవశాస్త్ర విశ్లేషణ మూలంగా అర్థం చేసుకొన్న వ్యష్టి దివ్యరహస్య తత్త్వజ్ఞుల భావాలకు చేరువగా ఉన్నదను విషయం ఎంతో అద్భుతమైనది కదా! కాకపోతే ఆ భక్తి మూలంగా మనిషి తాదాత్మ్యం చెందుతాడు. వైజ్ఞానిక వివరణల మూలంగా తాను పుల్లయ్యననో, సుబ్బమ్మననో విషయం విడనాడి తాను మనిషినని తెలిసికొంటాడు. అహంకారం పై ఆధారపడిన జీవితం బాధతప్త భ్రాంతి అనీ, కోరికలను జయించుట ద్వారా మనిషి విముక్తుడగునని బౌద్ధుల బోధిస్తారు. పాశ్చాత్య దివ్య రహస్య తత్త్వజ్ఞులు, ప్రాచ్య ఖండాలు ఋషులు ఆవిష్కరించిన సత్యాలకు నేటి విజ్ఞాన శాస్త్రంలో సమర్థన లభిస్తున్నది. నైతిక ధర్మమూ దీనినే సమర్థిస్తున్నది. వీరందరు చెప్పేది ఒక్కటే – అహంకారాన్ని వశపరచుకొనాలి; అహంకారం గమ్యం కాదు ఉపాయం మాత్రమే.'

మనిషి వ్యక్తి భావాన్ని అర్థం చేసికొనే ప్రయత్నంలో జీవశాస్త్రజ్ఞులు, మనస్తత్త్వజ్ఞులు శూన్యవాదం కోరల్లో చిక్కక ఉండవలెనంటే, గంభీర విశ్లేషణలు చేయవలసి ఉంటుంది. ప్రకృతి అంతర్భాగమైన అహంకారం వెనుక సాక్షి ఉన్నదని మన పూర్వీకులు కనుగొన్నారు. ప్రపంచంలో జరిగే సకల పరివర్తనలను ఎరుగు కాలాతీత సత్తా సాక్షి. దీని తాత్త్విక ప్రాముఖ్యాన్ని మనం ఇంకా సమగ్రంగా గ్రహించలేదు. సమస్త జ్ఞానము. తర్క విజ్ఞాన శాస్త్రాలలో సకల ప్రమాణాలు సాక్షి ప్రాముఖ్యాన్నే స్పష్టంగా చూపుతున్నాయి. తాము జరిపే పరిశోధనలు, అధ్యయనాలు అన్నీ వస్తునిష్ఠతో జరుపు తున్నామని శాస్త్రజ్ఞులు వక్కాణించినపుడు వారు సాక్షిభావాన్నే వెల్లడి చేస్తున్నారు. శాస్త్రీయ నిష్పక్షపాతం మూలంగా అహంకారం కేంద్రంగా ఉన్న పరిమిత దృష్టి స్థానంలో సాక్షి విశ్వజనీన దృష్టి పని చేస్తున్నదని చెప్పవచ్చు. నిత్య జీవితంలో ఏదైనా సందర్భంలో నిష్పాక్షిక నిర్ణయం కోరినప్పుడు మనం, అహంకారం తొలగింపునే కోరుతున్నాం. దీనిని గురించి హాల్డెన్ ఈ విధంగా అన్నారు. 'నేను తర్కబద్ధంగా కాని, లేక శాస్త్రీయంగా కాని ఆలోచించుతున్నప్పుడు, నైతికంగా నడుచుకొంటున్నపుడు, నా ఆలోచనలు చర్యలు కేవలం నావేకావు. నా స్థానంలో ఉన్న మరే తెలివి గలవాడైనా, మరే నీతిమంతుడైనా ఆ విధంగానే చేస్తాడు. అనగా నా మనస్సు ఒక నిరుపాధికమైన మనస్సు (మహత్తు)తో తాదాత్మ్యం పొందుతున్నది.

'ఈ విధంగా ఆలోచించితేనే నా మనుగడ సాధ్యమని తోచుతున్నది. ఈ విధంగా చేసినప్పుడు వ్యక్తిగత వ్యవహారాలతో ఆసక్తి క్షీణించును. నేను మాత్రం అమరుడనైన చాలునను భావం క్షీణించును'.

వైరాగ్యం, విశ్వజనీనత సాక్షి ప్రధాన లక్షణ ద్వయం. ఇది పరిపూర్ణతకు పరాకాష్ఠ. ఇందులోనే శాస్త్రీయ దృక్పథం సఫలమవుతుంది. ఇదే నీతికి, ధర్మానికి కూడ సాఫల్యసిద్ధి అని మనం ముమ్ముందు తెలిసికొనగలం.

ఆత్మ అజము, అమరము, నిత్యము అని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పినప్పుడు ఆతడు సాక్షిని గురించే తెల్పుతున్నాడు. ఆత్మ ఎటువంటి పరివర్తనం చెందదని గీతలో చెప్పారు. అహంకారం మారుతూ ఉంటుంది. కనుక అది ఆత్మకాదు. కావున శీతోష్ణసుఖదుఃఖాది ద్వంద్వభావాల

నధిగమించి, నిత్యము శాశ్వతమైన సాక్షితో తాదాత్మ్యం చెందుమని శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉదేశించాడు. సాక్షి భావాన్ని గ్రహించటమెంత కష్టమో కూడ చెప్పాడు. (11-29)

ఆశ్చర్యవత్ పశ్యతి కశ్చిదేనం
ఆశ్చర్యవత్ వదతి తథైవ చాన్యః ।
ఆశ్చర్యవత్ చైనమన్యః శృణోతి
శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥

'ఒకడు దీనిని (ఆత్మను) ఆశ్చర్యమైన దానిని వలె చూచును. ఒకడు దీనిని గురించి ఆశ్చర్యమైన దాని వలె చెప్పును. వేరొకడు ఆశ్చర్యమైన దానిని వలె గూర్చి వినును. అయినా ఎవరును దీనిని సరిగ్గా తెలిసికొనుట లేదు.' (అనగా తెలుసుకొనువారు చాల అరుదు అని భావము)

7. ఆత్మతత్త్వం

ఈ విధంగా శ్రీకృష్ణుడు సాంఖ్యయోగం, లేక ఆత్మతత్త్వ బోధ వివరించాడు. ఆ పైన అందులోని నీతిని విశదీకరించాడు. హేతు బద్ధమైన నీతి-తత్త్వజ్ఞానం పైనే ఆధారపడి ఉండును. మానవజాతి నీతిశాస్త్రానికి గల సమర్థన ఏమిటని ప్రశ్నిస్తూనే ఉన్నది. తత్త్వకోవిదులు, మత ప్రవక్తలు పలు సిద్ధాంతాలు ప్రతిపాదించారు. సర్వమతాలు, తత్త్వాలు, నిస్వార్థమే పరమ ధర్మమని ఘోషిస్తున్నాయి. మతాలు ఇది శాస్త్రోక్తమనీ, ఆచార్యుల వాక్కులనీ చెప్పగా, కాంట్ దీనిని తిరుగులేని ఆదేశంగా వర్ణించాడు. ఉభయవాదనలు సంతృప్తికరంగా లేవు. వేదాంతము, గీత నైతిక ధర్మ ప్రవర్తనలకు హేతుబద్ధమైన కారణాలు చూపించినాయి.

తాను సమాజము, స్వార్థము పరోపకారము వంటి ప్రతిద్వంద్వాల మధ్య నలిగే వ్యక్తి సంఘర్షణలను నీతి, ధర్మము తీరుస్తాయి. అహంకార నాశనమే ధర్మజీవనసారం అని నీతి శాస్త్రం బోధిస్తుంది. అనగా మిథ్యాజీవనాన్ని విడనాడి సత్యవస్తువుతో తాదాత్మ్యం చెందమంటున్నది. 'నేనెందుకు స్వార్థాన్ని విడనాడాలి' అని హేతువాది ప్రశ్న. అతనికి కావలసినది హేతు బద్ధమైన సమాధానం. 'అహంకారం భ్రమ, అహంకారం జ్వరం' అన్నాడు గౌతమ బుద్ధుడు. సత్యం సాక్షాత్కరించుకొనవలె నంటే సాక్షివలె నిస్సంగత్వం అవలంబించాలి. అనగా ధర్మాచరణకు సశాస్త్రీయం, హేతుబద్ధమైన ఆధారాలు ఉండాలి. సత్యాన్వేషణ చేయబూనిన శాస్త్రజ్ఞులు క్రమబద్ధంగా ఆలోచించటం అవసరం. అంతేకాదు. జీవితంలో ప్రతిచర్య, ప్రతి క్షణం క్రమశిక్షణా యుతమై ఉండాలి. దీనినే యోగం అంటారు. జీవితం అనగా ఎడతెగని సందడి, నిరంతర సంఘర్షణ, ఈ జీవితాన్ని ఏ విధంగా మలచుకొంటే మనం సత్యాన్ని తెలిసికొనగలుగుతాం అన్నదే ప్రధాన సమస్య. మనం చేసే ప్రతి పని ఇటు మన శ్రేయస్సుకు, అటు పరహితానికి ఏ విధంగా తోడ్పడగలదన్నదే ముఖ్యమైన ప్రశ్న. నిత్యనిరంతరమైన ఈ సమస్యకు శ్రీకృష్ణుడి పరిష్కారం మానవ చరిత్రలో నవీనము, అపూర్వమునైనది. అదే కర్మయోగం.

సామాన్య మానవుడు, తత్త్వబోధ జరుగక పూర్వం, అహంకారం సత్యమని నమ్ముతాడు. జీవితంలో ప్రతి చర్యను, ప్రతి ఘటనను అహంకారపరంగా (తనకు సంబంధించినట్లు) వీక్షిస్తాడు. ఆ వ్యక్తి చేపట్టే ప్రతి పనికి ప్రయోజనం, ఫలాపేక్ష ఉంటాయి. శ్రీకృష్ణుడి కాలంలో స్వర్గప్రాప్తి ఒక ముఖ్యమైన ఫలాపేక్ష, వేదకాలంలో ఇది ఇంచుమించు ఒక విశ్వాసంగా ఉంది. కాని ఉపనిషత్తుల కాలంలో జరిగిన తత్త్వ విచారణ మూలంగా అహంకారం అనిత్యమనీ, అసత్యమనీ నిరూపిత మవగా ఈ నమ్మకం నాశనమైంది. లోకంలోనే కాని,

స్వర్గంలోనే కాని కామనాయుతమైన అస్తిత్వం అసత్యమని నిరూపించారు. నైతిక జీవనానికి యజ్ఞాలు, యాగాలు అవసరములేదని శ్రీకృష్ణుడు, బుద్ధుడు బోధించారు. నైతికోన్నతికి స్వర్గప్రాప్తిని కొలమానంగా తీసికొని కొలచలేమనీ, అహంకారం తరగుటే దాని ప్రమాణ మని తెలిపారు. గీత కర్మయోగాన్ని బోధించి, కర్మకాండ నుండి దృష్టిని తత్త్వశాస్త్రం వైపు మళ్లింపజేసింది.

ఏషా తే అభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।
బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మ బంధం ప్రహాస్యసి ॥

(11-39)

'ఇప్పటి వరకు నీకు సాంఖ్యం తెలిపినాను. ఇప్పుడు బుద్ధియోగం (అనుష్ఠానిక వేదాంతం) వినుము. ఇది తెలిసికొని, ఓ పార్థ, నీ కర్మ బంధనములను విడిపించుకొన గలవు.'

నేహాభిక్రమనాశోஉస్తి ప్రత్యవాయో న విద్యతే ।
స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥

(11-40)

'ఈ యోగానుష్ఠానంలో అసంపూర్తిగా ఉన్న సాధనలు వ్యర్థంకావు. ఇందుమూలంగా ప్రతికూల ఫలితాలు ఉత్పన్నం కావు. ఈ ధర్మం స్వల్పంగా ఆచరించినా గొప్ప భయాల నుండి రక్షణ ఇచ్చును.'

సాక్షి ప్రధాన లక్షణాలు వైరాగ్యం, విశ్వజనీనతలని ఇంతకు పూర్వం చెప్పాను. ఈ మహనీయ దర్శనం పొందటానికి వైజ్ఞానిక విచారణ కొంతవరకు తోడ్పడుతుందని కూడ చెప్పాను. ఇది సిద్ధించుటంలో ధర్మప్రవర్తన పాత్ర కూడ తెలిసికొనాలి. ఆత్మ సాక్షాత్కారం కావలెనంటే అహంకారాన్ని జయించటం అత్యంతావశ్యకం.

8. కర్తవ్య పాలన

ఇందుకై గీత రెండు విషయాలు బోధిస్తుంది. ప్రతిపని, నచ్చినా నచ్చకపోయినా కర్తవ్యతాభావంతో ఆచరించాలి. దీని వల్ల తేలేది ఏమిటంటే కర్మకు నీచోచ్చ గుణాలు ఉండవు. అహంకారం మూలంగా పని గొప్పదనీ చిన్నదనీ, లేక ప్రియమైనదనీ, అప్రీతికరమనీ భావాలు వస్తాయి. పనికి, జీవితానికి అహంకారం మూలంగా ఆపాదితమైన కృత్రిమ విలువలను లక్ష్యపెట్టకూడదని కర్తవ్యతాభావం నేర్పుతుంది. ఇదే అహంకారాన్ని జయించటమనగా, అప్పుడు సాక్షి రెండవ లక్షణాన్ని సాక్షాత్కరించుకొనాలి; సార్వజనీన దృక్పథం కలిగి ఉండటం లేదా సంకుచిత దృష్టినాశనం. కర్మఫలాన్ని ఆశించక ఉంటే సాక్షి ప్రథమ లక్షణమైన వైరాగ్యం అలవడుతుంది. ఫలాపేక్షతో పనిచేసే వారిని గీత గర్హించదు కాని వారిని అల్పబుద్ధులు అంటుంది – "కృపణాః ఫలహేతవః". కర్మయోగాన్ని "యోగః కర్మసు కౌశలం" అన్నారు; కర్మ యందు నైపుణ్యం కలిగి ఉ ఒడుటే కర్మయోగం. కర్మఫలమందు ఆసక్తి లేకపోవటాన్ని గీతలో ఈ విధంగా ప్రస్తుతించారు (11-51):

కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।
జన్మబంధ వినిర్ముక్తాః పదం గచ్ఛంతి అనామయమ్ ॥

'వివేకవంతులు సమత్వబుద్ధి కలిగి ఉండి, కర్మఫలాన్ని త్యజించి, జననమరణ బంధమునుండి విడుదల పొంది, దుఃఖరహితమైన స్థానమును పొందుదురు.'

9. కర్తవ్యాతీతంగా సహజ జీవనం

ఆధ్యాత్మిక నైతిక జీవితంలో కర్తవ్య పాలన ప్రథమ దశ. గీతలో ఇంతకుమించిన దశనుకూడ చెప్పాడు. అన్ని మతాలకు చెందిన మహాపురుషులెందరో ఇందుకు

నిదర్శనాలు. కాని భారతీయులు తప్పించి మరెవ్వరూ ఈ విషయాన్ని లోతుగా పరిశీలింపలేదు. కర్తవ్యపాలన అను బడిలో అహంకారాన్ని ఎట్లు నాశనం చేయాలో దండనలతో నేర్చుకొంటాము. ఈ దశలో నిరంతర ప్రయాస ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. కాని అహంకారభావంనుండి సాక్షిభావానికి ఎదిగినప్పుడు, కర్తవ్యతాభావం సమాప్తమగును. ఆ వ్యక్తి ఇప్పుడు ఒక ఉన్నత దశకు చేరి కర్మలు చేస్తాడు. అన్ని బంధాలు తెంపుకొని స్వేచ్ఛావిహంగం వలె ఎగిరిపోవాలను ఆరాటం కలుగుతుంది. ఆ ఉన్నతదశలో కర్తవ్యం అనగా ఏమిటి అని విచారణ చేస్తాడు. కామక్రోధాల కంటె కర్మ నిస్సంశయంగా గొప్పదే. కాని అందులో ఒకింత నిర్బంధం కూడ ఉంటుంది. మనస్సు మనను నిర్బంధింప వచ్చు. లేదా శాస్త్రోక్త నియమ నిషేధాల నిర్బంధం కావచ్చు. ఏదైనా నిర్బంధం తప్పనిసరి అంశం. కనుక దీనిని కూడ అధిగమించాలి. స్వేచ్ఛాకాంక్ష చాలగట్టిది. సకల బంధాలు తొలగించుకొనాలి. కర్తవ్యపాలనలో బందీ అయిన వ్యక్తిని క్రమశిక్షణతో మెలిగే బానిసగా వర్ణింపవచ్చు.

కర్తవ్య భావాన్ని అధిగమించి, ఒక స్వేచ్ఛా జీవిగా కర్మ నాచరింపుమని గీత బోధిస్తుంది. శాస్త్రగ్రంథాలో, గురువో బోధించారు కనుక అన్యులను ప్రేమించటం మంచిదే. మనస్సు ప్రోద్బలం మూలంగా ప్రేమించటం శ్రేష్ఠతరం. కాని స్వతస్సిద్ధంగా ప్రేమించటం ఉత్తమోత్తమం. మొదటి రెండింటిలో పొరపాట్లకు అవకాశం ఉంది. స్వార్థం చోటుచేసికొనవచ్చు. కాని అహంకారాన్ని అధిగమించి, స్వార్థపరత్వం తొలగించబడితే, జీవితం ప్రేమలు పరిశు ద్ధము, నిత్యము అగుతవి. సహజమైన జీవితంలో ప్రేమ స్వతస్సిద్ధంగా ఉత్పన్నమవుతుంది. రోజా పువ్వుకు సౌరభ మెంత స్వతస్సిద్ధమో, ఈ వ్యక్తి ప్రేమ కూడ అంతే స్వతస్సిద్ధం. ఈ దశలో వున్న వ్యక్తి – ఆదేశాల, చట్టాల అధీనంలో ఉండదు. కర్తవ్యపాలనను అధిగమించిన ఈ స్థితిని గీతలో పలుచోట్ల ప్రస్తావించారు. (11-71)

సాక్షి చైతన్యం ప్రాప్తించిన వ్యక్తి జీవితాన్ని పూర్తిగా క్రొత్త దృక్పథంతో చూస్తాడు. జీవితంలో అహంకారం మూలంగా ఉత్పన్నమైన కృత్రిమ విలువలన్నీ నశించి, యథార్థమైన విలువలు ప్రత్యక్షమవుతాయి. నైతిక పరిపూర్ణతకు ఇది పరాకాష్ఠ. సామాన్యులకు జీవితమనగా ప్రయాస, సంతోషం, ద్వేషం, పోటీలు, దుఃఖం, క్లేశం. కాని సాక్షి చైతన్యం ప్రాప్తించిన వ్యక్తి వీటన్నిటికీ అతీతుడు. అతని జీవితం సామరస్య పూర్ణం. అన్నిటా సామరస్యవే కానవస్తుంది. తాను సర్వంతో ఏకమై ఉంటాడు. అతని నోటి నుండి జారే ప్రతి పలుకు ప్రేమ పూరితం. అతడు ఎల్లప్పుడు లోకహితం గురించే చింతన చేస్తాడు. అతడు చేసే ప్రతి పని లోకకల్యాణార్థమే. అటువంటి వారు గీతలో చెప్పినట్లు సర్వభూతహిత రతులు – సర్వ జీవుల హితాన్ని కాంక్షిస్తారు. వారి ఆలోచనలు, చర్యలు లోక సంగ్రహార్థం (లోకకల్యాణం) కొరకే అట్టివారు భూమిలోని రసం వంటి వారని ఏసు పలికిన పలుకులలో ఎంతో నిజమున్నది.

10. శ్రీకృష్ణుని ఆధ్యాత్మిక సమన్వయం

గీతా తత్త్వంలో – జీవితంలోని ప్రతి చర్యకు అర్థం, వివరణ దొరకుతాయి. గీతలోని ముఖ్య లక్షణం – దాని సమన్వయ ధోరణి. శ్రీకృష్ణుడు అందించిన సమగ్ర జీవనతత్త్వంలో ఆధ్యాత్మిక జీవనంలోని సకలాంశాలు, భక్తి కర్మజ్ఞాన ధ్యాన యోగాల ప్రత్యేక లక్షణాలు, వాటి సామాన్యాంశాలు చక్కగా సమ్మిళితం అయినాయి. శరణాగతి తత్త్వాన్ని ఆశ్రయించినా, నిష్కామకర్మ చేసినా, మనో నిగ్రహం అలవరచుకొన్నా, మన ఆలోచనలను విశ్లేషించినా మనం

చేసేది అహంకారనాశన యత్నమే. మనందరిలోను సత్యం అహం ముసుగు కప్పుకొని ఉంటుంది. మనం ఏ యోగ మార్గాన్ని ఆశ్రయించినా, ఏ ఆశ్రమధర్మాన్ని స్వీకరించినా నేను అను భావం వీడి సాక్షిభావంతో మసలుకొనే ప్రయత్నం చేస్తే ద్వంద్వభావాలను, సంఘర్షణలను అధిగమించి, హృదయవైశాల్యం పెంచుకొని సార్వజనీన దృక్పథం అలవరచు కొనగలుగుతాం. ఈ రెండు లక్షణాలు ఎవరిలో కనపడినా, వారు సాక్షిభావాన్ని ఇంతో అంతో గ్రహించారని తెలిసికొనాలి.

గీతోపదేశం సారమిదే. ఇది ఒక ప్రత్యేక మతానికి చెందినదని అనుకొనరాదు. ఏ మతావలంబులైనా, ఏ వృత్తిలో ఉన్నా గీత ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుంది. అది బలాన్నొసగే సందేశం. అది మనిషిని ఉన్నతోన్నతమైన ఆత్మవ్యక్తీకరణ దశలకు తీసికొని వెళ్లుతుంది. అది హైందవేతరులు హిందువులుగా మారాలని కాని, పాశ్చాత్యులు ప్రాచ్య సంప్రదాయాలు ఆచరించాలని కాని శాసించదు. ప్రతి వ్యక్తి తన పరిస్థితులకు ఈ సందేశాన్ని అన్వయించుకొని, ఆత్మ సాక్షాత్కారం దిశగా పయనించాలి. పోతే ఒక హెచ్చరిక - మధ్యేమార్గంలో ఇక చాలు అనుకొని విశ్రమించటానికి వీలులేదు. సత్యాన్వేషణ మార్గంలో విశ్రాంతి గృహాలుండవు.

11. ముగింపు

ఈనాడు ప్రపంచం ఒక మహాసంకట స్థితిలో చిక్కుకొన్నది. పూర్వీకుల ఆలోచనలు, అభిప్రాయాలు, వ్యవస్థలు కొట్టుకుపోతున్నాయి. మున్ముందు జరుగబోయేది ఏమిటో స్పష్టంగా తెలియరావటం లేదు. ఒక సుస్థిరమైన నాగరికతను నెలకొల్పాలన్న ఆకాంక్ష అందరి మనస్సులలో ప్రబలంగా ఉంది. భావిప్రపంచం అను పదం వాడినప్పుడు ఆ ఆకాంక్షే వ్యక్తం అగుచున్నది. భవిష్యత్తులో ఒక ప్రపంచ నాగరికత రూపుదిద్దుకొనవలె నంటే, సమస్త మానవజాతి యొక్క ఉమ్మడి విజ్ఞతను ఉపయోగించుకొనాలి. ఇందులో పాలుపంచుకొనేది ప్రధానంగా కృష్ణుడు, బుద్ధుడు, మహమ్మదు ప్రవక్త, ఏసుక్రీస్తు వంటి ఆధ్యాత్మిక మహాపురుషులే కాని మతాలు, సంప్రదాయాలు, రాజకీయపార్టీలు, నాయకులు కాదు. నేడు ప్రపంచంలో చోటు చేసికొన్న ఆవేశాలు, ఆకాంక్షలు-గీతోపదేశం జరిగిన మహాభారతం కాలం నాటి పరిస్థితులను పోలి ఉన్నాయి. ఘర్షణలు, యుద్ధాలు, గందరగోళాలతో నిండిన ఈ కాలంలో శాంతి, స్వేచ్ఛల స్థాపనకు విశ్వజనీనము, యుక్తి యుక్తము నైన గీతాసందేశాన్ని మించిన మార్గదర్శి లేదు. శ్రీకృష్ణుడు దీనిని 5,000 సంవత్సరాల క్రితం బోధించాడని గుర్తించుకోవాలి. ఇది భగవంతుడు మనకు అందించిన శాశ్వత, సనాతన, పురాణ సందేశం. మహాధీశాలురకు సైతం దిగ్భ్రమ కలిగించే టటువంటి ప్రబలమైన సమస్యలు ఈనాడు మన ఎదుట ఉన్నాయి. ఆధునికులు గీత పట్ల కనపరచుతున్న నూతనోత్సహం, సమస్త మానవజాతికి చిరశాంతిని ప్రసాదింపగదని ఆశిస్తూ, భగవంతుని ప్రార్థిద్దాం.

(శ్రీరామకృష్ణ మఠం వారి సౌజన్యంతో)

అమూల్యమగు ఈ జన్మను ఇంద్రియసౌఖ్యముల కొఱకు ధారపోసి తుదకు శోకసంతప్తులగుట విజ్ఞులకు పాడి గాదు. కావున ఓ సాధకుడా! రేపు, మాపు అనక ఇప్పటి నుండియే పరమాత్మచింతన కుపక్రమించి, బ్రహ్మానంద సామ్రాజ్యాభిషిక్తుడవు కమ్ము.

- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు



(పూజ్యశ్రీ స్వాములవారు ఋషీకేశ్‌లో పూజ్యశ్రీ శివానందస్వామివారిచే స్థాపింపబడిన అంతర్జాతీయ దివ్య జీవన సంఘానికి అధ్యక్షులుగా వుండి వుండిరి. శ్రీవారిపుడు బ్రహ్మలీనులైనారు.)

భగవద్గీతా హృదయము

శ్రీ చిదానందస్వాములవారు,
శ్రీ శివానందాశ్రమం, ఋషీకేశ్

భగవద్గీత నిజముగా తమ ప్రత్యేక అవసరమును బట్టి ప్రతి మనుజునికి ప్రతివస్తువు నొసంగునట్టి ఒక దివ్యమైన కల్పతరువు వంటిది. ఖచ్చితముగా ఈ కారణము చేతనే ఇది కేవలము 700 శ్లోకములతో కూడిన చిన్న గ్రంథమైనను, మహాకావ్యమైన మహాభారతములోని ఒక చిన్న పద్య భాగమైనను, వేదాంత క్షేత్రమునందిది సాటిలేని ప్రస్థాన త్రయమునందొక భాగము నాక్రమించినది. గీతపై అసంఖ్యాకములగు వ్యాఖ్యానములు వ్రాయబడినవి. గీతాప్రబోధమునకెట్టి గూఢార్థము లొసంగ బడినను గీత వేదసందేశమునకు నవనీతమువంటిదనియు, అది అనుష్ఠాన యోగ్యమైనదనియును వ్యాఖ్యాత లందరున్నూ అంగీకరించిరి. గీతలోని ఛందస్సు మఱియు భాషాశైలి ఎట్టిదనగా:- ఈ శాస్త్రము నొక్కమారు పఠించినను, లేక శ్రవణ మొనర్చినను ఆ శబ్దములు మనస్సులో నాటుకొనబడి, భావి జీవితమునకు ప్రోత్సాహదాయకములగును.

గీతలో వివరింపబడినట్టి వివిధములైన యోగమార్గములను విస్తరింపబూనక, భగవద్గీతా హృదయము, లేక సారాంశమును మాత్రము కనుగొనుటకు మనము ప్రయత్నించెదముగాక!

ఈ ప్రాపంచిక మానవుని ఎదుర్కొనునట్టి నిత్యజీవిత సమస్యలపై ప్రకాశ కిరణములను వెదజల్లుచు మనకీ అద్భుతశాస్త్రము, మన హృదయమునందే మనయొక్క గొప్ప మిత్రుడు మరియు మహాశత్రువు దాగియున్నాడను విషయమును ప్రతిపాదించుచున్నది. సాత్త్వికమైన బుద్ధితో మనస్సు తాదాత్మ్యము నొందినప్పుడు మనకది మిత్రుడగుననియు, ఇక విషయేంద్రియ వాంఛలచే నిండియుండి తామసిక బుద్ధితో తాదాత్మ్యము నొందినప్పుడదియే శత్రువగుననియు తెలియ వలయును. మనస్సు ఊర్ధ్వస్థాయియందున్నప్పుడాతడు నిజముగా దేవుడనియు, ఇక అధోస్థానము నందున్నప్పుడాత డొకభూతము వలెను మనము తలంతుము. ఈ విధముగా తాను దేవుడో, లేక దయ్యమో తెలియక క్రిందు మీదులలో లాగబడుచున్న మానవుని యొక్క ఈ ఘోరమైన పరిస్థితిని మించిన హీనదశ మరేమి కలదు?

“ఉద్ధరేదాత్మనాత్మానమ్” అని గీత నుడువుచున్నది. అనగా:- మనస్సు యొక్క సహాయముచేతనే మనస్సు పరిశుద్ధ మొనర్పబడవలసి యున్నది. సాత్త్విక బుద్ధితో తాదాత్మ్యము నొందిన మనస్సు యొక్క సహాయమున, విషయేంద్రి యములతో తాదాత్మ్యము నొందిన మనస్సు నియమింపబడి, పవిత్రీకరణ మొనర్చబడ వలసియున్నది. ఇట్టి సందిగ్ధావస్థలో అర్జునుడు శ్రీకృష్ణుని మిక్కిలి అభిరుచికరమైన ఒక ప్రశ్ననడిగెను. “గాలి వంటి

చాంచల్యము గల ఈ మనస్సును నిగ్రహించుట మిక్కిలి కష్టముగానున్నది. మనో నిగ్రహము కంటె వాయువును నిగ్రహించుట మిక్కిలి సులభముగా తోచుచున్నది. ఐతే దీనికుపాయమేమి?"

ఈ ప్రశ్నకు శ్రీకృష్ణుడు సమాధాన మొసంగుచు తాను సత్యమతావలంబిగా నిరూపించుకొనెను. అర్జునుడడుగ కూడని క్షుద్రమైన ప్రశ్న ఇదియని ఆతడు దానిని గూర్చి తర్కము నొనర్పలేదు. మనస్సును నిగ్రహించుట కష్టమని శ్రీకృష్ణుడు కూడా అంగీకరించెను. అది కష్టమైనదే, కాని అసాధ్యమైనది కాదు. అభ్యాసము మఱియు వైరాగ్యముచే దానిని నిగ్రహించుట సాధ్యమగును. ఈ రెండు శబ్దములను సాధకుడెప్పుడూ మఱువరాదు.

అభ్యాస, వైరాగ్యములు రెండు భిన్నమైన పదార్థములు కావు. అవి పరస్పరము బలము నొనంగునట్టి పూరక ద్రవ్యములు. అవి ఒకే నాణెము యొక్క ఇరుపార్శ్వముల వంటిది. నిరంతర అభ్యాసము లేకున్నచో వైరాగ్యము వ్యర్థమగును. వైరాగ్యము లేకుండా అభ్యాసము అసాధ్యమగును. ఆత్మసాక్షాత్కారమును గూర్చి సాధకుడొనర్చు ప్రయత్నము నడ్డగించునదేమి? అది వైరాగ్యము యొక్క అభావమే.

ఇక యోగాభ్యాస విషయములో భగవద్గీత సాధనానుష్ఠానమును గూర్చి అద్భుతమైన పాఠములు నొసంగును. గీతలోని 14వ అధ్యాయమైన గుణత్రయ విభాగయోగమును మఱియు 16వ అధ్యాయమైన దైవాసురసంపద్విభాగయోగమును పఠించుము. నీవు సముపార్జింప వలసిన సద్గుణములు మఱియు విసర్జింప వలసిన దుర్గుణముల యొక్క పట్టికను 16వ అధ్యాయము మనకొసంగును, ఇక 17వ అధ్యాయము నీవెట్టి ఆలోచనలను కలిగి యుండవలయునో, దానము మఱియు తపస్సు నెట్లొనర్చవలయునో, నీవెట్టి ఆహారమును గ్రహింపవలయునో మొదలగు త్రివిధములగు క్రమబద్ధ పద్ధతుల నొసంగును. నీ మనస్సు విషయేంద్రియముల వైపు ప్రవహించునట్లు చేయునదేమి? అవి రాజసిక మఱియు తామసిక గుణములే. మనస్సు నందు సాత్త్విక భావమును పెంపొందింపజేయుము. ఈ యధోముఖప్రవృత్తి నిగ్రహింపబడును. ఈ సాత్త్విక గుణమును పెంపొందించు కొనుటకై గీత మనకు మిక్కిలి విస్తృతమెన సూచనలనొసంగును. సాత్త్విక గుణము వైరాగ్యమును పోషించును. కావున గమ్యస్థానమును చేఱుటకు సమయము మాత్రము మిగిలి యున్నది. "తత్స్వయం యోగ సంసిద్ధః కాలేనాత్మని విందతి" గమ్యస్థానము నొందిన తర్వాత ఈ దుఃఖము మఱియు మృత్యువుతో కూడిన సంసారమునకు తిరిగి వచ్చుటయనునది లేదు. ఒకవేళ తిరిగి వచ్చినను, ఈ సాంసారికతాపత్రయ రజ్జువుచే బంధింపబడిన జీవుల వలెగాక 'సర్వభూతహితే రతాః' సర్వ మానవ శ్రేయస్సుకై పాటుబడునట్టి దివ్యాత్మ స్వరూపులమై ఈ భువికేతెంతుము.

ఓ జీవుడా! నీవు ఏడుజేనల మనిషిని కావు. భూనభోంతరాళములు పరివేష్టించిన విశ్వవ్యాపక దీర్ఘదేహుడవు. నీవు ప్రకృతిరథచక్రముల క్రింద నలిగిచచ్చు అల్పకీటకముకాదు. ప్రకృతిని శాసించు పరమాత్మవు. నీవు బద్ధుడవు కావు, ముక్తుడవు. కర్మాధీనుడవు కావు, కర్మాతీతుడవు. మృత్యురూపుడవు కావు, అమరుడవు. భృత్యుడవు కావు, రాజాధిరాజువు. పాదుషాచక్రవర్తివి. వేయేల నీవు జీవుడవు కావు, సాక్షాత్ శివుడవే. ఇదియే ఉపనిషత్తుల యొక్క సందేశము.

– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు



భగవద్గీత యొక్క ప్రాణశక్తి

శ్రీ కృష్ణానంద స్వాములవారు,
శ్రీ శివానందాశ్రమం, ఋషీకేశ్

(పూజ్యశ్రీ స్వాములవారు ఋషీకేశ్‌లోని అంతర్జాతీయ సంస్థ అయిన దివ్యజీవన సంఘానికి జనరల్ సెక్రటరీగా వుండినారు. శ్రీస్వామీజీ ఇప్పుడు బ్రహ్మలీను లైనారు.)

సుప్రసిద్ధమైన దైవగానమగు భగవద్గీత యందు మహాభారతములోని వేదాంత తత్త్వసారము చొప్పింపబడి యున్నది. మానవ జాతికి శ్రీకృష్ణు డొసంగిన సందేశము ఒకజాతి, మతము, రహస్యమైన తెగ, ఒక ప్రత్యేక సంఘము, లేక సమాజములకు చెందినట్టిది కాదు. అది సుదూరము నందున్న ఆముష్మిక జీవితమునకు సంబంధించినదేగాక, ఇహలోకము నందనుష్ఠాన యోగ్యమగు, అనుభవ పూర్వకమగు మఱియు క్రమబద్ధమైన క్రమశిక్షణా సూత్రములను మనకొసంగును. గమ్యస్థానమును చేర్చుటలోని సమన్వయత, ప్రబోధములోని విశ్వవ్యాపకత మఱియు తాత్త్వికతలోని భావనమ్మిశ్రతలో భగవద్గీత యొక్క గొప్పదనమిమిడి యున్నది. పూర్ణపురుషుడు పూర్ణ జీవితమును గూర్చిన పూర్ణవిజ్ఞానమును మనకొసంగెను. ఈ నరనారాయణుల సంవాదముచే, వారియందు దాగియున్న పరస్పర సంబంధము యొక్క చిక్కువిడిదీయబడి, మానవుని కన్నుల ఎదుట అతని అద్భుతమైన జీవిత లక్ష్యము ప్రస్ఫుట మొనర్పబడినది.

మానవుడు తన శరీరము, ప్రపంచము, తుట్టతుదకు దేవునితో గల వక్రీభవించిన సంబంధముచే తాను పొందు చున్న కష్టములకు గల ప్రాథమిక కారణమును గీత మనకు బయల్పఱచును. దేహము యొక్క నశ్వర స్వభావము, ప్రపంచము యొక్క మార్పునొందు గుణము మఱియు చైతన్యము యొక్క శాశ్వతత్త్వము మఱువబడినది. దీనిచే మానవుడు అసత్యమునే చేపట్టవలసి వచ్చుచున్నది. తన పరిసరములయందున్న శరీరము మఱియు వస్తు సముదాయమునాతడు నిత్యమని భావించుటయే దీనికి కారణము. ఇంతేగాక తన ఆత్మ ప్రాపంచిక పదార్థములపై ఆధారపడియున్న దనియు, వాటిచే పోషింపబడు చున్నదనియును ఆతడూహించుచున్నాడు. ప్రాపంచిక వస్తువులపై గల ప్రేమ– ఆత్మ నిజముగా పొందగోరు చున్నట్టి శాంతికి గొడ్డలిపెట్టు వంటిది. ఏలననగా:– ఈ ప్రాపంచిక ప్రేమలు, అజ్ఞానజనితములగు దోషగుణమును కలిగియున్నవి. సత్యాసత్యానుభవ వివేచనమునందు బుద్ధి ప్రయోగింపబడవలయును. సర్వ సామాన్యముగా మానవుని బుద్ధి ఇంద్రియములతో తాదాత్మ్యమునొంది, వాటికి పరికరముగా పనిచేయును. ఇంద్రియముల కనుగుణములగు వస్తు గుణముతో దేశకాల భౌతికముగా ఆత్మ తాదాత్మ్య మొందింపబడి, దేహ చైతన్యానుభవమునకు గుఱియగునట్లది క్షీణదశనొందును. వస్తుతత్త్వము నతిక్రమించినట్టి

నిజతత్త్వమును దృష్టి పథమునందుంచు కొనకుండుటచే ఈ బుద్ధియొక్క నిర్ణయమంతయు దోషభూయిష్ఠమైయే యుండును. మానవుని ఈ క్షుద్రజ్ఞానము ఇంద్రియములనెడి సంకెళ్ళనుండి విముక్తమై పవిత్రీకరింపబడినప్పుడు. ఉన్నతజ్ఞానము మానవుని బుద్ధికి సహకరించును. మానవుడు దేవుని శరణుపొంది తీవ్రమైనధారణ మొనర్చుచు, బ్రహ్మచైతన్యానుభవముకై అఖండకృషి యొనర్పవలయునని శ్రీకృష్ణుడు ప్రబోధించినట్టి యోగము మనకు నుడువుచున్నది.

మన మొనర్చు ప్రతి ప్రయత్నమున్నూ సిద్ధాంతము, కర్మ, కర్మఫలములనెడి మూడు దశలను కలిగియుండును. గీత మఱియు ఉపనిషత్తులు ఈ మూడు దశలను వర్ణించునట్టి క్రమబద్ధములైన ప్రబంధములై యున్నవి. గీత ప్రత్యేకముగా బ్రహ్మవిద్యను గూర్చి ప్రబోధించు గ్రంథమై యున్నది. ఇది ఆత్మ నియంత్రణము మఱియు ధ్యానమును గూర్చి ప్రబోధించు యోగశాస్త్రము. అశాశ్వతుడగు జీవిని శాశ్వత స్వరూపుడైన విశ్వాత్మతో తాదాత్మ్యము నొందింపజేయు శ్రీకృష్ణార్జున సంవాదమే ఇది. సత్యాన్వేషకుడు తొందరపాటు గలవాడై యుండరాదు. అతడు మొమ్మొదట తానొనర్ప వలసిన ప్రయత్నమును గూర్చినట్టి భావములను, సిద్ధాంతములను బాగుగా ఊహించి సక్రమముగా సమకూర్చవలసియుండును. తదనంతర మీ క్రమబద్ధమైన సిద్ధాంతములు తన వ్యక్తిగత జీవిత కార్యరంగ క్షేత్రము నందు నాటబడ వలయును. ఈ విధముగా చైతన్యాత్మయందు స్థిర ప్రతిష్ఠితుడై, ప్రధానమైన సిద్ధాంతముల నవలంబించుచు, తన నిత్య జీవితమును నూతన జీవితముగా మార్పునొందింపవలయును. ఇక మూడవ విషయమే మనగా:- ప్రయత్నము ఫలరూపము నొందుట కెంతటి సమయము పట్టినను, అత్యంత ఓర్పుతో సాధకుడు వేచియుండ వలయును. అభ్యాసము నిర్దోషమై, వైరాగ్యాన్వితమై జీవిత లక్ష్యమునకు సంబంధములేని క్షుద్రవాంఛా విరహితమై మఱియు తన సాధనకు సంబంధించిన సిద్ధాంతములు హృదయంగమములై యుండునట్లు సాధకుడు జాగరూకుడై యుండవలయును. ఈ నియమములు పాటింపబడినప్పుడు. ఒక వృక్షములోని ఫలము క్రమక్రమముగా పక్వ స్థితినొందినట్లు, జీవిత లక్ష్యమున్నూ నిశ్చయముగా పొందబడును.

కర్మ, జ్ఞానములు రెండున్నూ ఏకైక ధారణా బలప్రవాహమునందు మిళితమైనప్పుడు, శ్రీకృష్ణార్జును లుభయులు కలిసి ఒకే రథముపై కూర్చొని ముందుకు పయనించునప్పుడు అచ్చట శ్రీ, విజయము, ఆనందము మఱియు నిశ్చితమైన నీతియు నిలిచియుండును.

ఓం తత్సత్

> సముద్రమెట్లు అనంతముగ చూపట్టునో అట్లే ఈ సంసారమున్ను జననమరణపరంపరలతోడ అంతములేనిదై దుఃఖాకులమై దుస్తరమై చూపట్టుచున్నది. సముద్రమునం దెట్లు మొసళ్లు, తిమింగిలములు తదితరములగు భయంకర జలజంతువులు కాపురముండు చున్నవో, అట్లే ఈ సంసారమందును కామక్రోధాదులు, దంభదర్పాసూయాదులు మొదలగు బాధాకరవృత్తులు తిష్ఠ వేసికొనియున్నవి. సముద్ర మెట్లు అగాధమైయున్నదో అట్లే ఈ సంసార దుఃఖమున్ను అత్యంత గహనమై వర్తించుచున్నది. అయితే సముద్రమెంత విశాలమైనప్పటికిని ఎంత లోతుగలిగి యున్నప్పటికిని ఒక చిన్నినావచే అది యెట్లు దాటివేయబడగలదో అట్లే భగవద్భక్తి అను తెప్పచే ఈ సంసారరూపమహోదధి యంతయు తృటిలో దాటివేయబడగలదు.
>
> — శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

భగవద్గీత

శ్రీ సచ్చిదానందేంద్రసరస్వతి స్వాములవారు,
హొళీనర్సీపూర్, కర్ణాటక

(పూజ్యశ్రీ స్వాములవారు శంకరవేదాన్తంలో నిష్ణాతులు)

సదసద్వివేకము (ఉన్నదీ లేనిదీ)

'నాసతో విద్యతే భావో నా భావో విద్యతే సతః' ఈ గీతావాక్యం సకల శాస్త్రముల సారమని చెప్పాలి. ఈ వాక్యార్థాన్ని మననం చేసి సత్యాత్మను కనుగొన్నవారే తత్త్వదర్శకులనబడుదురు. ఇహపరలోక సుఖాన్ని పరమపురుషార్థాన్ని సాధింప గోరువారు ఈ గీతావాక్యాన్ని అనుభవానుసారంగా విచారం చేస్తే సత్యాత్మను కనుగొనుటలో జయశీలురవుతారు.

ఈ వాక్యంలో సత్తు - అసత్తు అనే శబ్దాలున్నాయి. అసత్తు అంటే లేనిదని అర్థం. సత్తు అంటే ఉన్నది. నిజంగా ఉన్నది ఉన్నట్లు తోచేది కాదు. 'తెల్లగా ఉన్నదంతా పాలుకాదనే సామెతలాగ, ఉన్నట్లు తోచేదంతా సత్తుకాదు. నిజంగా ఉండే వస్తువు కాదు, ఏది నిజంగా ఉన్నదో దానికి లేమి లేదు. అందువల్ల ఏదైనా ఒక వస్తువు ఉన్నట్లు తోస్తే, అంతమాత్రాన అదున్నదని చెప్పడం సరికాదు. ఏ వస్తువేకాని ఉన్నట్లు తోచి లేకుండా పోతుందో, ఇపుడు తోచి తర్వాత లేకుండా పోతుందో, అది నిజంగా లేనే లేదని నిశ్చయించాలి. తోచి తర్వాతలేకుండా పోవచ్చు అయితే తోచేటపుడైనా ఉందని అనిపిస్తుంది కదా? అని ఎవరైనా అడగవచ్చు. దీనికి సమాధానమేమనగా ఉన్నట్లు తోచిందంతే, నిజంగా లేనేలేదు. ఎందుకన ఉందంటే వికారం పొందకుండా తన స్వరూపాన్ని అలాగే ఉంచుకొన్నదని అర్థం. 'తాడులో పాము తోచునపుడు ఉండింది. ఇపుడు ఎచటికో పోయి ఉండాలని మనం ఎవరూ అనుకోముకదా? మనం భ్రాంతివల్ల తాడునే పామనుకొంటిమి. అలాతప్ప. తెలివివల్ల పాముగా తోచిందే తప్ప, తాడులో నిజమైన పామనేది లేనేలేదని కదా మనందరి దృఢనిశ్చయం. అందువల్ల పాము అసత్తు, దానికి స్వంతమైన ఉనికి లేనే లేదు.

ఈ నిత్యానిత్యవివేకవిచారానికి అధికారులెవరు? శోకాన్ని సమూలంగా నాశనం చేసికోవాలని పరితపించే వారంతా గీతలోని ఆధ్యాత్మకవిద్యకు అధికారులే. ఈ అధ్యాత్మవిద్య శోకాన్ని సంపూర్ణంగా నిర్మూలించే సార్వత్రిక మైన దివ్యౌషధం. ఈ విద్య రహస్యమేమంటే విషయాలు ఉన్నదున్నట్లుండవు, అవి స్థిరం కావు. వీటిద్వారాకల్గే వేదనలు స్థిరం కాదు. వేదనల ద్వారా అనుభవించే సుఖదుఃఖాలు స్థిరంకాదు. సుఖం తర్వాత దుఃఖం, దుఃఖం తర్వాత సుఖం వస్తూండడం వల్ల అనిత్యమైన ఈ సుఖదుఃఖాల్ని వివేకంతో సహించే వాడే ధీరుడని భగవంతుడు ఉపదేశించాడు.

అయితే ఈ శీతోష్ణాదిద్వంద్వములను సహించటానికి గీతోపదేశమే ఎందుకు కావాలి? వీటిని సహించడం మనిషికి సహజమే కదా? అంటే, ఇచటొకమర్మ ముంది. సందర్భానుసారంగా వచ్చే శీతోష్ణములను మనుష్యులే కాక పశుపక్ష్యాదులు కూడ దానికి పరిహారం కనుక్కోలేక

సహించుకుంటున్నాయి. ఈ విషయంలో మనుష్యుని గొప్పతనమేమీ లేదు. అయితే వివేకంతో వాటిని ఎదుర్కొనువాడు ధీరుడు. అతను అమృతత్వానికి అర్హుడు. విషయాలు ఎలా మనకంటే వేరుగా ఉన్నాయో అలాగే శీతోష్ణాదులు మరియు వాటిద్వారా కలిగే సుఖదుఃఖాలు కూడ వేరుగా ఉన్నాయి. దీన్ని విమర్శించి ఎవడు తెలుసుకుంటాడో అతడు అమృతస్వరూపుడవుతాడు.

విషయాలు అనిత్యం, శీతోష్ణములు అనిత్యం, సుఖదుఃఖాలు అనిత్యం, ఇవన్నియో రాకడపోకడలు గలవి. ఒక కాలంలో వచ్చి కొంతకాలం తోచి తదనంతరం మాయమై పోతాయి. అయితే మన స్వరూపం అలాంటిది కాదు. మనం నిత్యులమని ఎవరు నిజం తెలుసుకున్నారో వారే ధీరులు. వారికి చావు అనేది లేనేలేదు. ఇలాంటి జననమరణ రహితమైన ఆత్మ స్వరూపాన్ని గురించే భగవంతుడు అర్జునుని నిమిత్తంగా చేసికొని మనకందరికీ బోధిస్తున్నాడు.

ఇంతటితో ఈ విచారం పూర్తయిందని తేల్చుకో రాదు. ఏలన శీతోష్ణాదుల కాలంలో తోచి మరుగవుతున్నందు వల్ల అనిత్యమని ఇంతే అభిప్రాయం కాదు. అవి అసత్పదార్థములు, నిజంగా లేనేలేవు. ఆత్మ నిత్యుడంటే కూడా ఇలాగే తెలుసు కోవాలి. అతడు త్రికాలంలో నిత్యుడని అభిప్రాయం కాదు. కాలమూ అనాత్మ అయినందువల్ల ఆత్మకంటే భిన్నమై అనాత్మ అయివున్నది. ఆత్మకు కాలసంపర్కమే లేదు. కాలసమేతమైన అనాత్మ అంతయూ అనిత్యమే అంటే అసత్యమే? అది నిజంగా లేనేలేదని అభిప్రాయం. సదసద్వివేకం లేనందువల్లనే మనం ఈ ద్వంద్వ ప్రవాహరూపమైన సంసారములో మునుగుతూ తేలుతూ ఉన్నాము.

సత్తనగా నిజమైన ఉనికిగల వస్తువు. అసత్తనగా నిజంగా లేని వస్తువు. ఇచట నిజంగా ఉన్నదానికి ఉన్నట్లు తోచేదానికి తేడా వుంది. ఎలాగంటే దూరంలో ఒక మొండిమానుంది, మసక మబ్బులో అది దయ్యంలాగ తోస్తుంది. ఇచట దయ్యమనే వస్తువు ఉన్నట్లు తోచినా, నిజంగా ఉన్న వస్తువు మొండిమానే కదా? ఏ వస్తువు ఎలా తోస్తుందో అలాగే ఉండాలనే నియమమేమి లేదు. అందువల్ల సత్యమైనదేది, సత్యంగా ఉన్నట్లు తోచేదేది - అని వ్యవహారంలో నిర్ణయించడం ఆవశ్యకం కదా? అలాగే తత్త్వవిచారంలో కూడ అత్యావశ్యకం.

ఇంకో విచారం. వేదనలు మరియు సుఖదుఃఖాలతో కూడిన ఈ సంసారం మన స్వంత ఇల్లు కాదు. మార్గమధ్యంలో ఆయాస పరిహారం కోసం ఏర్పరచిన ముసాఫరఖాన(ట్రావెలర్స్ బంగళా)లాంటిది. గీతోపదేశం అనేది చాలా లోతైన విచారం. ఈ శీతోష్ణాది ద్వంద్వములు కొంతకాలం తోచి మరుగవుతాయని మాత్రం కాదు. అవి తోచేటపుడునూ అసత్తయి ఉన్నాయి. పూర్వంలేక, కొనలో లేని వస్తువులు మధ్యంలో ఉన్నాయి అనే మాటకర్థం లేదు. లేనివి ఉన్నాయని తోస్తాయి. అంటే ఇలా భ్రాంతి కాలంలో తోచడం విమర్శించి నిజం తెలుసుకున్న తర్వాత లేనేలేవని నిర్ణయించడం - దీన్ని దృశ్యముల ఆగమాపాయిత్వ మని అసత్యమని అంటారు. వేదాంతులు ఇలాంటి భ్రాంతుల్ని 'అధ్యాస' అంటారు. అధ్యాస అంటే పదార్థంలో లేని దాన్ని ఆరోపించడమని అర్థం. వస్తుతత్త్వానికి మనకల్పనను చేర్చి వ్యవహరించడం అన్నమాట. ఈ కల్పనలు వస్తువు యొక్క నిజస్థితిని తెలుసుకున్నాక అనృతమౌతాయి. అధ్యాస నిజమని తోచటానికి కారణం తత్త్వాన్ని కనుక్కోవాలనే ఇచ్ఛలేకపోవడమే. వివేచించి చూస్తే భ్రాంతి కాలంలోనే ఒట్టి

తోపిక అనియూ, వస్తుతత్త్వానికి ఎలాంటి సంబంధం లేదనియూ నిశ్చితమౌతుంది.

నామరూపాలకు విలువ నిచ్చేవారు తత్త్వదర్శకుల దృష్టిలో ఇంకనూ పసిబిడ్డలే, అమాయకులే. మన చుట్టు ముట్టుగల దృశ్యాలు వికారంపొందుతూంటాయి. అయితే వివేకవంతులు వాటినే సద్వినియోగపరచుకుని ధర్మజ్ఞానాలను సంపాదించుకుని సంసారసాగరాన్ని సునాయాసంగా దాటవచ్చు అనేది గీతాభిప్రాయం.

శరీరాదులు నిజంగా స్థిరంగా ఉంటాయా? ఇవి తాము నిజంగా లేనప్పటికి నిజమైనవిగా తోస్తూ అవివేకుల్ని గోళాడిస్తున్నాయి. అయితే వికారం పొందే తోచి అణగిపోయే ఈ తోపికలకంతా ఆధారమైన సత్యతత్త్వమొకటున్నది. దాన్నే పరమాత్మ అంటారు. ఆ ఒక్క వస్తువునకే నిజమైన విలువ. ఈ పరమాత్మ అనే వస్తువుతో పోల్చినపుడు ఈ బ్రహ్మాండ మంతయూ సున్నయే. పరమాత్మ సంపర్క మున్నపుడు మాత్రమే దీనికంతా విలువ వస్తోంది. పరమాత్మతో కూడుకొని ఉన్నపుడు మాత్రమే నామరూపాలకు అస్తిత్వం. కేవలం నామరూపాలకు అస్తిత్వమే లేదు. అవి అసత్పదార్థములు. ఇలా విమర్శించడం వల్ల బయటతోచే ప్రపంచానికిగాని, మనలోని ప్రపంచానికిగాని విలువలేదని అనుకోకూడదు. ఈ ప్రపంచం తోచటానికి ఆస్పదమై, ఇంకోవస్తువును ఆశ్రయింపక తానేతానై ఉండే పరమాత్మసంపర్కం పెట్టుకోవాలి. అలాగైతేనే మనం బ్రతికి బయటపడతాం. లేని యెడల శోకమోహాలే మనకు గతి! ఏ దృశ్యరాశియైనా తనకు తానే స్వతంత్రంగా తోచదు. దానికి ఆస్పదమైన పరమార్థ వస్తువనేది ఉండేతీరాలి. నామరూపాత్మకమైన ఈ జగత్తును కొత్తగా పరమాత్మునితో సంబంధ పరచడమనేది ఉండదు. జగత్తు ఎల్లప్పుడూ పరమాత్మకు సంబంధించికొనియే, అతణ్ణి ఆశ్రయించు కొనియే తోస్తోంది. దీనివైపు మనదృష్టి పోలేదు. మనస్సుకు హత్తుకోలేదు. ఎవరు ఈ తత్త్వాన్ని ఉన్నదున్నట్లు కనుక్కుంటారో వారే తత్త్వదర్శకులు.

ఈ విశాలమైన ప్రపంచమంతయూ పరమాత్మ నాశ్రయించుకుని ఉన్నదనేది కేవలం నమ్మకం మాత్రమే కాదు. ఇది ప్రతిఒక్కరి అనుభవంలో ఉంది. అంటే సర్వానుభవసమ్మతమైనది. ఎలాగంటే ఉన్నత్రాడులో లేని పాము తోచినట్లు, సద్రూపుడైన పరమాత్మలోనే అసత్తయిన ఈ జగత్తు తోస్తోంది. అందువల్ల ఏ దృశ్యరాశి తోచుచున్నా (కల, మెలకువ దృశ్యాలు) వాటికి ఆత్మ సత్తా, ఆస్తిత్వం అంటుకునే అనుభవానికి వస్తోంది. ఆత్మసత్తా సంపర్కం లేనిదే దేన్నీ కల్పించటానికి కూడ మనస్సుకు సాధ్యపడదు. పరమాత్ముని నిజమైన అస్తిత్వమే మనందరి లోపలాబయటా అంతటా వ్యాపించి యున్నది. అతను లేడనే కల్పనకూడ రావటానికి వీల్లేదు. నిజస్థితి ఇలా ఉన్నా మనం పరమాత్మను చూడలేం!

ఈ పరమార్థసత్యాన్ని కనుక్కోవాలనే శ్రద్ధాభక్తులు గల జిజ్ఞాసువులు లభించటమే కష్టము. సరియైన శాస్త్రం మరియు అనుభవసమ్మతముగా బోధించే మహాత్ముల సాంగత్యం లభించడం కూడా దుర్లభమే. అలాంటి యోగ్యులైన గురుశిష్యులే లోకానికి ఆదర్శప్రాయులు. శ్రీరామకృష్ణ పరమహంస వద్దకు వచ్చి వివేకానందులు 'స్వామీ! మీరు దేవుణ్ణి చూశారా?' అని అడిగినపుడు 'ఔను చూశాను. రా! నీకూ చూపిస్తాను' అన్నారట. ఇలాంటి సత్యాత్మదర్శకులూ, బ్రహ్మనిష్ఠులైన గురువులూ, మరియు ఆత్మానుభూతిని పొందాలనే తహతహలాడే ముముక్షువులూ ఎంతమంది లభిస్తారు?

జ్ఞానులంటే మనకన్నా అత్యంతవిలక్షణమైన వ్యవహారముచేసేవారనే మనకు ధృడమైన నమ్మకముంది. వేషధారి సాధువులు, యోగులు జటాధారులు, అద్భుతలీలల్ని చూపించేవారు - ఇలాంటి వారినే వెతుక్కుంటూ తిరుగుతూ మోసపోయే వారే చాలామంది ఉంటారు. అయితే మరి జ్ఞానులను గుర్తించడం ఎలా? విలువగల బట్టల్ని ధరించడం, గడ్డం మీసాలు పెంచడం, ముండనం చేసుకోవడం - ఇలాంటి బాహ్యచిహ్నాలు ఏం పనికిరావు. వేదాంతశాస్త్ర వాక్యాలను వల్లించడం, ఉపన్యాసాలు దంచడం, శ్రోతల్ని దిగ్భ్రాంతి పరచడం - ఇవన్నీ జ్ఞాన లక్షణాలు కావు. వేదాంత పుస్తక జ్ఞానం కలవారిని జ్ఞానులని భావించడం అవివేకం, నిష్ప్రయోజనం.

ఆత్మజ్ఞానాన్ని భగవంతుడు తానే స్వయంగా అర్జునునికి ఉపదేశించిన అనుభవామృతము. దాన్ని పూర్ణంగా జీర్ణంచేసుకోవాలంటే దానికనుగుణమైన యోగ్యతను సంపాదించుకోవాలి. దైవీసంపత్తుతో కూడుకున్న అర్జునుడి లాంటి శిష్యునకు కూడా నేరుగా ఆత్మను దర్శించడానికి శక్యం కాలేదు. ఇలా ఉంటే కలియుగ వారలమైన, కలితప్త హృదయులమైన మనం - భక్తికర్మానుష్ఠానం లేనిదే జ్ఞానాన్ని ఎలా సంపాదించుకోగలం? అందువల్ల ఆత్మజ్ఞానాన్ని సంపాదించుకోవాలంటే గీతలో భగవంతుడు చెప్పిన కర్మయోగాది సాధనాల్ని అలవరుచుకోవాలనేదే గీతాభిప్రాయం.

మననం చేయాలి. నిదిధ్యాసన చేయాలి. ఇలా ఆత్మను ఉన్నదున్నట్లు తెలుసుకుంటే సర్వమూ తెలుసుకున్నట్లే.

- ఓమ్ -

శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారి
శతజయంతి శుభాకాంక్షలు........

జూలుగంటి అర్జునయ్య శెట్టి & సన్స్
STD : 08578
☎ 222613
శ్రీరామ జయం

జూలుగంటి జ్యూయలర్స్
డోర్ నెం. 3/554, బజారు వీధి,
శ్రీకాళహస్తి, చిత్తూరు(జిల్లా). 517 644
బంగారు, వెండి నగల వ్యాపారము

శ్రీమతి & శ్రీ జూలుగంటి అర్జునయ్య శెట్టి

With Best Compliments From :

Ph : 08578-220023
Cell : 9603107606

G.M.R.AGENCIES
3-504, BAZAR STREET,
SRIKALAHASTHI
Authorised Dealers :
VIDEOCON, SANSUI, SONY,
LG, Whirlpool, V-GUARD,
SAMSUNG, AUDIO&VIDEO
Sales & Servcies



గీతాజ్ఞానము -ఒక పరిశీలన

-డా॥ శ్రీ కరిబసవ రాజేంద్రమహాస్వాములవారు
గవిమఠ సంస్థానం.

శ్రీమద్భగవద్గీత ప్రథమోధ్యాయము నుండి మనము గ్రహించవలసిన మొదటి బోధ 'నిర్భయత్వము' మరియు దుఃఖ హేతువులయిన అన్ని మనోదౌర్బల్యములను అధిగమించుటయు అయిఉన్నది.

రెండవ అధ్యాయము నిత్యానిత్య విషయములను గూర్చి వివరిస్తుంది. ఆత్మకు నాశనము లేదు. అది శాశ్వతమైనది. జీర్ణమైన పాతవస్త్రములను విసర్జించి క్రొత్త వస్త్రములను ధరించునట్లు ఆత్మ జీర్ణదేహమును వీడి నూతన శరీరమును చేరును. కావున ఆత్మ శాశ్వతము. కనుక జీవుడు మానసిక దుర్భలత్వమును, చింతను విడువవలెను.

భగవదనుగ్రహంతో ప్రాప్తమైన కర్మలను కడుచిత్తశుద్ధితో ఆచరించవలెను. కర్మానుష్ఠానమునుండి ఎన్నడును వైదొలగరాదు. ఏవిధమైన బలహీనతలకు లోనుగాక నియతమైన కర్మలను సక్రమముగా నిర్వర్తించవలెను. జనక మహర్షి జీవితము ఇందులకు చక్కని ఉదాహరణ. కలిమికి పొంగక లేమికి క్రుంగక కలిగిన దానితో సంతృప్తిని పొంది ఆంతరిక శక్తులను అభివృద్ధి పరచుకోనవలెనని గీత బోధిస్తుంది.

శరీరముపై మనస్సుపై చక్కని నియంత్రణ కలిగిన వ్యక్తి మానసిక దుర్భలత్వమునకు లోనుగాక స్వధర్మానుష్ఠానమును చక్కగా అనుష్ఠించగలడు. తొలుత శిక్షణద్వారా స్థూలదేహమును నిగ్రహించి, తదుపరి బాహ్యేంద్రియ మరియు అంతరేంద్రియ నిగ్రహమును శీలించి, పిదప మనోనిగ్రహమును సాధించవలెను. మనోనిగ్రహమును సాధించిన వ్యక్తి కర్మానుష్ఠానమును ఒక ధ్యాన ప్రక్రియవలె శ్రద్ధగా నిర్వహింపగలడు. నిష్కామముగ అనుష్ఠించు ఈ కర్మ ధ్యానము కంటె గొప్పగా భాసించును. తద్వారా ఆ వ్యక్తి అద్వైతానుభూతిని పొందగలడు.

జ్ఞానయోగము ద్వారాగానీ, కర్మయోగము ద్వారాగానీ లేక మరే ఇతర సాధన ద్వారా గానీ సాధకుడు అమనస్క స్థితిని సాధించినట్లయిన అతనికి తప్పక జ్ఞానప్రాప్తి కలుగును. పిదప అతడు సచ్చిదానంద పరబ్రహ్మమును గూర్చిన పూర్తి జ్ఞానము పొందును. తుదకు జ్ఞానానుభవమును పొందును.

అక్షరుడు అనగా నాశరహితుడు అని అర్థము. సర్వోత్తమమైన నాశరహితమైనదే బ్రహ్మము అనబడును. జీవాత్మ పరమాత్మలను గూర్చిన సంపూర్ణ జ్ఞానము యోగికి అద్వైత సిద్ధిని ప్రసాదించును.

కర్మఫలములను నిష్కామముగ భగవంతునకు సమర్పించినపుడు ఆ కర్మ యజ్ఞముగా మారగలదు. కర్మఫల త్యాగము ధ్యాన యోగముకంటే ఉన్నతమయినది.

భగవద్గీత 11వ అధ్యాయములో సకల చరాచర సృష్టి యొక్క విశ్వరూపము వర్ణింపబడెను. భక్తి ప్రపత్తులు కలిగిన యోగికి పరబ్రహ్మము యొక్క విశ్వరూపమును దర్శించు యోగ్యత కల్గియుండి భగవంతుని సర్వవ్యాప్తిత్వాన్ని

అవగాహన చేసికోనగలడు. అటువంటి యోగి ఈ విశాల జగత్తులోని అణువణువునందు అనంతమైన పరమాత్మ రూపమును దర్శించగలడు.

భగవద్గీత 17వ అధ్యాయములో నశ్వరదేహము మరియు శాశ్వతమైన ఆత్మను గూర్చి వివరింపబడినది. దేహము అశాశ్వతమైనది. అందున్న క్షేత్రజ్ఞుడు శాశ్వతుడు, సనాతనుడు. ఈ సత్యమును గుర్తించిన జ్ఞాని అహంకారమునకు గురికాడు. మరియు అతనికి సత్యాన్వేషణలో ఏవిధమైన అవరోధములు ఎదురుపడవు.

సాధకుడు ఆత్మజ్ఞానమును పొందుటకు అనుష్ఠించుసాధన మార్గంలో క్రమముగ తమో గుణమును, రజోగుణమును వదలి సత్వగుణమును పెంపొందించుకొనవలసిన అవసరము ఎంతైనా కలదు.

భగవంతుని వైభవమును, సగుణమును కీర్తించుటద్వారా సృష్టి స్థితి లయకారకుడైన పరమాత్ముని గూర్చిన జ్ఞానమును లెస్సగా పొందినవాడై జీవితపు పరమార్థమును ఎరుంగగలడు. శ్రీకృష్ణ భగవానుడు బోధించిన సుగుణములను ఆచరించు వారు భగవంతునకు అత్యంత ప్రీతిపాత్రులు కాగలరు.

తదుపరి భగవద్గీత తపస్సు యొక్క ప్రభావమును వివరిస్తుంది. తపస్సు సాత్విక, రాజసిక తామసిక తపస్సు అని మూడు రకములుగా వివరించడమైనది. రజస్తమో గుణములకు అవకాశము కల్పింపక, కేవలము సాత్విక తపస్సును పెంపొందించుకొని చివరకు సత్వగుణమును సైతము విసర్జించవలెను.

ఎప్పుడైతే మనము ప్రాపంచికమైన కోరికలను విడనాడి అవిద్యతో కూడిన బంధము నుండి విడుదలవుతామో అపుడే సృష్టిలోని జనన మరణ వ్యవస్థను చక్కగా అర్థము చేసికొనగలము.

భగవద్గీతా సందేశమును గమనించినపుడు ఎవరైతే నిరంతర భగవద్ ధ్యానములో ఉంటూ, దైవహిత, పరహిత, సత్కర్మాచరణ గావించుచుందురో అటువంటి వారు గొప్ప విజయాలను సాధిస్తారు. మరియు ప్రశాంతమైన జీవితమును అనుభవిస్తారు.

చివరగా శ్రీమద్భగవద్గీత మానవ జీవితమును ఒక యుద్ధ భూమిగా వర్ణిస్తుంది. ధైర్యంతో పోరాడి గెలవమని సందేశమిస్తుంది. ఈ జ్ఞానాన్ని అనునిత్యం దైనందిన జీవితములో అనుష్ఠించి ఆనందమును అనుభవించవలసినదిగా పరమ పూజ్యశ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి గీతామకరందం గ్రంథము ప్రబోధించుచున్నది.

అనువాదము

ఎ. తారాలక్ష్మి M.A., B.Md., M.Phil

> పనిలో దోషము లేదు. పనిచేయు విధానములో దోషము కలదు. కర్తృత్వ బుద్ధియే దోషము. అహంభావమే దోషము. అది లేనప్పుడు కర్మ బంధము కాక మోక్షమునే కలుగజేయును. ఎట్టిపని చేయు చున్నాడు అనుప్రశ్న భగవంతుని యొద్ద ఉదయించదు. ఆ పనిని ఏ ప్రకార మాచరించు చున్నాడను ప్రశ్నమాత్రము ఉదయించును. కావున లౌకికరంగమున గాని, పరమార్థ క్షేత్రమునగాని జనులు వారివారి కర్మలను వారాచరించుకొనుచు అహంభావములేక సంగ బుద్ధిని త్యజించి ధర్మనిష్ఠతో, న్యాయబుద్ధితో, భక్తిభావముతో మెలంగినచో అచిరకాలములో భగవత్కృపకు పాత్రులై మోక్షధామమును చేరగలరు. - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

సాధన

-శ్రీ రామకృష్ణపరమహంస

రైతులు గిత్తలను ఎలా కొనుగోలుచేస్తారో తెలుసా? ఓ! ఆ విషయంలో వారెంతో నిపుణులు. ఏవి మంచివో, ఏవి కావో వారు యిట్టే గ్రహించగలరు, గిత్త చురుకుదనం ఎలాంటిదో కనుగొనటం వారికి బాగా తెలుసు. వారు ఊరక తోకను తాకుతారు, ఫలితం అద్భుతం. చురుకుదనం లేనివి చలించక నిద్రపోతున్నట్లుగా పడుకొని వుంటాయి. చురుకైనవి తమజోలికి వచ్చినందుకు ఆగ్రహిస్తున్నట్లుగా ఎగిరి గంతులు వేస్తాయి. రైతులు ఈ రకం వాటినే ఎంచుకొంటారు.

జీవితం సఫలం కావాలంటే మానవుడికి నిజమైన సత్తావుండాలి. కాని పాలలో నానవేసిన మరమరాల మాదిరి మెత్తనై ఎందునా పొందని పౌరుషవిహీనులు అనేకులుంటారు! వారిలో సామర్థ్యం శూన్యం! దీక్షపూని ఏ పనినైనా కొనసాగించటానికైన సంకల్పశక్తి శూన్యం! మనోబలం అంతకు మునుపే సున్న! ఇలాంటివారి జీవితాలు ఎందుకూ కొరగానివి.

పెద్దచేపను పట్టదలచిన జాలరి నీళ్ళలో గాలాన్నివేసి గంటల కొద్దీ వేచివుండాలి. అలాగే దీక్షతోను ఓర్పుతోను సాధనలను సాగించే భక్తుడు చివరకు తప్పక భగవంతుణ్ణి కనుగొంటాడు.

వంశపారంపర్యంగా వ్యవసాయం సాగించే రైతు పన్నెండేళ్లు అనావృష్టి సంభవించి ఏమీ పండకున్నా వ్యయసాయం మానుకోడు. కాని కొత్తగా వ్యవసాయానికి దిగిన వర్తకుడు ఒక్క ఋతువు అనావృష్టి సంభవించగానే దిగులుపడి 'యిది మనకు అచ్చిరాలే' దని వ్యవసాయానికి స్వస్తి చెబుతాడు. అదే రీతిలో జీవితకాలమంతా సాధనచేసి చివరకు భగవంతుణ్ణి కనుగొనకున్నా నిజమైన భక్తుడు నిరుత్సాహపడడు.

ఈత నేర్చుకోవాలనుకొన్నవ్యక్తి కొన్నాళ్లు ఆ ప్రయత్నం చెయ్యాలి. ఒక్కరోజు ఆభ్యాసం చెయ్యగానే సముద్రంలో ఈదటానికి ఎవడూ సాహసించరాదు. అలాగే సచ్చిదానందసాగరంలో ఈదులాడ దలస్తే నువ్వు కృతార్థుడవవటానికి ముందు కష్టనష్టాలకోర్చి అనేక సాధనలు చేయాల్సి వుంటుంది.

అప్పుడు పుట్టిన దూడ స్థిరంగా నిలబడటానికి ముందు అనేకసార్లు తడబడుతుంది, పడుతుంది. అలాగే బ్రహ్మసాక్షాత్కారం సిద్ధింపచేపర్యంతం సాధకుడికి బ్రహ్మ మార్గంలో ఎన్నోసార్లు తొట్రుపాటు కలుగుతుంది.

ప్రశ్న - అరుదుగాగాని మనకు మనశ్శాంతి లభించదు గదా, అలా లభించిన శాంతి ఐనా చిరకాలం వుండిపోదు. అది ఎందువల్ల?

పరమహంస జవాబు- నిరంతరం ఊదుతూంటేనే గాని వెదురుకర్రల నిప్పు ఆరిపోకుండ వుండదు. ఆధ్యాత్మికాగ్నిని ప్రజ్వలింప చెయ్యటానికి నిరంతరమైన సాధన ఆవశ్యకం.

కూజాను నిండా నీటితోనింపి ఉట్టిమీద వుంచు. కొద్ది రోజుల్లో నీరంతా యిగిరిపోతుంది. కాని దాన్నే నీళ్లలో వుంచితే, అలా వుంచబడినంతకాలం నిండుగానే వుంటుంది. నీ భగవద్భక్తి విషయం కూడ యిలాంటిదే. కొంతకాలం భక్తిసాధన చేశాక ఆ విషయమే మరచి, యితర వ్యవహారాల్లో దిగినపక్షంలో నీ హృదయంలోకి భక్తి ఆసాంతం హరించి పోతుంది. కాని నీ ఆనందమయ హృదయాన్ని పవిత్ర భక్తివిశ్వాసాలనే అమృత సాగరంలో సదా ముంచివుంచితే వాటితో ఎప్పుడూ పరిపూర్ణమై ఒప్పుతూంటుంది.

పాలకుండ కింద మంట వున్నంతవరకు పాలుపొంగుతూనే వుంటాయి. కాని మంటను తీసెయ్యగానే పొంగు చల్లారుతుంది. అలాగే నూతన సాధకుడు తన పారమార్థిక సాధనలను సాగిస్తూన్నంతవరకే ఆవేశంతోను ఉత్సాహంతోను పొంగుతుంటాడు.

మనిషిలో ఎంతకాలం దైవభక్తీ, ధర్మబుద్ధీ నిలిచి వుంటుంది? కనకనలాడే నిప్పులో వున్నంత వరకు ఇనుము ఎర్రగా వుంటుంది. బైటికి తియ్యగానే నల్లబడుతుంది. అలాగే మనిషి బ్రహ్మానుసంధానం చేస్తూండేటంతవరకు బ్రహ్మాభావం కలిగివుంటాడు.

మనస్సు నీగ్రోజాతివ్యక్తి ఉంగరాలజుట్టులాటిది. దాన్ని నువ్వెంతగా సవరించి వక్రగతిని మాన్పచూసినా తిరిగి వక్రమవుతూనే వుంటుంది. మనస్సును పట్టి తిన్నగా నిలిపి వుంచేటంతకాలం సన్మార్గంలో చక్కగానే నడుస్తుంది, ప్రయోజనకారిగానే వుంటుంది. కాని నీ జాగరూకత రవ్వంత కొరవడగానే ఇది సన్మార్గాన్నివీడి పెడత్రోవ పడుతుంది.

సాధనాభ్యాసం

లోతులేని చెరువునుంచి పరిశుభ్రమైన నీళ్లను తీసుకొని తాగాలంటే, నీళ్లను కదలకుండా, జాగ్రత్తగా మెల్లగా పైభాగం నుంచి తీసుకోవాలి. కదిపితే అడుగులోని బురద పైకొచ్చి నీళ్ళనంతా మలినపరుస్తుంది. నువ్వు పరిశుద్ధడవు కాదలిస్తే నీ శక్తి సామర్థ్యాలను నిరుపయోగమైన చర్చలలో, వాగ్వాదాలలో వ్యర్థం చేసుకోక, దృఢవిశ్వాసంతో క్రమంగా సాధనలను సాగించు. లేనిపక్షంలో నీ అల్పబుద్ధి కలవరపడుతుంది.

(కలకత్తాలో కోటీశ్వరుడైన) యదునాథ మల్లిక్‌వంటి శ్రీమంతుడి సిరిసంపదలను గురుంచీ, భవనాలగురుంచీ భోగట్టా చేసేవారు అనేకులుంటారు. కాని స్వయంగా ఆతణ్ణి దర్శించి పరిచయం సంపాదించుకొనేవారు ఏ కొద్దిమందో! అలాగే ధర్మశాస్త్రాలను చదివేవారూ మతధర్మాలను గురుంచి ప్రసంగించేవారూ అనేకులుంటారుగానీ, భగవద్దర్శనం కోరి అందుకై కష్టించి సాధనలు చేసేవారూ అరుదు.

కార్యసిద్ధికి అనువైన మార్గాన్ని అవలంబించు. 'పాలలోవెన్నవుంది' అని గొంతు బొంగురుపోయేటట్లు ఎంత అరచినా వెన్న లభించదు.

నీకు వెన్న కావలసివస్తే పాలను తోడుపెట్టి పెరుగుచెయ్యాలి. తర్వాత దాన్ని చిలకాలి. అప్పుడు నీకు వెన్న లభిస్తుంది. అలాగే దేవుడు నీకు ప్రత్యక్షం కావాలని కోరుకుంటే శ్రద్ధాభక్తులతో సాధనచెయ్యి. అంతేగాని ఊరకే " ఓ దేవుడా! దేవుడా!" అంటూ అరిస్తే ఏం ప్రయోజనం?

నగరులోకి పోయి రాజదర్శనం చెయ్యగోరేవ్యక్తి అక్కడికి వెళ్లి ద్వారాలన్నిటిని దాటాలి. అలాగాక బైటి కోటగుమ్మం దాటగానే, "రాజుగారెక్కడ?" అని అడిగితే, రాజు కనబడడు. సప్తద్వారాలను దాటితేగాని రాజును దర్శించలేడు.

సాక్షాత్కారం కావాలంటే సాధనచేసి తీరాలి. ఒకరోజు నేను భావసమాధిస్థితిలో వుండగా హలధర పుష్కరంలో ఒక పల్లెటూరి వ్యక్తి నీటిమీద నాచును తొలగించి నీటిని పుడిసిటబట్టి మళ్లామళ్లా పరీక్షించటం నాకళ్లబడింది. నాచుని తొలగించనిదే భగవంతుడిలో నిర్మల భక్తీ ఆయన సాక్షాత్కారమూ కలుగవని తెలుపటానికో అన్నట్లుగా జగజ్జనని ఆ దృశ్యాన్ని చూపించింది. ధ్యానం, నామస్మరణం, సంకీర్తనం, ప్రార్థన, దానధర్మయజ్ఞ యాగాచరణం మొదలైన సత్కార్యాలు భగవత్ప్రాప్తిని కలిగిస్తాయి.

సాధనామార్గాలు మూడు విధాలు- 1. విహంగమార్గం, 2. మర్కటమార్గం,3. పిపీలికా మార్గం.

1. పక్షి వచ్చి పండును పొడుస్తుంది. బహుశా ఆ పోటుతో పండుపడిపోతుంది, యిక అది పక్షికి దక్కదు. అలాగే అతితీవ్రంగా సాధనలు సాగింప ప్రయత్నించేవారు కొందరుంటారు. ఆ తీవ్రతే తరచు వారి ప్రయత్నాలను భగ్నం చేస్తూంటుంది.

2. కోతి పండును నోట కరచుకొని కొమ్మనుంచి కొమ్మకు దూకటం దాని స్వభావం. ఇలా దూకేటప్పుడు పండు తరచు నోట్లోనుంచి పడిపోతుంటుంది. అలాగే సాధకుడు పట్టువదలితే జీవితంలో సంభవించే ఒడుదుడుకులతో తన సాధన విధానాన్ని జారవిడుస్తూంటాడు- బ్రహ్మమార్గ భ్రష్టుడవుతూంటాడు.

3. చీమ నెమ్మదిగా, నిశ్చయంగా ఆహారంవున్న చోటికి పాకి వెళ్లి దాన్ని నోటకరచుకొని తన కన్నంలోకి తీసుకెళ్లి సురక్షితంగా తింటుంది. ఇలాటి పిపీలికామార్గాన్ని అనుసరించే సాధనావిధానమే సర్వోత్తమం. ఇందులో ఫలప్రాప్తి నిశ్చయం.

చేపలను పట్టుకోవాలనేవాడు ఒక గుంటలో మంచి చేపలు దొరుతాయో లేదో తెలుసుకోటానికై దాన్లో యిదివరకు చేపలను పట్టిన వారి వద్దకు వెళ్లి ఆతురతతో యిలా అడుగుతాడు. "ఫలానా గుంటలో పెద్దపెద్ద చేపలు దొరకటం నిజమేనా? వాటిని పట్టటానికి ఎలాటి ఎరవెయ్యాలి?" కావలసిన సమాచారం వారివల్ల తెలుసుకొని పరికరాలతో గుంటవద్దకెళ్లి, గాలంవేసి, ఓపికపట్టి నేర్పుతో చేపలను ఆకర్షిస్తాడు. చివరకు చక్కని పెద్దచేపను పట్టుకోగలుగుతాడు. అలాగే మహాత్ముల ఋషుల వాక్కుల్లో పూర్ణవిశ్వాసముంచి, భక్తి అనే ఎనతో మనునిశ్చయమనే గాలపు కోలతో భగవంతుణ్ణి పట్టుకొని హృదయంలో నిలుపుకోవాలి. అందుకై అఖండమైన ఓర్పుతో కాలపరిపాకానికై వేచి వుండాలి. అలాచేస్తే ఆ దివ్యమీనం లభిస్తుంది.

ఆత్మసాక్షాత్కారం కావాలంటే సాధనలను ఆచరించి తీరాలి. కాని పరిపూర్ణశ్రద్ధవుంటే స్వల్పసాధన ఐనా చాలు.

పరమపావనమైన భగవన్నామ ప్రభావంలో సంపూర్ణ విశ్వాసంవుంటే - నిరంతర నామస్మరణలో మనస్సు రమిస్తే - అలాటి వ్యక్తికి మరే యితరసాధనగాని, వివేచనగాని అనావశ్యం. అప్పుడు సంశయాలన్నీ సమసిపోతాయి. మనస్సు నిర్మలమవుతుంది. పావననామ ప్రభావంలో భగవంతుడే స్వయంగా అతడికి సాక్షాత్కరిస్తాడు.

సాధన సిద్దులనీ కృపాసిద్ధులనీ సిద్ధులు (లేక ముక్తులు) రెండు కోవలకు చెందుతారు. మంచి పంట దక్కటానికి కొందరుతమ పొలాలకు కాలువలు, తీసో, నీటిని తోడో చాల శ్రమపడవలసి వస్తుంది. కాని నీటికోసం యిలాటి శ్రమను ఎంతమాత్రమూ పడనక్కర్లేని అదృష్టవంతులు కొందరుంటారు.ఎలాగంటే , వానలు పడి వారి పొలాన్నంతా నీటితో నింపుతాయి. మాయాబంధంనుంచి విముక్తి

పొందటానికై దాదాపు అందరూ దీక్షతో సాధన చేయవలసేవున్నారు. కాని కృపాసిద్ధులకు యి శ్రమంతా అనావశ్యం. భగవత్కృపతోనే వారు ముక్తులవుతారు. కాని వీరి సంఖ్య అత్యల్పం!

ఏకాగ్రత : ధ్యానం జపతపాలను సదా ఆచరిస్తూండాలి.

పనులన్నిట్నీ కట్టిపెట్టి సాయంకాలం నువ్వు భగవంతుణ్ణి ధ్యానించాలి. సంధ్యాసమయంలో సహజంగా భగవద్భావన మనస్సును ఆవరిస్తుంది. "కాసేపటిక్రితం సమస్తం దృగ్గోచరమైవుంది. కాని, ఆహా! ఇంతలోనే సర్వం చీకటితో ఆవరింపబడిందే! ఇలా చేసేవారెవరు?" ఇలాటి భావాలు మనస్సులో పొడసూపుతాయి. సాయంకాలంలో మహమ్మదీయు లెలా అన్నిపనులను విడిచిపెట్టి నమాజుకు కూర్చుంటారో మీరు చూడలేదా?

పొట్లం చినిగిపోగా కారిపోయి నాలుగువైపులా చెల్లాచెదరైన ఆవాలను పోగుచెయ్యటం చాలాకష్టం. విషయాలవెంటబడి నాలుగు దిక్కులకేసి పరుగులుపెట్టే మనస్సును అంతర్ముఖంచేసి, ఏకాగ్రంచెయ్యటం ఎంతోకష్టం.

ఏ మారుమూలో, నిర్జరారణ్యంలోనో, నిశ్శబ్దమైన నీ హృదయ దేవాలయంలోనో భగవంతుణ్ణి ధ్యానించు.

సాధకుడు ప్రారంభదశలో ఎప్పుడూ ఏకాంత స్థలానికి వెళ్లి మనస్సును ఏకాగ్రం చెయ్యటానికి ప్రయత్నించాలి. లేకుంటే నానావిషయాలూ మనస్సును ఆకర్షించి కలవర పెడతాయి. పాలకు నీటి చేరిక కలిగిస్తే రెండూ ఐక్యమౌతాయి. కాని పాలను చిలికి వెన్నగా మారిస్తే, అలా పరిణామం పొందిన పాలు(అంటే వెన్న) యిక నీటితో కలసిపోవటానికి మారుగా నీటిపైన తేలియాడుతుంది. అలాగే నిరంతరసాధనతో చిత్తైకాగ్రతను పొందిన వ్యక్తి ఎక్కడున్నా అతడి మనస్సు పరిస్థితులకు లొంగక సదా బ్రహ్మభావంలో నిలుకడ కలిగివుంటుంది.

తన శరీరాన్ని చూపిస్తూ గురుదేవుడు శిష్యులకు యిలా బోధించేవాడు, "ధ్యానం ఆరంభించడానికి ముందు దీన్ని గురించి కొంతసేపు భావించు. నే నిలా చెప్పటానికి కారణం ఏమిటో తెలుసా? మీకు దీని (నా) లోని నమ్మికతో మీ భావాలు దీని(నా) వైపుకు తిప్పబడిన పక్షంలో వెంటనే భగవంతుడి వైపుకు మరలుతాయి. ఇది ఆవులమంద కనిపించగానే ఎవరికైనా ఆవులకాపరి తలపుకు రావటం వంటిది, లేదా కుమారుణ్ణి చూడగానే తండ్రీ, వకీలును చూడగానే న్యాయస్థానమూ జ్ఞాపకం రావటం వంటిది. వెయ్యి విషయాల్లో చెల్లాచెదరైవుండే మనస్సు దీన్ని (నన్ను) గురించి భావించేటప్పుడు ఏకాగ్రతమౌతుంది, అలా ఏకాగ్రమవగానే భగవంతుడి మీదికి మరలుతుంది. అప్పుడు సరైన ధ్యానం సాధ్యమౌతుంది".

మనస్సును ఏకాగ్రపరచటానికి దాన్ని దీపంమీద నీలపటం అతిసులువైన మార్గం. దానికి మధ్యనుండే నిలిభాగం కారణశరీరానికి సరివస్తుంది. దానిమీద మనస్సును నిలపటానికి ప్రయత్నించటంచేత శీఘ్రంగా అలవడుతుంది. దీపంలో నీలాంశం చుట్టూవుండే తేజోవంతమైన భాగం సూక్ష్మశరీరాన్ని పోలుతుంది. దాన్ని ఆవరించుకొనివుండే బాగమే స్థూలశరీరం.

గురుదేవుడు తన సాధనదశను గురించి ముచ్చటిస్తూ శిష్యులకు యిలా తెలిపేవాడు, "నాయనా! ఆ రోజుల్లో భగవంతుణ్ణి ధ్యానించటానికి ముందు నేను వివిధ మాలిన్యాలను (చెడుతలపులు, కోరికలు మొదలైనవి) అన్నిటిని మనస్సునుంచి శుభ్రంగా కడిగివేస్తున్నట్లూ, ఆ తర్వాత దైవాన్ని

అందులో ప్రతిష్ఠించుకొన్నట్లూ భావించేవాణ్ణి. మీరూ అలాగే చెయ్యండి.

ఆరంభదశలో సాధకుడు ధ్యానసమయంలో యోగనిద్ర అనే ఒక రకమైన నిద్రను పొందుతాడు. అప్పుడాతడికి ఏవో కొన్ని దివ్య దృశ్యాలు తప్పక గోచరిస్తాయి.

సాత్వికస్వభావుడైన వ్యక్తి ఎలా ధ్యానిస్తాడో తెలుసా? అర్థరాత్రి పడకమీది దోమతెరలో అతడు యితరులకు కానరాకుండేట్లు ధ్యానం సాగిస్తాడు.

మనోకల్లోలం పూర్తిగా శాంతించేటప్పుడు శ్వాసలు కట్టుబడటంచేత కుంభకం సిద్ధిస్తుంది. భక్తియోగ మూలాన కూడ కుంభకస్థితి లభిస్తుంది, - గాఢమైన భగవద్భక్తివల్ల సైతం శ్వాసలు కట్టుబడుతాయి.

గాఢమైన ధ్యానం ధ్యేయవస్తుతత్వాన్ని గోచరింపచేసి ధ్యాత యొక్క అంతరంగంలో నెలకొల్పుతుంది.

'ధ్యాన సిద్ధుడికి మోక్షం కరతలామలక' మనే సామెతవుంది. ధ్యానంలో ఎప్పుడు సిద్ధి కలుగుతుందో తెలుసా? ధ్యానానికి కూర్చోగానే దివ్యభావాలతో ఆవరించబడి బ్రహ్మానుసంధానం చెయ్యగలిగినప్పుడు.

ధ్యానంలో తీక్ష్ణమైన ఏకాగ్రత కలిగినప్పుడు అన్యమేదీ కనిపించదు. వినిపించదు. బాహ్య స్పర్శలుగాని, విషయానుభవాలుగాని లేకుంటాయి. శరీరం మీద పాము పాకుతున్నా అప్పుడు తెలియదు. ధ్యాతకు గాని, పాముకుగాని ఆ విషయమైన ఎరుకే లేకుంటుంది.

ప్రగాఢధ్యానంలో ఇంద్రియవ్యాపారాలన్నీ కట్టుపడతాయి. బాహ్యప్రపంచద్వారాలు బంధించ బడ్డాయో అన్నట్లు మనస్సు అంతర్ముఖమై వృత్తిరహితమై వుంటుంది. శబ్ద స్పర్శరూప రసగంధాలైదూ బైటేవుండి గోచరించవు. ధ్యానంలో మొట్టమొదట విషయాలు మనస్సుకు గోచరిస్తాయి, కాని ధ్యానం గాఢ మైనప్పుడు విషయానుభవాలు కలుగనే కలుగవు అవి బహిష్కరింపబడతాయి.

భగవత్సాక్షాత్కారానికై నువ్వు ఏమార్గాన్ని అవలంబించినా మనస్సు సంపూర్ణంగా అడగిపోతేనేగాని - వృత్తిశూన్యమైతేనేగాని యోగం సిద్ధించదు. ఇదే రహస్యం. యోగి ఎప్పుడూ మనస్సుకు అధీనుడుగాక మనస్సును సదా తన అధీనంలో వుంచుకొని వుంటాడు.

(శ్రీరామకృష్ణమఠం వారి సౌజన్యంతో)

ధ్యానము నాలుగు విధములు (1) తనయందొక విధమగు తేజోరూపమును భావించుట, దీనిచే తనయందున్న పాపము రహితమగును. (2) తనయందున్న తేజోరూపము (ఆత్మ) సర్వభూతములయందున్నదని భావించుట, ఇందుచే రాగద్వేషరహితమగు సమత్వమేర్పడును. (3) ఈ నడుపబడు ప్రకృతితో గూడ సర్వమును ఈశ్వర మహిమయనియే భావించుట. ఇది మిక్కిలి విశాల భావము. దీనిచే భేద రహిత స్థితి చేకూరును. (4) ఇది తురీయము, ధ్యేయము. దీనియందేకము గోచరించును. అంతయు, తానుగాక మరియొక వస్తువే తోచకుండుట. దీనికి తురీయాతీతమని గూడ పేరు గలదు. కట్టకడకు పై చెప్పిన మువ్వురును ఈ నాల్గవస్థానమునకు క్రమక్రమముగా రావలసియుందురు. అపుడే పరిపూర్ణావస్థను బొందగలరు.

- శ్రీ మళయాళస్వామి

రాజయోగం

– స్వామి వివేకానంద

మనిషిలోని వ్యక్తిత్వాన్ని వికసింపచేయటానికి ఉద్దేశించిన పాఠం ఇది. ప్రతి వ్యక్తిత్వం పరిపుష్టిం కావాలి. ఈ వ్యక్తిత్వాలన్నీ కేంద్రస్థానంలో సమన్వయమౌతాయి. "భావన లేదా ఊహాశక్తి దివ్యప్రేరణకు ద్వారం. ఈ ఊహాశక్తే ఆలోచనానికి మూలం". ఆచార్య పురుషులు, కవులు, ప్రకృతి సిద్ధాంతాలను కనిపెట్టిన వారంతా గొప్ప ఊహాశక్తి కలవారు. ప్రకృతి మనకు బయట ఉన్నా, దానిజ్ఞానం మనలోనే ఉంది. రాయి భూమిమీద పడటం జరిగేదే, అయితే ఆ భూమ్యాకర్షణరూప సిద్ధాంత జ్ఞానం మనలోనే కలుగుతుంది తప్ప బయట కలుగదు. అతిగా తినేవారు, అసలు తిననివారు, అతిగా నిద్రించేవారు, అసలు నిద్రించనివారు – యోగులు కాలేరు. అజ్ఞానం, చాంచల్యం, అసూయ, ఆలస్యం, అతిసాంగత్యం–యోగసాధనానికి బద్ధశత్రువులు. యోగసాధనానికి కావలసిన గుణాలు మూడు.

1. బాహ్యాభ్యంతర శుద్ధి – మనసును క్రిందికి లాగే దైహిక, మానసిక మలాన్నంతా క్షాళనం చేయాలి.

2. సహనం – (సాధన కాలంలో) మొదట చాలా అద్భుత అనుభూతులు కలుగుతాయి. అయితే అవి క్రమంగా అణగిపోతాయి. ఈ దశ చాలా కఠినమైనది. కాని వదిలిపెట్టవద్దు. సాధన కొనసాగిస్తూనే ఉండాలి. సహనం వహిస్తే చివరికి ఫలితం లభిస్తుంది.

3. పట్టుదల – కష్టం వచ్చినా– సుఖం వచ్చినా, రోగం వచ్చినా– ఆరోగ్యంగా ఉన్నా – ఏది ఏమైనా ఒక్క దినం కూడా సాధనను మానరాదు.

సాధనకు యోగ్యమైన కాలం సంధ్యాకాలం. మన స్థూల–సూక్ష్మ దేహాల్లోని రక్తప్రవాహాలు, భావప్రవాహాలు ఉండేకాలం. సంధ్యాసమయం రెండు స్థితులకు మధ్య నున్న సమస్థితి. ఈ సంధ్యాకాలంలో సాధన చేయడానికి కుదరకపోతే, ఉదయం నిద్రలేచిన వెంటనే, రాత్రి నిద్రపోయే ముందు సాధనచేయాలి. శారీరకశుద్ధి చాలా అవసరం. ప్రతిరోజూ శుభ్రంగా స్నానం చేయాలి. స్నానం చేసిన వెంటనే స్థిరంగా కూర్చోవాలి. నువ్వు కొండలా అచలంగా కూర్చునట్లుభావించుకో. నిటారుగా కూర్చో. తల– భుజాలు– పిరుదులు వంగరాదు. వెన్నుబద్దమీద బరువు పడరాదు. వెన్నుబద్ద వెంట యోగశక్తి ప్రవహిస్తుంది. అందుకని వెన్నుబద్ద నిరపాయంగా ఉండాలి. పాదాగ్రం నుండి శిరఃపర్యంతం పరిశుద్దంగా ఉన్నట్లు భావించాలి. భావనా సందర్భంలో ఆయా అవయవాలను మనసులో రూపొందించి, చేతితో స్పర్శించవచ్చు. తర్వాత శరీరమంతా పరిశుద్ధంగా ఉందని, అది ఈశ్వరునికి సాధనభూతంగా సమర్పితమైందని, అది నీకు సత్యదర్శనం చేయించగలదని, ఈ సంసారవారధినీ దాటించుట కది నీకు తరుణోపాయ నౌక అని భావించు. తర్వాత రెండు నాసారంధ్రాల ద్వారా లోనికి గాలిపీల్చి, బయటికి పూర్తిగా వదిలివేయి. ఓపినంతవరకు బహిః కుంభకం –అంటే గాలి పీల్చకుండా ఉండటం చేయి. ఇలా నాలుగు పర్యాయాలు చేయి. తర్వాత మామూలుగా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు కొనసాగిస్తూ ఆత్మానుభూతికై ధ్యానించు. "ఈ విశ్వాన్నంతా సృజించిన పరమాత్మతేజస్సుమీద నేను ధ్యానం చేస్తున్నాను. ఆ పరమాత్మ నా బుద్ధిని సన్మార్గంలో నడిపించుగాక!" –అంటూ పది పదిహేను నిమిషాలు భావించు.

నీ అనుభవాన్ని నీ గురువుకు తప్ప మరెవ్వరికీ చెప్పకు. వాక్ నియమం పాటించు. ఎప్పుడూ సత్ సంకల్పాలే చేస్తూండు. మనం ఏమి సంకల్పిస్తామో, అలాగే మారుతాం.

ధ్యానం మానసిక మలాన్ని హరిస్తుంది. యోగులు మాత్రమే యథార్థానికి స్వతంత్రులు. తక్కినవారంతా బద్ధులు. మనం ముక్తులం కావటానికి ఒక్కొక్క బంధాన్ని త్రెంచుకోవాలి.

అంతా పరమార్థాన్ని గ్రహించగలరు. భగవంతుడు సత్యమైతే, మనకు ఈశ్వరానుభూతి కలిగితీరాలి. ఆత్మానుభూతిని మనం పొంది తీరాలి.

ఆత్మానుభూతిని పొందటానికి ఒక్కటే మార్గం. అది తాను శరీరం కాదని తెలుసుకోవటం.

యోగులు ఇంద్రియాలను రెండు భాగాలు చేశారు.

జ్ఞానేంద్రియాలు – కర్మేంద్రియాలు. అంతఃకరణం అంతరింద్రియం. అది నాలుగు భాగాలు, 1. మనసు, 2.బుద్ధి 3. చిత్తం, 4. అహంకారం.

సంకల్ప వికల్పాత్మక మనసు, ఇది ఆలోచనాత్మకం. దీన్ని సరిగ్గా నిగ్రహించకుంటే, ఈ శక్తి వ్యర్థమవుతుంది. అదుపులోకి తెచ్చుకుంటే ఇది గొప్పశక్తిగా పరిణమిస్తుంది.

బుద్ధి – ఇది నిశ్చయాత్మకం.

అహంకారం – ఇది గర్వాత్మకం. కర్తృత్వ భోక్తృత్వరూపం.

చిత్తం యితర వృత్తుల్లోకి మారకుండా అవి కారణంగా ఉంచటానికి ఏర్పడిన శాస్త్రం యోగం. అంటే చిత్తవృత్తి నిరోధక సాధనం. తరంగాలతో కూడిన సముద్రంలో పడిన చంద్రబింబంలా, చంచల మనసులో ఆత్మ స్పష్టంగా ప్రతిబింబించదు. సముద్రంలో తరంగాలు ఆగిపోయినపుడు చంద్రబింబం స్పష్టంగా ప్రతిఫలిస్తుంది, అలాగే చిత్తం నిరుద్ధమై – శాంతమైనప్పుడు, చిత్తంలో ప్రతిబింబించి, దర్శనయోగ్యమౌతుంది.

మనసు శరీరం వంటిదికాదు. కాని అదికూడా సూక్ష్మభూతాలవల్ల ఏర్పడిందే. మనసు చిరకాలం శరీరంలో బద్ధమై ఉండదు. మనం అప్పుడప్పుడు ఈ శరీరం నుండి పైకి లేవటంవల్ల ఈ విషయం ఋజువవుతుంది. ఇంద్రియాలను నిరోధించటం వల్ల మనసును మన యిష్టం వచ్చినప్పుడెల్లా శరీరాన్నుండి వేరుచేయటం నేర్చుకొంటాం.

ఇంద్రియ నిగ్రహం అలవాటైన తర్వాత, విషయాలను నిగ్రహించాలి. మన కనుభవంలో నున్న ప్రపంచమంతా, వైషయికమైనదే. ఉత్తమస్థితికి చేరినందుకు నిదర్శనం ఒక్కటే, అదే స్వతంత్రం. నువ్వు యింద్రియాలకు దాసుడవు కాకుండా, వాటిని నిగ్రహింపహలిగితే, అప్పుడు నువ్వు ఆధ్యాత్మిక జీవితంలో అడుగుపెట్టినట్లు భావించుకో! ఇంద్రియాకర్షణానికి లోనైనవారు వట్టి ప్రాకృతులు, ఇంద్రియాలకు బానిసలు.

చిత్తవృత్తులను నిర్మూలనం చేసి, చిత్తాన్ని

ప్రశాంతంగా చేస్తే, మనం జన్మరాహిత్యం పొందినట్లే. కోట్ల సంవత్సరాలు శ్రమించి మనం ఈ శరీరాలను సంపాదించాం. ఈ శరీర సంపాదన శ్రమలో, వీటిని మనం ఎందుకు సంపాదించామో, ఆ మహత్తర ప్రయోజనాన్ని మరిచాం. ఆ ప్రయోజనం మోక్షం. పరిపూర్ణత్వాన్ని సంపాదించటం. శరీరాన్ని వృద్ధి చేయటమే మన ప్రయత్నాలన్నింటి ప్రయోజనమని మనం అనుకొంటున్నాం. అదే మాయ. మనం ఈ భ్రాంతిని వదిలి, మన ప్రధాన లక్ష్యాన్ని గుర్తుతెచ్చుకొని, మనం ఈ శరీరం కాదని, ఇది మనకు సాధనమే తప్ప సాధ్యంకాదని గ్రహించాలి. శరీరం భృత్యునివంటిదే సుమా!

మనసును శరీరాన్నుండి బయటికి లాగి మనం శరీరంకన్నా వేరని దర్శించటం నేర్చుకోవాలి. మనం ఈ శరీరానికి జ్ఞానం - చైతన్యం సంక్రమింపచేసి, ఇది ప్రాణవంతమైందని, యథార్థమని భావించటం మొదలు పెడతాం. చాలాకాలం ఈ తొడుగును ధరించటం వల్ల, ఈ తొడుగు మనం కాదన్న సంగతిని మరిచిపోయాం. మనం కోరినప్పుడెల్లా ఈ శరీరాన్ని దూరంగా నెట్టి ఇది మనకు సాధనమని, ఒక సేవకుడని, మనం కోరినప్పుడెల్లా చూడటానికి యోగం కావాలి. యోగసాధనంలో తొలి లక్ష్యం మనశ్శక్తులను నిరోధించటం. రెండవలక్ష్యం వాటిని మరేవిషయమందైనా లగ్నం చేయటం.

ఎక్కువగా మాట్లాడేవాడు యోగి కాలేడు.

యోగానికి అష్టాంగాలున్నాయి, యమం- నియమం- ప్రాణాయామం- ప్రత్యాహారం- ధారణం- ధ్యానం-సమాధులు.

1. యమం - ఇది చాలా ముఖ్యమైంది. జీవితాంతం దీన్ని పాటించాల్సిఉంటుంది. ఇది ఐదుభాగాలు. అహింస-అస్తేయం-శౌచం-సత్యం-అపరిగ్రహం. త్రికరణశుద్ధిగా వీటిని పాటించుటయే యమం.

2. నియమం - ఇది శారీరకం. స్నాన అన్నపానాలకు సంబంధించింది.

3. ఆసనం - పిరుదులు - భుజాలు - తల నిటారుగా నిలిపి వెన్నుబద్ద వంగకుండా కూర్చోవటం.

4. ప్రాణాయామం - వాయు నిరోధం. దీనివల్ల ప్రాణశక్తి నిరుద్ధమౌతుంది.

5. ప్రత్యాహారం - మనసును, బయటికి వెళ్లకుండా నిరోధించి, దాన్ని అంతర్గతంలోకి వెళ్లేలా చేయటం. ధ్యేయాన్ని మాత్రమే మనసులో మరల మరల అనుసంధానం చేయటం.

6. ధారణ - ధ్యేయంలో మనసును కేంద్రీకరించటం

7. ధ్యానం - ఈ దశలో ధ్యేయమే ఏకధారగా ప్రవహిస్తుంది.

8. సమాధి - ఆత్మదర్శనం. ఇదే మన సర్వప్రయత్నాలకు చరమదశ.

యమ నియమాలు జీవితాంతం అభ్యసించాలి. మిగతావి నిచ్చెన మెట్లు. వాటిని ఒకదాని తర్వాత మరొకటి వరుసగా తృణజలూక న్యాయంగా అనుసరించాలి. మొదటి పదాన్ని బాగా అభ్యాసం చేసిన తర్వాతే పైమెట్టును గ్రహించాలి.

ఈ పాఠంలో ప్రాణ నిరోధం గూర్చి చెబుతాను. రాజయోగంలో ప్రాణవాయువు సూక్ష్మశరీరంలో ప్రవేశించి, ఆధ్యాత్మికానుభూతిని కలిగిస్తుంది. ప్రాణాయామం మొత్తం శరీరానికంతా దీపక సాధనం. అది ముందుగా ఊపిరితిత్తులకు బలమిస్తుంది. అది ఊపిరితిత్తులు - హృదయం - రక్తప్రసారం- మేధ-మనస్సు వీటన్నింటిపై పనిచేస్తుంది. బుద్ధి బాహ్యజ్ఞానాన్ని కలిగిస్తే, ఆ బాహ్యజ్ఞానం మరల బుద్ధిని ప్రదీప్తంచేస్తుంది. మన ఇచ్ఛాశక్తులు బలహీనమైనవి. ఆ శక్తులను మనం సరిగ్గా గుర్తింపలేకున్నాం. మనం భౌతిక జగత్తులో అంతలోతుగా దిగిపోయాం. మన కున్నదంతా బాహ్యప్రవృత్తే. బాహ్యజగత్తు మన మనశ్శాంతిని పాడుచేస్తుంది. మనం బాహ్యజగత్తును వశంలోకి తేజాలకున్నాం. ఇదంతా తప్పు. నిజంగా ఎక్కువ బలవంతమైన శక్తి మనలోనే ఉంది.

లోకంలో మహానుభావులైన ఆచార్య పురుషులు, సిద్ధులు, తమ మనసులను జయించి ఆత్మశక్తితో దివ్య సందేశాన్ని వినిపించారు.

ఒక రాజు తన మంత్రిని ఒక ఎత్తైన బురుజులో పెట్టి బంధించినాడు. ఆ మంత్రి భార్య ఒక పోకచెక్క- తేనె- పట్టుదారం-నూలుత్రాడు-మ్రోకును అందించగా, ఖైదులోనుండి అతను తప్పించుకొని బయటపడతాడు. ఈ కథ మనసును ఎలా అదుపులోకి తేవాలో తెలుపుతుంది. ప్రాణాయామం పట్టుదారం లాంటిది. ఈ ప్రాణాయామం వల్ల ఒకదాని తర్వాత ఒకటి మన శ్శక్తులను అదుపులోకి తెచ్చుకోవచ్చు. చిట్టచివరిదైన ధ్యానం పెద్దమ్రోకు లాంటిది. దాంతో మనం ఈ శరీర బంధిఖానానుండి బయటపడతాం. ముక్తులమైన తర్వాత మోక్షసాధనాలను అవతలికి పారవేయవచ్చు.

ప్రాణాయామంలో మూడుభాగాలున్నాయి.

పూరకం-కుంభకం-రేచకం

పూరకం - గాలిని లోనికి పీల్చుట

కుంభకం - గాలిని నిలుపుట

రేచకం - గాలిని బయటికి వదులుట

మెదడు నుండి వెన్నుబద్ద వెంట, రెండువైపులా మూలాధారం వరకు వచ్చి, అక్కడినుండి మరల రెండవ వైపునుండి ఒకదానినొకటి దాటి మరల వెన్నుబద్ద వెంటచేరే రెండు నాడులున్నాయి. ఆ రెంటిలో ఒకటి పింగళనాడి. ఇది మెదడులో ఎడమ ప్రక్కనుండి బయలుదేరుతుంది. వెన్నుబద్ద వెంట మూలాధారానికి దిగి, అక్కడ వెన్నుబద్ద కుడిప్రక్కకు తిరిగి మరల ఎడమ ప్రక్కకు తిరుగుతుంది. దీని ఆకారం ఇంగ్లీషు అంకె ఎనిమిది(8) లో సగం ఆకృతిగా(5)ఉంటుంది.

రెండవనాడి ఇడ. ఇది పింగళనాడికి ఎదురు చుట్టుకుని ఎనిమిది (8) అంకె పూర్ణాకృతిని సిద్ధింపచేస్తుంది. ఈ ఎనిమిదంకెలో పైభాగం కన్నా క్రింది భాగం పొడవెక్కువ. ఈ రెండునాడుల్లో ప్రాణశక్తి దివారాత్రాలు ప్రవహిస్తూ షట్చక్రస్థానాల్లో ప్రాణశక్తిని నిల్వచేస్తూ ఉంటుంది. అయితే మన కీ చక్రాలు తెలియవు. ధ్యానం వల్ల మాత్రమే వాటిని మనం చూడగలం. ఇడా పింగళ ప్రవాహాలు మన శ్వాసక్రియతో సంబంధం కలిగి వున్నాయి. కాబట్టి ప్రాణాయామం వల్ల శరీరాన్ని మనం స్వాధీనం చేసుకోగలం.

కఠోపనిషత్తులో శరీరాన్ని రథంగా, మనసును పగ్గాలుగా, బుద్ధిని సారథిగా, ఇంద్రియాలను అశ్వాలుగా, విషయాలను మార్గాలుగా వర్ణించారు. ఆత్మ రథికుడు. రథికుడు చక్కని గ్రహణశక్తి గలవాడై సారథిని - గుర్రాలను

అదుపులో ఉంచేలా చేస్తేతప్ప, తన లక్ష్యాన్ని తాను చేరలేడు. ఇంద్రియాలు దుష్టాశ్వాల మాదిరి కుపథానికి ఈడ్చి, అతణ్ణి పతితుణ్ణి చేయవచ్చు. ఈ రెండు ఇడా-పింగళ శక్తులు, సారథి చేతిలో ఉన్న పగ్గాలు. అతను ఈ గుర్రాలను వశపరచుకోవాలంటే, ఈ వగ్గాలను పట్టుకోవాలి. మనం నియమవంతులం కావటానికి శక్తిమంతులు కావాలి. ఆ శక్తిని సంపాదించుకోకుంటే, మనం మన పనుల్ని అదుపులో ఉంచుకోలేము. యోగ మొక్కటే మనలను నియమితులను చేయటానికి సమర్థమైనది. యోగలక్ష్యం నైతిక ప్రభావాన్ని చేకూర్చుటే! యోగులు ఈ ఇడా-పింగళ ప్రవాహాలను మూలాధారంగా నిరోధించి, మేరుదండమనే వెన్నుబద్ద మధ్యగా వ్యాపించిన సుషుమ్నానాడి వెంట ప్రవహింపచేస్తారు. సుషుమ్నానాడిలో ప్రవేశిఇచినప్పుడు ఈ ఇడా పింగళ ప్రవాహాలు జ్ఞానప్రవాహాలుగా మారతాయి. ఇలాంటి స్థితి యోగుల్లోనే ఉంటుంది.

ప్రాణాయామంలో రెండవ పాఠం - ఒకే పద్ధతి అందరికీ పనికిరాదు. ఈ ప్రాణాయామాన్ని లెక్కప్రకారం చేయాలి. ఈ లెక్కకు ఓంకారాన్ని ఉపయోగించవచ్చు.

ప్రాణాయామం చేసే పద్ధతి ఇది. బొటనవ్రేలితో కుడిముక్కును నొక్కిపట్టాలి. ఎడమ ముక్కువెంట గాలిని ఓంకారాన్ని నాలుగుమార్లు జపిస్తున్నంతకాలం లోనికి పీల్చాలి. తర్వాత తర్జనితో ఎడమ ముక్కును నొక్కి పెట్టి మనసా ఓంకారాన్ని ఎనిమిదిసార్లు ఉచ్చరించునంతకాలం గాలిని లోపలే కుంభించాలి. తర్వాత బొటనవ్రేలిని కుడిముక్కునుండి తీసి, ఎడమముక్కును మూసి, కుడి ముక్కుతో ఓంకారాన్ని నాలుగుసార్లు ఉచ్చరించునంత కాలం గాలిని వదిలివేయాలి.

ఈ వదిలివేయటం పూర్తికానున్నప్పుడు పొత్తికడుపును వేగంగా అక్కళించి, లోపలి గాలినంతా బయటికి పోయేలా చేయాలి. తర్వాత ఎడమముక్కును మూసి, ఓంకారాన్ని నాలుగుసార్లు ఉచ్చరిస్తూ, కుడి ముక్కునుండి గాలిని పీల్చాలి. తర్వాత కుడిముక్కును బొటనవ్రేలితో నొక్కి 8 సార్లు ఓంకారాన్ని జపిస్తూ కుంభించాలి. తర్వాత ఎడమముక్కుతో ఓంకారాన్ని నాలుగుమార్లు జపిస్తూ గాలిని వదలాలి. ఇందాకటి లాగే పొత్తికడుపును అక్కళించాలి. ఇలా రెండుసార్లు ధ్యానానికి కూర్చున్నప్పుడెల్లా చేయాలి. ఇది నాలుగుసార్లు ప్రాణాయామం చేసినట్లవుతుంది. ఒక్కొక్క ముక్కు వెంట రెండేసి ప్రాణాయామాలు చేయాలి. నువ్వు ప్రాణాయామంచేసేముందు ప్రార్థన చేయటం మంచిది.

ఇలా వారం రోజులు అభ్యాసం చేయి. తర్వాత క్రమంగా పూరక-కుంభక-రేచక కాలాలను వెనకటి నిష్పత్తి చెడకుండా క్రమంగా పెంచాలి. పూరకంలో 6 జపిస్తే, కుంభకం 12. ఈ అభ్యాసం పుణ్యభావాన్ని-చిత్తశుద్ధిని-ఆధ్యాత్మికతను పెంచుతుంది. అడ్డత్రోవలు తొక్కవద్దు. ఏవో సిద్ధుల్ని సాధించటానికి ప్రయత్నించవద్దు. మనకు ఏది ప్రీతికరమో, అదొక్కటే మనవెంట వస్తుంది. అదే అభివృద్ధి చెందుతుంది. రాజయోగం వల్ల ఈశ్వర దర్శనం చేయాలనుకొనేవారు, మానసికంగా శారీరకంగా-నైతికంగా-ఆధ్యాత్మికంగా బలవంతులై ఉండాలి.

లక్షమందిలో ఒక్కడు ముక్తికోసం ప్రయత్నిస్తాడు. కొంతమంది మాత్రమే సత్యదర్శనం చేయగలుగుతారు. కాని దేన్నయినా సాధించాలంటే, సత్యానికై ప్రాణత్యాగం చేయటానికైనా సిద్ధపడాలి.

(శ్రీరామకృష్ణమఠం వారి సౌజన్యంతో)



మోక్షప్రాప్తికై ఉపదేశ చతుష్టయము

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు
శ్రీశుకబ్రహ్మాశ్రమ స్థాపకులు, శ్రీకాళహస్తి.

మోక్షప్రాప్తికై వేదశాస్త్రాదులందు మహర్షులు కావించిన సద్బోధనంతను నాలుగు చక్కని వాక్యములలో ఇమిడ్చి చెప్పవచ్చును. ఆ మహోన్నత ఆదేశములనే ఇంగ్లీషుభాషలో F_4 అని అందురు. అవి యేవి యనిన -

Follow the master.
Face the devil
Fight to the end.
Finish the game.

వీని యర్థము -

సద్గురువును ఆశ్రయింపుము
మాయను ఎదుర్కొనుము.
చివఱివఱకు పోరాడుము.
జగన్నాటకమును అంత మొనర్చుకొనుము.

తరింపనెంచు పరమార్థసాధకునకు ఈ నాలుగు ఆదేశములు చాలును. వీనిని జ్ఞప్తియందుంచుకొని, తదనురీతిగ అనుష్ఠించినచో అతడు గట్టెక్కిపోగలడు. లేనిచో ఈ దుర్భర సంసార దావానలమున తగుల్కొని ఇంకెంతయో కాలము దుఃఖజాల మనుభవింపవలసి యుండును.

1. సద్గురువు నాశ్రయింపుము.

'సద్గురువును ఆశ్రయింపుము' - అనునది వీనిలో మొదటి ఆదేశము. కోట్లకొలది జన్మలు ఈ సంసారఘటీయంత్రమున తిరుగాడి పుట్టుచు, చచ్చుచు ఏదియో సుకృతవశమున ఒకింత వివేకము జనింప మనుజుడు "ఇది యేమి విచిత్రము! ఈ శరీరమేమి? ఈ సృష్టియేమి? ఈ పుట్టుట యేమి? ఈ చచ్చుటయేమి? ఈ ప్రకారము కలకాలము జరుగవలసిన దేనా? ఈ దుస్సహ యాతనాపరంపరను నిలుపుదలచేయుటకేదైన ఉపాయము కలదా?" అని ఆలోచింపదొడంగును. దీనినే 'శుభేచ్ఛ' యందురు. ఇది సప్తజ్ఞానభూమికలలో మొదటిది. బహుజన్మ పుణ్యవిశేషముచేతనే ఇట్టి వివేకము జనులయందుద యించును.

ఈ ప్రకారముగ వివేకోదయము కలిగినపుడు అతడు చేయవలసిన మొట్టమొదటి పని సద్గురువును వెతకుకొనుట. 'ప్రేక్షేఽహం శాస్త్రసజ్జనైః' అనునట్లు వైరాగ్యోదయ కాలమున మనుజుడు తనకు దారి చూపువా రెవరా యని పరితపించుచు, 'మహాత్ములను సందర్శించి నా యభీష్టమును వారికి తెలిపి అంధకారమున ఒకింత వెలుగును సంపాదించుకొందును' అని నిశ్చయించుకొనును. మఱియు శాస్త్రములందు, సద్గ్రంథములందు ఆసక్తి కలిగి వానిని పరిశీలించుచుండును. జీవితంలో ఇదియొక గొప్ప పరిణామము(Turning point), ఇక్కడ నుండియే వాని జీవితము ఒక మలుపు తిరుగును. ఇంతవఱకు గడిపిన కోటాను కోట్ల సంవత్సరముల అసురజీవితము ఒక రకము.

ఇక ఇపుడు గడుపనున్న దివ్యజీవితము మఱియొక రకము. ఈ రెండింటికిని పొత్తు ఉండదు. ఏ ప్రాపంచిక సంపదలను నమ్ముకొని ఇంతవఱకు అతడు తన జీవితము గడపెనో, ఏ విషయభోగములే సర్వస్వమని భావించి, అవియే తన యేడుగడ యని నమ్మియుండెనో, ఏ విషయానందమును జూచి 'ఇంతకు మించిన సౌఖ్యము మఱియొకటి ముల్లోకము లందును లేదు' ని భావించెనో, అట్టి ఇంద్రియ సుఖములే వైరాగ్యోదయకాలమున వెలవెల బోవ, నీరసింప, వానిపై విరక్తి జనించును. విషయ సుఖములే అహర్నిశము అనుభవించుచు పోయిన ఇక పశువులకును తనకును భేదమేమియను వితర్క మపుడు వానియందుదయించును.

అత్తఱి జీవితనౌకను అతడు నూతనమార్గమునకు మళ్లించుకొనును. దక్షిణాయణమున నున్నవాడు ఉత్తరాయణ మునకు మఱలును. అసురసంపదలో మునిగియున్నవాడు క్రమముగ దైవసంపదను చేకూర్చుకొనదొడగును. అట్టి శు భలగ్నముననే మనుజుడు గుర్వన్వేషణ ప్రారంభించును. పుణ్యము ఫలించినపుడు మాత్రమే జీవునకు సద్గురువు లభించును. సద్గురువు గాని, సచ్ఛాస్త్రముగాని, సద్బోధగాని ఎవరికైన లభించినచో అది బహుజన్మపుణ్యఫలమని, భగవత్కృపాకటాక్షలబ్ధ మని నిశ్చయించుకొనవలెను.

గురువు లభించిన మీదట వారు కావించు ఆదేశమును శిరసావహించి తదనురీతిగ అనుష్ఠించుటకై ముముక్షువు తీవ్రతర యత్నము కావింపవలెను. శ్రద్ధాభక్తులతో, పరిపూర్ణ విశ్వాసముతో గురువాక్యమును, శాస్త్రవాక్యమును పరిపాలించవలెను. Follow the master సద్గురువును ఆశ్రయించుము, అనుసరించుము అను ప్రథమోపదేశము యొక్క అర్థమిదియే.

అధ్యాత్మికవిద్య అనుభవైకవేద్యమగు శాస్త్రము (Practical Science) అయియున్నది. ఒక చిన్న ఉపదేశమును జిజ్ఞాసువు కొన్ని సంవత్సరముల పర్యంతము సాధన చేయవలసియుండును. మార్గమధ్యమున అనేక సంశయము లుదయించుటచేతను, అనేక వితర్కములు జనించుటచేతను ఈ విద్యను సాధింపదలచువాడు అనుభవజ్ఞుడైన వ్యక్తినే ఆశ్రయించుట సముచితము. మహర్షులందఱును అట్టి అనుభవజ్ఞులైన సద్గురువులే. కనుకనే వారు బోధించిన, రచించిన శాస్త్రములన్నియు సాధకునకు పరమప్రమాణములై యొప్పుచున్నవి. గురోర్గురువై, జగద్గురువైనట్టి శ్రీ కృష్ణపరమాత్మ బోధించిన గీతాశాస్త్రము, అట్లే వ్యాసమహర్షి, శంకరాచార్యులు మున్నగు మహనీయులు కావించిన సద్బోధలు ముముక్షువులకు అత్యంత శిరోధార్యములై, అనుసరణీయములై యున్నవి. ఈ ప్రకారము పూర్వకాలిక గురుసత్తములపైనను, వారు బోధించిన సచ్ఛాస్త్రములపైనను అకుంఠిత విశ్వాసము గలిగి సాధకుడు వానిని అనుసరించుచు జీవితమును ఆధ్యాత్మికముగ పరిణత మొనర్చుకొనవలెను. గురుసేవ, గురువాక్యానుసరణము - ఈ రెండును సాధకునకు అత్యావశ్యకములని ఎన్నటికిని మఱువరాదు.

తాను గొప్పవాడననియు, సమస్తము తనకు తెలియుననియు తలంచి శిష్యుడు ఏ కాలమందును అహంకరించరాదు. గురువుయొద్ద తన తల వంగినపుడే ప్రపంచమంతయు తనయొద్ద తలవంచును. ఈ సూత్రమును జ్ఞప్తియందుంచుకొని ముముక్షువు భగవంతునియెడల, సద్గురువులయెడల, పెద్దలయెడల వినయవిధేయతలు గలిగి, వారి వాక్యములను అకుంఠిత శ్రద్ధతో పరిశీలించుచు, జీవితమునందు గొప్ప పరిణామమును సాధించవలెను.

మోక్షప్రాప్తి కిదియె ఏకైక మార్గము. ఈ ప్రకారముగ సద్గురునమాశ్రయణము మానవుని బంధ విముక్తికి అత్యావశ్యకమై యున్నది.

ప్రపంచములో గురువులు దొఱకవచ్చునుగాని సద్గురువులు దొఱకుట చాలా దుర్లభము. శిష్యులను సద్వస్తువగు ఆత్మయొద్దకు చేర్చువాడే సద్గురువు. సచ్ఛీలమును వాక్కునందేగాక అనుష్ఠానమునందును దిగ్దర్శన మొనర్చువాడే సద్గురువు. శిష్యుల అజ్ఞానాంధకారమును రూపుమాపి జ్ఞానాలోకమును వారికి ప్రసాదించువాడే సద్గురువు. కావున అట్టి యోగ్యతలు గలవారు సహజముగానే జనులలో చాలా అరుదుగా నుందురు. భగవానుడు ఎన్నుకొనిన ఏ కొలదిమంది మహనీయులో అట్టి సద్గురు పీఠ మలంకరించి లోకములో విరాజిల్లుచుందురు.

అట్టి మహనీయుల జీవితము వాస్తవముగ ప్రజలకు వసంత సదృశములుగనే యుండును. ఆధ్యాత్మిక విషయములందు పండిన యనుభవముగల మహనీయు లగుటవలనను, పారమార్థిక సూత్రము లన్నియు వారికి కాచి వడబోసినవే అయియుండుటవలనను, భక్తులకు వారి సాన్నిధ్యమందు నిగూఢ దైవతత్త్వావగాహనము సులభతర మనిపించుచుండును. బ్రహ్మజ్ఞానము పుస్తకమునుండి గ్రహింపదగిన విద్య కాదు. హృదయమునుండి ప్రవహించవలసిన అనుభవ మిది. బ్రహ్మానుభూతి నొందిన సద్గురుని హృదయక్షేత్రము నుండి పొంగి పొరలి అధికారియగు సచ్ఛిష్యుని హృదయసీమ యందు దొరలునట్టిదియే బ్రహ్మజ్ఞానము. కావున నిర్మలచరిత్ర ద్వారా తమ తమ హృదయస్థానములను పునీత మొనర్చుకొనిన భక్తకోటి యంతయు అట్టి మహాత్ములు వర్షించు బ్రహ్మజ్ఞానామృతమును గ్రహించి, అనుష్ఠించి, అనుభూత మొనర్చుకొని, జన్మ సార్థక మొనర్చుకొందురు. మహాత్ముల దివ్యావతరణముచే గలుగు పరమలాభమిదియే.

మహనీయులగు సద్గురువులు తమ జీవిత కాలమంతను అనుష్ఠానమును గూర్చియే ఎక్కువగ నొక్కి చెప్పుచుందురు. వారు స్వతః అట్లాచరించుచుందురు. కనుకనే ఆ యనుష్ఠానముపై వారికంత నమ్మకము ఏర్పడును. (1) గురువు(2) దైవము (3) అనుష్ఠానము అను మూడింటిని ఏ కాలమందును విస్మరించరాదనియు, అట్లు విస్మరించనందు వలననే తమ కెంతయో శాంతి జీవితమునందు లభించినదనియు వారు చెప్పుచుందురు. కావున వారి జీవితమునుండి మొట్ట మొదట గ్రహింపదగిన మహాపాఠ మిదియే - 'అనుష్ఠానము నెన్నడును మఱువరాదు'. ప్రతిదినమున్ను ప్రతివారును నియమపూర్వకముగ భోజన మెట్లాచరించుచున్నారో, అట్లే దైవధ్యానమున్ను నియమ పూర్వకముగ చేయవలయుననుట వారి బోధలలో ప్రముఖమైనది. ఈ చిన్న నియమమే సక్రముగ నాచరింప బడుచో అదియే సాధకుని మెల్లమెల్లగ మహోన్నత ఆధ్యాత్మిక శిఖరములకు గొనిపోగలదని వారి విశ్వాసము.

ప్రతిప్రాణియందును గొప్పగొప్ప శక్తులు విరాజిల్లు చున్నవి. అయ్యవి నిగూఢములుగ నుండుటవలన ఎవరికిని వానియొక్క పరిచయము కలుగుటలేదు. నిదురించుచున్న కుండలినీశక్తి యోగాభ్యాసముచే ఏప్రకారము పైకి లేచునో, ఆ ప్రకారమే మానవుని యందంతర్లీనములై యున్న దివ్యపారమార్థిక శక్తులు ఆతని సత్ప్రయత్నముచే లెస్సగ ప్రస్ఫుటములు కాగలవు. బంగారము ఇతర లోహములతో గూడి యుండినపుడు దానికేమంత విలువయుండదు. కాని బాగుగ ప్రస్ఫుటము గావింపబడి మేలిమిగా మారునపుడు దానికి గొప్ప విలువ యేర్పడుచుండును. అట్లే

అజ్ఞానపరివేష్టితుడై, అసురగుణాభిభూతుడై, అపవిత్ర హృదయుడై యుండునపుడు జీవునకు విలువ యుండదు. అతని నెవరును లెక్కచేయరు. అయినను అంతమాత్రముచేత నతడు నిర్లక్ష్యము చేయదగిన వాడుకాడు. ఏలయనిన, అతనియందు పవిత్రాత్మ యుండియే యున్నది. దానిని వ్యక్త మొనర్పవలెను. సత్సాంగత్యము చేతను, మహనీయుల సద్బోధలచేతను అట్టి ఆత్మస్థితి తప్పక చేకూరగలదు. అత్తఱి యింతదనుక ఎంతయో నీచుడుగ పరిగణింపబడువాడు సంఘమున సర్వోత్తముడుగ గణుతి కెక్కును. కావున పాపము చెడ్డది కాని పాపి చెడ్డవాడు కాడు. పాపి ఏనాటికైనను పుణ్యాత్ముడు కాగలడు. ప్రయత్నాతిశయముచే మానవుడు మాధవుడు కాగలడు. పశువు పశుపతి కాగలడు. ఈ సత్యమునే సద్గురువులు తమ జీవితమందు పదే పదే యుద్ఘాటించు చుందురు. కాబట్టి ప్రతిజీవియు తన నికృష్టస్థితిని జూచి నిరుత్సాహము జెందక, హృదయమును చక్కగ పరిశోధించుకొని, అసుర గుణములు, దుస్సంకల్పములు, దుర్వాసనలు తమయం దేవైనయుండిన వానిని సమూలముగ తొలగించివేసి, దైవసముడై- కాదు కాదు, దైవమే అయి శోభిల్లవలెను. ఈ ప్రకారముగ అల్పుడు మహాత్ముడు కాగల్గు ప్రతిజీవియు తన హృదయమును చక్కగ వికసింపజేసికొని జీవిత పరమావధియగు స్వస్వరూప(ఆత్మ) సాక్షాత్కారమును బడసి ధన్యుడు కావలయును.

ఈ ప్రకారములైన సర్వజీవ సంతారణరూపములగు మహత్తర సద్బోధలను మహనీయులగు సద్గురువులు కావించుచు జనుల కుత్తేజమును గలిగించుచుందురు. వారిద్వారా ఎందఱో సామాన్యజనులు ముముక్షువు లగుదురు. ఎందఱో ముముక్షువులు ముక్తులగుదురు. శుష్కవేదాంత తవోజాలమును ప్రజల హృదయవీథులనుండి దూరీకరించుటకును, అట్లే వేదాంతభేరిని దశదిశల మార్మ్రోగించుటకును వారు కంకణము కట్టుకొందురు. అట్టి సద్గురువులను వెతకి వెతకి సంపాదించి, చిత్తశుద్ధితో వారి సేవచేసి, వారు బోధించు మోక్షమార్గమును చక్కగ అనుసరించి బ్రహ్మవిద్యను బడసి జీవితమును కృతార్థ మొనర్చుకొనవలెను.

2. ప్రకృతిని (మాయను) ఎదుర్కొనుము

ఇక మోక్షప్రాప్తికై రెండవ ఉపదేశము – 'ప్రకృతిని (మాయను – అవిద్యను) ఎదుర్కొనుము' అనునది. దొంగ ఇంటిలో ప్రవేశించినను కనిపెట్టలేనివారు కొందఱు, కనిపెట్టినను ఎదుర్కొను శక్తిలేక యుండువారు కొందఱు, ఎదుర్కొని చివఱకు వానితో ఘర్షణపడి తరిమివేయువారు కొందఱు – ఈ ప్రకారముగ జనులలో మూడుతరగతుల వారుందురు. మూడవతరగతివారు జీవన్ముక్తులు, చిత్తమందిరమున ప్రవేశించిన అహంకారాది శత్రువులతో యుద్ధము చేసి వారలను పరిమార్చి తన్మందిరమున పరమాత్మను ప్రతిష్ఠింపజేసి ఈ జీవితమున పరమానంద మనుభవించువారే అట్టి మహనీయులు. మఱికొందఱికి సరియైన ఆయుధములు లేకయు, ఉన్నను ఎదుర్కొను శక్తిలేకయు శత్రువుపై విజయమును పొందజాలక యుందురు. ఇట్టివారు పెద్దల సహవాసముచే చక్కని పారమార్థిక ఆయుధములను సమకూర్చుకొని ఏనాటికైనను శత్రువును తరిమివేయగలరు. వీరు మధ్యములు. ఇక అధములు శత్రువు ప్రక్కనే యున్నను వాని జాడ కనిపెట్టలేక తమోగుణాభిభూతులై, అజాగరూకులై అజ్ఞానాంధత్వముచే స్తబ్ధులైపడియుండి శత్రువుయొక్క దుఃఖరూప ఆఘాతములకులోనగుచు జననమరణ ప్రవాహమున పూర్తిగ తగుల్కొని యున్నవారలు. ఇక వీరి తారణము ఎప్పటికో ఆ పరాత్పరునకే ఎఱుక!

జీవుని హృదయగేహములో అజ్ఞానమను దొంగ ఎప్పుడు ప్రవేశించెనో ఎవరికినీ తెలియదు. ఆ 'ఎప్పుడు' అను ప్రశ్నకు శాస్త్రములలో సమాధానము లేదు. సమాధానముకొఱకు యత్నించుటయు కేవలము అప్రస్తుతమే యగును. జీవుడు చేయవలసిన పని ఆ చోరుని కనుగొని త్వరలో సాగనంపుటయే. అంతియే కాని తర్కవితర్కములచే కాలయాపన చేయుటకాదు. శత్రువు బహుకాలము నుండి హృదయక్షేత్రమును ఆక్రమించుకొని యుండుటచే బలమును కూడగట్టుకొని యున్నాడు. చక్కగ కాలు నిలద్రొక్కుకొని యుండుటవలన ఒక రాగాన అతడు కదలుట లేదు. తనకేవియో హక్కుభుక్తములు ఏర్పడినట్లు అతడు భావించుకొనుచున్నాడు. ఇట్టి పరిస్థితి యందు ఇక జీవుడేమి చేయవలెను? శత్రువు యొక్క బలము చూచి, శక్తిని జూచి, అపార సామర్థ్యమును జూచి బిత్తరపడి ఊరకయుండ వలసినదేనా? కాదు, అట్లెన్నటికిని చేయరాదు.

జీవునియందు అనంతశక్తి కలదు. దానిని విజృంభింపచేయవలెను. జీవుడు గొఱ్ఱెవంటివాడుకాడు. అతడు నిద్రించుసింహము. సింహముయొక్క సింహత్వమునకు ఏ కాలముననూ లోటు ఉండదు. సింహము మేలుకొనిన చాలును. అట్లే అనాదికాలమునుండి అజ్ఞాననిద్రలో పడిఉండి తనయొక్క దైవత్వమును మఱచి, కర్మబంధమున తగుల్కొని పుట్టుచు చచ్చుచు నానాయాతన లనుభవించుచున్న ఈ జీవుడు ఇపుడు నిద్రలేచి అజ్ఞానమను శత్రువును ఎదుర్కొని తన దివ్యాత్మస్వరూపమును వ్యక్తము చేసికొనవలెను. పిరికిపందయై అజ్ఞానస్థితిని, బంధదశను ఇంకను దీర్ఘముగ కొనసాగించుట ధర్మముకాదు. ఇప్పటికే బహుకాలము దాటిపోయినది. ఇక నిద్రించుట కిది తరుణము కాదు. లేచి కర్తవ్యమునకు గడంగవలెను. మాయను ఎదుర్కొనవలెను.

సామాన్యముగా లోకములో కోతిగాని, కుక్కగాని పిరికివారలను చూచినచో తరుముకొనును, ధైర్యముగ నిలబడిన వారిని చూచి పారిపోవును. అట్లే జీవునియందు గల విరుద్ధశక్తులు (Negative Forces) దుర్బలురను నానా బాధలు పెట్టును. ధైర్యవంతులకు తలయొగ్గి యుండును. మహనీయులయొక్క జీవితచరిత్రలను పరికించినచో, వారు శత్రువు యొక్క దాడులకు ఏ మాత్రము జంకక తమ శక్తి యుక్తులచే వారిని జయించి వేసిన సంఘటనలు అనేకము కానిపించుచున్నవి. ఈ నాటి శత్రువే జయింపబడినచో రేపు మిత్రుని పగిది వ్యవహరింపగలడు. అట్లే ఇంద్రియములను శత్రువులు జయింపబడినచో, అవి మనకు అనుకూలముగ ప్రవర్తించును. కాబట్టి ధైర్యమును కూడగట్టుకొని, పిరికి తనమునకు ఏ మాత్రము తావొసంగక, మాయారూప శత్రువుతో సంగ్రామమునకు దిగవలెను. మన జన్మహక్కైన ఆత్మవస్తు సంపాదనమునకై ఎన్ని త్యాగముల కైనను సంసిద్ధులై యుండవలెను. సాహసవంతుని జయము వరించియే తీరును.

In the world's broad field of battle
In the bivouac of life
Be not like dumb driven cattle
Be a hero in the strife.

అని 'లాంగ్‌ఫెలో' అను కవిసత్తముడు నుడివినట్లు ఈ విశాలజీవిత సంగ్రామక్షేత్రమందు నోరులేని మూగపశువుల వలె వ్యవహరించక ప్రచండయోధుని భంగి అపార ధైర్య సాహసములతో వర్తించవలెను. శత్రువునకు ఏకాలమందును వెన్ను చూపరాదు.

లోతుగ విచారించి చూచినచో ఈ మాయకుగాని, అజ్ఞానమునకుగాని, అవిద్యకుగాని, వాస్తవముగు అస్తిత్వములేదు. అది నీడవంటిది. మాయను జూచి భయపడుట తన ఛాయను జూచి భయపడుటవంటిదే యగును. నీడను తృణీకరించి, నిజవస్తువగు ఆత్మ ప్రకాశమువైపునకే దృష్టిని మరలించి, దానినే ఆశ్రయించినచో జన్మ కడతేరిపోవును. దైవబలమును చేకూర్చుకొనిన వారినుండి మాయ తప్పక పలాయనము చిత్తగించి వేయును. భగవంతుని ఆశ్రయించివారిని మాయ ఇక ఏమియు చేయజాలదు.

మా మేవ యే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తి తే ।

అని భగవానుడు సెలవిచ్చియే యున్నాడు. తన్నాశ్రయించినారు భయంకరమైన మాయను అవలీలగ దాటి వేయ గలరని గీతాచార్యుల హితవచనము, చేతిలో పడవ గలవారికి సముద్రముయొక్క లోతుతో పనిలేనట్లు, తన ఆత్మస్వరూపమేయగు భగవంతుని ఆలంబనమును పొందినవారు మాయయొక్క భీషణత్వమును జూచి జంకవలసిన పనిలేదు. మాయ ఎంత శక్తిమంతమైనప్పటికిని, ఆనాది కాలమునుండియు ఉన్నది అయినప్పటికిని, చీకటివంటిదే యగును. ప్రకాశము యొక్క ధాటికి అది తట్టుకొనలేదు. కావున జీవుడు ఆత్మజ్ఞానమను జ్యోతిని వెలిగించి ప్రకృతిని, మాయాతిమిరమును ఎదుర్కొని, దానిని అంతమొనర్చి భవబంధరహితుడై ఈ జీవితమునందే మోక్షసామ్రాజ్యాధిపత్యమును బడయవలయును.

3. చివరివఱకు పోరాడుము

ఇక మోక్షప్రాప్తికి గావింపబడిన మూడవ ఉపదేశము 'చివరివఱకు పోరాడుము' అనునది. సామాన్యముగా పర్వతారోహకులు శిఖరమును చేరనంత వఱకు తమ లక్ష్యము నెరవేరినదని తలంపరు. సంగ్రామమున పాల్గొను సైనికులు శత్రువు జయింపబడ నంతవఱకు తమ ధ్యేయము సఫలమైనదని భావింపరు. అట్లే అధ్యాత్మమార్గమున యత్నశీలుడగు సాధకుడు బహు జన్మలనుండియు వేధించుచున్న మాయను, అజ్ఞానమును, ప్రతీపశక్తులను పూర్తిగ తుడిచిపెట్టనంతవఱకు తన కర్తవ్యము పరిసమాప్తమైనదని తలంపరాదు. మాయ నివురుగప్పిన నిప్పువలె నుండును. మనుజుడు దానిని జయించినట్లే భావించి సంబర పడుచుండును. కాని ఇంతలో ఏదియో యొక అవకాశము చూచుకొని అది తలవని తలంపుగ వచ్చి అమాంతముగ మీదపడు చుండును.

The mind has the knack of making the aspirant feel that he is its master, while in fact it makes a hopeless fool of him.

అని ఒక మహాత్ముడు నుడివినట్లు మనస్సు జిత్తుల మారిది, తన్ను జయించివేసినట్లు తన యజమానికి అది విశ్వాసమును కలుగజేయును, కాని తృటిలో వానిని పరాభవించి తనదే పైచేయిగ గావించుకొనును. కావున సాధకులు బహుజాగరూకులై ఇంద్రియములను, మనస్సును వెయ్యికళ్ళతో కనిపెట్టి చూచుచుండవలెను. బహుజన్మార్జిత మలిన వాసనాప్రభావముచే ఇంద్రియాదులు తమకు ప్రియములైన దృశ్యవిషయములపైకే ఉరుకు చుండును. అత్తఱి విజ్ఞుడగు వాడు వివేకమను ఆయుధమును ఆశ్రయించి వానికి ఈ క్రింది విధముగ బోధించవలెను.

'ఓ మనస్సా! ఓ యింద్రియములారా! ఎన్ని జన్మల నుండి ఈ ప్రకారము విషయములవైపునకు మీరు పరుగెత్తుచున్నారు? మీకేమైన తృప్తి కలిగినదా? ఇంకను కోటానుకోట్ల జన్మలు ఈ ప్రకారముగ అనుభవించినను తృప్తి

కలుగునను నమ్మకమేమైన మీకున్నదా? విషయములవలన మీరు పొందు ఆనందము ఏ పాటిది? ఎంతసేపుండును? అది శాశ్వతమా, లేక నశ్వరమా? అవిచ్ఛిన్నమా, లేక దుఃఖమిశ్రితమా? అతుకుల బొంత వంటి ఈ అల్పసుఖముకొఱకై బహు మూల్యమైన ఈ మానవజన్మను వృథాచేయుట మీకు పాడియా? దివ్యమైన ఇట్టి అవకాశములు మఱల మఱల దొఱుకునా? అనంత బ్రహ్మానందపారావారమునకు వారసులైయున్న మీరు ఈ ప్రకారముగ కక్కుర్తిపడి అల్పవస్తువు కొఱకు జీవితమును ధారపోయుట న్యాయము కాదు. లెండు! పరాత్పరుని పాదయుగములను సేవించుటకై తత్క్షణమే కృత నిశ్చయులు కండు'!

ఈ ప్రకారముగ మనస్సునకు, ఇంద్రియములకు చక్కని హితబోధచేసి వానియొక్క దర్పమును సాధకుడు అడంచవలెను. అయితే బహుకాలమునుండి ప్రాపంచిక వాసనలు రూఢిపడి యుండుటవలన అవి వెంటనే చెప్పిన మాట వినకపోవచ్చును. అయినను ప్రయత్నమును వీడరాదు. ఏనాటికైనను తత్త్వజ్ఞానసహాయముచే వాసనాక్షయము పరిపూర్తిగ సంభవించి మనోనాశము లెస్సగ సిద్ధించినపుడే ఆత్మసాక్షాత్కారము కలుగగలదు. వాసనలు పైపైన నశించినట్లు కనిపించినను లోన వేరు పాతుకొని యుండును. తీగె ఎండిపోయినను దుంపనశింపనట్లు, సాధకుడు తాను చేయుసత్ప్రయత్నముల వలన వాసనల యొక్క ప్రకోపము ఒకింత ఉపశమించినను దానిని నమ్మరాదు. 'రసవర్జం' అని గీతాచార్యులు ఈ స్థితినే గీత రెండవ అధ్యాయమున చక్కగ వర్ణించి చెప్పిరి. వివేక వైరాగ్యాదులచే వాసనలు, దుర్గణములు, దురభ్యాసములు, విషయప్రవృత్తులు సమూలముగ తొలగిపోనంతవఱకు మనుజుడు సాధన చేయుచునే యుండవలెను. మధ్యలో నిలుపరాదు. Fight to the end చివరి వరకు పోరాడుము అను సూక్తి యొక్క భావమిదియే.

స్థిత్వాఽస్యామన్తకాలేఽపి బ్రహ్మనిర్వాణమృచ్ఛతి

అని శ్రీకృష్ణపరమాత్మ గీత రెండవ అధ్యాయమున బ్రాహ్మీస్థితినిగూర్చి వర్ణించు సందర్భమున సాధకులకు చక్కని హెచ్చరిక చేసియున్నారు. 'ఓ సాధకులారా! పరమార్థ సాధనను అంత్యకాలమువఱకు, దేహావియోగ సమయమువఱకు నిలుపరాదు. మాయ టక్కులమారిది. మహా శక్తిమంతమైనది. ఎప్పుడెప్పుడు సాధకుని పడగొట్టుదునాయని అది పొంచియుండును. కాబట్టి సాధకులారా! ఏమరుపాటులేక శత్రువుతో చివఱివరకు పోరాడి జయించుడు.

జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్

భయంకరమైన ఈ కామక్రోధాదిరూప శత్రువును విచారణాబలముచే జయించివేయుడు. అభ్యాసముచే దానిని పారద్రోలుడు. ఇక్కార్యమున ప్రమత్తతగాని, పరాకుగాని, అలసత్వముగాని పనికిరాదు. అంత్య కాలమువఱకు కూడ సాధనవిషయమై బహుజాగ్రత్తగా నుండుడు' అని భగవానుని హితోపదేశము.

పరుగిడు పందెములో ఏ కొద్దిమందో పాల్గొందురు. పాల్గొనిన కొద్దిమందిలో మధ్యలోనే కొందఱు నిలిచిపోవుదురు. చివరివఱకు పోరాడి పందెము గెలుచుకొనువారు ఏ ఒకరిద్దరో ఉందురు. వారే ధీమంతులు. విజయలక్ష్మిని వరించువారు వారే. అట్లే అధ్యాత్మక్షేత్రమునను అకుంఠితమగు దీక్ష, అప్రతిహిత అధ్యయవసాయము, తీవ్రమగు పట్టుదల, ఆత్మవిశ్వాసము కలవారుమాత్రమే మాయతో చివరి వఱకు పోరాడి విజయశ్రీని చేపట్టుదురు.

అనేకమంది మోక్ష ప్రాప్తికై యత్నములు చేయు చుండినను, కడవఱకు పోరాటమును సాగించుచు నిలిచిన, ఏ ఒకానొక ధీరుడో విజయవంతుడు కాగలుగుచున్నాడు. 'కశ్చిద్ధీరః ప్రత్యగాత్మానమైక్షత్' – విషయ విరక్తి కలిగి అంతర్ముఖుడైన ఒకానొక ధీరుడు మాత్రమే ప్రత్యగాత్మను చూడగలుగుచున్నాడని ఉపనిషత్తులున్ను ఘోషించుచున్నవి.

కాబట్టి ముముక్షువు లక్ష్యప్రాప్తివఱకు తన పోరాటమును సాగించుచునే యుండవలెను. ఒక జన్మకాలము పట్టినను, రెండు జన్మలకాలము పట్టినను, అనేక జన్మలు పట్టినను మోక్షము పొందువఱకు ప్రయత్నమును విరమించరాదు. లోకమున అధములు దైవకార్యమును ప్రారంభించనే ప్రారంభించరు. మధ్యములు ప్రారంభించి విఘ్నములు తటస్థించినను తాము ప్రారంభించిన సత్కార్యమును దైవకార్యమును విడువనే విడువరు. పరమార్థ సాధకులు ఉత్తములవలె వ్యవహరించి గొప్ప పట్టుదలతో లక్ష్యమగ భగవత్సాక్షాత్కారమును ఎటైనను సాధించియే తీరవలెనుగాని, పిరికిపందలై మధ్యలోనే విరమించి పెద్దల దృష్టిలో హాస్యాస్పదులు కారాదు.

వాసనలు, అగ్ని, ఋణము, రోగము, శత్రువు, విషము అనునవి ఏ కొంచెము మిగిలియున్నను బాధించుచునే యుండును. వానిని సమూలముగ తొలగించవలెనని నీతిశాస్త్రము బోధించుచున్నది. కావున అనాది మాయారూపశత్రువును, అజ్ఞానవైరిని హృదయగేహమునుండి తరిమి వైచుటలో ఏ మాత్రము వెనుకాడక, అతడు పూర్తిగ వైదొలగనిదే శాంతిని ఏకాల మందును నోచుకొనలేమని దృఢముగ నమ్మి అక్కార్యమును సాధించుటకు ఈ జన్మయే చక్కటి అవకాశమని విశ్వసించి, దైవముపై పరిపూర్ణ విశ్వాసముంచి, మాయతో, ప్రకృతితో కడవఱకు పోరాటము సాగించి, విజయశ్రీని చేపట్టి ఆత్మసాక్షాత్కారముచే పరమానందమును అనుభవించవలెను.

4. జగన్నాటకమును అంతమొనర్చుకొనుము

ఇక మోక్షప్రాప్తికై నాలుగవ ఉపదేశము – 'జగన్నాటకమును శీఘ్రముగ పరిసమాప్తము గావించుకొనుము' అనునది. శిరస్సుపై కట్టెలమోపు పెట్టుకొని పోవుచుండు గ్రామస్థుడు దానిని ఎప్పుడు క్రిదకు దింపి భారమును తొలగించుకొందునా యని తహతహ పడుచుండును. పగలంతయు పనిచేయు ఉద్యోగి ఎపుడు సాయంసమయేతెంచునా యనియు, కార్యభారము ముగించుకొని ఇంటికి వెళ్ళి హాయిగా ఎపుడు కాలము గడుపుదునా యనియు పరితపించుచుండును. కాని చిత్రమేమనగా కోట్లకొలది జన్మలందు పుట్టుచున్నను చచ్చుచున్నను, దేహభారమును మోయుచున్నను, తద్ద్వారా దుఃఖభారమును వహించు చున్నను జీవుడు ఆ భారము ఎపుడు తొలగిపోవునాయని ఆలోచించుట లేదు. పైపెచ్చు అజ్ఞానముచే దేహముతో,ఇంద్రియములతో, మనస్సుతో చేయరాని పనులు చేయుచు జన్మబంధనమును ఇంకను దృఢతర మొనర్చుకొనుచున్నాడు. దుఃఖభారమును ద్విగుణీకృత మొనర్చుకొనుచున్నాడు. ఈ జగన్నాటకమును అంతులేకుండ కొనసాగించుచున్నాడు. ఇది అత్యంత శోచనీయము.

All the world is a stage
And all the men and women merely players
They have their exists and their entrances

'ఈ ప్రపంచమంతయు ఒక మహానాటకరంగము. పురుషులు, స్త్రీలు అందఱును ఆ నాటకమందలి పాత్రధారులు. వారు రంగస్థలముపైకి వచ్చుచుందురు. పోవుచుందురు'. అని షేక్స్పియర్ మహాకవి నుడివినట్లు ఈ

విచిత్ర జగన్నాటకరంగములో జీవుడు వేయని వేషము లేదు. ధరించిన పాత్రలేదు. ఎనుబదినాలుగులక్షల రూపములు ధరించి ఈ విశ్వరంగస్థలిపై అతడు అనాది కాలమునుండి అభినయ మొనర్చుచున్నాడు. కాని విసుగుపుట్టలేదు. ఈ వేషధారణకు స్వస్తిచెప్పి తనకు తానై మిగిలి పరిపూర్ణసుఖమనుభవించు భాగ్యము నోచుకొనలేదు. ఇప్పటికే కాలము మీరిపోయినది. బంధవిముక్తినిగూర్చి తేల్చుకొనవలసిన అపూర్వ మానవజన్మ ఏతెంచినది. భగవంతుడు ఎంతయో విజ్ఞాన మొసంగినప్పటికిని మనుజుడు బంధనమును దృఢపఱచుకొని బుద్ధిపూర్వకముగ గోతిలోపడుటకే సిద్ధపడుచుండుట హాస్యాస్పదమైన విషయము. ఇకమీదటనైనను మానవుడు తన విజ్ఞతను ఉపయోగించి ఈ జన్మ పరంపరకు ఉద్వాసన చెప్పుట శ్రేయస్కరము. ఈ అనాది జగన్నాటగకమున కింతటితో భరతవాక్యము పలికి, తాను ధరించు అగణిత వేషముల కొక నమస్కారము చెప్పి, జీవుడు తన సహజ నిర్వికల్పస్వస్వరూపాత్మయందు స్థితిగల్గి పరిపూర్ణశాంతి ననుభవించుట యుక్తము.

శాంతి బాహ్యవస్తువులనుండి లభించునదికాదు. అట్లు లభించునని తలంచుటయు కేవలము వెఱ్ఱి. శాంతి సుఖములు బయటనుండి కూరబడునవికావు. అవి లోపలనుండియే ఊరునట్టివి. ఒకవేళ బయటనుండి ఒకింత శాంతిగాని, సుఖముగాని, లభించినట్లు తోచినను అది ఎల్లకాలము నిలువదు. మఱుక్షణమే అదృశ్యమై భయంకరదుఃఖరూపముగ పరిణమింపజీవుడు దానిచే సతమతమైపోవును. కావున ఆత్మశాంతియే పరిపూర్ణ శాంతి. పదార్థజనితశాంతి కేవలము భ్రాంతిమాత్రమే యగును.

రాత్రి గాఢనిద్రలో జీవుడు అవిచ్ఛిన్నముగ కొంతసేపు సుఖమనుభవించుచున్నాడు గదా! ఆ సుఖ మెక్కడ నుండి వచ్చినది? బయటనుండియా? కాదు. దేహము, ఇంద్రియములు, మనస్సు అత్తఱి లయించియుండుట వలన ఆ సుఖము బాహ్యపదార్థ జనితముకాదనుట స్పష్టము, అది అంతరము నుండియే ఆవిర్భవించినది. జడమైన సుషుప్తియందే అంతటి ఆనందము, శాంతి మానవునకు లభించుచుండ ఇక చైతన్య వంతమగు సమాధి స్థితియందాతని కెట్టిమహోన్నత శాంతి లభించునో ఊహించుకొనవచ్చును. అదియే ఆత్మశాంతి. అది అపరిచ్ఛిన్నమైనది. అదియే మన జన్మహక్కు, అదియే మన స్వస్వరూపము, భక్తి, జ్ఞాన, వైరాగ్యముల ద్వారా ఇంద్రియములను, మనస్సును చక్కగ నిగ్రహించుకొనుటద్వారా అట్టి స్వస్వరూపశాంతి జీవునకు తప్పక లభించగలదు. ఏ నిర్వికల్ప ఆనందమును జీవుడు సుషుప్తియందు తెలియకుండ అనుభవించుచున్నాడో, దానిని జాగ్రత్తునందు తెలిసి అనుభవించుటయే సమాధిస్థితి యగును. ఇంద్రియ మనస్సంయమాదులచేతను, చక్కని విచారణ చేతను, దృశ్యమునందు విరక్తి భావము జనింప, మనస్సు అంతర్ముఖము కాగా ఇట్టి సమాధి సుఖము, పూర్ణవిశ్రాంతి జాగ్రత్తునందే జీవునకు చక్కగ లభింపగలదు. కావున అద్దానికొఱకే ముముక్షువు లెస్సగ పాటుపడి గమ్యస్థానమగు పరమాత్మను శీఘ్రముగ చేరుకొనవలెను.

సామాన్యముగ దూరప్రయాణము చేయునపుడు యాత్రికుడు కొద్ది సామానును మాత్రమే తన వెంట తీసికొని పోవుచుండును. ప్రయాణము సల్పువాడు తనవెంట భారమును ఎంత తగ్గించుకొనిన అంత హాయిగా ప్రయాణము సలుపగల్గుచుండును.

Less luggage makes travel a pleasure

అని రైల్వే అధికారులు ఈ సత్యమునే ప్రయాణీకులకు చక్కగ ఉద్బోధించుచున్నారు. అట్లే

జీవుడుఆనాదికాలము నుండి చేయుచున్న ఈ జననమరణరూప దీర్ఘ సంసారయాత్ర యందు మనస్సు, దేహము, భోగపదార్థములు - ఇత్యాది రూప దృశ్యవస్తువులను గూర్చిన సంకల్పములను ఎంత తగ్గించు కొనిన అంత శాంతిని, సుఖమును బడయగల్గు చుండును. అపుడే మోక్షరూప గమ్యస్థానమును జీవుడను పాంథుడు ఆనందముగ చేరుకొనగల్గును. సంకల్ప భారము తగ్గుటయే, లేక తొలగుటయే శాంతికి ఏకైక మార్గము. పూర్ణశాంతికి వేఱొక ఉపాయ మెద్దియు లేదు. అనాత్మరూపములైన దేహాది దృశ్యపదార్థముల యెడల విరక్తిగలిగి, ఆత్మయందు ఆసక్తిని పెంపొందించుకొని అట్టి ఆత్మయందు మనస్సును స్థాపిత మొనర్చుటయే పూర్ణశాంతికి ఉపాయము.

కాబట్టి ఉదయము నిద్రలేచినది మొదలు రాత్రి పరుండువరకును లోకవ్యవహారము లనేకము లున్నప్పటికిని అవకాశమును కలుగజేసికొని ఆత్మను గూర్చియే చింతించుచు, ధ్యానించుచు, తదేకనిష్ఠుడై మెలగుచు తద్ద్వారా అవిచ్ఛిన్న సుఖమును, పరిపూర్ణ శాంతిని జీవుడు పడయవలెను. ఈ మానవజీవితమునే చరమజన్మగ నొనర్చుకొని, జగన్నాటక వేషముల కింతటితో తిలాంజలి యొసంగి అనాది కాల సంసార దుఃఖజాలమును విచ్ఛిన్న మొనర్చివైచి ఆత్మస్థితుడై బ్రహ్మానందమనుభవించవలయును. అదియే కైవల్యస్థితి. అదియే పరమపురుషార్థమగు మోక్షము.

అన్నమయకోశములో నివసించువారు మృగప్రాయులు. వారు శరీరమును మాత్రమే చూచుకొందురు. ప్రాణమయకోశములో ఉండువారు సగము మృగత్వము, సగము మానవత్వము కలిగిఉందురు. మనోమయకోశమును చెందియుండువారు పూర్ణమానవత్వమును పొందుదురు. సామాన్యముగా గృహస్థాశ్రమములో ధర్మబద్ధముగా గడుపుచు మనస్సును నిగ్రహింప యత్నించుదురుగాని నిగ్రహింపలేరు. విజ్ఞానమయ కోశమును చేరుసరికి సగము మానవత్వము, సగము దేవత్వము సంప్రాప్త మగును. మనసు కొంత వశమై బుద్ధిరాజ్యము జరుగుచుండును. గృహస్థాశ్రమములో ఉన్నకొంత శ్రద్ధమాత్రమే దానియందుండి మిగతా శ్రద్ధ ఆధ్యాత్మ విషయములందు గడుపును, సగము ధనము కుటుంబమునకు, సగము దైవకార్యములకు ఖర్చుపెట్టును. ఆనందమయకోశము పూర్ణదేవత్వము, వాడు ఎల్లప్పుడు దైవకార్యములే చేయును. వానికి దుఃఖములు పోవును. అతడు ఆత్మరాజ్యములోనికి వెళ్ళును. వ్యష్టికి సాక్షిగా ఉండును. దైవగుణములన్ని అవలంబించుచు సత్త్వగుణ ప్రధానుడై, సత్సంకల్పములు మాత్రమే కలిగియుండును. ఆనందమయకోశముకూడా కోశమే కాని అది శుద్ధకోశము, పూర్ణముగా ఆత్మసాక్షికాదు. అదికూడా దాటినప్పుడు పూర్ణ ఆత్మస్థితి కలుగును. అప్పుడు సమష్టికి సాక్షిగా నుండును, సత్సంకల్పము కూడా తొలగును. పరమశాంతి స్థానము. త్రిగుణములు పోవును. ఇది జీవం పోయి శివం అయిన స్థానం, కాని యీస్థితిలో అన్ని క్షేత్రములలో ఉన్న క్షేత్రజ్ఞుడు అని భావము ఉన్నది. సమష్టి అనునది ఒకటి. అందుకు సాక్షి ఒకటి. రెండూ ఒకటే అను అవస్థలోనుండు వారే పరబ్రహ్మస్థాన మందుండువారు.

- శ్రీ మలయాళస్వామి



గీతలో శ్రీకృష్ణాశయము

- శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

గీతను చదువునపుడు ఒక సందేహము ఆవిర్భవించినది. గీతాశాస్త్రము నిష్కామకర్మయోగ, దైవోపాసనాయోగ, ధ్యానయోగ, జ్ఞానయోగములతో గూడినదని ప్రజ్ఞాశాలు రందరియొక్క మతము. వానిలో కర్మయోగమునే శ్రీ కృష్ణభగవానుడుపదేశించెనని కొందరున్ను, భగవదుపాసనయే చెప్పడమైనదని మరికొందరున్ను, ధ్యానయోగమునే తెలిపినట్లు ఇంక కొందరున్ను, జ్ఞానయోగమునే వచించినట్లు వేరొక కొందరున్ను తెలుపుచున్నారు. ఈ నాలుగింటికి కావలసిన ప్రమాణములు గీతలో ననేకములు గలవు. సరి, ఇట్లుండుగాక. ఏ గ్రంథమును పరిశోధించినా, అది నిష్కామ కర్మను గురించియో, భక్తిని గురించియో, యోగమును గురించియో, జ్ఞానమును గురించియో తెలుపుచుండును. ఇదొక ధర్మము.

భగవద్గీత యోగచతుష్టయమును బోధించినను అది ఒక్కొక్క అధ్యాయమున ఒక్కొక్కదానిని గురించి మాత్రమే చెప్పక ప్రతి అధ్యాయములోను కర్మ, భక్తి, యోగ, జ్ఞానములను గురించి తెలుపుటకు కారణమేమి? ఇదే సంశయమునకు కారణము. అయితే కృష్ణభగవానుడు మానవుల ప్రజ్ఞకు అతీతుడని చెప్పుటలో నెవరికిన్ని సంశయము కలుగదు. కావున నాలుగింటిని అన్ని అధ్యాయములలోను కలిపి చెప్పుటలో దీనియందు నిగూఢమైన తత్త్వమొకటి యుండియే తీరవలయును. అట్లు కానిచో కర్మయోగమును గురించి కొన్ని అధ్యాయములు, భక్తియోగమును గురించి మరికొన్ని అధ్యాయములు, ధ్యానయోగమును గురించి వేరుగా కొన్ని అధ్యాయములు, జ్ఞానయోగమును గురించి ప్రత్యేకముగా కొన్ని అధ్యాయములు చెప్పియుండినచో పై చెప్పిన సందేహము జనించుటకు అవకాశము ఉండెడిది కాదు. నాలుగుయోగములున్ను కాండత్రయాత్మకమగు వేదమందంతర్భూతములు. అయితే వేదము కాండత్రయాత్మక మగుటచేతనే వేదసారమగు గీతయున్ను కాండయాత్మకముగా చేయుటకు కారణమని ప్రజ్ఞాశాలుర మతమని లోకము తెలుపుచున్నది. ప్రథమషట్కమగు ఆరధ్యాయములు నిష్కామకర్మయోగమును బోధించెననియు, ద్వితీయషట్కమగు ఏడు నుండి పన్నెండు అధ్యాయములు ఉపాసనను చెప్పెననియు, తృతీయషట్కమగు 13వ అధ్యాయము నుండి 18వ అధ్యాయము వరకు గల భాగము జ్ఞానకాండము గురించి బోధించెననియు మహా మహనీయుల యొక్క ఆశయము.

అయితే అప్పుడు కాండత్రయమున కర్మ, భక్తి, జ్ఞానములను గురించి చెప్పినారే గాని నాలుగవదగు ధ్యానయోగమును చెప్పకపోవుటకు కారణవేమని మరికొందరు చింతనాశీలురు ఆలోచించుచున్నారు. అయితే ధ్యానయోగము, భక్తియోగములో అంతర్భూతమని విజ్ఞానశాలుర మతము. "ఈశ్వర ప్రణిధానాద్వా' అని పతంజలి మహాయోగిపుంగవుని యొక్క సూత్రము. ఈ సూత్రములోని ఈశ్వరప్రణిధానమనగా సర్వేశ్వరార్పిత

సంపూర్ణ చిత్తమనియే అర్థము కనబడుచున్నది. యోగుల మత ప్రకారము ఈశ్వరానుగ్రహము వల్లనే యోగసిద్ధి, ఆత్మసిద్ధి, జీవన్ముక్తి, కైవల్యప్రాప్తి గలుగవలెనని సిద్ధాంతము. ఉపాసనామార్గము యొక్క సిద్ధాంతమున్ను ఇదియే. ఇది యోగీశ్వరులచే అంగీకృతము. కావుననే ప్రథమ షట్కాంతమున ఆరవ అధ్యాయమున ఆత్మసంయమయోగము చెప్పిన తరువాత ఉపాసనాపరమగు భక్తియోగము ద్వితీయషట్కాంతమున జ్ఞానవిచారణలో ప్రవేశించుటకున్ను హేతువని బ్రహ్మవేత్తల మతము సరి.

అదెట్లయినప్పటికిన్ని విరోధము లేదు. సరిపుచ్చుకొనవచ్చును. సందేహమునుకు కారణము ఈ యధ్యాయములలో నెచ్చుటను వర్ణించియుండలేదు. అట్టి సంశయనివృత్తియే యిప్పుడు మనకు కావలసినది. అప్పుడే శ్రీ కృష్ణభగవానుని యొక్క ఆశయము వెలువడగలదు. ఈ అధ్యాయములలో కర్మ, భక్తి, యోగ, జ్ఞానములను చెప్పని అధ్యాయమే కనుపించదు. దీనివల్ల ఈ నాలుగున్ను ఎల్లరకున్నుఎప్పుడున్ను కలిసియుండవలెనని శ్రీ కృష్ణ భగవానుని ఆశయమని తోచుచున్నది. వాస్తవముగా నీ నాలుగున్ను ప్రతి జీవన్ముక్తునికిని ఉండియే ఉంటున్నవి. వారిని ఆదర్శముగ చేసుకొని ముముక్షువులును ఈ యోగచతుష్టయమును తప్పనిసరిగా ఆచరణలో నుంచవలెననియే శ్రీ కృష్ణభగవానుని మతమని హృదయమున స్ఫురించుచున్నది.

అంతియే గాక మలవిక్షేప ఆవరణము లనెడు మూడు దోషములు ప్రతిజీవునకున్ను ఉండియే ఉన్నవి. నిష్కామకర్మయోగముచే మలనివృత్తియు, ఉపాసనా యోగముచే విక్షేపనివృత్తియు, జ్ఞానయోగముచే ఆవరణ నివృత్తియు ప్రతిజిజ్ఞాసువునకున్ను పరంపరగా గలిగియే ఉండును. ఉపాసనాయోగమందు ధ్యానయోగము అంతర్భూతమై ఉండునని యిదివరలో నిర్ణయించడమైనది.

అయితే పూర్వజన్మ సంస్కారము ననుసరించి అనగా అష్టాంగయోగ భూమికలలో ఒకటిగాని, నాలుగుగాని, ఏడుగాని భూమికలు ఇదివరలో పొందియుండవచ్చును. ఆలాగున జ్ఞానభూమికలో శుభేచ్ఛ, సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థాభావన అది సప్త భూమికలలో గడచిన జన్మములలో ప్రవేశించియుండిన సంస్కారజీవులు గూడ వర్తమాన యుగములో పుట్టి యుండవచ్చును. కావున అందరికిన్ని ఈ జన్మములో నాలుగు యోగములున్ను అనుష్ఠించియే తీరవలెనని నిర్ణయించుటకు అవకాశము లేదు. అది వారి వారి అనుభవములచే వారు వారు తెలుసుకొనవలసినదేగాని యింకొక్కరికి నిర్ణయించుటకు అధికారము లేదు. అయితే ఆత్మదృష్టి గల గురువరేణ్యుడైనచో నితరుల సంస్కారమును తెలుసు కొనగలరు. మరల సామాన్యముగా యోగదృష్టి గలవాడైనచో పై జెప్పిన వారల యొక్క వర్తనము చేతను తెలుసుకొనగలుగును. ఈ విషయము ఇంత మాత్రము చాలును. ఎట్లయినను కట్టకడపటి సిద్ధాంతమేమన జీవుల హృదయస్థమగు పైన నిరూపించిన దోషత్రయము తొలగక, ముక్తిమాత్రము గలుగదు. ఇది యొకటే మనము గ్రహించిన చాలును.

జీవన్ముక్తుడై కనబడినవానిలో జ్ఞానముగాని, యోగముగాని, ఉపాసనగాని, నిష్కామకర్మయోగముగాని ఒకటి ముఖ్యముగా లేక అధికముగా కనబడినను, తప్పనిసరిగా తక్కిన మూడు యోగములున్ను గౌణముగా కనబడకపోవు. అది వారి సంస్కారము. అంతే మనము చెప్పవలసినదిగాని, అట్లుండవలెను, ఇట్లుండవలెను అని శాసించుటకు మనకు అర్హతలేదు. మనమేమి? వేదమునకే అర్హత లేదని శాస్త్రము చెప్పుచుండగా మనమా దానిని నిర్ణయించువారము? ఈ నాలుగు యోగములున్ను సృష్ట్యారంభమునుండి జీవుల సంస్కారము ననుసరించి సర్వేశ్వరుడే యేర్పరచినట్లు శాస్త్రములు ఉద్ఘోషించుచున్నవి.

కావున నాలుగు యోగములున్ను ప్రతిమహాత్మునియందును హెచ్చుతక్కువలుగా కనబడుచునే యున్నవి. అట్లుండ వలెననియు భగవానుని యొక్క ఆశయము.

అట్లయిన ఏసంస్కారముగల జీవులకైనా అట్టి మహాత్ముని ఆశ్రయించి తరించుటకు అవకాశము గలుగును. అంతే గాదు, బ్రహ్మవేత్తలలో గూడ హెచ్చుతక్కువలను భావము ఆ మహనీయాత్ములకు గూడ నుండదు. లేనిచో నేను ఎక్కువవాడను. నాది జ్ఞానయోగము, మరియొకడు ఉపాసనాయోగము గలవాడు ఇంకొకడు నిష్కామకర్మయోగి అను నిటువంటి భేదములు జనించును. భేదమెచ్చట జనించునో అచ్చట తప్పనిసరిగా బాధయున్ను గలుగకపోదు. ఈ కారణములు అన్నియు ఆలోచించుకొనియే శ్రీకృష్ణభగవానుడు సర్వజనులు తరించవలెనను ఆశయముతో గీతాశాస్త్రమును నిర్మించెను. నదులు ఏ దిక్కులలో ప్రవహించినను, కట్టకడకు ఏకమగు మహాసముద్రములో పోయి చేరునట్లు పై నిరూపించిన నాలుగు యోగములలో కట్టకడపటి వరకు వెళ్ళిన అనంతమగు జ్ఞానసాగరములో అందరున్ను ప్రవేశించి అమృతత్వము నొందగలరు.

వ్యష్టికి బుద్ధికి పరముగాను, సమష్టికి మాయకు పరముగాను దాటి వెళ్ళినచో అచ్చట ఏకమైన సత్తుమాత్రమే ఉండును. భూమియొక్క సరిహద్దు దాటిపోయినతరువాత అన్ని నదులున్ను సముద్రములో చేరునట్లు ఉపాధి ద్వయములను భేదించి వెళ్ళినచో అచట " ఓం తత్ సత్" అనేదొకటి మాత్రమే నిలుచును. భూమిని దాటిన పిమ్మట నదియొక్క నామరూపములు మాయమైపోయి అనేక దిక్కులనుండి ప్రవహించి, ప్రవహించి వచ్చిన నదులన్నిటియొక్క భేదమును స్ఫురింపజేసెడు భావముపోయి అభేదమైన ఒకే జలమే అన్ని నదులున్ను పొందినట్లు మనము గూడ నేదైన ఒక మార్గమును ఆధారము జేసికొని కడవరకు వెళ్ళిన అఖండమైన దైవమును లేక బ్రహ్మమును పొందగలము. ఈ విషయమై శ్రుతి స్మృతులు అనంత ముఖములతో నుద్ఘోషించుచున్నవి. అదంతయు వ్రాసిన నీ చిన్నవ్యాసము చాల పెరిగిపోవును. వాటిని ఇదివరలో వ్రాసిన గ్రంథములలో చాల వరకు నిరూపించడమైనది. ఇక కాండత్రయాత్మకమే వేదమనియు, వేదసారమగు గీతయు కాంత్రయాత్మక మని కొంచెము నిరూపించవలసియున్నది. ఇచ్చట శ్రీమధుసూదన సరస్వతీస్వాములవారు గీతావ్యాఖ్యానమునందు నిరూపించినది చూడుడు.

సహేతుకస్య సంసారస్యాత్యంతో పరమాత్మకమ్ ।
పరం నిశ్శ్రేయసం గీతాశాస్త్రస్యోక్తం ప్రయోజనమ్ ॥

సచ్చిదానందరూపం తత్పూర్ణం విష్ణోః పరం పదమ్ ।
యత్ప్రాప్తయే సమారబ్ధా వేదాః కాండత్రయాత్మకాః ॥

కర్మోపాస్తి స్తథా జ్ఞానమితి కాండత్రయం క్రమాత్ ।
తద్రూపాష్టాదశాధ్యాయైర్గీతా కాండత్రయాత్మికా ॥

సహేతుకమైన సంసారముయొక్క నివృత్తిరూపకమైన మోక్షము నొసంగుటయే గీతాశాస్త్రమునకు పరమ ప్రయోజనమని చెప్పబడినది. సచ్చిదానంద రూపమగు పరిపూర్ణ పరమపద ప్రాప్తికొఱకే వేదములు గూడ కాండ త్రయాత్మకముగా నారంభింపబడినవి. కర్మ, ఉపాసనా, జ్ఞానకాండములని వానికి పేర్లు. ఆ వేదరూపమై అష్టాదశాధ్యాయములతో గూడిన భగవద్గీతయు, క్రమముగా కర్మ, ఉపాసనా, జ్ఞానకాండ త్రయాత్మకమై యున్నది. మరియు ఈ భగవద్గీత సర్వశాస్త్రమయీ అని తెలుపునట్టి నీలకంఠ వ్యాఖ్యను చూడుడు.

భారతే సర్వవేదార్థో భారతార్థశ్చ కృత్స్నశః ।
గీతాయామస్తి తేనేయం సర్వశాస్త్రమయీ మతా ॥

సమస్త వేదార్థములును భారతమునందున్నవి. ఆ భారతార్థమంతయు గీతయందున్నది. అందువలననే గీత సర్వశాస్త్రమయీ అని చెప్పబడినది.



గీత వ్యవహారమును వేదాంతస్థాయికి కొనిపోవును

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

" కర్మ చెడ్డది కాదు. వ్యవహారము దూష్యము కాదు. నీ దృష్టిని పవిత్రమొనర్చుకొనుము. అత్తఱి నీవు చేయుకర్మ మహాయజ్ఞమై భాసించును. నీ భావమును శుద్ధ పఱచుకొనుము. అత్తఱి నీవు చేయు వ్యవహారము నిశ్శ్రేయసకరమై చెన్నొందును" - అని గీత ఘోషించుచున్నది. కర్మ చేయక ఒక క్షణమైనను మనుజు డుండజాలడు. కావున కర్మను దూషించుచు, నిషేధించుచు, చేయు బోధలు సామాన్యునకు ప్రయోజనకరముగ నుండవు.

పైగా అట్టి బోధలచే నతడు అకర్మణ్యుడుగ, జడప్రాయుడుగ తయారగును. జీవితము నిరర్థకమైపోవును. లోకములో నూటికి తొంభై తొమ్మిది మంది గృహస్థులుగను, బ్రహ్మచారులుగ నున్నారు. వారు కర్మను పరిత్యజింపలేరు. సర్వసంగపరిత్యాగము చేసి ఏకాంతమున కాలముగడుపు, సంన్యాసులు, సాధువులు చాల అరుదుగా నున్నారు. కావున ఎక్కువ మందికి ఉపకరించు బోధయే ఇపుడు కావలసి యున్నది. ఈ విషయములన్నియు గీతాచార్యులు చక్కగ ఆలోచించి, వ్యవహారమును దూషింపక, దానిని పవిత్ర మొనర్చు ఉపాయముల నన్వేషింప దొడగిరి. మఱియు అట్టి వ్యవహారము ద్వారా కర్మాచరణ ద్వారా చిత్త శుద్ధిని సంపాదించి క్రమముగ జ్ఞానానుభవమును బడసి మోక్షమును జెందవచ్చునని వారు బాహాటముగ ప్రకటించిరి.

"స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విన్దతి మానవః " (18-46) 'తమ తమ కర్మల ద్వారా, పరమాత్మ నర్చించి మానవుడు ముక్తినొందగలడు" అని భగవానుడు వాక్రుచ్చిరి. ఇందులకు ప్రబల దృష్టాంతము అర్జునుడే యగును. ఏలననిన, 'నేను యుద్ధముచేయను, నాకు రాజ్యము వలదు, జోలె తీసికొని ఏకాంతమునకు బోయి భిక్షాన్నము భుజించుచు కాలక్షేపము చేసెదన' ని పలికిన అర్జునుడు శ్రీ కృష్ణమూర్తి యొక్క దివ్య బోధలచే కర్మరంగమున దుమికి, యుద్ధముచేసి, 'నేనేమియు చేయలేదు' అను నిర్లేపభావము కలవాడై, భయంకర సంగ్రామమును పవిత్ర యజ్ఞముగా మార్చి వైచెను. శ్రీ కృష్ణుని ముందుపెట్టుకొని అర్జునుడు యుద్ధమను వ్యవహారమును నడిపెను. వ్యవహారము మోక్షసోపానముగ పరిణమించుటకు ఉపాయ మిదియే (భగవదున్ముఖత్వమే) అయియున్నది. భగవంతుని స్మరించుచు ఆ కార్యమును చేయుటయే ముక్తికి మార్గము.

'మామనుస్మర యుధ్యచ' నన్ను స్మరించుచు యుద్ధము చేయుము' - ఇదియే కర్మరహస్యము. యుద్ధము చేయుట గొప్పది కాదు. దేవుని స్మరించుచు యుద్ధము చేయుట గొప్పది. ఫలమును ఈశ్వరార్పణము చేసి కార్యమొనర్చుట గొప్పది. అపుడు 'కర్మ' కర్మగా నుండక 'కర్మయోగము' గా మారిపోవును(Work will be transformed into worship). అత్తఱి ఏకాంతమున సమాధి నిష్ఠయందుండు యోగిపుంగవునకు, ప్రపంచమధ్యమున వివిధ కార్యకలాపములందు నిమగ్నుడగు కర్మిష్ఠునకు ఒకే ఫలము లభించును. ఆత్మశాంతి యిరువురికిని సంప్రాప్తించును, భగవద్గీత బోధించిన తత్త్వమిదియే. లోకములో కొన్ని శాస్త్రములు కర్మను పూర్తిగా నిషేధించుచున్నవి. ఆవి నివృత్తిమార్గమునే ఎక్కువగ పోషించుచుండును. మఱికొన్ని శాస్త్రములు కర్మను లెస్సగ ప్రోత్సహించుచున్నవి. అవి ప్రకృతినే ఎక్కువగ బలపఱచు చుండును. కాని గీత అటు ప్రవృత్తికాక, ఇటు నివృత్తికాక మధ్యే మార్గమును కనిపెట్టినది. అది అందఱికిని ఆచరణయోగ్యముగ నున్నది. శరీరము ప్రవృత్తియందున్నను మనస్సును నివృత్తియందుంచుకొనుము(Hands in the society and head in the forest) - అని గీత బోధించు చున్నది. ఈ గీతా భావము నాధారపఱచుకొనియే జనకుడు రాజ్యమేలెను. విష్ణుమూర్తి ముల్లోకములను పాలింపగల్గిరి. ఇవ్విధముగ వేదాంతులు సామాన్యముగ ఏవగించుకొను చుండు లోకవ్యవహారమునకు గీతాచార్యులు క్రొత్తరూపమిచ్చి దానికి పరమార్థస్థాయిని కల్పించిరి. ఇట్టి అపూర్వ సిద్ధాంత మును మున్నెవరును ఏ శాస్త్రమున్ను ప్రతిపాదించలేదు. కనుకనే గీతకును, గీతాచార్యులకును ఇంత ఘనత చేకూరినది.

గీత యందు సర్వయోగసమన్వయము

లోకమున కర్మమార్గావలంబులు, భక్తిమార్గావలంబులు, యోగమార్గావలంబులు, జ్ఞానమార్గావలంబులు అను నీ ప్రకారముగ అనేకులు అధ్యాత్మక్షేత్రమున కలరు. కాని, వారిలో కొందఱు తమ మార్గమే గొప్పదనియు, తక్కినవి నికృష్టములనియు వాదించుచుందురు. తమ తమ వాదములను బలపఱచుటకై వారు కొన్ని ప్రమాణములను గూడ చూపుచుందురు. ఈ ప్రకారముగ స్వమతసంస్తుతి, పరమత విద్వేషము, స్వమార్గ పరిపోషణము, అన్యమార్గ విమర్శనము, ప్రపంచమున అమలులోనుండుటజూచి అద్దానిని దూరీకరించుటకై శ్రీ కృష్ణభగవానుడు గీతావతరణమునుగావించి సర్వమత సమన్వయతత్త్వమును దానిద్వారా జనులలో వ్యాపింపజేసిరి. మోక్షసౌధమునకు కర్మ, భక్తి, ధ్యానము, జ్ఞానము అను నాల్గున్ను నాల్గు ద్వారములనియు, ఏ ద్వారము గుండా వెళ్ళినను ముక్తిప్రాసాదములోనికి చేరుకొనవచ్చుననియు వారు నుడివిరి. మఱియు నదులన్నియు గమ్యస్థానమగు సముద్రమును తప్పక చేరునట్లు, అన్ని మార్గములున్ను దేవుని కైవల్యధామమునకు జేర్చునని సెలవిచ్చిరి. ఏ మార్గముగుండా పోయినను తప్పులేదు. వారి వారి సంస్కారము ననుసరించి జనులు ఆయా మార్గమును, ఆయా సిద్ధాంతమును అనుసరించుటకు సర్వస్వతంత్రులు అని గీత నుడువుచున్నది.

కొందఱి చిత్తము సహజముగనే క్రియాశీలమై (Active) యొప్పును. వారు తప్పనిసరిగ కర్మమార్గము ననుసరించుదురు. కర్మ నాచరించుటయందే, లోకసేవ చేయుటయందే వారు ఆనందమును బొందుచుందురు. కర్మతత్త్వమును, కర్మ రహస్యమును చక్కగ తెలిసికొని నిష్కామపూర్వకముగ కర్మనే ఆచరించుచుండుడని అట్టివారికి గీత బోధించుచుండును. వారికొఱకే కాబోలు 'కర్మయోగము' అను అధ్యాయమును గీత కేటాయించియుంచినది. మఱికొందఱి చిత్తము సహజముగనే ఆవేశపూరితమై, భక్తిపరవశముగ(Emotional) నుండును. అట్టివారు భక్తి మార్గము నవలంభించుదురు. జపము, పూజ, ప్రార్థన, సంకీర్తన నామస్మరణ మున్నగు వానియందు వారు మిక్కుటముగ ప్రీతిబొందుదురు. అట్టి వారికి భక్తి మార్గమును గీత ఉపదేశించి, దానినే చేబట్టి ముక్తిని బడయుడని ప్రోత్సహించుచున్నది. కనుకనే భక్తియోగము అను అధ్యాయమును అట్టి సంస్కారము కలవారికి ప్రత్యేకముగ గీత ఏర్పాటు చేసియున్నది. అట్లే కొందఱిమనస్సు ఉపాసనాశీలమై(Meditative) వర్తించు చుండును. అట్టివారు నిరంతరము ధ్యానమునందాసక్తి గొనుచుందురు. బహిర్ముఖ

వ్యవహారములం దానక్తిలేక, చిత్తమును సర్వదా అంతర్ముఖమొనర్చి ధ్యాననిష్ఠను శీలించుటయందే వారు ఆత్మసంయమయోగము అను అధ్యాయమును ప్రత్యేకించినది. వీరు ముప్వురును గాక మఱికొందఱు కలరు. వారు జ్ఞానులు. వారి చిత్తము సదా విచారణాపరమై(Rational) వర్తించును. వారు సత్యాసత్యములను, ఆత్మానాత్మలను క్షేత్ర క్షేత్రజ్ఞులను చక్కగ వివేచించి చూచుదురు. వారికి ధీశక్తి (Will power) ఎక్కువగనుండును. అట్టి స్వభావముకలవారికి గీత జ్ఞానయోగము, క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగము మున్నగు అధ్యాయములను ప్రత్యేకించి చెప్పినది.

ఈ ప్రకారముగ ప్రపంచములో గల భిన్న భిన్న మనస్తత్వములు కలవారి నందఱిని గీత సంతృప్తిపఱచి, అందఱికిని మోక్షమార్గము నుపదేశించి సర్వపథములు సత్యములేయని నిరూపించి పరస్పర విద్వేషమును, వైమనస్యమును రూపుమాపినది. ఇవ్విషయమున శ్రీ వివేకానందస్వామి వచించిన వాక్యములుల్లేఖింపదగినవి.

The reconciliation of the different paths of Dharma and work without desire or attachment are the two special characteristics of the Gita – అనగా సర్వయోగ సమన్వయము, నిష్కామకర్మ – అను నీ రెండును గీత యొక్క ప్రముఖలక్షణములు ! ఇట్టి సమన్వయ భావము గలిగియున్నందువలననే, అన్ని సంప్రదాయములవారును గీతయెడల మిక్కుటమగు ఆదరమును ప్రదర్శించుచుందురు. అద్వైతమత ప్రతిష్ఠాపకులైన శంకరాచార్యులు గీతను శ్లాఘించిరి. విశిష్టాద్వైత ప్రవర్తకులగు రామానుజ లద్దానిని కొనియాడిరి. ద్వైతమతస్థాపకులైన మధ్వాచార్యులు దానికి జోహారు లర్పించిరి. శైవమతప్రతిష్ఠాపకులగు శ్రీ కంఠ శివాచార్యులు దానిని ప్రశంసించిరి. ఈ ప్రకారముగ వివిధ యోగములతో గూడిన వివిధ మార్గముల నుపదేశించుచు భిన్న భిన్న తత్త్వములను ప్రతిపాదించుచు, తుదకన్నిటిని సమన్వయపఱచి, ఒకే లక్ష్యమగు పరంధామమునకు జీవులను చేర్చునట్టి, అద్భుతకౌశలముతో గూడిన గ్రంథరాజమే గీత. యోగములన్నిటి మధ్య చక్కని పొందికను, చక్కని సమత్వము (Balance) ను అది కాపాడినది. ఇదివఱలో తమతమ మార్గమే గొప్పదని వాదులాడువారి కందఱికిని గీత చక్కని గుణపాఠము బోధించి, వారిలో వారు తగవులాడుకొనుట కేవలము మూర్ఖత్వమే యనియు, అహంకారమును రూపుమాపి ఆత్మానుభూతిని కలుగజేయుటయే అన్ని మార్గములయొక్క ఏకైకలక్ష్యమనియు ముక్తకంఠముతో తెలిపెను. ఈ ప్రకారముగ జనులందఱి మధ్య మతము లన్నిటి మధ్య పరిపూర్ణమగు సమరసత్వమును స్థాపించుట యనునది గీత సాధించిన ఘన విజయములలో నొకటియని పాఠకులు గుర్తెఱుగుదురుగాక !

నిర్మల చిత్తమున జ్ఞానోదయమగును

కృతయుగమున ధ్యానాదుల చేతను, త్రేతాయుగమున యజ్ఞయాగాదుల చేతను, ద్వాపరయుగమున అర్చనల చేతను, ఏ పరమ పదవి లభించునో, కలియుగమున కేశవుని(పరమాత్మను) కీర్తించుట చేతనే అది లభించుచున్నది.

సంకీర్తనను భక్తి పూర్వకముగా నాచరించు వారికి భక్తి పారవశ్యముచే భగవానుని యనుగ్రహము లభించుటయే గాక చిత్తమున్ను దైవాణువులచే పరిశుద్ధమగును. నిర్మల చిత్తమున భగవత్కృపచే జ్ఞానోదయమగును.

– శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు

భగవద్గీత విశ్వాసానికి చెందినది

– పూజ్యశ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ
కాళీవనాశ్రమాధిపతులు, నంబూరు.

"కృష్ణం వందే జగద్గురుమ్"

"భగవద్గీతా కించిదధీతా!
గంగాజాల లవ కణికా పీతా
సకృదపి యేన మురారి సమర్చా!
క్రియతే తస్య యమోఽపి న చర్చామ్।"

అని భజగోవింద శ్లోకములలో చెప్పినట్లు, – భగవద్గీతను కొంచెము అధ్యయనం చేసినను, గంగ నీరు ఒక్క బిందువు పానము చేసినను, ఒక్కసారైనా భగవంతుని మనసారా పూజించినను చాలు! అట్టి వానికి యముని వలన ఎటువంటి భయమూ ఉండదు అని పై శ్లోకం తెలియజేయుచున్నది.

యముని వలన ఎట్టి భయమూ ఉండదు అంటే మనిషికి మరణమనేది ఉండదా అని కొంతమంది ప్రశ్నించవచ్చు. "జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ" అని గీతలో భగవానుడు చెప్పే ఉన్నాడు. పుట్టిన ప్రతి జీవీ మరణించక తప్పదు; మరణించిన వారు తిరిగి పుట్టుటయు తప్పదు. కాని భగవద్గీత మనకి బోధించేది ఏమిటంటే మరణము, జననము అనేవి శరీరాలకేగాని, వాటిని ప్రకాశింపజేసే ఆత్మవస్తువుకి కాదు. సర్వజీవకోటి యందు ఉన్న ఆత్మ, లేక చైతన్యం ఒక్కటే గాని అనేకం కాదు. ఆత్మ కాల్చబడేది, తడపబడేది, ఎండింపబడేది, కోయబడేది కాదు; అటువంటి ఆత్మయే నీ స్వరూపం అని భగవానుడు నిష్కర్షగా చెప్పాడు.

ఈ సత్యాన్ని గురు శుశ్రూష ద్వారా, భగవద్గీతాసారమును పానం చేసి, సాధన ద్వారా అనుభవపూర్వకంగా తెలుసుకున్న సాధకుడికి యముని వలన భయం ఎక్కడ ఉంటుంది? ఒక మామూలు డాక్టరే పెద్ద రోగాన్ని పోగొట్టడానికి ఒక చిన్న మాత్రగాని, సూదిమందు గాని, (ఇంజక్షను) యిస్తే సరిపోతుందే! మరి భవరోగ భిషగ్వరుడైన భగవానుని ముఖస్థంగా వచ్చిన దివ్యవాణి అనే దివ్యౌషధం మనని జనన మరణ విషవలయమనే సుదీర్ఘ వ్యాధి నుండి నయం చేయడానికి ఎంత కావాలి?

భగవద్గీతలోని 701శ్లోకాలు మాకు కంఠస్థమయితే చాలా అంటే అది చాలదు. ఒక్క అర్థ శ్లోకం చదివినా దాన్ని అర్థం చేసుకుని, అనుభవానికీ తెచ్చుకోవాలి. ఈ సందర్భంగా, మహారాణి అహల్యాబాయి హెూల్కర్‌గారిని తలవడం ఎంతో సమంజసంగా వుంటుంది. ఆ తల్లి భగవద్గీతను శ్రవణం చేయదలచి, ఒక పండితుని రప్పించి, గీతను పఠించి ప్రవచనం చేయవలసినదిగా కోరారుట. ఆ పండితుడు "ధర్మక్షేత్రే కురుక్షేత్రే" అని ఒక్కపాదం చదివేసరికల్లా ఆ మహారాణి "ఇక చాలు స్వామీ!" అన్నారుట. తన వలన ఏమైనా తప్పు జరిగిందేమోనని ఆ పండితుడు భయపడుతూంటే, ఆ రాణీగారు "పండిత వరేణ్యా! గీతామాహాత్మ్యంలో 'అధ్యాయ శ్లోకా పాదం వా' ఒక్క పాదమైననూ చాలు అని చెప్పబడి ఉన్నది కదా! "ధర్మక్షేత్రే కురుక్షేత్రే" అన్న ఒక్కపాదమే నాకు ఎంతో తృప్తిని

కలిగించింది. "క్షేత్రే క్షేత్రే ధర్మం కురు" ఎక్కడెక్కడికి వెళ్ళినా ధర్మాన్ని ఆచరించు. ధర్మము తప్పకు" అనే అర్థం నాకు స్ఫురించింది. ఇది నాకు పరిపూర్ణ తృప్తిని ప్రసాదించింది. దీనిని నేను ఆచరించుకుంటే చాలు కదా అనిపించింది స్వామీ! అందుకనే మిమ్మల్ని ఆపమన్నాను" అని ఆ మహాసాధ్వి చెప్పిందిట! ఆహా! ఎంత శుద్ధమైన పాత్ర ఆమె హృదయం! ఇటువంటి అత్యున్నత భావాలతో, దివ్యబోధతో అలరారే భగవద్గీతను గురించి ఏమని చెప్పాలి? ఎంత చెబితే తనివి తీరుతుంది?

అస్మద్గురుదేవులు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవరప్రసాద బాబూజీ మహరాజ్‌వారు తమ బిడ్డ అయిన ఈ అమ్మచేత మొట్టమొదటిసారిగా ఒక గీతాజయంతినాడు ఉపన్యాసం చెప్పించారు. శ్రీగురుదేవులు 'గీతను తిరగవేస్తే 'తాగీ' అవుతుందని, బెంగాలీలో 'తాగి' అంటే 'త్యాగం' అని శ్రీరామకృష్ణులు చెప్పారని మాకు చెప్పేవారు.

'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ!
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః"

అన్న చరమ శ్లోకానికి అర్థం త్యాగమే కదా! సర్వ ధర్మాలను వదిలివేసి, నన్నొక్కడినే శరణు పొందితే, నీ సమస్త పాపముల నుండి నిన్ను విముక్తుడిని చేసి, మోక్షాన్ని ప్రసాదిస్తాను. జన్మమృత్యు జరా వ్యాధులనే దుఃఖాలతో పీడింపబడుతూ, అశుచియై ఉన్న నిన్ను, ఆనంద స్వరూపునిగా తీర్చిదిద్ది, శుచిత్వంతో శోభిల్లేటట్లు చేస్తానంటున్నాడు పరమాత్ముడు.

మా ఉద్దేశ్యంలో భగవద్గీత యొక్క సారాంశం 'సర్దుబాటు'. ఈ ప్రపంచంలో మానవుడు ఎటువంటి పరిస్థితులు, ఒడిదుడుకులు ఎదురైనా, వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్పేదే భగవద్గీత. ఈ భగవద్గీత ఏ ఒక్క మతానికో, దేశానికో చెందినది కాదు.

"జాతి, నీతి, కుల, గోత్ర దూరగం, నామ రూప గుణ, దోష వర్జితమ్,
దేశ కాల విషయాతివర్తియత్ బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని"

అని శ్రీ ఆదిశంకర భగవత్పాదాచార్యులవారు చెప్పిన ఆత్మవస్తువును తెలియజేసేది భగవద్గీత. ఇది యూనివర్సల్ అంటే సర్వమానవాళికీ, విశ్వానికీ చెందినది. ఇటువంటి దివ్య గ్రంథాన్ని, అందులో లోతైన అర్థాలనీ, అందరికీ అర్థమయ్యే సులభమైన భాషలో ఆంధ్రావనికీ, తెలుగువారికీ 'గీతామకరందాన్ని' అందించిన మహనీయులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి దివ్య చరాణర విందములకు అనేక సాష్టాంగ నమస్కారములు. వీథివీథులా, వాడవాడలా గీతామృత వర్షాన్ని కుండపోతగా కురిపించిన మహానుభావులు. ఆ దివ్య గ్రంథాన్ని అనేక భాషలలోనికి ముఖ్యంగా ఆంగ్లభాషలోనికి అనువాదం చేయించి, ప్రచురించి స్వామివారు దిద్దిన బాటలోనే అవిశ్రాంతంగా కృషి చేస్తున్న పూజ్య శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామివారికి అనేకానేక కృతజ్ఞతాపూర్వక నమస్కారములు. 'గీతామకరందం'తో పాటు, 'గీతోపన్యాసములు' కూడా, ఆంధ్రదేశంలోని మనందరికీ ఎంతో మార్గదర్శకమై యున్నది. అట్టి మహాత్ములు అవ్యాజమైన కరుణతో కురిపించిన గీతామృతధారలను మనం ఎంత త్రాగ గలిగితే అంత త్రాగాలి. "రసతి- భజతి- సోఽ మృతో భవతి" అని గోపాల తాపన్యుపనిషత్తు చెప్పినట్లు - రసస్వరూపుడైన భగవానుని ముఖస్తుగా ప్రవహించిన ఆ గీతామృతాన్ని పానం చేసి, ఆ రసంలోనే మునిగిపోయి, అమృత స్వరూపుడైన భగవానుని భజించి, సేవించి, అమృతత్వాన్ని పొందుదుము గాక! అటువంటి దివ్యసాధనకు కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి గురుపాదుకలు సర్వదా మనందరినీ కాపాడుగాక! శ్రీసద్గురుదేవుల కృపాశీస్సులు మనపై సర్వదా వర్షించుగాక!

సుఖీభవ! సుఖీభవ! హరిః ఓం తత్సత్.



భక్తి ప్రతిబంధకములు

పూజ్యశ్రీ పరిపూర్ణానందగిరి స్వాములవారు
శ్రీ వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు, ఏర్పేడు.

"అత్యాహారం ప్రయాసశ్చ ప్రజల్పో నియమగ్రహః
జనసంగశ్చ లౌల్యంచ షడ్భిర్భక్తిర్వినశ్యతి"

అత్యాహారం, అనగా యెక్కువగా ఆహారం తీసికోవడం. అతిగా ఆహారం తీసికొంటే నిద్రవస్తుంది. సోమరితనం పెరుగుతుంది. ప్రమాదం వస్తుంది. ప్రమాదం అంటే ఒకటి చెప్పబోయి మరొకటి చెప్పడం, ఒకటి చేయబోయి యింకొకటి చేయడం. భగవచ్చింతనబోయి ప్రపంచ చింతన చేయడం, యిలా వ్యవహారమంతా తల్లక్రిందులు కావడమే ప్రమాదం. అతి భోజనము వలన కలుగు అనర్థములను గూర్చి మనువు యిలా చెప్పెను.

"అనారోగ్యం అనాయుష్యం అస్వర్గ్యం చాతి భోజనమ్
అపుణ్యం లోకవిద్విష్టం తస్మాత్తత్ పరివర్జయేత్".

అనగా, అతి భోజనమున అనారోగ్యము, ఆయుస్సు తరగుట, స్వర్గప్రాప్తి కలుగకపోవడం, పుణ్యము ప్రాప్తించక పోవడం, లోకనింద కలుగుట జరుగును. కావున, మొదట "ఆహార నియమం" అనగా మితాహారం కలిగియుండుట ముఖ్య విషయం. మహర్షి సద్గురు శ్రీ మలయాళ స్వాములవారు చెప్పిన "రత్నత్రయము" లో మొదటిది యుక్తాహారమే. భగవంతుడు కూడా "యుక్తాహార విహారస్య" అని హెచ్చరించెను. కాబట్టి అమితాహారం తీసుకోవడం భక్తికి సాధనకు గూడా ప్రతిబంధకమే.

రెండవది 'అతిప్రయాసః' అనగా సాధకుడు లేక భక్తుడు మిక్కిలి బాధను కలిగించే పనులు, మిక్కిలి ప్రయాసనిచ్చే పనులు యెప్పుడును చేయరాదు. ఒకవేళ చేసినట్లైతే దేహేంద్రియాలు అలసిపోతాయి. జపధ్యానాలు, నిత్యనైమిత్తిక కర్మలు, సరిగా జరుగవు. ధ్యానానికి కూర్చుంటే బద్ధకముచే మనస్సు పండుకోమంటుంది. అందుచేత శరీరానికి మిక్కిలి అలసట కలిగించేటటువంటి పనులేవియు యెప్పుడు చేయరాదు.

మూడు "అతి ప్రజల్పః", అనగా యెక్కువగా మాట్లాడడం. దీనివలన యెంతో నష్టమున్నది. కావుననే మిత భాషణ మవసరమన్నారు పెద్దలు. "మౌనేన కలహోనాస్తి" అన్నారు. తక్కువగా మాట్లాడుట చేత ప్రాణశక్తి నష్టము కాదు. అబద్ధములు యెక్కువగా పలుకుటకు వీలుండదు. ప్రాణశక్తి ఖర్చు కాకపోయిన చాలా కాలం జీవించుటకు అవకాశమున్నది. మితభాషణత్వముచే యెక్కువగా కలహములు గూడా రావు. వాని దగ్గరకు కాలక్షేపమునకు కూడా యెవరురారు. భక్తితో గూడిన వాని సాధనలు సక్రమముగా కొనసాగును. లేనిచో క్షణము తీరికుండదు, శాంతి ఉండదు. నాలుగు "అతి నియమగ్రహః" నియమాలను కఠినముగా పాలించుట తగదు. స్వవర్ణాశ్రమ ధర్మాలను

మాత్రము శీలించవలయును. అంటే బ్రహ్మాచారులుంటారు. వారు వేదాధ్యయనము, గురుశుశ్రూష అగ్ని కార్యము మొదలైనవి వారి విధులు లేక వారి ధర్మాలు. వీనిని సకాలములో సక్రమముగా నెరవేరిస్తే చాలు. అంతకు మించి ఇతర ధర్మాల జోలికి పోతే నష్టపడుతారు. గృహస్థులు శాస్త్రములో చెప్పిన దానం, ధర్మం, సత్యం మొదలైనవి కలిగి మెలగుట, అతిథి అభ్యాగతులను సత్కరించుట, శ్రాద్ధ కర్మలను శ్రద్ధతో చేయడం వారి విధులు. ఇక వానప్రస్థులు కృచ్ఛము, చాంద్రాయణము మొదలైన వ్రతములను ఆచరించుట, సద్గ్రంథ పఠనము, ధ్యానము, జపము మొదలగునవి వారి విధులు. సన్న్యాసులు, వీరు సదా బ్రహ్మచింతనలో కాలము గడపుచు తాను తెలిసికొన్న విషయములను ఇతరులకు బోధిస్తూ లోకకళ్యాణమునకు తోడ్పడుట వారి నిత్యవిధులు. వీటిని తప్పించి హఠయోగములు, నిరాహారులై సాధనలు చేస్తే యోగం బదులు రోగాలు వచ్చి కూర్చుంటాయి. దాని వలన తాను భక్తి మార్గము నుండి లేక సాధనా మార్గము నుండి చ్యుతుడవుతాడు.

ఐదు "అతి సంగశ్చ" జనులతో అతి సంబంధం భక్తునికి లేక సాధకునికి సుతరాం పనికిరాదు. ఇది సాధనలకు,నిష్ఠకు భంగకరము, కాబట్టి "త్యజ దుర్జన సంసర్గం భజ సాధు సమాగమం". అనగా దుర్జునులతో సంబంధం పూర్తిగా వదలమన్నారు. సజ్జనులతో సహవాసము ప్రయత్నముతో చేయమన్నారు. "సాధు సంగంబు సకలార్థ సాధనంబు". "సత్సంగతిః" కథయ కిం న కరోతి పుంసాం" అని శాస్త్రము కుడా చెప్పుచున్నది.

ఆరు''అతిలౌల్యం'', అనగా ఇంద్రియాలకు దాసోహమనరాదు. ఇంద్రియాలకు లోబడినట్లైతే ఆత్మోన్నత్యము కలుగదు. ఎన్నో ప్రమాదాలు, అనర్థాలు పొందవలసియుండును. ఏ పనిని పట్టుగా పూర్తిగా చేయలేడు. నిష్ఠ కుదురదు. భక్తికి నిలకడుండదు. తెగిన గాలిపటము వలె జీవితమే చిందరవందరై పోతుంది. ఇక తాను ఆత్మోన్నతిని యెలా సాధించగలడు? విషయ సుఖముల ననుభవించుటకే తన ఇంద్రియములు ఆరాట పడుచుండిన పారమార్థిక చింతన యెప్పటికి కలుగును. ఎప్పటికి కలుగదని అర్థము.

"శబ్దాదిభిః పంచభిరేవ పంచ పంచత్వమాపుః స్వగుణేన బద్ధాః
కురంగమాతంగ, పతంగ మీనభృంగాః నరః పంచభిరంచితః కిమ్"

జింక, ఏనుగు, మిడుత, చేప, తుమ్మెద ఒక్కొక్క ఇంద్రియమునకు లోబడి ప్రాణాన్నే పొగొట్టుకుంటున్నాయి. ఇక పంచేంద్రియములకు లోబడిన నరుని గతి ఏమి? అధోగతే అని చెప్పక తప్పదు.

కాబట్టి సాధకులు, భక్తులు పైజెప్పబడిన వాటియందు జాగ్రత్త కలిగి మెలగవలయును. అట్లుగాక అతి ఆహారాదులను వదలక స్వేచ్ఛగా నెవడు ప్రవర్తించునో వానికి భక్తి మార్గమున పై జెప్పినన్నియు ప్రతిబంధకములగును.

చక్కగా నియమములను పాలించక సాధనలయందు తొందరపడి అతిగా ప్రవర్తించినందున వారి సాధనలు మధ్యలోనే ఆగిపోవుచుండుట లోకములో మనము చూచుచునే యున్నాము గదా! కాబట్టి శాస్త్ర ప్రమాణముగను, గురుశిక్షణాయుతముగను హితమితమేధ్యమైన ఆహారాదులు గలిగి సాధన జేయువారు పరమభక్తులై, భగవంతుని అనుగ్రహమునకు పాత్రులై, జన్మబంధ రహితులై పరమపదమగు మోక్షమును పొందగలరు.

ఓం తత్ సత్ ఓమ్.

ఓం శాంతిః శాంతిః శాంతిః



శ్రీ మద్భగవద్గీత

శ్రీ విద్యానంద భారతి స్వామి
శ్రీ శివరామ అవధూతాశ్రమం
హేమకూట - హంపి పోస్ట్
బళ్ళారి తాలూకా. కర్ణాటక.

మన భారతదేశం భౌతికరంగంలోనూ, ఆధ్యాత్మిక రంగంలోనూ ఏ మాత్రం తక్కువకాదు. ఈ రెండు రంగాలు సువిస్తారసంపద్భరితం. ప్రతియుగంలోనూ పరమాత్ముడు అవతరిస్తూ ధర్మం సంస్థాపనం, జాగృతిని ఉద్దీపిస్తూ, దుష్టుల్ని నిగ్రహిస్తూ, శిష్టులను సజ్జనులను రక్షిస్తూ పాలిస్తున్నాడు. ఈ భరతభూమిలో అనేక ఋషులు, యతులు, శరణులు, సాధువులు యోగులు, బ్రహ్మజ్ఞానులు ఇంకా ఎందరో అవతరిస్తూ జగత్తులోని జీవకోటి పాపకల్మషాన్ని క్షాళితం చేస్తూ ఆత్మజ్ఞానం బోధిస్తూ భవసాగరంనుండి విముక్తులను చేశారు.

ద్వాపరయుగంలో శ్రీమన్నారాయణుడే వసుదేవదేవకి దంపతుల పవిత్రగర్భంలో శ్రీ కృష్ణుడై అవతరించి దుష్టులయిన కంస, శిశుపాల దుర్యోధనాదులను శిక్షించి భక్తి వినయ సద్గుణ సంపద్విరాజితులయిన పాండవులను, గోపకాంతలను విదురాదులను కృపాశీర్వాదంతో ఉద్ధరించాడు. భగవంతుడు అర్జునుని నిమిత్తమాత్రుని చేసి మానవకులకోటికి తన 'శ్రీముఖరూపేణ' ఉపదేశించిన గ్రంథము భగవద్గీత. ఇది భగవంతుని 'ప్రాణమయం', భగవంతుని హృదయంకూడా. ఇది సకల వేదాల సారసంగ్రహం.శ్రుతి ప్రస్థాన స్మృతి ప్రస్థాన న్యాయప్రస్థానమనే ప్రస్థానత్రయంలో శ్రీ మద్భగవద్గీత 'స్మృతిప్రస్థానం'-

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్॥

సకలోపనిషత్తులే గోవులై శ్రీకృష్ణపరమాత్మయే పాలుపిండే గోపాలుకుడయినాడు. అర్జునుడు ఆ క్షీరం త్రాగేదూడ అయ్యాడు. భగవద్గీత సకలోపనిషత్తుల సారమయింది. ఇది విశ్వమాన్యగ్రంథమయింది. శ్రీ మద్భగవద్గీత ఏ నిర్దిష్ట జాతిమత ధర్మసంప్రదాయాలకు సంబంధించినది కాదు. సర్వులు గ్రహించడానికి యోగ్యమయిన గ్రంథరాజం.

భగవద్గీత ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత మత సంప్రదాయశాఖీయులకు తమకు తోచిన రీతిలో అర్థావగాహనకు అవకాశమిచ్చిన గ్రంథం. అనేకానేక సంశయాలకు సమర్థంగా సమాధానం లభించే గ్రంథం. ప్రపంచంలో గీతకు 8000కు మించిన వివిధ భాషలలో వ్యాఖ్యానాలు లభ్యమవుతున్నాయి. భగవద్గీతకు సమానమయిన మరొక్క గ్రంథం ప్రపంచంలో మరొకటిలేదు. సర్వశాస్త్ర మయీ గీతా అన్నట్లు అన్ని శాస్త్రాల సారరూపమే గీత.

గీతాశ్రయోఽహం తిష్ఠామి
గీతా మే చోత్తమం గృహమ్
గీతా జ్ఞానముపాశ్రిత్య
త్రీన్‌లోకాన్ పాలయామ్యహమ్

అని భగవంతుడే సెలవిచ్చాడు. అంటే నేను గీతను ఆశ్రయించి నిలిచి వుంటాను. గీత నా ఉత్తమగృహం. గీతా జ్ఞానాన్ని ఆశ్రయించి ముల్లోకాలను పాలిస్తానని భగవంతుడు చెప్పాడు.

మహాభారతాన్ని 'పంచమవేదం' గా గణిస్తారు. మహాభారతం భీష్మపర్వంలోనే భగవద్గీతోపదేశముంది. 18 అధ్యాయాలు 700 శ్లోకాలతో రచితం, ప్రోక్తం కూడా 'వ్యాసేన గ్రథితా పురాణమునినా' అన్నట్లు వ్యాసమహర్షి భగవంతుడయిన శ్రీకృష్ణునిచే అర్జునునకు ఉపదేశింపబడిన అద్వైతామృతాన్ని గణపతి సాయంతో రచించారు.

గీత-పండితుని మొదలు పామరుల వరకు పఠన యోగ్యం. సులభంగా అర్థం చేసుకోవడానికి వీలయినది. భావ నాదాన్ని మీటి హృదయానందం ప్రసాదించే ఉత్తమగీత. భవద్గీతలో 1 నుండి 6 అధ్యాయాలు కర్మకాండాన్ని, 7 నుండి 12 వరకు ఉపాసనకాండాన్ని, 13నుండి18 వరకు జ్ఞానకాండాన్ని ఉపదేశించాయని జ్ఞానులు చెబుతారు. ఈ గీతలో భగవంతుడు ప్రవృత్తి నివృత్తి ధర్మాలను రెంటిని ఉపదేశించాడు. భక్తి జ్ఞాన వైరాగ్యాలను సుందరంగా యథార్థంగా ఉపదేశించాడు.

కౌరవపాండవుల 18 అక్షౌహిణీ సైన్యాల మధ్య సమరభూమికి సారథి అయిన కృష్ణుడు అర్జునుని వెంటబెట్టుకు వచ్చాడు. అర్జునుడు ఒకసారి తన విరోధి బలగాన్ని తేరిపార చూచాడు. పితామహులయిన భీష్మకౌరవసైన్య సేనాధిపతిని, విద్యాగురువయిన ద్రోణాచార్యులను, అటువైపు ఇటువైపు ఒకవంశం వారయిన దాయాదులను బంధువులను, మిత్రులను చూచి వీరందరు నావారు కదా అనే భావం కలిగింది. దయ పెల్లుబికింది. సమరంలో వీరిని చంపితే మహాపాపం కదా అని అనిపించింది. సమరం వద్దనిపించింది. కదనరంగంలో కాలుమోపడం తగదని శస్త్రాలు వదలిపెట్టి శోకసాగరంలో మునిగి పోయాడు అర్జునుడు. శోకమోహామగ్న మానసుడయిన అర్జునునితో భగవంతుడు ఈలాంటి విషమస్థితిలో నీకు మోహమెందుకు? ఈ షండత్వాన్ని హృదయ దౌర్బల్యాన్ని వదలిపెట్టమని ఉపదేశించాడు. కార్పణ్యదోషజనిత స్వభావగత ధర్మ విషయంలో మూఢుడనయిన తనకు ఏది శ్రేయమో చెప్పమని శరణాగతుడై అర్జునుడు ప్రార్థించాడు. శ్రీకృష్ణ పరమాత్మ పార్థుని శోకమోహాదుల విముక్తికై ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించాడు. దేహం నశ్వరం. ఆత్మ 'అనశ్వరం' అన్నాడు.

'న జాయతే మ్రియతే వా కదాచిత్' ఆత్మ ఎపుడూ జన్మించలేదు. మరణించలేదు. నాకు జన్మమూలేదు. నిత్యుణ్ణి, శాశ్వతుణ్ణి, పురాణపురుషుణ్ణి. శరీరం నశించినా నాశనంలేదు. జీవాత్మ శరీరం వదలి మరో శరీరం ధరిస్తుంది అనే ఉపదేశం చేశాక అర్జునుడు అజ్ఞాన విముక్తుడయ్యాడు. భవసాగరం నుండి శోకమోహాదులనుండి విముక్తుడయ్యాడు. జీవ బ్రహ్మాదుల ఏకత్వం -జ్ఞాని అయితేగాని అవగతంకాదు. అజ్ఞానికి అది అసాధ్యం. 'న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే' అని రాజ విద్యా రాజ్య గుహ్యం ॥ మొదలయిన శ్లోకాదులతో జ్ఞాన శ్రేష్ఠత్వాన్ని బోధించాడు.

సాంఖ్యయోగమంటే జ్ఞానానికి సంబంధించిన విచారమని అర్థం. జ్ఞానయోగం మరి కర్మయోగ సంబంధ విచారాన్ని పరమాత్మ స్పష్టంగ సుందరంగా నిరూపించాడు. ఫలాపేక్షరహిత కర్మలే కర్మయోగలక్షణం. 'న హి కశ్చిత్ క్షణమపి' అనే భగవదుపదేశం ప్రకారం కర్మలు చేయక ఎవరు ఒక్కక్షణం కూడా ఉండలేదు. 'కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన'. అర్జునా! కర్మ చేసే అధికారం నీకుంది. కాని కర్మఫలాధికారం లేదు. ఆసక్తి రహితుడవై కర్మను చేయి. అత్మరతిగలవాడు,ఆత్మతృప్తుడయినవాడు ఎవడో అతనికి ఏ

కర్తవ్యమూ లేదు. జనకాదులు కర్మవలన సిద్ధి పొందారు. నీవు క్షత్రియుడివి నీ ధర్మం పరిపాలించు. 'స్వధర్మే నిధనం శ్రేయః, పరధర్మో భయావహః"అని ఉపదేశించాడు కృష్ణపరమాత్మ. అనంతజన్మలు నీకు గడిచాయి. అవి నీకు తెలియవు. తెలిసే అవకాశం లేదు. ధర్మానికి అవనతి ఏర్పడే వేళ ధర్మస్థాపనకోసం దుష్టనిగ్రహం, శిష్టపరిరక్షణార్థం ప్రతియుగంలో అవతరిస్తుంటాను. అలౌకిక అవతార మొందినవాడు మరల పునర్జన్మ పొందడు. అన్ని యజ్ఞాలకన్నా జ్ఞానయజ్ఞం శ్రేష్టం. అన్ని కర్మలు జ్ఞానంతో సంలీన మవుతాయి.

గీత ముఖ్యధ్యేయ రహస్యాన్ని కృష్ణుడు అర్జునునికి బోధించాడు. కర్మసన్యాసాన్ని బోధిస్తూ జ్ఞాననిష్ఠులు పొందే మోక్షస్థానాన్ని నిష్కామ కర్మయోగులు కూడా పొందుతారు. ఈశ్వరార్పణ బుద్ధితో ఫలాపేక్షలేకుండా కర్మ చేసేవారు తామరాకుమీది నీటి బొట్టులా పాపం పొందరు. ఎవరయితే మనస్సును బ్రహ్మలో నిలుపుతారో వారు ఇక్కడ సంసారాన్ని జయిస్తారు. 'సన్యాస' మని దేనినయితే చెబుతారో అది యోగమని తెలుసుకో అని భగవంతుడు ఉపదేశించాడు. సర్వసంకల్పాలను త్యాగం చేసినవాడు యోగారూఢుడు. సమదర్శి అయిన యోగి ఆత్మను సర్వభూతాలలోను, సర్వభూతాలను ఆత్మలోను దర్శిస్తాడు. అభ్యాసంతోనూ, వైరాగ్యంతోనూ మనస్సు ఏకాగ్రత సాధించే విధానాన్ని భగవంతుడు ఉపదేశం చేశాడు. పరమాత్మను గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస వేయిమందిలో ఒకరికి మాత్రం సాధ్యమని ఇటువంటి అనేక జిజ్ఞాసువులలో ఎవరో ఒకరు మాత్రం యాథార్థ్యం తెలుసుకొంటారు. అనంత జన్మాదుల వల్ల సంపాదించి నిష్కామకర్మోపాసకునికి ఇదంతా పరమాత్మస్వరూపమే. నేను పరమాత్మనే అనే దృఢజ్ఞానం కలుగుతుంది. అనన్యమయిన భక్తితో భగవంతుని జ్ఞానం, దర్శనం సాధ్యమని విశదీకరించాడు. భక్తితో పత్రంగాని, పుష్పంగాని, ఫలంగాని లేదా తోయంగాని సమర్పిస్తే అద్దానిని తాను స్వీకరిస్తానన్నాడు. ఎవరు కర్మ చేసినా, తపంచేసినా పరమాత్మప్రీత్యర్థం చేయాలని ఉపదేశించాడు. నాపై మనస్సుంచు. నాపట్ల బుద్ధి నుంచు. నన్నే తప్పక పొందుతావు అనడంలో సంశయంలేదు. క్షేత్రక్షేత్రజ్ఞవిభాగమును ఉపదేశించిన భగవంతుడు త్రిగుణాతీతమూర్తిని పొందే భాగ్యాన్ని, పురుషోత్తమ ప్రాప్తి యోగాన్ని బోధించాడు. దైవాసురసంపద్విభాగములతో అసురగుణాదుల బంధనాన్ని విడిపించుకుని జీవుడు పొందే స్థితిని బోధించాడు. సాత్త్విక, రాజసిక, తామసిక అనే శ్రద్ధాత్రయం గురించి వివరించాక 'యజ్ఞో దానం తపశ్చైవ పావనాని మనీషిణామ్' యజ్ఞదాన తపాదులు మానవున్ని పవిత్రుణ్ణి చేస్తుందని ఉపదేశించాడు. 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, అర్జునా! అన్ని ధర్మాలను పరిత్యజించి నాకు శరణుకమ్ము. నిన్ను నేను అన్ని పాపాలనుండి విముక్తుణ్ని చేస్తానని వివరించి చివరకు అర్జునునిచే 'నష్టో మోహః' అని అనిపించాడు. తాను ఏది కోరాడో అర్జునుని వల్ల కృష్ణుడు అది సాధించగలిగాడు.

శ్రీకాళహస్తిలో శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో పరమపూజ్య శ్రీ విద్యాస్వరూపానందగిరిస్వాములవారు శ్రీ విద్యా ప్రకాశానందుల 100వ జయంతి ఉత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విద్యా ప్రకాశానందస్వాములవారు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, అనేక ప్రాంతాలలో సంచరించి జ్ఞానోపదేశాలను 108 జ్ఞాన యజ్ఞాలను 58 గీతా సదస్సులను నిర్వహించి భక్తకోటిని ఉద్ధరించినారు. ఈ బృహత్ కార్యక్రమం అన్ని రకాల భక్తులకు శ్రేయస్సును, శాంతిని, అభ్యుదయాన్ని ప్రసాదించాలని ఆశిస్తున్నాను.

ఓం తత్సత్

గీత- సార్వజనీనికత

- బాదామి జయరామగుప్త (హైదరాబాద్)

నాకు నాలుగు పదుల దాటిన వయసు వచ్చినప్పుడు కూడా భగవద్గీతను ఎఱుగకుంటిని. భగవద్గీత స్పృహయే నాకు లేకుండెడిది. అట్టి స్థితిలో మహానుభావుడైన ఒక ఆచార్యుని ప్రవచన భాగ్యముచే భగవద్గీత మహాభారతము లోనిదనియు, కృష్ణుడు అర్జునునికి బోధించిన వేదాంత తత్త్వమనియు తెలిసి వచ్చినది. కాని, ఆ తెలివి అతిపరిమితమై ఈ గీతాబోధ మనదేశమునకు, మన సంప్రదాయమునకు, మన మతమునకు సంబంధించిన దనియే ఊహించుచుంటిని, అట్టి పరిస్థితిలో నా సౌభాగ్యవశాత్తు భూమి మీద తిరుగాడ వచ్చిన దేవుడా అనిపించు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి గీతా ప్రవచనములను వినుట జరిగినది. అంతే, నాకు కనువిప్పు కలిగినది. గీత సర్వప్రపంచమునకు శుభసందేశ ప్రదాయక మని తెలిసినది. అనగా గీత సార్వ జనీనికమన్న వెలుగు నాలో వెలిగినది.

అపూర్వమును, అద్భుతమును, అనర్గళమునైన వివరణను వారిధోరణిలో చెప్పుట నాకు సాధ్యము కాదు, కాని వారి సునిశిత అభిప్రాయమును నాకు తోచిన మేర నా మాటలలో మనవిచేసెదను.

భగవద్గీతలో కర్మ, భక్తి, ధ్యానము, ఉపాసన, జిజ్ఞాస, విచారము అని ఎన్నియో విషయములు చెప్పబడినవి. అవి అన్నియూ సార్వజనీనికములేనని వారి వాదన. అనగా దేశప్రాంతాదులతో సంబంధములేక, కాలముతో కూడా సంబంధములేక సర్వమానవులకు వర్తించు సత్యమనుట సత్యము. అంతేకాక, ఈ విషయము నెవడైనను కించి-దాత్మవిచారణచేత తనకు తానే తెలిసికొన గలుగు ననుట కూడా శుభసత్యము. స్వాములవారు ఉపదేశించిన వాటిలో కర్మను మాత్రమే ఈ వ్యాసమున విచారింతము.

కర్మ యనగా పని. ఉపయోగమే లేనిచో మూర్ఖుడు కూడా ఏ పనిని చేయడు. ఊరక కూర్చున్నను అలసట తీరుటకో, ఆలోచనలు చేయుటకో కూర్చొనును గాని నిరుపయోగముగా కాదు. అనగా ప్రతి పనికి తప్పక ఒక ఫలము ఉండి తీరును. ఆ కర్మఫలము నెవరు అనుభవింప వలెను? కర్తయే అనుభవింపవలె నని ఆపాతముగా తోచును. కాని సమాజములో ఒకడు చేసినపనికి వేఱొకడు మేలు పొందుటయో, కీడు పొందుటయో కలదు. ఈ నైజమే ఒక ధర్మసూక్ష్మమునకు బీజము. మేలు నాకు కలుగవలెనే కాని కీడు కలుగరాదని ప్రతిమానవుడు ఆకాంక్షించును. అనగా ఎవరును తనకు కీడుకలుగునట్లు ప్రవర్తింపరాదు, మేలు కలుగునట్లే ప్రవర్తింప వలెనని ఆశ. ఈ ఆశ అందఱికిని ఉండును కనుక, నేనును ఇతరులకు మేలు కలుగునట్లే ప్రవర్తింప వలెను కాని కీడు కలుగునట్లు కాదు కదా! ఇది ప్రాథమిక ధర్మసూత్రము. ఇది దేశకాలములకు పరిచ్ఛిన్నమైనది కాదు. సర్వమానవులకును వర్తించునది. ఇతరులకు ఉపకారము చేయుట ధర్మమనియు, అపకారము చేయుట అధర్మమనియు ఒకరు చెప్పవలసిన పనిలేక మనకే తెలియుచున్నది. ఇది సులభతర తర్కముతో స్వాములవారు ఆవిష్కరించిన ప్రాథమికాంశము.

అయ్యా, ధర్మమే కార్యమని ఇతరులకు మేలు కలిగించుచు పోయినచో నాకు మేలు కలుగటెట్లు? అని

సామాన్యమానవు డనుకొనుట సహజము. ఈ ఆలోచనమే తీవ్రవిచారముగా కొనసాగినచో కర్మలు ఈక్రింది విధముగా నుండగలవని తెలియవచ్చును.

1. నాకు మేలు కలిగినను కలుగకపోయినను ఇతరులకు మేలు కలిగించు కర్మ.
2. నాకును, ఇతరులకును మేలు కలిగించు కర్మ
3. నాకు మేలు కలుగుచుండగా ఇతరులకు కీడు కలిగించు కర్మ
4. నాకును, ఇతరులకును కీడు కలిగించు కర్మ.

పై కర్మలలో చివరి కర్మను ఎవరును చేయరు. చేసినచో వాడు మత్తుడో ఉన్మత్తుడో, కావలెను. కావున దానిని వదిలివేయుదము. ఇక మూడవ కర్మ అధమము ఇతరులు కూడా తమ తమ మేలు చూచుకొని ఇతరులకు కీడు కలిగించినచో సమాజమునకును, నీకును కీడే కలుగును కదా! అట్టి చర్యల వల్ల సమాజము కడగండ్ల పాలగును. అది ఉగ్రవాదచర్య, అందుకే అధమము.

ఇప్పుడు రెండవవిధమైన కర్మను పరికింపుడు. ఇది తనకును, ఇతరులకును మేలు కలిగించెడిది. ఇతరులకు సాక్షాత్తుగా మేలు కలుగక పోయినను కీడు కలుగజేయ కుండుట ఈ కర్మలో అంతర్భాగమే నన్నారు స్వాములవారు. సమాజపరముగా వీక్షించినచో ఈ కర్మ అభినందనీయమే. అయినను ఇది మధ్యమకర్మ మాత్రమే నన్నారు. ఎందు కనగా దీనికంటె ఉత్తమమైన కర్మ కలదు. అదియే ఒకటవ విధపు కర్మ, దానిని పరికింపుడు. అందులో స్వార్థత్యాగము గుబాళించు చున్నది. సమాజ శ్రేయస్సుకు పెద్ద పీట వేయబడినది. కావున అది ఉత్తమకర్మ.

ఉత్తమ, మధ్యమ, అధమములు అనబడు ఈ కర్మవిభజన అన్ని దేశములకును, అన్ని కాలములకు వర్తించును. కనుక అవి సార్వజనీనములు. కాని ఇంకను లోతుగా విచారించి చూచిన ఈ మూడింటి కంటెను ఔన్నత్యముతో విరాజిల్లు మఱియొక విధమగు కర్మ మనకు ప్రత్యక్ష మగును. ఉత్తమమధ్యమాధమ కర్మల మూడింటిలోను ప్రతిఫలము కొఱకు వాంఛ దాగియున్నది. ఉత్తమమైన దానియందు కూడా సమాజశ్రేయస్సు కొఱకు వాంఛ సుస్పష్టముగా దాగి యుండును.

ప్రతిఫల వాంఛను గుఱించిన విశ్లేషణను స్వాముల వారు అతి నైపుణ్యముతో కొనసాగించినారు, మన జీవితములో కర్మలను వాటి ప్రతిఫలములను సాకల్యముగా సమీక్షించినచో, ప్రతిఫలములు మనము వాంఛించినట్లే కలుగునన్న నిశ్చయము లేదని మన అనుభవమే తెలుపును. అనేకానేక కర్మలకు ఫలములు మన వాంఛలకు భిన్నముగానే లభించుచున్నవి. ఇదియు సార్వజనీనికానుభవమే. దీనివలన కర్మలకు ప్రతిఫలమును నియమించు శక్తి కర్తకు లేదనియు, అదృశ్యశక్తి వేఱొకటి నియమించు చున్నదనియు తెలియు చున్నది. ఆ శక్తి యేదైనను, యే పేరుపెట్టినను, ఒక శక్తి యున్నదనియు, ఆ శక్తిని మనము చూడలేదనియు, దానిని మనము నియంత్రించలేమనియు, అది స్వయం నియామకమై యుండవలె ననియు మన మనోగోచర మగును. కావున మన అధీనములో లేని క్రియాఫలమును వాంఛించుట కంటె, ఉత్తమ క్రియ యని మనము తేల్చుకున్న క్రియను ఆచరించి ప్రతిఫలమును ఆ శక్తికే వదలుట మేలు కదా! ఎందుకనగా ఫలవాంఛ వీడగానే ఫలిత మెట్లున్నను మనకు దుఃఖకారణము కాదు. వాంఛ యున్నచో, తీరని యెడల నిస్పృహ నిరాశలు మన మనసును తొలిచి వేయుచుండును. ప్రతిఫలవాంఛ వీడినచో మనకు నష్ట మేమియును లేదు. రావలసిన

ప్రతిఫలము ఎటుతిరిగి రానే వచ్చును. ప్రతిఫల స్వరూపము నిన్ను వేధింపదు. నీకు మనశ్శాంతీ నెలకొనియే యుండును. ఎందుకనగా ఇచట నిరాశానిస్పృహలకు తావే లేదు. ప్రతిఫల వాంఛ లేకుండుట యనునది మనమే మన మనసుకు నేర్పవలసిన విద్య. ఇది యేదేశములో నైనను ఏ కాలములో నైనను అభ్యసింప గలిగిన విషయము గనుక సార్వజనీనికము. దీనికి మన పెద్దలు "కర్మయోగము" అని పేరు పెట్టిరి.

ఇదియే భగవద్గీతలోని మౌలికతత్త్వము. దీనిని ఆవిష్కరించినది భగవద్గీతయే యైనను, సంప్రదాయము నందించినది వేదములే యైనను, దర్శించినది భారతీయ మహర్షులే యైనను, నూటికి నూరు పాళ్ళు యావత్ప్రపంచములోని మానవాళి అనుసరించి ఆచరింపయోగ్య మైనది కనుక సార్వజనీనికము.

ఈ రచన యంతయు పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వాములవారి ప్రవచన పచనమే కాని నా రచనకాదు. వారి భౌతికకాయము కనుమఱుగైనను వారి బోధనాజ్యోతి నిత్యమై నిరతిశయమై మన బోంట్ల భక్తుల బుద్ధి గుహలో కాంతిని ప్రసరించుచునే యుండును.

నమోఽస్తు విద్యాప్రకాశాయ భక్త కల్మష నాశినే ।
జిజ్ఞాసు కల్పవృక్షాయ బ్రహ్మీభూత చిదాత్మనే ॥

సద్గురు ఉపదేశములు

1). అతిథియనగా పదిమైళ్ళ నుండి వచ్చిన వాడుగ నుండవలెను. ధనాదులు లేనువాడుగ నుండవలెను. పూర్వము రానిరాదుగ నుండవలెను. బ్రహ్మనిష్ఠగలవాడుగ నుండవలెను. భుజించిన రోజుననే వెళ్ళువాడుగ నుండవలెను. ధర్మబోధకుడుగ నుండవలెను. అట్టి అతిథికి భిక్ష యిచ్చిన వారిని పరమేశ్వరుడు డనుగ్రహించును. అతథియనగా ఆతిథియందు వచ్చి. అదే తిథి యందు వెళ్ళువాడుగాను, ఏతిథియందు రానివాడుగా నుండవలయును. అట్టి వారికి భిక్ష నివ్వనియెడల వారిదివరలో చేసిన పుణ్యము అతిథి వెంటనే వెళ్ళి పోవును. అట్టి అతిథులకు జాగ్రత్తగా దైవభావముతో వడ్డించవలయును. భుజించువారును. దైవప్రసాదముగ ఒక్క రేణువును కూడ పారవేయక భుజించవలయును. లౌకిక భావములు కలిగి మాట్లాడుచు భుజించినచో రాక్షసాహారమై అయాభావములుగా వారి మనస్సు మారిపోవును. కనుక ఈ ధర్మము సర్వులు నెరుంగవలెను.

2) లోకములో కొన్ని మతములవారు 'అనన్యభక్తి యనగా తమ గురుధ్యానము, తమతమ గ్రంథమును తప్ప పరమతగ్రంథమును చదువుట గాని పరగురువాక్యములను వినుటగాని లేకుండుటేయని చెప్పుదురు. ఇది చాల సంకుంచితబుద్ధి. సర్వ చరాచర ప్రపంచమంతట తన స్వరూపమును చూచుటే అనన్యభక్తి. అనేకత్వములో ఏకత్వమును సదాచూచుటే అనన్యభక్తి. 'సూత్రే మణిగణా ఇవ' అని భగవానుడు చెప్పియున్న సత్యమిదియే. లభించిన దానితో తృప్తి నొంది యితరచింతలు లేక సర్వమును పరమేశ్వరుని యందు లీనముచేయుటే అనన్యభక్తి. చివరకు పరమాత్మయే తనయాత్మ గాను, తనకు మినహా మరియొకటిలేదు అను అపరోక్షాను భూతిని సంపూర్ణముగా కల్గియుండుటయే నిజమైన అనన్యభక్తి.

- శ్రీ మలయాళస్వామి

With Best Compliments from :

M/s Muthuraman & Sons Agency

Paper Distributors

No. 29; Stringers Street, Chennai - 108

ఉత్తమ జీవనమునకు మార్గదర్శి

- ప్రొఫెసర్ సి.రామయ్య,
విశ్రాంత డీన్, యస్.వి.యు., తిరుపతి.

ఉత్తమ జీవనమునకు మార్గదర్శి శ్రీమద్ భగవద్గీత. హైందవ మతము మానవాళికి ప్రసాదించిన బహూకరణలలో భగవద్గీతతో సరిపోలినది మరియొక్కటిలేదు. ఇది దేశకాల, భాష మత పరిధులను అధిగమించి, సర్వజనుల యశస్సులను, హృదయములను అలరింపజేయు సామర్థ్యముగలది.

భగవద్గీత కేవలము అర్జునుని విషాదమును నిర్మూలించుటయే కాక, అర్జునునికి ప్రాప్తించిన సంకట పరిస్థితుల వంటి పరిస్థితులున్న వ్యక్తులకు సరియగు మార్గమును సూచించుటలోనూ, అవిద్యావశులై క్రియాశూన్యులైన వారికి కర్తవ్యాన్ని భోధించుట యందును సామర్థ్యము కల్గి ఉంటున్నది. కనుకనే మహాత్మాగాంధీ గారు భగవద్గీతను గూర్చి ఇలా వ్యాఖ్యానించారు- "భగవద్గీత విశ్వజనని. సంకటములు నన్నావరించినపుడు, నిరాశా నిస్పృహలు నాకు జనించినపుడు నేను భగవద్గీతను ఆశ్రయించెదను. అది నాపట్ల కామధేనువై నాకు మార్గదర్శకత్వము వహించును. ఒక్కమారు నీవు ఆ మకరందమును చవిచూచిన యెడల దానితో నీ బాంధవ్యము దినదిన ప్రవర్ధమానమగును. అది ఒక జ్ఞానభాండాగారము. ఒక అమూల్యమయిన మార్గదర్శి. నిత్య జీవితపు నిఘంటువు. నాలో కలిగెడు అన్ని సంశయములకు, సంకటములకు ఖచ్చితమైన సరియైన సమాధానము నాకు గీతలో లభించును. గీతాభ్యాసనాపరుడు పరమానందప్రాప్తిని పొందగలడు".

భగవద్గీత కేవలము విరాగులకు, ప్రాపంచిక జీవనమునుండి పారిపోయి అరణ్యములనాశ్రయించువారికి మాత్రమే కాదు. సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, జయాపజయాలతో కూడి దుఃఖభూయిష్టమైన ప్రాపంచిక జీవితములు మనుగడసాగించుచున్న వారికి సైతము మార్గదర్శకత్వం వహిస్తుంది. గీతాజ్ఞానము, జీవితములో ఎదురయ్యే వివిధ సంకటములతో సతమతమగుచున్న మనుజునకు అంతర్ దృష్టిని ప్రసాదించి వారికి ప్రశాంతతను చేకూరుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే భగవద్గీత ఒక గొప్ప అనుష్ఠానగ్రంథం. అజ్ఞానాంధకారంలో ఉన్నవారికి చిరుదీపం వంటిది. అజ్ఞానులకు జ్ఞానాన్ని, ప్రాపంచిక సమస్యలతో నిరాశా నిస్పృహలకు లోనయిన వారికి పరమశాంతిని ప్రసాదించునది.

భగవద్గీత మనుజుని ప్రాపంచిక బంధములనుండి విముక్తుని చేయగలదు. లౌకిక ప్రపంచంలోనే నివసిస్తూ ప్రాపంచిక విషయాలతో బంధింపబడని విధముగ, పాపపుణ్యములు, సుఖదుఃఖముల మధ్య వర్తిస్తూ వాటి ప్రభావమునకు లోను కాకుండా జీవించగల నైపుణ్యాన్ని ప్రసాదిస్తుంది. ఎందువలననగా గీతాజ్ఞానము వ్యక్తిని నిష్కామ కర్మాచరునిగా మారుస్తుంది. ఈ విషయాన్నే గీత "కర్మసు కౌశలం" గా వ్యక్తం చేస్తుంది(11-50). సంక్షిప్తంగా గీతాజ్ఞానము సాధకుని సర్వోత్కృష్టునిగ మారుస్తుంది. తనలోని దివ్యత్వాన్ని గుర్తించేటట్లు చేస్తుంది. తనను లౌకిక

ప్రపంచముతో బంధించు ప్రాపంచిక బంధములను దగ్ధం చేస్తుంది. జీవుని స్థితప్రజ్ఞునిగా మారుస్తుంది. జీవన సమరంలో మనమందరమూ అర్జునుని వంటి వారమే. ఈ యుద్ధంలో విజేయులమగుటకు మనకు గీతాజ్ఞానము యొక్క మార్గదర్శకత్వము అత్యంతావశ్యకము.

యుద్ధభూమిని ప్రవేశించి రెండు సేనల యందును నిల్చియున్నట్టి తండ్రులను, తాతలను, మేనమామలను, అన్నదమ్ములను, కొడుకులను, గురువులను, స్నేహితులను చూచిన అర్జునుని మానసిక పరిస్థితిని పరిశీలించుదము. అర్జునుడు స్వజనమును కింత బాగుగ పరికించి దయార్ద్రహృదయుడై దుఃఖించుచు ఇట్లు పలికెను. "ఓ కృష్ణమూర్తీ! యుద్ధము చేయుటకై ఇచట సమకూడిన ఈ బంధు జనములను చూచి నా అవయవములు పట్టు దప్పుచున్నవి, నోరెండిపోవుచున్నది. శరీరమందు వణుకు పుట్టుచున్నది. గగుర్పాటు కల్గుచున్నది. గాండీవము చేతినుండి జారిపోవుచున్నది, చర్మము మండుచున్నది, నిలబడుటకైనను నాకు శక్తిలేకున్నది. మనస్సు గిర్రున తిరుగుచున్నది. (1-28) (1-30). ఈ యుద్ధమునందు బంధువులను చంపిన పిదప పొందబోవు లాభమెద్దియో నాకు బోధపడుటలేదు.(1-31) "ఓ కృష్ణా! కౌరవులను చంపుటచే మనకేమి సంతోషము కల్గును. పైగా వీరిని సంహరించుట వలన మనకు పాపమే కల్గును(1-36) "ఎంతటి పాపము! రాజ్యలోభముచే స్వబంధువులను చంపబూనితిమి. తద్వారా పాపకృత్యము చేయ సంకల్పించితిమి"(1-45) అర్జునుడు ఈ ప్రకారముగ పలికి శోకముచే కలత నొందిన వాడై ధనుర్బాణములను పారవైచి రథముపై చతికిలబడెను(1-47). తదుపరి రెండవ అధ్యాయముగు సాంఖ్యయోగమందు 9వ శ్లోకములో అర్జునుడు కృష్ణునితో "నేను యుద్ధము చేయబోన"ని స్థిరముగ పలికి ఊరకుండెను.

ఉపరితల పరిశీలనలో అర్జునుని వైఖరి మనకు సబబైనదిగా అపోహ కలుగుతుంది. అర్జునుడు యుద్ధకాంక్ష లేనివాడుగను, శాంతికాముకునిగను, కృష్ణ భగవానులు యుద్ధాభిలాషిగను, శాంతిని కాంక్షించే అర్జునుని సమరం వైపుగా ప్రేరేపించుచున్నట్లు అపోహకల్గుతుంది.

అటులయిన అర్జునినివైఖరి వేదాంత పరముగ సబబైనదేనా? పైపై పరిశీలనలతో వేదాంతజ్ఞానము నిర్మింపబడదు. ప్రాతిభాసికసత్యం, వ్యావహారిక సత్యాల పరిధులను దాటి కేంద్రస్థానమైన పారమార్థికసత్యం వైపుగ వేదాంతం సత్యశోధన సాగిస్తుంది. తేనెటీగ మకరంద విహీనమైన పుష్పములను వదలి మకరందము గల పుష్పములపైననే వాలి మకరందమును గ్రోలు నట్లుగ వేదాంతి, వివేకి స్వల్పమైన అవాంఛితమైన వ్యర్థ విషయములను వర్జించి అంతర్గతమైన సారభూతమయిన సత్యంపైననే దృష్టిని కేంద్రీకరించును.

భగవద్గీత నిత్యమైన, శాశ్వతమైన సత్యం పైననే దృష్టిని కేంద్రీకరిస్తుంది. అశాశ్వతమైన పైపై వ్యర్థ విషయములను పట్టించుకొనదు. అంతర్గత సారాన్ని గ్రహిస్తుంది. ఉపరితలపు ఊకను కాదు. అంతర్లీనముగా ఉన్న భావమునకు ప్రాముఖ్యతనిస్తుందే కానీ బాహ్యమైన ప్రదర్శనకు కాదు. వాస్తవికమైన సత్యమునే లక్ష్యంగా గైకొనును, అవాస్తవమైన పైపై పోకడలనుకాదు. పారమార్థిక సత్యాన్నే లక్ష్యంగా గైకొని పారిభాషిక లేక వ్యావహారిక సత్యములను ఉపేక్షిస్తుంది. ఈ సత్యమును భగవానుడు అర్జునునకు భగవద్గీత ద్వారా బోధపరుస్తారు.

ప్రారంభంలో అర్జునుడు సమరము చేయుటకు నిరాకరించుటను రెండు విధములుగ అభివర్ణింపవచ్చును. మొదటిది స్వజనులను సంహరించుట, రెండవది సంహరించుటవలన కలుగబోవు పాపము. అయితే ఈ రెండు

విషయములు సత్యమైనవికావు. ఇచట అర్జునుడు జనులను సంహరించుటకు వెనుకాడుటలేదు. కానీ స్వజనులను సంహరించుటకు నిరాకరించుచున్నాడు. ఈ ప్రకారముగ అర్జునుడు రాగద్వేషములకు అతీతుడు కాలేదని అర్థమగుచున్నది. అదియునూ కాక యుద్ధము చేయ నిరాకరించుట అనుభావము అతని వివేకమునుండి జనియించినదికాదు, అది కేవలము మోహజనితమైనది.

భగవానుడు అర్జునుని యొక్క మోహగ్రస్తమైన వైఖరిని గమనించినవారై "ఓ అర్జునా! పామరులవలంబించు నదియు, స్వర్గప్రతిబంధకమును, అపకీర్తిని కలుగ జేయునదియునగు ఈ మోహము ఈ ఒడిదుడుకు సమయమున నీ కెచటినుండి వచ్చినది? అని ప్రశ్నించిరి (11-2). "ఓ అర్జునా అధైర్యము పొందకుము, ఇది నీకు తగదు. నీచమగుమనోదుర్బలత్వమును వీడి యుద్ధమునకు సిద్ధము కమ్ము(11-3)

సుఖదుఃఖములందును, లాభనష్టములందును, జయాపజయములందును సమబుద్ధిని కలిగిన మనుజునకు పాపము అంటదని భగవానుడు అర్జునునకు బోధించు చున్నారు(11-38).

ఇదియే భగవద్గీత యొక్క శుభసందేశము. పరిపాలకుడు యుద్ధభూమిలో సంహరించుటసైతము పాపము కానేరదు. మనుజుడు ఒక కర్మచేయునపుడు ఆ కర్మ వెనుక ఉన్న భావన లేక ఉద్దేశ్యము ఆధారంగా ఆకర్మ సత్కర్మగా లేక దుష్కర్మగా నిర్ణయింపగలం. అంతియే కాని కర్మలను మంచి కర్మలు చెడుకర్మలుగా విభజింపవీలుకాదు. ఈ సందర్భంగా భగవాన్ రామకృష్ణ పరమహంస ఓ కథను వివరించేవారు. ఇరువురు మిత్రులు వినోదం కొరకై ఒకరు హరికథా కాలక్షేపమునకు మరియొకరు వేశ్యావాటికకు వెళ్ళిదరు. హరికథా కాలక్షేపమును వెళ్ళిన మిత్రుడు వేశ్యావాటికకు వెళ్ళిన మిత్రుడు పొందుచున్న ఆనందమును మనస్సులో ఊహించుకొనుచు తాను వెళ్ళనందులకు తననుతాను నిరసించుకుంటు కాలంగడుపుతాడు. అదే సమయములో వేశ్యావాటికకు వెళ్ళిన మిత్రుడు తాను తీసుకున్న నిర్ణయమునకు పశ్చాత్తాపపడుచు, రక్షింపుమని భగవంతుని ప్రార్థిస్తాడు. వారిరువురు మరణించిన పిదప మొదటి మిత్రుడు నరకకూపంలోనికి రెండవ మిత్రుడు స్వర్గంలోకానికికొని పోబడుతారు. కనుక భావము ప్రధానం.

మనం నిర్వహించు కర్మలే మనను స్వర్గలోకమున కయినా, నరకలోకమునకైనా చేర్చగలవని గీత బోధిస్తుంది. అయితే మానవుని జీవితలక్ష్యం స్వర్గసుఖాలు పొందడం మాత్రమే కాదు. జనన మరణముల గొలుసునుండి విడివడి మోక్షాన్ని పొందడమే.

కర్మాచరణద్వారానే మనుజుడు సర్వోత్కృష్టస్థితిని పొందునని భగవద్గీత బోధిస్తుంది. కర్మలు మంచివైనా, చెడువైనా రెండూ రెండు రకాల ఫలితాన్నిస్తాయి. సత్కర్మ ఫలంగా స్వర్గం, దుష్కర్మ ఫలితంగా నరకం లభిస్తుంది. సత్కర్మానుష్ఠానం ఫలితంగా పొందిన పుణ్యఫలం వలన కొంతతడువు స్వర్గభోగములనుభవించినప్పటికినీ ఆ పుణ్యఫలం క్షీణించగనే తిరిగి జనన మరణ రూప సంసార చక్రభ్రమణములోనికి ప్రవేశించవలసినదే. కానీ భగవద్గీత సూచనలమేరకు కర్మలు నిర్వహించినట్లయిన కర్మఫలశేషము ఉండదు. అటువంటి నిష్కామ కర్మలు మనకు మోక్షమును ప్రసాదించును. మోక్షము అను పదమును వేరు వేరు వేదాంత దార్శనికులు వేరు వేరుగా వర్ణిస్తారు. కానీ అన్నింటి సారాంశం పరిశీలిస్తే జనన మరణ రూప సంసార చక్రమునుండి విడివడడమే మోక్షమనబడును.

మరి అట్టి కర్మలు ఏవి? భగవద్గీత ప్రకారం మనుజుడు మోక్షాన్ని పొందుటకు ఎటువంటి కర్మలు

అనుష్ఠించాలి? ఈ ప్రశ్నలకు సమాధానం భగవానుడు ఈ క్రింది విధముగ ఉపదేశించుచున్నారు.

1. సుఖ దుఃఖములందును, లాభనష్టములందును, జయాపజయములందును మనుజుడు సమబుద్ధిని కల్లియుండవలెను. (11-38).

2. కర్మలను నిష్కామముగ ఆచరించుట. "నీకు కర్మచేయుటయందే అధికారముకలదు. కర్మ ఫలమునాశించుట యందేనాడును నీ కధికారము లేదు. మరియు కర్మలు చేయుట నీవుమానరాదు". (11-47). ఇదియే గీత మనకు ప్రసాదించిన నిష్కామకర్మయోగము.

3. ఓ అర్జునా! యోగ నిష్ఠ యందుండి, సంగము వదలి కార్యము సిద్ధించును. సిద్ధింపకున్నను సమభావముకలిగి కర్మల నాచరింపవలెను. అట్టి సమబుద్ధియే యోగమనబడును (11-48)

4. బుద్ధిని సమత్వముతోను, నిష్కామ భావనతోనూ గూడిన దానిగా జేసికొని అట్టిబుద్ధినాశ్రయించి కర్మలు చేయవలెను(11-49)

5. సమత్వబుద్ధి గలవాడు అనాసక్తంగా కర్మల నాచరించును. నేర్పుతో అనాసక్తముగ కర్మలనాచరించు నైపుణమే యోగమనబడును(యోగః కర్మసు కౌశలం) (2-50). అట్టి కర్మలు పుణ్యమును గానీ, పాపమునుగానీ చేకూర్చవు. ఇట్టి కర్మలనొనర్చు వివేకవంతుడు జనన మరణ రూపమగు బంధమునుండి విడుదల బొందినవాడై దుఃఖ రహితమైన మోక్షపదవిని బొందుచున్నాడు(11-51).

6. బుద్ధి ఎపుడైతే అజ్ఞానమను మాలిన్యమును తొలగించుకొని పరిశుద్ధమగునో అపుడిక వినవలసినదానిని గూర్చియు, వినినదానిని గూర్చియు నీవు విరక్తిని కల్గియుందువు. (2-52)

7. "నానా రకములగు శ్రవణాదులచే కలత చెంది యున్న నీ బుద్ధి ఎపుడైతే నిశ్చలముగ పరబ్రహ్మమందు స్థిరముగా నిలచి యుండునో అపుడే నీవు ఆత్మ సాక్షాత్కారమును బొందగలవు" (2-53)

8. ఈ ప్రకారముగ మనుజుడు స్థితప్రజ్ఞునివలె వ్యవహరించవలెను. స్థితప్రజ్ఞుని లక్షణములెవ్వి? ఎవడైతే కోరికలన్నింటిని పూర్తిగా విడనాడి నిరంతరము ఆత్మయందే సంతుష్టిని బొందునో అతడే స్థితప్రజ్ఞుడనబడును(2-55).

"ఎవడు సమస్త విషయములందును అభిమానము లేకుండా మంచి జరిగినపుడు సంతోషమునుగానీ, చెడుజరిగినపుడు దుఃఖమునుగానీ బొందడో అటువంటి మనుజుని స్థితప్రజ్ఞుడందురు(2-57) (2-58).

స్థితప్రజ్ఞులు నిస్స్వార్థపరులుగను, నిరహంకారులు గను ఉందురు. కర్తృత్వ భావనను వీడి వీరు ఆచరించెడి కర్మలు అకర్మలే అగును. అట్టి కర్మలు పాపమును గానీ, పుణ్యమునుగానీ చేకూర్చవు. కనుక అవి జన్మకు హేతువు కావు. ఏ మనుజునకయితే "నేను కర్తను" అన్న తలంపు ఉండదో వారికి పాపపుణ్యములు అంటవు. అట్టి మనుజుడు ప్రాణులన్నింటిని సంహరించిననూ వాస్తవమునకు చంపుటలేదు మరియు అతను పాపముచే బంధింపబడుట లేదు(18-17).

పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు స్థితప్రజ్ఞులు. జీవన్ముక్తుల కోవకు చెందినవారు. నిష్కామ కర్మాచరణమును అనుష్ఠించిన మహామనిషి. వారు పేదప్రజల సేవార్థము ఒక ఉచిత కంటి ఆసుపత్రిని, అనేక విద్యాసంస్థలను స్థాపించిరి. పూజ్యశ్రీ స్వాములవారు నిర్దేశించిన మార్గమును అనుసరించుటద్వారా, వారి శతజయంత్యుత్సవాల సందర్భంగా ఆ మహనీయునకు నివాళులర్పించెదముగాక. -ఓం తత్ సత్-

అనువాదము

ఎ. తారాలక్ష్మి M.A., B.Ed., M.Phi.l

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందస్వాముల పదసన్నిధికి

నూటయెనిదవ గీతాయజ్ఞ పూర్ణాహుతి పుణ్యసమయమున సమర్పించబడినది

శ్రీసాయం నారాయణచరణంగారు. తెలుగుపండితులు. నెల్లూరు.

(శ్రీ నారాయణ చరణంగారు శ్రీ సద్గురు మలయాళస్వాములవారు వద్ద విద్య నేర్చుకొనిన చరణ చతుష్టయంలో ఒకరు. మంచి పండితులు. పుట్టపర్తి శ్రీసత్యసాయిబాబాగారి వద్ద వుంటూ పరమపదించారు.)

కII ఓగీతాష్టోత్తరశత! యాగాచరణైక సోమయాజీ! విద్యా
యోగ ప్రకాశజీవన! త్యాగాలయ! యతివరేణ్య! స్వామి! నమస్తే.

కII శ్రీవిద్యాప్రకాశకృత భావానంద ప్రపూర్ణ పావనగీతా
సేవనము, మీ స్వరూపము, శ్రీ విద్యాప్రకాశనంద చిన్మయమూర్తీ!

ఉII స్వాగతమో! మునీంద్ర బుధసన్నుత తత్త్వనిధాన, భోగ సం
యోగవిరాగధుర్య! గుణమోహిత మార్గవిదూర! ధీర, సు
స్వాగత మిద్దె గైకొనుము, సారపరీమళవాక్ సుమాల, మీ
త్యాగపద స్వరూపమున, కంజలి నిచ్చితి మో! యతీశ్వరా!

చII గల గల, కంకణధ్వనులు, ఘల్లనిమ్రోయ, రమా సరస్వతుల్
కల నినదంబులన్, సరసగాన మొనర్చుచు, కప్పురారతుల్
వెలయగ, స్వాగతంబిడిరి, వేదవిదాం వరమూర్తి వంచు. నో
కలిహర, మౌనివర్య! యిదె గై కొని, దీవనలిమ్ము, ప్రేమతో

శాII ప్రారంభంబున సూక్ష్మమై క్రమముగన్ బ్రహ్మాండమున్నిండు ఒ
ప్పాఋన్ వామనురీతి, మీవిమల దివ్యజ్ఞాన యజ్ఞక్రియా
కారం బట్లు బహుప్రజాభరితమై గన్పట్టు నోస్వామి! యో
ధీరా! మీదు తపంబదెంత మహిమా దీప్తందో గుప్తంబొకో!

సీII ఆంగ్ల హిందీ భాషలందు పట్టమునంది
దివ్య వటుప్రతార్థిత్వ గరిమ
లోక భోగవిలాసలోలతన్ కాల్దన్ని
త్యాగఫలైకనిధ్యాన కాంక్ష
పదిరెండు వత్సరాల్ పరమతపోదీక్ష
సద్గురు సన్నిధిన్ స్వాత్మనరసి

సత్య ధర్మ క్రియాసాధన బోధలన్
వాడవాడలను జెప్పంగదలచి

గీ॥ తద్గురూత్తముచేత సంన్యాసదీక్ష
నంది శ్రుతి ధర్మ వర్తనానందముగను
అల శుక బ్రహ్మ పేరున నా శ్రమమును
స్థాపనము జేసి యవ్యయశాంతిదాత
వగుచు వెలసిన ఋషివరేణ్యా! నమస్తే.

సీ॥ మీ సముజ్జ్వల యోగవాసిష్ఠ సంస్కృతిన్
మృదుల తెల్గుపదాల యెదలనింపి,
మీ మహిమార్థ గీతామకరందంపు
మధురిమన్ తెల్గుధామముల నిలిపి
మీ వశిష్ఠ సుగీత భావ భవ ధ్వాంత
మునకు విచ్ఛేదార్కముగనుజేసి
మీ మోక్షసాధని కామాది రిపువర్గ
విదళనక్షమముగ కదియగూర్చి

గీ॥ శ్రీ శుకబ్రహ్మతత్త్వ ప్రసిద్ధరాజ్య
పతిగ గతిగను వెలయు నో బ్రహ్మమూర్తి
సంవిదానందమును ప్రజాసమితి కొసగు
స్వామివర! స్వీకరింపు మా స్వాగతమును.

సీ॥ ద్వాదశవర్షముల్ పరమర్షి సద్గురు
సన్నిధిన్ గల తపశ్చర్యమీది
కర్మభక్తిజ్ఞాన ధర్మసమన్వయ
శ్రుతికళా బోధాప్రగతియ మీది,
అభిషేకపూజాది విభవాల కందని
దృఢతరవైరాగ్య ధృతియమీది
స్తుతినిందలకు సమస్థితిగల ప్రజ్ఞాన
బ్రహ్మానుభూతి సంపదయ మీది

గీ॥ సాంఖ్యమాదిగ నలరు విశ్వస్వరూప
దర్శన మొసంగి! తుది మోక్షనిరత గతిని
పరగ త్యజియించు గీతాప్రవక్తవగుచు
వెలయు మునివర్య! స్వాగతాంజలిని గొనుమ.

సీ॥ మలయాళ సద్గురు మహిత యశద్యుతిన్
భరతోర్వి దెసల దీప్తముగజేసి
త్రికరణంబుల నొక్కతీరున శుద్ధ సా
త్త్వికపథంబున ప్రవర్తింప గూర్చి
గురుల విమర్శించు నరులను హింసించు
ఛిద్ర ఛాత్రుల దరిజేరనీక
నాదియే శాస్త్రమన్యము కాదుకాదన్న
వాది సోదెకు తిలవారినొసగి

గీ॥ నవ్యగాతానుగత జీవనప్రశస్త
పదములన్ ప్రజల కల సులభముగ
తెలియ, బోధనొనరించు యాజకవేద వీపు
స్వామివర! మాదు స్వాగతాంజలిని గొనుము.

క॥ కమనీయ గంధవహసం!
గమమయి దీప్తముగనలరు కప్పురారతుల్
సుమనస్సాధ్వీమతల్లు!
లమలభక్తి నిచ్చిరో మహర్షీ గొనుమా.

క॥ అంతయు నీశ్వరమయమను
భ్రాంతిరహితముపనిషద్ ప్రభావార్థము న
త్యంతము మీ కనుభవమై
క్రాంతిల్లెన్ విధిని దాటగలిగితివి ఋషీ!

గీ॥ తగుప్రవక్తవు నెల్ల శ్రోతలను ప్రేమ
జగములందున లోవెలిన్ నెగడునట్టి
ఆపరాత్పరు డక్షయప్రాపకుడయి
మిమ్మ గాచుత నిత్యశుభమ్ము లొసగి.

- ఓమ్ -

శతజయంతీ మహోత్సవం

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి.



ఉపనిషద్వాక్యంబు లుచ్చరించెడు వేళ
ధీరతన్ మెరయు గంభీరరవము
గత చరిత్రలలోని కథలు చెప్పెడు వేళ
సరసమైయొప్పు స్వచ్ఛ స్వరమ్ము
నేటి కాలపు తీరు చాటి చెప్పెడు వేళ
చిరునవ్వు లొలికింప జేయు రవళి
అజ్ఞానులకు బోధలందజేసెడు వేళ
నమృతవాహిని యైన యమరవాణి

విశ్వసిద్ధాంత రీతి విన్పించువేళ
సారతరమై ధ్వనించు ఘంటారవమ్ము
తమ మహోన్నత వాగ్గుంభనముల సొంపు
లెన్ని రూపంబులో వచియింప దరమె?

(శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామీజీ చరిత్రము – 359 వ పుట)

ఇత్యాదిగా కవులు ముక్తకంఠంగా ఆ మహనీయుని వాగ్ధోరణిని ప్రశంసించారు. ఒకరూ, ఇద్దరూ కాదు, వారి గీతాప్రవచనాలు విన్న సంస్కృతాంధ్రకవులందరూ వారి నీరీతిగా కవిత లల్లి శ్లాఘించినవారే.

గీతాయజ్ఞాలలో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి ప్రబోధసుధ నాస్వాదించడానికి వేలకొలది ప్రజలు తరలివచ్చేవారు. ఆ యజ్ఞం జరిగినన్ని రోజులూ ఒక తిరునాళ్ళ వాతావరణం కనిపించేది. అయితే తిరునాళ్ళలో జనసందోహం కావించే కోలాహలాలూ, ధ్వనులూ ఏకాంతప్రియులకు అశాంతిని కల్గిస్తాయి. ఈ గీతాయజ్ఞాలలో అలా కాదు. శ్రీస్వామి ప్రవచనం ప్రారంభిస్తే వారి కంఠధ్వని తప్ప మరే ధ్వనీ ఉండేది కాదు. అందరూ రెప్పలు వాల్చకుండా వేదికపైనున్న స్వామినే వీక్షించేవారు.

వక్తృత్వం సహజంగా అలవడాలి. నేర్చుకొంటే వచ్చేది కాదు. వివేకానందులు ప్రపంచాన్నంతా చైతన్యవంతం చేశారంటే దానికి ముఖ్యకారణం ఆయన వక్తృత్వ కౌశలమే.

వివిధ విషయాలపై ప్రసంగించేవారు అనేకు లుంటారు. కాని ఆత్మతత్త్వాన్ని ప్రబోధించేవారి సంఖ్య చాలా స్వల్పంగానే వుంటుంది. అలా ప్రబోధించేవారిలో గూడా వేలకొలదిగా జనానీకాన్ని ఆకర్షించేవా రెందరుంటారు. అందుకే యోగవాసిష్ఠంలో వాల్మీకి

శతేష్వేకతమస్యైవ సర్వోదారచమత్కృతిః ।
ఈప్సితార్థార్పణైకాంతదక్షా భవతి భారతీ ॥

అని శ్రీరాముని వాక్పటుత్వాన్ని శ్లాఘించాడు.

వందలకొలది జనులలో ఏ ఒక్కనికో మాత్రమే ఉదారము, చమత్కారపూర్ణమూ, చెప్పదలచుకొన్న విషయాన్ని శ్రోతల హృదయాలకు హత్తుకొనేటట్లు చెప్పగల సామర్థ్యమూ ఉంటాయని భావం.

ఆంధ్రదేశంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని సామాన్య జనులలో సైతం కల్గించడానికి బీజావాపం చేసినవారు మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారన్న విషయం అందరికీ విదితమే. వారి జీవితం భగవద్గీతకే భాష్యప్రాయమై విరాజిల్లింది. గీతాప్రచారాన్ని వాడవాడల్లో ముమ్మరంగా చేయాలన్న శ్రీ సద్గురుదేవుల ఆశయాన్ని విజయవంతంగా ఫలప్రదం కావించినవారు శ్రీ విద్యాప్రకాశానంద యతీంద్రులు.

కాలక్రమంలో శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారి ఆధ్యాత్మిక ప్రబోధ నైపుణ్యాన్నీ, గీత ప్రచారపాటవాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంవారు గుర్తించారు. ఈ గుర్తింపులో ప్రధాన సూత్రధారి అప్పటి టి.టి.డి. కార్యనిర్వహణాధికారి శ్రీపి.వి.ఆర్.కె.ప్రసాద్‌గారే. వారికి తగిన సహకారం అందించినవారు నాటి టి.టి.డి. బోర్డు సభ్యులు శ్రీపి.వేంకటేశ్వర్లుగారు.

గీతాయజ్ఞాలు నిర్వహించిన ప్రదేశాలలో చేరే వేలకొలది జనానీకానికే కాక ఇతరులకు గూడా శ్రీ స్వామీజీ ప్రబోధాన్ని అందజేయాలని తి.తి.దేవస్థానం వారు ఆడియో, వీడియో కేసెట్లుగా గూడా దాన్ని రూపొందించారు. ఇది అందరూ హర్షించ తగిన పరిణామం.

ఇటీవల దేవస్థానం వారు భక్తి ఛానల్ ప్రారంభించిన తరువాత తరచూ వారి ప్రసారాల ద్వారా శ్రీ స్వామీజీ ప్రవచనాలను వినవచ్చునని ఆశించిన జిజ్ఞాసగల జనుల ఆశలు మాత్రం నేటికీ ఫలించలేదు. త్వరలో ఫలిస్తాయని ఆశిద్దాం!

సంకుచితభావాలను విడనాడి ఆత్మతత్త్వాన్ని శ్రద్ధాళువులైన జనులందరికీ ప్రబోధించాలని సంకల్పించిన శ్రీ మలయాళస్వామి వారి సత్సంకల్పాన్ని వారి ముఖ్యశిష్యులైన శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు తమ అమోఘమైన గీతా ప్రవచనాలతో ఫలింపజేశారు.

అటు శ్రీ సద్గురుదేవులూ, ఇటు శ్రోతలే కాక శ్రీవిద్యాప్రకాశానందుల గీతా ప్రచార మహోద్యమానికి శ్రీకృష్ణ పరమాత్మ గూడా అమందానంద కందళితుడైనాడు. గీతను ప్రచారం జేసే వానికంటే అత్యధిక ప్రీతిపాత్రుడు, ప్రియం కల్గించేవాడూ నాకు మరొకడు లేడు అని ఆ గీతాచార్యుడే అన్నాడు కదా!

అట్టి శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామివారి శతజయంతీ మహోత్సవం ఈ నెలలోనే (ఏప్రిల్ – 2013) సంభవించడం, భక్తకోటి దానికి సహకరించడం, వేలాదిగా జనులు అందులో పాల్గొనడం పరమానంద ప్రదం.

> *ఎల్లపుడు దైవభావములో నుండుటయే ముఖ్యకార్యమైనను అది అభ్యాసకులకు సాధ్యము గానందుచే, వారు జప, ధ్యాన, పారాయణకాలము లందైనను దైవభావమునకు మరుపు గలుగనీయక చూడవలయును. ఈ యభ్యాసము బలపడి రాగా రాగా సదా దైవభావములో నుండుటకు సాధ్యమగును.*
>
> *– శ్రీ మలయాళస్వామి*

శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు హృదయకుహరమందు జీవించే వున్నారు

– గోటేటి శ్రీరామారావు, ప్రముఖాంధ్ర ఎడిటర్

ఒక రామకృష్ణ పరమహంస !
ఒక వివేకానందుడు !
ఒక రమణ మహర్షి !
ఒక సత్యసాయి బాబా !
ఒక విద్యాప్రకాశానందగిరి స్వామి !

వీరందరూ వీరికి వీరేసాటి ! వీరితో పోల్చగలవారు కనబడడంలేదు. తరులూ, గిరులూ, నదులూ, నరులూ ఉన్నంతకాలం వీరిస్థానం వీరిదే ! మరొకరు వారి స్థానాలను పూరించలేరు!

సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వాములవారు మా హృదయకుహరములందు జీవించి ఉన్నారు. మహాత్ములకూ మరణం లేదని వేదమే చెబుతున్నది. గీతాచార్యులు భగవద్గీత యందుదాహరించి ఉన్నారు. అలాంటిది 'గీతామకరంద' కర్తయైన, పరివ్రాజకులైన శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి వర్యులు మరణించినారనిన నమ్మదగునా? నిండు నూరేండ్లైనా వారు పూర్తి చేసుకోనేలేదే! వారిప్పుడు నూరేండ్లవయసుకు వచ్చారు. వారింకా జీవించే ఉన్నారు.

నూటయేబది యేండ్లు అయినప్పటికినీ వివేకానందులవారు మనల్ని వీడిపోలేదు. వారిగురువులు శ్రీరామకృష్ణ పరమహంస మనల్నింకా జ్ఞానబోధామృతాలలో మునకలు వేయిస్తున్నారే? రమణ మహర్షి ఇంకా స్మృతిపథం నుండీ పోలేదు. కావ్యకంఠ గణపతిముని రమణుని మనసుల నుండి విడిపోని 'మహర్షి'గా చేసి యున్నారు. అలానే సద్గురు శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారిని మన మనస్సుల్లో మరో వంద సంవత్సరములు నిలిచేట్టు శతజయన్త్యుత్సవములు తలపెట్టడం వారి గ్రంథాలను పునఃపునః ముద్రిస్తూండడం చూస్తుంటే నైమిశారణ్యంలోని సూతమహర్షి యావన్మంది మహనీయులకూ పురాణేతిహాసాలు వివరిస్తున్న విధంగా దేశంలోని మహర్షులనూ, సాధుసత్తములనూ, పీఠాధిపతులను శుకబ్రహ్మాశ్రమంలో సమావేశపరుస్తూ, తమ గురువుల గీతాయజ్ఞశైలిని పునఃస్మరణకు తెస్తున్నట్టుగా ఉన్నది.

గీతాచార్యుడు 'భగవద్గీత'లో రుచిచూపించిన మకరందమును శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వాములవారు 'గీతామకరందం'లో గీతాజ్ఞానయజ్ఞములను సప్తాహములుగా చేసి, పల్లె పల్లెలకూ పరమాత్ముని పరమబోధ పామరజనుల మెదళ్ళలో నిలిచేట్టు చేసారు. అపక్వాహారాన్నే వారు భుజించారు. పక్వం కాబడిన గీతామకరందాన్ని ప్రపంచానికందించారు. వారిష్యులు 'గీతామకరందం' బృహద్గ్రంథాన్ని ఆంగ్లమువంటి అన్యబాషలలోకి అనువదింప చేసి 'గీత' వలె 'గీతామకరందం' గ్రంథమును ప్రపంచ ప్రజల మనస్సులో భక్తి ప్రపత్తులు ప్రభవిల్లడానికి చేసిన కృషి అపారం, అమేయం.

శ్రీకాళహస్తిలోని సువర్ణముఖీనదీ తీరమున వనాన్తర ప్రదేశములోఅడవిలా ఉన్న తరురుహ ప్రదేశాన్ని ఒక సుందర ఆశ్రమంగా, తీర్చిదిద్దుతూనే నేత్ర చికిత్సాలయాన్ని 30 పడకల వైద్యాలయంగా అభివృద్ధిచేయడం గ్రంథాలను విద్యాలయాలను జ్ఞానసౌగంధ విద్యాలయాలుగా తీర్చిదిద్దడం స్వామివారి పేరున ఓ కళాశాల, అనేకానేక బృహత్సేవా కార్యక్రమాలను అహరహమూ చేస్తూ, పేదల పట్ల పెన్నిధిగా వరలుతూన్న శ్రీ శుకబ్రహ్మాశ్రమం సేవలు వివరించడం నా శక్తికి మించిన పనియైనప్పటికినీ, ఆగురుశిష్యుల పట్ల నాకున్న అపార, అమేయ, అనుపమ భక్తి, విశ్వాస వాత్సల్యములను, నాకున్న పరిమిత జ్ఞానముతో విశదీరించగలిగినందుకు ఆనందిస్తున్నాను.

గురువుగారి నిఃస్వార్థత, నిరాడంబరత, సేవాపరాయణతల నట్టే ప్రతిబింబింపచేస్తున్న శ్రీశ్రీ విద్యాస్వరూపానంద స్వామివారికి ముకుళిత హస్తాలతో వందన శతములందిస్తూ, మరోపదికాలాలపాటు శుకబ్రహ్మాశ్రమాభివృద్ధిని కొనసాగించేట్టు - శ్రీ జ్ఞానాంబిక సమేత శ్రీ కాళహస్తీశ్వరుడు పరిపూర్ణాయురారోగ్యాలనూ, ఆ చంద్రతారార్కయశః సంపన్నత నొసగాలని ప్రార్థిస్తున్నాను.

అచ్యుతుని హృదయ పద్మమున ధ్యానించుము

హృదయపద్మమున సూర్యతేజస్సుమధ్య పద్మాననాసీనుడై కూర్చొనియున్న నారాయణుని ఎల్లప్పుడు ధ్యానించుము. లేదా భృకుటి యందు రత్నఖచితమైన బంగారు కంకణములు (ముంజేతులకు), కుండలములు, రత్నఖచిత సువర్ణకిరీటము, కౌస్తుభమణితో కూడియున్న సువర్ణ కంఠహారము మరియు స్వర్ణచ్ఛాయతోను కూడియుండి, శంఖచక్ర గదా పద్మములను చతుర్భుజములందునూ ధరించిన అవినాశియగు ద్వారకా నిలయుడైన అచ్యుతునిగాని ధ్యానించుము.

ధ్యానసమయమున మనస్సును విష్ణువు యొక్క వివిధ శరీర భాగములపై సంచరించునటుల చేయుము. అతని శరీరమునందలి వివిధ భాగములను చూడుము. ముందుగా అతని పాదములను మనస్సుతో చూడుము. తరువాత పట్టు పీతాంబరమును, తరువాత కౌస్తుభమణితో కూర్పబడిన బంగారుహారమును, ఆ తరువాత కుండలములను (మకర కుండలములు), ఆ పిదప ముఖమును, ఆపైన తలపైగల కిరీటమును, ఆ పిమ్మటపై కుడిచేతియందలి గదను, అటు పైని ఎడమ క్రిందిచేతి యందుగల పద్మమును చూడుము. ఈ క్రమమును (వరుసను) అనుసరించవలెను. ఆ పిదప మరల పాదముల నుండి పైన చెప్పిన వరుస ననుసరించి చూచుటకు ప్రారంభించుము. ఈ విధముగా చేసినచో మనస్సు బాహ్య విషయముల వైపుకు పరుగులిడదు.

- శ్రీ స్వామి శివానంద సరస్వతి


పూజ్యశ్రీ సంపూర్ణానంద గిరి స్వాములవారు


పూజ్యశ్రీ గోవిందానందగిరి స్వాములవారు

శ్రీ బావులూరి రాధాకృష్ణయ్యగారు

శ్రీ కె. ఈశ్వర్‌గారు

శ్రీ పేట గజేంద్రగారు


శ్రీ కె.సి. వెంకట్రెడ్డిగారు


శ్రీ పి.సత్యనారాయణరాజుగారు

శ్రీ పాబోతు సుబ్రహ్మణ్యంగారు

శ్రీమతి ఎ. తారాలక్ష్మిగారు



మహాయోగిని సీతావధూతగారు

సమాజ సంస్థాపకులు మాతృశ్రీ సుశీలమ్మగారు, ఈదర, ఆగిరిపల్లి మండలం, కృష్ణాజిల్లా.

శ్రీస్వాములవారికి పాదపూజ

India's Message to the World

Swami Vivekananda

If there is any land on this earth that can lay claim to be the blessed Punya Bhoomi, to be the land to which all souls on this earth must come to account for Karma, the land to which every soul that is wending its way Godward must come to attain its last home, the land where humanity has attained its highest towards gentleness, towards generosity, towards purity, towards calmness, above all, the land of introspection and of spirituality - it is India. Hence have started the founders of 'religions from the most ancient times, deluging the earth again and again with the pure and perennial waters of spiritual truth. Hence have proceeded the tidal waves of philosophy that have covered the earth, East or West, North -or South, and hence again must start the wave which is going to spiritualise the material civilisation of the world. Here is the life-giving water with which must be quenched the burning furnace of materialism which is burning the core of the hearts of millions, in other lands. Believe me, my friends, this is going to be.

Civilisations have arisen in other parts of the world. In ancient times and in modem times, great ideas have emanated from strong and great races. In ancient and in modem times, wonderful ideas have been carried forward from one race to another. In ancient and in modern times, seeds of great truth and power have been cast abroad by the advancing tides of national, life; but mark you, my friends, it has been always with the blast of war trumpets, and with the march of embattled cohorts. Each idea had to be soaked in a deluge of blood; each idea had to wade through the flood of millions of our fellow-beings; each word of power had to be followed by the groans of millions, by !he wails of orphans, by the tears of widows. This, in the main, other nations have taught; but India has for thousands of years peacefully existed. Here activity prevailed when even Greece did not exist, when Rome was not thought of, when the very fathers of the modern Europeans lived in the forests and painted themselves blue. Even earlier, when history had no record, and tradition dares not peer into the gloom of that intense past, even from then until now, ideas after ideas have marched out from her, but every word has been spoken with a blessing behind it, and peace before it. We, of all nations of the world, have never been a conquering race, and that blessing is on our head, and therefore we live.

To the other nations of the world, religion is one among the many occupations of life. There is politics, there are the enjoyments of social life, there is all that wealth can buy or power can bring, there is all that the senses can enjoy; and among all these various occupations of life, and all this searching after something which can give yet a little more whetting to the cloyed senses - among all these, there is perhaps a little bit of religion. But here, in India, religion is the one and the only occupation of life.

Individuals have each their own peculiarities, and each man has his own method of growth, his own life marked out for him, by the infinite past life, by all his past Karma as we Hindus say; into this world he comes with all the past on him, the infinite past ushers the present, and the way in which we use the present is going to make the future. Thus, everyone born into this world has a bent, a direction towards which he must go, through which he must live, and what is true of the individual is equally true of the race. Each race, similarly, has a peculiar bent, each race has a peculiar raison d' etre, each race has a peculiar" mission to fulfil in the life of the world. Each race has to make its own result, to fulfil its own mission. Political greatness or military power is never the mission of our race; it never was, and, mark my words, it never will be. But there has been the other mission given to us, which is to conserve, to preserve, to accumulate, as it were, into a dynamo, all the spiritual energy of the race, and that concentrated energy is to pour forth in a deluge on the world, whenever circumstances are propitious. The Hindu's calm brain must pour out its own quota to give to the sum total of human progress. India's gift to the world is the light spiritual.

Thus, in the past, we read in history, that whenever there arose a great conquering nation uniting the different races of the world, binding India with the other races, taking her out, as it were, from her loneliness, and from her aloofness from the rest of the world, into which she again and again cast herself, that whenever such function has been brought about, the result, has been the flooding of the world with Indian spiritual ideas. At the beginning of this century, Schopenhauer, the great German philosopher, studying, from a not very clear translation of the Vedas made from an old translation into Persian, and thence by a young Frenchman into Latin, says, "In the whole world there is no study so beneficial and so elevating as that of the Upanishads. It has been the solace of my life, it will be the solace of my death." This great German sage foretold: "The world is about to see a revolution in thought more extensive and more powerful than that which was witnessed by the Renaissance of Greek Literature," and today his predictions are coming to pass. Slow and silent, as the gentle dew that falls in the morning, unseen and unheard, yet producing a most tremendous result, has been the work of this calm, patient, all-suffering, spiritual race, upon the world of thought.

Once more history is going to repeat itself. When the modern tremendous theories of evolution and conservation of energy and so forth are dealing death blows to all sorts of crude theologies, what can hold any more the allegiance of cultured humanity but the most wonderful, convincing, broadening, and ennobling ideas, that can only be found in that most marvellous product of the soul of man, the wonderful voice of God, the Vedanta.

At the same time, I must remark that what I mean by our religion working upon the nations outside of India, comprises only the principles, the background, the foundation upon which that religion is built. The detailed workings, the minute points which have been worked out through centuries of social necessity, little ratiocinations about manners and customs and social well-being, do not rightly find a place in the category of religion.

The great principles underlying all this wonderful, infinite, ennobling, expansive view of man and God and the world, have been produced in India. The great good fortune of this country and of the world was voice which declared एकं सद्विप्रा बहुधा वदन्ति "That which exists is One; sages call It by various names."

And herein is the explanation of the most remarkable phenomenon that is only witnessed here, all the various sects, apparently hopelessly contradictory, yet living in such harmony. You may be a dualist, and I may be a monist. You may believe that you are the eternal servant of God, and I may declare that I am one with God Himself; yet both of us are good Hindus. How is that possible: Read then एकं सद्विप्रा बहुधा वदन्ति "That which exists is One; sages call It by various names." Above all others, my countrymen, this is the one grand truth that we have to teach to the world. Even the most educated people of other countries turn up their noses at an angle of forty-five degrees and call our religion idolatry. I have seen that, and they never stopped to think what a mass of superstition there was in their own heads. It is so still everywhere, this tremendous sectarianism, the low narrowness of the mind. There is tremendous religious persecution yet, in every country in which I have been, and the same old objections are raised against learning anything new; The little toleration that is in the world, the little sympathy that is yet in the world, for religious thought, is practically here, in the land of the Aryas, and nowhere else'. It is here that Indians build temples for Mohammedans and Christians; nowhere else, If you go to other countries and ask Mohammedans, or people of other religions to build a temple for you, see how they will help. They will instead try to break down your temple and you too, if they can. The one great lesson, therefore, that the world wants most, that the world has yet to learn from India, is the idea, not only of toleration, but of sympathy

(- With kind courtesy of Sri Ramakrishna Mutt. From "My India Arise")

ANANDASHRAM

GITA SANDESH
By swami Ramdas

At the start the Lord awakens the ignorant soul to the existence of the root evil which has brought about his bondage and the utter oblivion of his divine and immortal nature. This root evil Moha or attachment which has sprung from the seed called desire - the primal cause of ignorance. The eradication of desire and Moha means liberation. Liberation consists in the identity of the soul with the immortal Atman. This deathless state is realized only when the mind of man, through a burning aspiration for freedom, is withdrawn from its association with the perishable body and the objects of the senses and is directed through concentration towards the eternal Truth of his being. The soul has to pass through various Sadhanas or spiritual practices before he can unveil the glory and magnificence of the Atman dwelling within him. In fact, ignorance consists in the forget fulness of the soul of his eternal and infinite nature. So all Sadhanas are for keeping up a ceaseless remembrance of the great Truth which the soul has forgotten and which he is in reality. Ceaseless remembrance brings on a divine consciousness in which the soul discovers himself to be the all-pervading, eternal and changeless Truth. In this attainment the soul rises beyond the notion of the body and enjoys the bliss of immortality by rising superior to the Gunas of Prakriti and the Dwandwas born therefrom.

The liberated soul freed through the realization of Atman, which is only one aspect of the Lord, still strives to know and merge in the supreme Godhead in all His aspects and existences. Here starts the path of utter self-dedication leading the awakened soul to a vision and status which baffles description. He now beholds the entire universe and all beings, creatures and things in it as the very expression and revealment of the invisible, infinite, immutable, eternal, unthinkable and transcendent supreme Reality. He experiences not only the unchanging calmness and peace of his oneness with God in the universe and beyond but also the bliss of the pure, intimate and loving communion with him in the visible universe and all activities in it. So it is made clear at the end of the Gita that the highest acme of God-realization is to be a perfect devotee of the Lord - a veritable embodiment of divine knowledge, divine action, and divine love. Such a devotee is the very form and expression of God or God Himself in human form. Sri Krishna - the Purushottama has revealed Himself in his heart and has absorbed him into His ineffable and extremely wonderful Being. This is the goal and Gita Sandesh is to take the soul to this goal.

THE DIVINE LIFE SOCIETY

Swami Vimalanandasaraswathi

Om Namo Narayanaya.

Revered Swamiji,

I am immensely happy to learn from your letter dated 20th April 2012 that your esteemed Ashram is celebrating the auspicious Centenary of Worshipful Sri Sri Sri Vidya Prakashananda Giri Swamiji Maharaj on 28th, 29th and 30th April 2013.

On this sacred occasion, your Ashram is organizing a National Seminar on Srimad Bhagawad Gita and is also bringing out a Sathajayanthi Souvenir. Indeed, this is the most befitting way to express our heartfelt gratitude and deep reverence for the stupendous and remarkable work Revered Swamiji Maharaj did in propagating and disseminating spiritual knowledge.

Sri Swamiji Maharaj was a saint who dedicated his entire life to the cause of enlightening masses on sublime wisdom of Sri mad Bhagawad Gita. Swamiji Maharaj conducted 108 Gita Jnana Yajnas throughout Bharatavarsha to illumine the hearts of the devotees with the immortal teachings of this glorious scripture. This Divine Gospel of Lord Sri Krishna is still preserved and regarded as the most elevating and inspiring scripture not only in the country of its birth but also in foreign lands due to the presence of great spiritual luminaries like Sri Sri Sri Vidya Prakashananda Swamiji Maharaj. Apart from propagating the supreme teachings of Bhagavan Sri Krishna, Swamiji Maharaj also inspired people to develop devotion to one's motherland as he was an earnest lover and follower of Mahatma Gandhi in his pre-monastic life.

Sri Swamiji Maharaj has written several books on Vedanta but his divine mission was to ennoble the lives of all by propagating the sublime message of Srimad Bhagavad Gita. He intensely wished that every man in the country should understand the divine wisdom of the great Gita. He expressed the unique teachings of Lord Sri Krishna in his simple but impressive language in an exhaustive commentary titled 'Gita Makarandam' (Nectar of Gita) which is widely read all over India and has been translated into many languages.

I congratulate the organizers of Centenary Programme for organising such great event to mark this august occasion. This is the most befitting tribute to the hallowed memory of Swamiji Maharaj. I take this opportunity to place my head at the sacred feet of all the great Mahatmas who would be assembling to participate in this great and historical event.

I extend my best wishes for sanguine success of Centenary Celebrations and also humbly Pray to Lord Almighty, Sadguru Sri Swami Sivanandaji Maharaj and Sri Sri Sri Vidya Prakashanandaji Maharaj to bless Sri Sukabrahma Ashram so that it may continue to render its wonderful service to humanity by propagating the nectarine teachings of Srimad Bhagawad Gita.

THINKERS OF YOGA DOWN THE AGES

-Swami Amritananda

The word Yoga is derived from the verbal root युज् with two meanings: a) युजि यिञ्ज् and b) युजि समाधौ. It is used to indicate a) joining and b) concentration. Patanjali is the author of Yoga sutra which goes by the name of Raja Yoga - The prince of Yoga.

He based his text on the second meaning of युज् viz. to concentrate. He starts his book. with the sutra अथ योगानुशासनम् It does not mean any order in the undertaking as in अथातो ब्रह्मजिज्ञासा but means an undertaking. A text giving a revised, critical teaching of Yoga is to be understood as having been undertaken. This is the explanation given by Vyasa in the commentary.

This shows that the ideas of Yoga have been given to us from the Upanishadic sages and Hiranyagabha downwards, and Patanjali makes them into a text - Raja Yoga. This is not a Vichara Sastra as are the Brahma Sutras, but is an अनुशासनम् - A text book. (शिषृस्य शासनम् अनुशासनम्)

Swami Vivekananda the foremost disciple of Sri Ramakrishna translated the Raja Yoga into English with a beautiful commentary on it. He analyses the ideas of Raja Yoga and how it has contributed to our understanding of Religion. Even though the Yoga and Sankhya are similar in their approach to philosophy Yoga differs from Sankhya in one important aspect, that is, mind is all pervading in Yoga. This helps us to make a thorough study of the mind and arrive at a universal approach in analyzing the internal nature. In the Western approach there is no common basis of study of the mind, and we cannot arrive at a universal conslusion. Further the Raja Yoga provides us the means of studying our minds and understand our internal nature.

External nature is studied by science. Internal nature is studied by Yoga. This helps us in understanding nature clearly, and this is the foundation of Religion. Swamiji calls this as scientific religion.

We can take one example of how he arrives at a comprehensive study of religion and give it a short definition.

In the aphorism II-25 (English Raja Yoga) he explains the absence of avidya and independence of the seer as follows:

"According to yoga philosophy, it is through ignorance that the soul has been joined with nature. The aim is to get rid of nature's control over us. That is the goal of all religions.

